# ప్రశ్న ఎందుకు ?



English
**Ted Agon**
అనుసరణ
డా॥ పి. హరిపద్మరాణి
పెద్ది సాంబశివరావు

# ప్రశ్న ఎందుకు ?

## ప్రశ్న - ప్రగతికి కీలకం

వేలవేల ప్రశ్నలు వేయనిద్దాం-అందరినీ ఎదగనిద్దాం

*ఆంగ్ల మూలం*

టెడ్ అగాన్, హ్యూస్టన్, యు.యస్.ఏ.

*సంక్షిప్త స్వేచ్ఛానువాదం*

*డా. పి. హరిపద్మరాణి*

పెద్ది సాంబశివరావు

PRASNA ENDUKU
ప్రశ్న ఎందుకు?

English : Ted Agon, Heuston

Translation : Dr. P Hari Padma Rani
Peddi Sambasiva Rao

Print : November 2022


Publishers : Peddi Praja Publications,
505, Yaganti Mini Apartment
Stambhala garuvu
GUNTUR – 522006
Andhra Pradesh.
Mobile no: 94410 65414
E-mail : peddissrgnt@gmail.com

ISBN No : 978-93-91400-00-2

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| ఆప్తవాక్యం | వంగూరి చిట్టెన్ రాజు | 4 |
| ప్రశ్నతో సాధికారత | డా.హరిపద్మరాణి | 8 |
| పుస్తక పుట్టుపూర్వోత్తరాలు | పెద్ది సాంబశివరావు | 12 |
| 1.ప్రశ్నల ప్రారంభం , | | 17 |
| ఆలోచన | | 34 |
| 2. సిద్ధాంతం - శాస్త్రీయసిద్ధాంతం | | 49 |
| 3. అసాధారణమైన సాధారణ ప్రశ్న | | 53 |
| 4. మెదడు | | 56 |
| 5. వాడుతుంటే మెదడు పెరుగుతుంటుంది | | 60 |
| 6. సృజనశీలత | | 65 |
| 7. భాష – ఆలోచనల మధ్య సంబంధం | | 71 |
| 8. నేర్చుకోవడానికి అత్యంత అనుకూల పరిస్థితి ఏది? | | 74 |
| 9. ప్రశ్నలు ప్రగతికి మార్గాలు | | 78 |
| 10. రాయడం – ఆలోచనా వ్యాయామానికి మాధ్యమం | | 84 |
| 10. నేర్చుకోవడం ఎలా? | | 91 |
| 11. ఆలోచించు, ప్రశ్నించు, నేర్చుకో | | 95 |
| 12. మార్పును ప్రతిఘటించడం | | 102 |
| 13. తరగతి గదుల్లో జరిగే హాని | | 104 |
| 14. ప్రశ్న అధ్యయనాన్ని నేర్పి, జీవితాన్ని నడుపుతుంది | | 110 |
| 15. ఫిన్‌ల్యాండ్ ఆదర్శం | | 113 |
| 16. భావమార్పిడి అవసరం | | 117 |
| 17. ప్రశ్న ప్రాణాలతో చెలగాటం | | 124 |
| 18. దారి చూపే ప్రశ్నలు | | 130 |
| 19. చెయ్యండి, అంతే | | 142 |

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్, టెక్సస్, USA
ఏప్రిల్ 10, 2022



**ఆప్తవాక్యం...**

సుమారు రెండేళ్ల క్రిందట “ఎప్పటి నుంచో మిమ్మల్ని కలవాలి అనుకుంటున్న నాకు ఇప్పుడు హ్యూస్టన్ వచ్చే అవకాశం వచ్చింది. మీరు ఒక గంట సమయం ఇవ్వగలరా?”అని ఎంతో మర్యాదగా ఒకాయన నాకు ఫోన్ చేయగానే “అయ్యో ఎంత మాట” అని వెంటనే ఆయనని మా ఆఫీసుకి ఆహ్వానించాను. తీరా చూస్తే ఆయనతో పాటు ఇంకో అమెరికన్ దొర కూడా రావడం చూసి కొంచెం ఆశ్చర్యపోయినా, చాలా సంతోషం వేసింది. ముగ్గురమూ సమ వయస్కులమే. ఆ తరవాత సుమారు మూడు గంటలు ఎలా గడిచి పోయాయో మాకే తెలియదు. ముందుగా 6 భాషల్లో 50 పైగా నిఘంటువుల తయారీ, ఇ-పుస్తక ప్రచురణ, భక్తి సంగీత, సాహిత్యాల సేవ, తితిదే వారు ప్రచురించిన అన్నమయ్య సంకీర్తనల 29 సంపుటాలకి విషయసూచిక తయారీ, 80 వేల తెలుగు పుస్తకాల వివరాలను అంతర్జాలంలో ఉంచడం మొదలైన అసాధారణమైన సాహిత్య సేవా రూపశిల్పిని ప్రత్యక్షంగా కలుసుకోవడమే కాకుండా “మీకు నా బహుమతి. స్వీకరించండి” అని ఆయన అవన్నీ నిక్షేపించిన రెండు, మూడు ఫ్లాష్ డ్రైవ్లు ఆయన చేతుల మీదుగా అందుకోవడం నా పూర్వజన్మ సుకృతం. ఆయనే ‘నిఘంటు నిర్మాత:” గా ప్రపంచ ప్రసిద్ధి చెందిన పెద్ది సాంబశివరావు గారు.

ఇదంతా ఒక ఎత్తు అయితే.ఆ తర్వాత గంటా, గంటన్నరా ఆ అమెరికన్ దొరగారి వంతు. మా హ్యూస్టన్ నివాసి అయిన టెడ్అగాన్ గారి గురించి మా టెక్సాస్ పద్ధతిలో "హౌడీ" అనేసుకుని మామూలు కరచాలనం, పరిచయం, కుశల ప్రశ్నలూ అయ్యాక ఆయన నాకు తనే వ్రాసిన ఒక ఇంగ్లీషు పుస్తకం ఇచ్చారు. ఆ పుస్తకం అట్ట కాస్త విభిన్నంగా ఆకర్షణీయంగా ఉంది. అది ఏదో ఆయన వ్రాసిన నవలేమో అనుకుని యాదాలాపంగా పేజీలు తిరగెయ్యగానే ఇదేదో మామూలు గ్రంథం కాదు సుమా అని తెలిసిపోయింది. ప్రతి పేజీలోనూ అంతకు ముందు నేను చదవని, నాకు తెలియని చిన్న చిన్న వాక్యాలు, సూక్తులు, సూచనలు. వెరసి ఈ పుస్తక రచన వెనుక కాలక్షేపానికి అతీతంగా ఒక ఉన్నత స్థాయి ధ్యేయం ఉంది అని అర్థం అయింది. అలాంటి గ్రంథరచనకి పూనుకోడానికి టెడ్అగాన్ కి ఉన్న అర్హతలు, జీవితానుభవాలు ఆయన నోటనే సరదాగా చలోక్తులతో వినగానే ఆయన తపన అర్థం అయింది. అంతకంటే ముఖ్యంగా అసాధారణమైన, మానవాళికి ఆశాకిరణం అయిన ఆ గ్రంథాన్ని తెలుగులో వ్రాద్దాం అనుకుంటున్నాను అని సాంబశివరావు గారు చెప్పగానే నమ్మబుద్ధి కాలేదు. ఎందుకంటే ఆ గ్రంథం నాకు తెలిసిన అనువాదం, అనుసరణ, అనుసృజన మొదలైన ప్రక్రియలకి లొంగేది కాదేమో అనిపించింది. అది కథ కాదు, వచన కవిత్వం కాదు, వ్యాసం కాదు, సిద్ధాంతాల సూత్రీకరణ కాదు, ప్రణాళికా బద్ధమైన రచన అంతకంటే కాదు..అన్నింటినీ మించి తెలుగు వాతావరణం, భారతీయ భావజాలం లాంటి 'పుస్తక వస్తువుల'కి సుదూరంగాఉన్న ఆ గ్రంథం చిన్నదే అయినా పరిధి విస్తృతమైనది. అందుచేత ఆ సమయంలో నా అనుమానాలు నాకు రానే వచ్చాయి. ఆ మాటే సాంబశివరావు గారితో అన్నట్టు కూడా గుర్తు.

ఆ తర్వాత వారం, పదిరోజుల్లోనే ఆ ఇంగ్లీషుపుస్తకం ఆసాంతం చదివి, అబ్బుర పడి, ఆస్వాదించాను. ఇది జరిగి రెండేళ్లు దాటింది. అత్యంత ఆశ్చర్యకరమైన మరో విశేషం ఏమిటంటే ఆ రోజు ఆయన నిఘంటువుల మీదా, టెడ్అగాన్ పుస్తకం మీద చర్చ జరిగాక సాంబశివరావు గారు మా

సంస్థ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ప్రచురించిన గ్రంథాలని ఎంతో ఆసక్తిగా తనతో ఇండియా తీసుకు వెళ్ళారు.

అంతే కాకుండా, వాటిల్లో "20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథ మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం" అనే సుమారు 600 పేజీల అచ్చు పుస్తకాన్ని (2000 ప్రచురణ) పూర్తిగా యూనీకోడ్లోకి మార్చి నాకు పంపించి అపారమైన సహాయం చేశారు. ఎందుకంటే మా దగ్గర కనీసం పిడిఎఫ్ ప్రతి కూడా లేని ఆ చారిత్రక గ్రంథం ఆయన ధర్మమా అని ఇప్పుడు రెండో ముద్రణకి తయారుగా ఉంది. అమెరికాలో కూడా ఆ టెక్నాలజీ లేదేమో అని నా అనుమానం. ఉన్నా, అడగకుండానే అలాంటి సహాయం చేసే సాంబశివరావు గారి లాంటి ఆత్మీయులు లేరు అని చెప్పగలను.

ఇక గత రెండు, మూడేళ్ళగా సాంబశివరావు గారూ. నేనూ పలకరించు కుంటూనే ఉన్నాం, అప్పుడప్పుడు అంతర్జాల సమావేశాలలో కలుసుకుంటూనే ఉన్నాం. టెడ్అగాన్ ఇంగ్లీషు పుస్తకం నా అలమారాలోకి వెళ్ళిపోయింది. అలాంటిది మొన్నీ మధ్యనే సాంబశివరావు గారి దగ్గర నుంచి వచ్చిన ఈ మైల్ ఆసక్తిగా తెరిచి చూడగానే అస్సలు నమ్మలేక పోయాను. ఆ నాడు ఏదైతే అసాధ్యం అనుకున్నానో ఆ ఆంగ్ల గ్రంథం "The Human Key" కి "ఎందుకు ప్రశ్నించాలీ?" అనే మకుటంతో సంక్షిప్తస్వేచ్ఛానువాద పుస్తకం సాఫ్ట్ కాపీ జతపరిచిన ఆ సందేశంలో ఆ పుస్తకానికి నన్ను ముందుమాట వ్రాయమని కోరారు. అసలు ఎటువంటి పుస్తకానికైనా ముందుమాట వ్రాసే అర్హత నాకు ఉందా? అని ఎప్పటి కప్పుడు నన్ను నేను ప్రశ్నించుకునే అలవాటున్న ఆ ప్రశ్న సాంబశివగారికే వేసి, నా అనుమానాలు నివృత్తి చేసుకుని ఈ "ఆప్తవాక్యం" వ్రాయడానికి ధైర్యం చేస్తున్నాను.

నేను "ప్రశ్న -ప్రగతికి మూలం" అనే ఉప మకుటంతో వెలువడిన ఈ పుస్తకానికి మరో మకుటాయమానమైన ధ్యేయం "వేలవేల ప్రశ్నలు

వేయనిద్దాం -అందరినీ ఎదగనిద్దాం".తండ్రి పెద్ది సాంబశివరావు గారి సహకారంతో *డా. పి. హరిపద్మ రాణి* (శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం) గారు చేసిన ఈ స్వేచ్ఛానువాదం నిజానికి తనదే అయిన కొత్త రుచినీ, వాసననీ పొదివి పట్టుకుని ఆగకుండా చదివిస్తుంది. అందులో భావజాలానికి అబ్బురపడేలా చేస్తుంది. ప్రశ్నించడం భారతఇతిహాసాల్లో, పురాణాలలో ఆదినుంచీ ఉన్న ప్రక్రియే. నిజానికి "నేను ఎవరు?" అని ప్రశ్నిస్తూ, ప్రశ్న వేసుకుంటూ ఆదిశంకరుల వారి నుంచి వివేకానందుల వారి దాకా శోధించినదే మన వేదాంతసారం. పాశ్చాత్య నాగరికతలో ఏదైనా నేర్చుకోవాలీ అంటే ముందు ప్రశ్నించాలి అనేది ఒక మౌలిక సూత్రం. మనం చిన్న పిల్లలకి "చెప్పింది చెయ్యి, వెధవ ప్రశ్నలు అడక్కు" అని అనొచ్చునేమో కానీ పాశ్చాత్య దేశాలలో పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహిస్తారు. ఆ ప్రోత్సాహం ఇంకా, ఇంకా పెరగాలనే టెడ్అగాన్ సిద్ధాంత పరమైన ఈ గ్రంథం ప్రధాన ఉద్దేశ్యం. దాన్ని తెలుగులో అద్భుతంగా ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఆచరణలో పెట్టవలసిన అంశాలు ఉన్న ఇలాంటి గ్రంథాలకి పుస్తకం చదివాక దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో కూడా పుస్తకం లోనే సూచనలు ఇవ్వడం మెచ్చుకో దగ్గ విషయం.

ప్రశ్నించడంలో ఉన్న ఔచిత్యాన్ని, అవసరాన్ని ఆకళింపు చేసుకునే మార్గాన్ని సుగమం చేస్తున్న ఈ గ్రంథాన్ని తెలుగు పాఠకులు చదివి తమ జీవితాలని ఉన్నత స్థాయిలో నడుపుకుంటూ విజయాలు సాధిస్తారు అని ఆశిస్తూ, నాకు ఈ ముందు మాట వ్రాసే అవకాశం ఇచ్చిన ఆత్మీయ అనువాదకులు పెద్ది సాంబశివరావు, ఆచార్య హరిపద్మరాణిగారికీ, ఆంగ్ల మూలరచయిత టెడ్అగాన్ గారికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

భవదీయుడు,

వంగూరి చిట్టెన్ రాజు

## ప్రశ్నతో సాధికారత

వృత్తిలో భాగంగా ఎమ్.ఎ. స్థాయి విద్యార్థినులకు ఆంగ్ల భాష, ఆంగ్ల భాషా బోధన, ఆంగ్ల సాహిత్య సంబంధ అనేక అంశాలను గత 25 సంవత్సరాలుగా తిరుపతి, శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో నేను బోధిస్తూ ఉన్నాను.

మా బోధన ద్వారా విద్యార్థులు నేర్చుకోవాలని మేము ఆశించే దానికీ, వారు నిజంగా నేర్చుకునేదానికి మధ్య ఎంతో తేడా ఉండటం సర్వ సాధారణ మైంది. అయితే సుమారు ఒక దశాబ్దం క్రితం, ఈ రెండింటి మధ్య దూరాన్ని తగ్గించేందుకు వ్యవస్థాపరంగా, బోధనాపరంగా, వ్యక్తిగతంగా నేను ఏమి చేయగలనని నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు, అనేకప్రశ్నలు నాలో తలెత్తాయి.

నేను ఎలాంటి అకడమిక్ నేపథ్యం కలిగిన పిల్లలకు బోధిస్తున్నాను? ఏమి చేస్తే వారిని వారి లక్ష్యసాధనకి, మా శాఖా లక్ష్యసాధనకి దగ్గరగా తీసుకు వెళ్ళవచ్చు? ఇలా అనేక ప్రశ్నల సహాయంతో విద్యార్థినుల లక్ష్యాలను, నిజ సామర్థ్యాలను, ఆసక్తులను నేర్చుకునే శైలులను, మా బోధనా స్థితిగతులని, పరిక్షా విధానాలను సమగ్రంగా విశ్లేషించడం మొదలుపెట్టాను.

నా విశ్లేషణ ఫలితంగా నేను తెలుసుకున్న ప్రధాన విషయం ఇది: పిల్లల్లో ప్రశ్నించే తత్వం లేకపోవటం. నా అనుభవం మొత్తంలో తరగతి లోపల చెప్పిన విషయంలో సందేహాలుండి విద్యార్థినులు ప్రశ్నలు వేసిన సందర్భాలు చాలా అరుదు. తరగతి బయట సందేహనివృత్తి కోసం టీచర్ ని కలవటం అనే విషయం ఇంక చెప్పనవసరమేలేదు. ప్రతి తరగతి లోనూ ప్రతి విషయం చెప్పిన వెంటనే "అర్థమైందా లేదా? సందేహాలుంటే నిస్సంకోచంగా అడగండి, మరో సారి చెబుతాను" అనే మకుటాన్ని వేలసార్లు వాడి ఉంటాను. అయినా పిల్లలు ఎప్పుడూ చెప్పుకోదగ్గ ప్రశ్నలు ఏమీ వేసేవారు కాదు.

ఈ 25 సంవత్సరాల బోధనా ప్రయాణంలో నేను గుర్తు పెట్టుకొని నన్ను ఒక విద్యార్థిని ఒకరోజు ఈ ప్రశ్న అడిగింది. దానికి నా దగ్గర సమాధానం లేక నేను పరిశోధించి చెప్పాల్సి వచ్చింది అనే సందర్భం ఒక్కటి కూడా నాకు లేకపోవడం

టీచర్‌గా నా వైఫల్యమా? అనే ప్రశ్నకూడా ఎన్నోసార్లు నాలో తలెత్తింది. ప్రశ్నించే తత్వం వారిలో లేకపోవటమే వారు సమర్థవంతంగా నేర్చుకోక పోవడానికి ప్రధాన కారణమని నేను తెలుసుకున్న తర్వాత నాలో ఉత్పన్నమైన తరువాతి ప్రశ్న ఇది:

విద్యార్థినుల్లో ప్రశ్నలు ఎక్కువవేసే తత్వాన్ని ఏవిధంగా పెంపొందించ గలను? ఈ ప్రశ్నకి సమాధానాలు వెతుక్కునే క్రమంలో పిల్లలకు తరగతిలో ప్రత్యేకమైన కార్యశాలలు నిర్వహించి ప్రశ్న అంటే ఏమిటి? జీవితంలో ప్రశ్నించడం ఎందుకు ముఖ్యం? నేర్చుకునే క్రమంలో ప్రశ్న యొక్క ప్రాధాన్యత ఏమిటి? ప్రశ్నించటం ఎలా నేర్చుకోవాలి? వంటి అనేక అంశాలతో ఓ నాలుగు గంటల కార్యశాలను ప్రతి బ్యాచ్ పిల్లలకు నిర్వహించడం మొదలు పెట్టాను.

బోధన రంగంలో ఉన్న మిత్రులతో మాట్లాడి వారు పనిచేసే సంస్థలలోనూ విద్యార్థుల పరిస్థితి ఇదే విధంగా ఉందని తెలుసుకున్నాను. ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులలో పెంపొందించాలంటే వారికి బోధించే బోధకులకు ప్రశ్నించడం యొక్క ఆవశ్యకత తెలియాలనే ఉద్దేశ్యంతో UGC నడిపే HRDC (Human Resource Development Centre) లలో 2014 ప్రాంతం నుండి ''How do we teach students questioning?'' అనే అంశం పైన అనేకసార్లు అధ్యాపకులకు ప్రసంగాలు ఇవ్వటం, కార్యశాలలు నిర్వహించటం జరిగింది. విద్యార్థులను ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడే అవకాశం ఎప్పుడు ఎక్కడ వచ్చినా ప్రశ్నించడం యొక్క ఆవశ్యకత గురించి క్లుప్తంగా అయినా ప్రస్తావించడం మొదలుపెట్టాను.

తరగతిలో పిల్లలు సెమినార్ ప్రజెంటేషన్ ఇచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కనీసం ఒక్క ప్రశ్న అయినా అడగాలనే నిబంధన పెట్టటం, తరగతిలో ఎక్కువ ప్రశ్నలు అడిగే వారికి ఎక్కువ మార్కులు ఇవ్వబడతాయి అని చెప్పటం జరిగింది.

పిల్లలకి కొన్ని పదాలను, వాక్యాలను జవాబుగా ఇచ్చి వాటికి ప్రశ్నలు అడగమని ప్రోత్సహించటం, ఒక విద్యార్థినిని హాట్‌చైర్‌లో కూర్చో పెట్టి, ప్రతి ఒక్కరినీ వారికి తోచిన ప్రశ్నని ఆ అమ్మాయిని అడగమని చెప్పటం , కోర్సు బోధించడం ముగిసిన తరువాత మీరు ఈ కోర్సు ద్వారా ఏ ఏ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్నారో, ఆ ప్రశ్నలను రాయమని అడగటంలాంటి అనేక చర్యలను చేపట్టి ఇప్పటికీ వాటిని కొనసాగిస్తూనే ఉన్నాను.

ఈ నేపథ్యంలో 2018లో మా నాన్న అమెరికాలోని ఓ గ్రంథాలయానికి వెళ్ళినప్పుడు ‘ The Human Key ’ అనే పుస్తకాన్ని చూడటం, ఆ పుస్తకాన్ని తెచ్చి నాకు చూపటం జరిగింది. ప్రశ్న లేదా ప్రశ్నించే తత్వం మానవ మనుగడకు ఎంతముఖ్యమో ఈ పుస్తకం చెప్పటం చూసి వెంటనే ఆ పుస్తకానికి కనెక్టయి పోవడం, దానిని చదవటం జరిగింది. రచయిత రచనా శైలి పాఠకులని ఆకట్టుకునే విధంగా, సరళంగా లేకపోయినప్పటికీ, ప్రశ్న యొక్క ప్రాధాన్యతని మానవజాతికి చెప్పాలనే రచయిత ప్రగాఢ వాంఛ, ప్రశ్నించడం గురించి వివిధ ప్రముఖుల కొటేషన్స్ ద్వారా ఆయన చెప్పిన విషయాలు ఈ పుస్తకంలోని అత్యంత ప్రధాన అంశాలు అనిపించాయి.

ప్రశ్న అంటే భాషను ఉపయోగించి ప్రశ్నార్థకంతో ముగించే కేవలం ఒక వాక్యము మాత్రమే కాదు. దానికి ఉన్న విస్తృత పరిధి, అనేక ఉదాహరణలు, కొటేషన్స్ తో సవివరంగా ఈ పుస్తకంలో విశదీకరించబడ్డాయి.

ఆలోచించడం అంటే ప్రశ్నించటం.
వినటం అంటే ప్రశ్నించటం.
మాట్లాడటం అంటే ప్రశ్నించటం.
చదవటమంటే ప్రశ్నించటం.
రాయటం అంటే ప్రశ్నించటం.
విశ్లేషించడం అంటే ప్రశ్నించటం.
ప్రశ్న లేకపోతే భావసృష్టి లేదు. భావ ప్రసరణ లేదు.

భావ సృష్టి, భావ ప్రసరణ లేనిదే ప్రగతి లేదు. వేల సంవత్సరాల మానవ ప్రగతికి మూలం ప్రశ్న.సృజనకు, పరిశోధనకు మూలం ప్రశ్న.

ఏమిటి ఈ ప్రశ్న? ఎలా ఇది ప్రగతికి మూలం?
ప్రశ్నించటం జీవితంలో ఎందుకు అంతర్భాగం అవ్వాలి?
సాధారణజీవితంలో,విద్యావ్యవస్థలో ప్రశ్నించేతత్వాన్ని ఎందుకు ప్రోత్సహించాలి?
ఏ వయస్సులో ప్రశ్నించే తత్వాన్ని పిల్లలకు ప్రత్యేకంగా నేర్పాలి, ఎలా నేర్పాలి?
మనల్ని మనం మదింపు చేసుకోటానికి ఉపయోగించే పరికరం ఏమిటి?
ప్రశ్న ఏ విధంగా జీవన నైపుణ్యాలన్నిటిలో అనుసంధానమై ఉంటుంది?

ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సమాధానాలు కావాలంటే టెడ్ ఆగన్ రచించిన ఈ పుస్తకం చదివాల్సిందే. మొదటిసారి పుస్తకం చదివినంత సేపూ ఒకే విషయాన్ని పదే పదే చదువుతున్నట్టుగా అనిపించింది. కానీ రెండవ సారి చదివినప్పుడు, ప్రశ్న యొక్క శక్తిని శాస్త్రబద్ధంగా, బలంగా నమ్మే ఓ రచయిత, ఆ విషయాన్ని పాఠకుల మెదళ్ళలో నాటుకు పోయే విధంగా చెప్పటం కోసం పడుతున్న తపనగా అతని పునరుక్తి శైలి అనిపించింది.

ప్రశ్నలో నిగూఢమై ఉన్న సాధికారతా శక్తిని రచయిత టెడ్‌తో సమానంగా నమ్మే నేను, ఈ పుస్తక అనువాదంలో ఎందుకు భాగస్వామ్యం తీసుకోకూడదూ? అని నన్ను నేను వేసుకున్న ప్రశ్నకి సమాధానమే ఈ అనువాదంలో నా పాత్ర.

350 పేజీల నిడివిగల ఈ పుస్తకాన్ని తెలుగులోకి ఉన్నది ఉన్నట్టు అనువదించడం అవసరం లేదనిపించింది. అలాగని కేవలం సారాంశం మాత్రమే తీసుకుని ఓ చిన్నిపుస్తకంగా తెలుగులో ప్రచురించటం రచయితకు, పుస్తక ఉద్దేశానికి న్యాయం చేసినట్లు అనిపించలేదు. అందుకే మధ్యస్తంగా స్వేచ్ఛానువాదంలో ఈ పుస్తకాన్ని మా నాన్నతో కలిసి తెలుగు పాఠకులకు అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది.
*పి. హరిపద్మరాణి*

**ఈ పుస్తకం సృష్టికర్త -టెడ్ ఆగాన్**

మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లాను. అక్కడ నాకు బాగా నచ్చిన విషయం గ్రంథాలయాలు. డల్లాస్ లోని కేంద్ర గ్రంథాలయానికి వెళ్లాను. అక్కడ ఏటా రెండుసార్లు, వారం పాటు, ప్రత్యేక పుస్తక ప్రదర్శన, అమ్మకాలు చేస్తుంటారు.నేను వెళ్లినపుడు ఆ ప్రదర్శన జరుగుతుంది, అందులో The Human Key అనే పుస్తకం కనిపించింది. దానిలో ఒక పేజీ మధ్యలో ఈ సూక్తి కనపడింది.

Those who don't learn don't question.
Those who don't question don't learn.
నేర్వని వాళ్లు ప్రశ్నించలేరు.
ప్రశ్నించనివాళ్లు నేర్చుకోలేరు.

ఆ మాటలు నన్ను ఆకర్షించాయి. పుస్తకాన్ని పరిశీలించాను.

అది టెడ్ అగాన్ రాసినది. మణిపూసల వంటి సూక్తులతో కూర్చిన పూవులమాలలా ఉంది. ప్రశ్నించటం యొక్క ఆవశ్యకత, అది మానవప్రగతికి ఎలా మూలం అయిందో వివరిస్తూ. ఆధునిక మానవుడు ఇవాళ ఇలా ఉన్నాడంటే అది ప్రశ్నించుకోవటం వల్లనే సాధ్యం అయింది అనీ టెడ్ ఆగన్ సోదాహరణంగా వివరించాడు.

కొన్నాళ్లు పుస్తకం పైపైన చూశాక రచయితకు ఫోన్ చేశాను. ఆ పుస్తకం బాగుంది. దానిని తెలుగులోకి అనువదించుకోవటానికి అనుమతి అడిగాను. గంటకు పైగా చాలా ప్రశ్నలు వేశాడు. నా జవాబులతో సంతృప్తి చెందిన పిమ్మట సంతోషంగా ఆమోదించారు. కొన్ని దఫాలుగా దానిని గురించి మాట్లాడు కున్నాం.

మళ్లీ ఆయనను కలుసుకోవటం కష్టం కనుక న్యూజెర్సీ నుంచి హ్యూస్టన్ వెళ్లి ఆయనను కలిశాను. ఒక రోజు ఇద్దరం కలసి గడిపాం.

ఫైలు మొత్తం ఇచ్చారు. ఆయనతో సంబంధాలు కొనసాగుతున్నాయి. మా ఇద్దరి వయసులో కొన్ని నెలలే తేడా. ఆయన సంక్షిప్త పరిచయం ఇది.

టెడ్ అగాన్- పుట్టింది కెనడా దేశ సరిహద్దులో 17 వ యేటనే అమెరికా వైమానిక దళంలో చేరి స్వంత సంపాదన మొదలు పెట్టాడు. నాలుగేళ్లు, అందులో మూడేళ్లు అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్ వేర్ విభాగంలో పనిచేశాడు.

1966లో అమెరికాను, పౌరసత్వాన్ని వదలి, యుద్ధంలో చితికిపోయిన వియత్నామ్ పౌరునిగా వెళ్లి అక్కడ ఎనిమిదేళ్లు ఉన్నాడు. ప్రపంచంలో సగభాగం సందర్శించాడు. పలు సంస్కృతులు, ఆలోచనా విధానాలను చూశాడు.

థాయ్ ల్యాండ్, జపాన్, సల్తనేట్ ఆఫ్ ఓమన్, ఫ్రాన్స్, కెనడాలలో జీవితం గడిపాడు. వ్యాపారరీత్యా ప్రపంచపు ఐదు ఖండాలలో పర్యటించి ఈజిప్ట్, ఇజ్రాయెల్, ఐవరీ కోస్ట్, కాంగో, దక్షిణ ఆఫ్రికా, హాలెండ్, ఇటలీ, ఇంగ్లాండ్, స్కాట్‌ల్యాండ్,సింగపూర్,మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, హాంగ్‌కాంగ్, కాంబోడియా, లావోస్, ఇండియా, నేపాల్, మెక్సికో, బ్రెజిల్ చూశాడు.

వైవిధ్యం లేకపోతే సృజన ఉండదు. వైవిధ్యభరిత జీవనం లేకపోతే నూతన ఆలోచనలు కలగవు. నూతన సృష్టి చేయలేక భిన్నజీవన విధానాల మధ్య గల పోలికలు, వైరుధ్యాలను సునిశితంగా పరిశీలించాడు.

''అనుభవం నుంచే విజ్ఞానం అంతా ఆవిర్భవిస్తుంది'' అన్నాడు ఐన్ స్టీన్

టెడ్ అగాన్‌కు అనుభవం అందించిన వనరుల వరాలు.

*(ఇవి కాలక్రమంలో లేవు.)*

దక్షిణచైనా సముద్రంలో చిక్కుకున్న వారిని కాపాడు బృందనాయకుడిగా ''యం.వి.సీ'' స్వీప్ అనే రక్షణనౌకలో వరల్డ్ విజన్ ఇంటర్ నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో పనిచేశాడు. వియత్నామ్ నుంచి పారిపోతున్న స్త్రీలు, పిల్లలు, పురుషులను రక్షించగలిగాడు. ఆ సాహసగాథలు చరిత్ర పుటలకు ఎక్కాయి. వీరి బృందం ఇండోనేషియా దీవుల్లో 30 వేలమంది శరణార్ధులకు టీకాలు వేసింది. అందులో 9,500 మందికి ఆరుబయట, ఒక్కరోజులోనే వేసి ఐక్యరాజ్యసమితి ద్వారా, కాంబోడియా నుంచి సత్కారాలు పొందారు.

సింగపూర్ నుండి కాంబోడియాకు విమానాలలో వరల్డ్ విజన్ ఇంటర్నేషనల్ ద్వారా సహాయసామగ్రిని చేర్చిన కొద్దిమందిలో టెడ్ ఒకరు.

సల్తనేట్ ఆఫ్ ఓమన్లో, ముసాండమ్ రాష్ట్రంలో ప్రొవిన్షియల్ ప్రధాన అభివృద్ధి అధికారిగా పనిచేశారు. వియత్నమ్లో ఓడలను లాగే పడవల యజమానిగా, నిర్వాహకునిగా ఉన్నారు. ఇద్దరు భాగస్వాములతో కలసి 6 పెద్ద పడవలు, 33 చిన్న పడవలతో మెకాంగ్ డెల్టా, డాన్ హా ప్రాంతాలలో వ్యాపారం నడిపాడు. మొత్తం మీద యుద్ధకాలంలో 8 సంవత్సరాలు వియత్నమ్లో ఉన్నాడు. ఆయన తమ్ముళ్లు ఇద్దరు, కొంతకాలం వాళ్ల అమ్మ కూడా అక్కడే ఉన్నారు. అక్కడ ఆయన మేనమామ కళాశాల ఆచార్యులుగా ఉండేవాడు. ఆయన టెడ్ కుటుంబాన్ని ఆదుకున్నాడు.

**జలాంతర్గాముల పరిశోధకుడు**

అట్లాంటిక్ మహాసముద్రంలో, ఎర్రసముద్రంలో, మెడిటరేనియన్ సముద్రం, అడ్రియాటిక్ సముద్రం, కాంగో, ఐవరీ తీరంలో, ఫ్రెంచ్, కెనేడియన్ కంపెనీలకు (పిసెస్-6) జలాంతర్గామి వాహకునిగా పరిశోధనలకోసం 4,300 అడుగుల (1,325 మీటర్లు) కంటే లోతుకు వెళ్లాడు. వీటిలో ఒక జలాంతర్గామిని గురించి 1986 నవంబరులో నేషనల్ జాగ్రఫిక్ – లో వ్యాసం ప్రచురించబడింది.

మానవ సమాన మరమనిషి: నాసాలోని జాన్సన్, గాడార్డ్ అంతరిక్ష కేంద్రానికి దాదాపు మానవుడితో సమానంగా, కొన్ని పనులు మానవునికంటే బాగా చేయగల సాంకేతికతను అందించారు.

పెద్దపెద్ద వారిని, ప్రముఖులను వెయ్యి గంటలదాకా ఇంటరువ్యూలు చేశాడు. బిలియన్ డాలర్ విలువగల అంతర్జాతీయ పెట్రోలియం కంపెనీకి 109 మంది ఉన్నతస్థాయి, ద్వితీయ స్థాయి ఉద్యోగులను ఎంపిక చేశాడు. థాయ్ ల్యాండ్ లో దూరప్రాంతాలకు ఫోను లైన్ల వ్యవస్థాపన పర్యవేక్షకునిగా పనిచేశారు. థాయ్, వియత్నమీస్, కొరియన్, ఫిలిప్పినో, అమెరికా సాంకేతిక బృందంతో కలసి థాయ్‌ల్యాండ్, వియత్నామ్‌లలో దూరప్రాంతపు ఫోన్ కేంద్రాలను నెలకొల్పాడు.

స్కౌట్ ఉద్యమ నాయకునిగా హ్యూస్టన్,(టెక్సాస్)లో, మూడేళ్లు బాధ్యతలు నిర్వహించి, ఆ ఉద్యమంలో ఉడ్ బ్యాడ్జ్ ప్రశంసా పత్రం అందుకున్నాడు.

**రోబోల సర్వస్వామ్య హక్కుదారు-**

హ్యూస్టన్, టెక్సాస్‌లలో రోబోటిక్ రూపకల్పన బృందసభ్యునిగా పాల్గొన్నారు. బయటి నుంచి సముద్రగర్భంలో పనిచేయగల రోబోల తయారీ, నిర్వహణ సభ్యుల బృందం అయిదుగురిలో ఒకడిగా ఉన్నారు. దీనిని చాలెంజర్ లో ప్రయోగాత్మకంగా వాడారు.

సముద్రగర్భంలో పనిచేసే రోబోకు ఉపయోగించే హైడ్రాలిక్ కనక్టర్ పరికరానికి మరొకరితో కలసి టెడ్ అగాన్ పేటెంటు హక్కులు కలిగి ఉన్నాడు. జార్జియాలోని రాబిన్స్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎలక్ట్రానిక్స్ బోధకుడిగా పనిచేశారు. ఇన్ని సాధించారు మరి మీ వైఫల్యాలు ఏమీ లేవా? అంటే పరాజయాలను ఎవరు చెపుతారు? చెప్పాలంటే చాలా ఉన్నాయి, అందరికీ ఉంటాయి, నాకూ చాలా ఉన్నాయి అన్నారు టెడ్.

*పెద్ది సాంబశివరావు*

**అమ్మకు ఆత్మీయ అంకితం**

*మా అమ్మ, ఇసబెల్ ఆలెన్ పుట్టింది 1916లో. వితంతువుగా 15 సంవత్సరాలపాటు ముగ్గురు పిల్లలను పెంచి, పోషించింది. ఆమె వేటలో నేర్పరి. కళాప్రియురాలు, ఆటలాడేది, పాటలు పాడేది, పియానో వాయించేది, పర్యటన, నాట్యం ఆమెకు ఇష్టం. వియత్నమ్ యుద్ధసమయంలో పిల్లలు ముగ్గురినీ కలుసుకుంది. తరువాత కొంతకాలం సల్తనేట్ ఆఫ్ ఓమన్ లో ఉన్నది. 50 యేళ్ల వయసులో ఒంటరిగా మెక్సికో అంతా మోటారు వాహనంలో స్పానిష్ నేర్చుకోవడానికి ప్రయాణం చేసింది. ఆ కాలంలో ఆమెఒక విశిష్ట మహిళ.*

*సంతానమైన మాలో విలువలు, భాష, సంగీతం, ప్రకృతి ప్రేమల పునాదులు వేసింది. అందుకే ఈ పుస్తకాన్ని అమ్మకు అంకితం ఇస్తున్నా..*

*నిరంతరం ప్రోత్సహిస్తున్న*

*నిర్మలహృదయిని నా ఆత్మ,*

***జూలి లింక్** కి ప్రగాఢ ప్రశంసలు.*

*విషయసేకరణలో సహాయపడినందుకు*
*జూడీ క్లార్క్ కు ప్రత్యేక ధన్యవాదాలు.*
*టెడ్ ఆగాన్*

## ప్రశ్నల ప్రారంభం


మానవుని జన్మ, స్త్రీ, పురుష కణాల కలయికతో తల్లి గర్భంలో, ఒక ***కణరూపంగా*** ప్రారంభం అవుతుంది. ఆ పిండం తల్లి గర్భంలో పెరుగుతూ 32- 40 వారాల తరువాత పూర్తిగా, ***ఎదిగిన శిశువుగా*** భూమి మీదకు వస్తుంది. అది మనం అనుకునే పుట్టినరోజు. బిడ్డను బడికి పంపటంతో ***సామాజిక పుట్టుక*** ఆరంభం అవుతుంది. మొదటి కొన్ని నెలల్లో బిడ్డ చూస్తూ, వింటూ గ్రహించటం మొదలు పెడుతుంది. పరిసరాలకు స్పందిస్తుంది. భాష నేర్చుకోవటానికి అలవాటు అవుతుంది. అప్పటినుంచి ప్రశ్నించటం మొదలు అవుతుంది. అనుసరణ సాగుతుంది. సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతాయి. వయసు 6-7 సం.రాలు పూర్తి అయేసరికి బిడ్డకు తెలియకుండానే తనమీద తనకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడతాయి. ఆ అభిప్రాయాలు ఏ జోక్యం లేకపోతే జీవితాంతం అలాగే ఉంటాయి.

శిశువు ప్రతిపనికీ ఇతరులపై(అమ్మపై) ఆధారపడుతుంది. ఆకలి, మల, మూత్ర విసర్జనల వల్ల అసౌకర్యం కలుగుతుంది. శిశువుకు చేతనయింది ఏడ్వడమే. ఏడుస్తుంది. అమ్మ వచ్చి ఆకలి తీరుస్తుంది, దుస్తులు మారుస్తుంది. ఇలా ప్రతిరోజూ అనేక వందలసార్లు జరగటంతో శిశువుకు భాష రాక పోయినా, భావన ఏర్పడవచ్చు. అదే భావన జీవితాంతం నిలుస్తుంది. శిశువు తనను దండించినా, కోపపడినా, విసుక్కున్నా గ్రహించగలుగుతుంది.

ఇలా పెరిగే శిశువుకు ఆలోచించడంతో పాటు మెదడుకు ప్రశ్నించే అలవాటు నేర్పడానికి ఏది సరైన వయస్సు?

మనిషి అనుభవాలు పెరిగే కొలది వాటిని అనుసరించి మెదడు మారుతుంది, ఆ మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకునే శక్తి మెదడుకు బాల్యంలో ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రాధమిక బాల్యంలో – ఐదేళ్ల లోపు - వ్యక్తిత్వం రూపు దిద్దుకునే వయసులో పిల్లల తెలివితేటలు, సమాజంలో మెలగటానికి కావలసిన నైపుణ్యాలలో 85 శాతం వరకు అభివృద్ధి చెందుతాయి.

అందుకే బడిలో చేరడానికి ముందే నేర్పడానికి, నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే మంచి- చెడు, ఉపయోగం- నిరుపయోగం, లాభం- నష్టం వంటి విషయాలను గ్రహించటం, అనేక వాదాలు విని వాటిలో ఏది తనకు తగిందో, ఏది కాదో తెలుసుకోగల జ్ఞానం కలగడానికి ఎక్కువ సంవత్సరాలు పడుతుంది. ఇందుకు మెదడులో ముందు భాగం, నొసలు వెనుక ఉండే కార్టెక్స్ సహాయపడుతుంది.




ఇది మెదడులో మిగతా అన్ని భాగాలకంటే ఆలస్యంగా అభివృద్ధి చెందుతుంది. భావావేశాలను, భావోద్వేగాలను నియంత్రించేది మెదడులోని ఈ భాగమే. సుమారు 25 సంవత్సరాల వయసు వచ్చే దాకా అది పెరుగుతూనే ఉంటుంది. అందుకే 25 సం.రాల లోపు వయసులో ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ. ఎవరైనా తన వాహనాన్ని దాటిపోతే సహించలేరు. ప్రయాణ నియమాలు పాటించటం కంటే తిరస్కరించడంలోనే గొప్పతనం ఉందనుకుంటారు. ఈ వయసు వారు వాహనాలను నడపడానికి బీమా చేయాలంటే కిస్తీలకు ఎక్కువ డబ్బు చెల్లించాలి. ఆవేశం, ఉద్రేకం ఎక్కువగా ఉండి, వివేచన, విచక్షణ తక్కువగా ఉండే వయసు ఇది. విచక్షణా జ్ఞానం తక్కువగా ఉన్నందువల్ల ఈ వయసులో వాహనప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. మంచీ, చెడు తెలుసుకొనే విచక్షణాజ్ఞానం కొలవడానికి సాధ్యమయిందే. 'ప్రతి విషయం నేర్చుకునేటంత చిన్నవయసు కాదు నాది'.అన్నాడు ఆస్కార్ వైల్డ్.

బాల్యంలో మెదడు మృదుత్వాన్ని ఉత్తమ అలవాట్లను నేర్పడానికి వినియోగించు కోవాలి. ఈ వయసులో పిల్లలు నేర్చుకునే యంత్రాలలాగా ఉంటారు. వాళ్లకు ప్రశ్నలు వేసే నేర్పు సహజంగానే ఉంటుంది. మనం కొత్తగా ఏమీ తెచ్చి పెట్టనవసరం లేదు. వారికున్న శక్తిని ప్రోత్సహిస్తే చాలు. ఆ వయసు పిల్లలకు బడిలో పాదం మోపకముందే ప్రశ్నించడం అలవాటు చేయాలి.

''క్లుప్తంగా చెప్పాలంటే బాల్యంలో పిల్లలకు మనం నేర్పితే వాళ్ల జీవితాలలో వచ్చే మార్పు చిన్నదిగా ఉండదు. అందులోనే ఉంటుంది తేడా అంతా''- అన్నాడు అరిస్టాటిల్ ఎన్నో శతాబ్దాల పూర్వమే.

''జీవితాన్ని గడపడం ఒక భవనాన్ని నిర్మించడం లాంటిదే. దాని ప్రారంభదశలో పొరపాట్లు చేస్తే వాటి ఫలితాలు పొరపాట్లతోనే ముగుస్తాయి''- అన్నది మాయా ఏంజలో. అంటే సరిగా ప్రారంభిస్తే సరిగా ముగించే అవకాశాలు ఎక్కువ. పిల్లల లేత మెదడు విషయంలో దాని మృదుత్వం గురించి ఆమె చెప్పింది నిజమే.


**పిల్లల పెంపకం**

అనుభవాలను బట్టి పెద్దల మెదడు కూడా పెరుగుతుంది, మారుతుంది. కనుకనే వయసుతో నిమిత్తం లేకుండా 60 సం॥రాలు దాటినా మెదడుకు పెరిగే శక్తి ఉంటుంది. అయితే పిల్లల్లో లాగా పెద్దలలో ఎక్కువ వేగంగా మారదు. వయసు మళ్లిన వారిని అనుభవజ్ఞులు అనడం అందుకేనేమో?

పెద్దలారా, మీ మెదడును పెరగనివ్వండి, ఆలోచించనివ్వండి. ఎవరైనా 'మా బిడ్డ మెదడు వికసింపజేయడానికి,ఆలోచనాశక్తిని పెంచడానికి ఏంచేయాలో చెప్పండి' అంటే జవాబు ఎలా చెప్పాలో తెలియదు. ఒక్క సంగతి గట్టిగా చెప్పొచ్చు. పిల్లల్లో సహజంగా ఉన్న జిజ్ఞాసని పెంచి, వాళ్లలో ఉన్న ప్రశ్నించే స్వభావాన్ని ప్రోత్సహించాలి. ఇది అందరూ చేయగలిగిందే. చేయగలిగింది కనుక చేసి తీరవలసిందే కదా? ప్రశ్నించడానికి ప్రోత్సహించడం అంటే మంచి ప్రశ్నలను అడగడం అలవాటు చేయడం. ఇందుకు కొనవలసినది ఏమీ లేదు. కనుక వెంటనే మొదలు పెడదాం.

**వర్తమానం** మాత్రమే ఉంది- ఇది గతానికి భవిష్యత్తు, భవిష్యత్తుకు గతం. గతం గడచిపోయింది, **భవిష్యత్** ఇంకా రాలేదు, ఉన్నది వర్తమానం ఒక్కటే. వర్తమానం లేకుండా గతం లేదు, భవిష్యత్తు లేదు.వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోగలిగితే గతాలూ, భవిష్యత్తులు బాగుపడతాయి.

**ఇప్పుడు** మాత్రమే ఉంది. కనుక ఇప్పుడు ఏమి చేద్దాం?




తల్లిదండ్రులు ప్రశ్నించడం నేర్పితే పిల్లల జీవితాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. గతాన్ని గురించి బాధ పడకుండా ఇప్పటి నుంచైనా మొదలు పెడదాం. మరో మార్గం లేదు. మన కళ్లముందు కనిపిస్తున్నది వర్తమానం. పిల్లల భవిష్యత్తును– రేపును - నేడు సృష్టించవచ్చు' క్రిష్టాఫర్ కొలంబస్. ఆయన ఆసియా ఖండాన్ని చూడాలనుకున్నాడు. కాని భూగోళంలోని మరో సగాన్ని చూశాడు. అదే కొత్త ప్రపంచం. ఆయన పొరపాటు పడ్డాడు. కాని 500 యేళ్ల తరువాత, నేటికీ ఆయన్ను ప్రశంసిస్తున్నాం. ఏడాదిలో ఒకరోజును ఆయన పేరున కేటాయించి గౌరవిస్తున్నాం.

ఈ పుస్తకాన్ని రాస్తుండగా ఒక ఆలోచన నా ముందుకు వచ్చి వాలింది. అది నా మేధస్సు గొప్పతనం వల్ల కాదు, పరిశీలన ద్వారానే జరిగింది. ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి, ఆవిష్కరణలు జరిగాయి. అవి విజయాల ద్వారా కాక, పరాజయాల వల్లనే సాధ్యం అయ్యాయి. ''అప్పుడప్పుడు సత్యం మీద నడుస్తూ తప్పటడుగులు వేస్తుంటాం. కాని చాలామంది నిలదొక్కుకొని వాళ్లంతట వాళ్లే పైకి లేస్తారు, ఏమీ జరగనట్లుగా ముందుకు సాగిపోతారు''. అన్నారు ఇంగ్లాండ్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్.

ఇలాగే నన్ను నేను తెలుసుకున్నాను. ఒక వాస్తవం తెలుసుకోవడానికి చేసిన ప్రయాణంలో నా అడుగులు తడబడ్డాయి. కానీ ఏమీ జరగనట్లు లేచి నడక కొనసాగించలేదు. నేను నా వైఫల్యాన్ని పట్టించుకోకపోతే మహా ప్రమాదాలు జరిగి ఉండేవి. దానిని అందరికీ చెప్పాలి. అందుకే ఇది రాస్తున్నాను. అంటే నేను మరేదీ చేయలేక కాదు, మరేదీ చేయలేను కనుక

*'ఆలోచించడం (ప్రశ్నించడం) నీకు సాధికారత కలిగిస్తుంది.*
*ఆలోచించడం తెలియని వాళ్లకంటే ముందుకు వెళతావు'*. నీల్ డిగ్రాసి టైసన్
'ప్రశ్నించగల శక్తి మానవ ప్రగతికి మూలం'. ఇందిరా గాంధీ
తన సర్వఅనుభవాల సారాంశమే మనిషి.

## విషయ పరిచయం:

*''విషయంలో సత్యం ఉంటే రచనలో నాణ్యత లేకున్నా అది గాయం చేయదు''* అన్నారు ఆల్ ఫ్రెడ్ ఆడ్లర్, మానసిక వైద్యుడు,ఆస్ట్రియా(1870-1937)

ముందుగా ఒక విషయం చెప్పాలి. నేను రచయితను కాను, కేవలం ఒక పరిశీలకుడిని మాత్రమే. అనుకోకుండా దేనినో కనుగొన్నాను. నా రచనా విధానం గొప్పది కాకపోవచ్చు. నేను చెప్పే విషయం మాత్రం చిన్నది కాదు. ఇందులో ఆలోచనలే చూడండి.

## మూడు అంశాలు

మానవ మనుగడలో గల మూడు ముఖ్యాంశాలు. ఆలోచన- నేర్చుకోవడం- భావవ్యక్తీకరణ-ఈ మూడు అంశాలకు, ప్రశ్నించటానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గురించి ఈ పుస్తకంలో చెపుతాను.

ఆలోచనా నైపుణ్యం కలవాళ్లు ఆ నైపుణ్యం లేని వాళ్లకంటే ముందుకు వెళతారు.

* నేర్చుకోవడంలో నైపుణ్యం కలవారు లేనివారిని జయిస్తారు.
* మనసులోని భావాలను ఇతరులకు స్పష్టంగా చెప్పగలిగిన వాళ్లు చెప్పలేని వాళ్లను జయిస్తారు.

ఈ మూడు సూత్రాలను అందరం ఆమోదిస్తాము. ఈ నైపుణ్యాలను, సామర్థ్యాలను మనం పెంచుకోవాలనుకుంటాం.

మన పిల్లలు వాళ్ల జీవితాల్లో రాణించడానికి వీటిని నేర్పాలనుకుంటాం. ఈ పుస్తకం అందుకు ఉపయోగపడే సులభవిధానాలు, చిట్కాలు తెలుపుతుంది. నేను కూడా ఆ దారిలో అడుగులు వేసేటప్పుడు తడబడ్డాను, ఆశ్చర్యపడ్డాను.

ఈ పుస్తక సారాంశాన్ని ఒక్క పేజీలో చెప్పవచ్చు. అయితే ఇన్ని పేజీలు ఎందుకని అనుమానం కలగవచ్చు. నువ్వూ, నేనూ ఎదురెదురుగా ఉన్నట్లయితే నీ ప్రశ్నలకు ప్రత్యక్షంగా, తక్షణమే జవాబులు చెప్పేవాడిని, సందేహాలను తీర్చేవాడిని. త్వరలోనే ఒక అవగాహనకు వచ్చే వాళ్లం. కాని పుస్తకం భావప్రసార మాధ్యమం. అది ఏకదిశా సమాచార ప్రసారసాధనం. ఈ పుస్తకం చదివేటప్పుడు కలిగే సందేహాలు, ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పడానికి ప్రయత్నిస్తాను. సులభమైన పద్ధతుల్ని ఆచరించడం ఎలాగో చెపుతాను. మీరే క్రమంగా సులభమైనదే బలమైనది అని గ్రహిస్తారు.

ఇంకా ప్రశ్నలు వేయాలనుకున్నా, వ్యాఖ్యలు చేయాలనుకున్నా, నేను ఈ భూలోకం మీద ఉన్నంతకాలం– thehumankey.com. ద్వారా సంప్రదించవచ్చు.

‘‘ప్రతి పుస్తకం ప్రపంచపు ఒక కోణం. అది నీకు నచ్చకపోతే దాన్ని పట్టించుకోకు, లేకపోతే నువ్వే ఒక పుస్తకం రాయి.’’ ఇండియాలో జన్మించిన బ్రిటీష్ రచయిత, సల్మాన్ రష్దీ (b.1947)

ఇందులో కొత్త ఏమీ లేదు, నేను ఏ కొత్త సిద్ధాంతాన్నీ ప్రతిపాదించడం లేదు. ఇప్పటికే మనుగడలో ఉన్న వాటిని, మేధావుల అనుభవాలను పుస్తకంలో కూర్చాను. ఇతరుల అనుభవాలను చూపాను. తెరచాటున తారాడుతున్న నీడల మధ్య నుండి భావాలను బయటకు లాక్కువచ్చాను, మానవజీవితమే నేపథ్యం. నువ్వే కథానాయకుడివి. ఎన్నో రంగస్థలపు పేర్లతో, మారుపేర్లతో చూపించాను. కళ్లు మిరుమిట్లు గొలిపే దీపాల కాంతిలో మీరు కనపడతారు. మిమ్మల్ని ప్రకాశవంతం చేసే ప్రయత్నం ఇది. ఇందులో ప్రశ్నలు కొన్ని మాత్రమే. వాటి

ప్రాముఖ్యత మాత్రం ప్రతి ఉఛ్వాస నిశ్వాసలో అతి కీలకమైనది. ఈ పుస్తకంలో ముఖ్యాంశం మనం చేసే ప్రతిపనికీ కీలకమైనదే.

ఒక పుస్తకమే అన్ని విషయాలనూ చెప్పలేదు, కాని మీరు ప్రతి విషయాన్ని ఆలోచించేలాగా చేస్తుంది. ప్రతిఅంశాన్నీ విమర్శనాత్మకంగా ప్రశ్నించమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ఈ పుస్తకాన్ని రాస్తున్నంతకాలం నేను అలానే చేశాను. ఎందుకో మీరు తెలుసుకుంటారు.

## హెచ్చరిక

మొదటి నుంచి చివరిదాకా ఈ పుస్తకాన్ని చదివి, తెలుసుకున్న విషయాలను అన్వయించుకోగలిగితే అది మీ జీవితాన్ని, మీ పిల్లల జీవితాలను, వారి మనుమళ్ల, ముని మనుమళ్ల జీవితాలను మారుస్తుంది. కాని ఒక్క షరతు ఉంది. అలాకాక గ్రహించిన వాటిని నువ్వు అన్వయించకపోతే అన్వయించిన వారి చేతిలో ఓడి పోతావు. అతిశయం చేసి చెప్పను, ఉన్నదాన్ని పెంచి చెప్పను. ఈ పుస్తకం మీకు ప్రశ్నించడం నేర్పుతుంది.

ఈ పుస్తకాన్ని కనీసం నాలుగు రకాలుగా ఉపయోగించవచ్చు. 1. ఇది ఎందుకూ పనికిరానిదని అవతల పడేయవచ్చు. 2. బాగా ఉపయోగ పడుతుందని గ్రహించి నప్పటికీ పట్టించుకోకపోవచ్చు. అలా చేస్తే పట్టించుకొని ఆచరించిన వారిలాగా విజయాలు పొందలేవు. 3. బాగుందని గ్రహించి, అందులోని విషయాలను ఆచరించి ఇతరుల కంటే అధిక్యంలో ఉండాలనే స్వార్ధప్రయోజనంతో పనిచేయవచ్చు. 4. బాగా ఉపయోగపడుతుందని తెలుసుకొని, ఈ సమాచారాన్ని ఇతర వ్యక్తులకు అందించి సహాయపడవచ్చు. ఈ నాలుగు మార్గాల్లో నువ్వు దేన్ని ఎంచుకుంటావో నీ ఇష్టం.

## మంచికి విరుద్ధమైనది పట్టించుకోకపోవడం. (చెడు)

ఇతరుల జీవితాలలో గణనీయ మార్పును తీసుకురావడానికి మనకు ఎన్నో అవకాశాలు వస్తాయి. పొరుగు వారి జీవితాలలో మార్పును తీసుకు రాగలిగితే మన జీవితాలలో మార్పులు రాకుండా ఉండవు. ఇతరులకు గులాబీ పూలు పంచుతుంటే ఆ సువాసన నీ చేతులకు అంటుకుంటుంది.

ఈ ఆలోచనా గ్రంథాన్ని రాసినందున నాలో చాలా మార్పు కనిపించింది.

ఒకసారి చదువుకోవడానికి, తరువాత మళ్లీ చూసుకోవడానికి ఉపయోగపడింది.

నేను వ్యక్తిత్వవికాస శిక్షణా తరగతులు నిర్వహిస్తాను. ముఖ్య విషయాలను మననం చేసుకోవడానికి ఉద్దేశించి ఈ గ్రంథాన్ని మొదట రాశాను. సాధారణంగా ఉపన్యాసం వినేటప్పుడు చిత్తుగా రాసుకునే నోట్సు వల్ల పూర్తి ప్రయోజనం ఉండదు. వింటున్నది వేగంగా రాసుకోవడం వల్ల ఏకాగ్రత తగ్గుతుంది. వినడం, రాసుకోవడం - ఒకేసారి రెండుపనులు చేయాలంటే రెంటిలో నాణ్యత లోపిస్తుంది.

అనేకసార్లు నా ఆధ్వర్యంలో శిక్షణ పొందేవారికి విషయాన్ని నెమరు వేసుకోవ డానికి అవగాహనకు నోట్సు సహాయపడుతుంది అనిపించింది. 'మానవ తాళం చెవి' అనే ఈ పుస్తకంతో ఓ సమస్య ఉంది. ఆలోచించడానికి, నేర్చుకోవడానికి, భావాలను ఇతరులకు చెప్పడానికి ఏవేవో ఆటంకాలు వస్తున్నాయని చిలిపి సంజాయిషీలను చెపుతూ, సామర్థ్యాలను పెంచుకోకపోతే నిన్ను ఇది ఏ మాత్రం వినిపించుకోదు, పట్టించుకోదు.

**ఇది నిజంగా ఆలోచనా పుస్తకమే.**

డా.మారియా పయాంటా నిడా చెప్పింది సముచితంగా ఉంది. ఆమె పిట్స్ బర్గ్ విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిలో ఉన్నది. పరిశోధనల్లో నాణ్యత పెంచడం గురించి ఆమె పదేళ్లు పైగా బోధించింది.

''ఆలోచనా గ్రంథం విశిష్టమైనది, అది సిద్ధాంత వ్యాసం లాగానో, పరిశోధనా పత్రం లాగానో లేదు. శాస్త్రీయపత్రికా వ్యాసం, నగిషీలు దిద్దిన నగ కాదు''.

నా జీవితంలో సగం దూరం వెనక్కు వెళ్లి చూస్తే, నేను దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో శరణార్థుల సహాయంలో లీనమై పనిచేశాను. ఇండోనేషియా శిబిరాలలో వైద్య సహాయాలు అందించాను. ఆ అనుభవాల ప్రభావంతో ఈ ఆలోచనా తటాకం తవ్వాలనుకున్నాను.

నేను 2009 నుంచి నా ఆలోచనలను కాగితంపై పెట్టడం ప్రారంభించాను.

(అవి ఒకదాని తరువాత మరొకటి ఆవిష్కరణలుగా వ్యక్తిగతజీవిత మార్పులుగా ప్రతిఫలించాయి.) నేను నేర్చుకున్న దానిని ఇతరులకు చెప్పకపోవడం బాధ్యతా రాహిత్యం. ఇంకా చెప్పాలంటే అది నైతిక అపరాధం కూడా అనిపించింది. కనుక రాయాలని నిర్ణయించుకున్నా. నా ఆలోచనలు నా మెదడు నుంచి ఈ పుస్తకంలోకి, అందులో నుంచి మీ జీవితాలలోకి ప్రసారం అవుతాయి. ''కొంతకాలం గడిచాక నువ్వు ఏం చేస్తున్నావో ఇతరులకు చెప్పలేకపోతే- నువ్వు చేసే పని నిరర్థకమే'' ఎర్విన్ స్రోడింగర్,(నోబెల్ పురస్కారగ్రహీత,

.(1887-1961)

నేను మీకు హృదయపూర్వకంగా వాగ్దానం చేస్తున్నాను. ఇందులోని విషయాలను ఆచరించిన వారి జీవితంలో, వారి కుటుంబ సభ్యుల జీవితాల్లో, ఆ సమాజంలో విలువైన, గణనీయమైన మార్పులు వస్తాయి. ఇదొక సంప్రదాయబద్ధంకాని గ్రంథం. ఇది సంప్రదాయ విరుద్ధంగానే తీర్చిదిద్దబడింది.

కొత్తగా చెప్పవలసింది ఏమీ లేనప్పుడు సంప్రదాయపద్ధతిలో పుస్తకం రాయడానికి సమయాన్ని ఎందుకు వృధా చేయాలి? సంకుచితత్వం ప్రగతికి శత్రువు. మనం ప్రగతిని కోరుకుంటే, అభివృద్ధి మన లక్ష్యమయితే సంకుచితత్వాన్ని వదలి ఆధునికత దిశగా అడుగులు వేస్తూ, నేర్చుకోవాలి.

ఈ రచనాశైలి సంభాషణ రూపంలో ఉంటుంది. భాష నియతరూపంలో ఉండదు. నా భాష, శైలి శాస్త్రజ్ఞులు, విద్యాసంస్థలు, విద్యావేత్తలవి కానే కావు. దీనిని వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలను ఉద్దేశించి రాసాను. ఇందులోని అంశాలు ముఖ్యమైనవి. పనికి వస్తాయనుకున్న వాటినే తీసుకొని మిగతా వాటిని వదిలేయండి. కోరుకున్నదానినే స్వీకరించండి, మిగతా దానిని పట్టించుకోకండి.

ఈ పుస్తకం 'ఆలోచన' పైన నా జీవిత సిద్ధాంతగ్రంథం. కాలానికి, ప్రాంతానికి అతీతంగా సాగిన జ్ఞానపూరిత సంభాషణలు, నావి మాత్రమే కాక ఇతరుల అనుభవాలు కూడా ఈ పుస్తకం నిండా ఉన్నాయి. వీరిని నేను పరోక్షంగా సంప్రదించినట్లు భావించి గౌరవిస్తాను. నేను ప్రధానంగా చెప్పదలచుకున్నది చెప్పిన తరువాత, ఇదే అంశంపై వాళ్లు ఏమి చెప్పారో చూపాను.

వాళ్లు అడిగితే వారి అనుభవాలను, సూక్తులుగా చెప్పటానికి సన్నద్ధంగా ఉన్నారు అనిపించింది. దశాబ్దాలు, శతాబ్దాలు, సహస్రాబ్దాలు గడచినా వారి అభిప్రాయాలు విలువ తగ్గకుండా నిలచి ఉన్నాయి.

అలా కాలాతీతంగా నిలబడి ఉండటానికి కారణాలు రెండు.

ఒకటి: వాళ్లు చెప్పే దానిలో ప్రత్యేకత ఏదో ఉంటుంది.

రెండు : వాళ్లు చెప్పినవి ఇప్పటికీ ఉపయోగపడేవిగా ఉన్నాయి.

లేకపోతే ఈ సుభాషితాలు ఇంతకాలం గడచినా నిలచి వుండేవి కావు, చరిత్ర మంచుపొరల్లో అంతర్ధానమై పోయేవి.

ఈ మేధావులు ఎన్నో ఖండాలు, దేశాలు, సంస్కృతులు, భాషలు, మతాలు, జీవనవిధానాలకు చెందిన వాళ్లు, అయినా వారి ఆలోచనా ధోరణులు పడుగు, పేక లాగా కలిపి నేయబడ్డాయి. దేశ, కాలాలకు అతీతంగా లోకజ్ఞానంతో నిండి ఉన్నాయి. ఇవి గత తరాల నుండి లభించిన వారసత్వ సంపదలు.

స్వయం వికాస పుస్తకాలలో ఉత్కృష్టమయినది ఈ పుస్తకం. ఎన్నో విశిష్టతలు గలది. ఎందరో మేధావులు ప్రయాణం చేసిన దారి ఇది. లోకజ్ఞానం, ఇంగితజ్ఞానం అనేవి అన్ని సంస్కృతులు, ప్రాంతాలలో ఒకే స్థాయిలో ఉండవు. మారుతున్న వాతావరణానికి అనుకూలంగా సర్దుబాటు చేసుకునే విధానాలు ధ్రువప్రాంతాలలో, భూమధ్య రేఖా ప్రాంతాలలో నివసించే ప్రజలకు వేరు వేరుగా ఉంటాయి. ఇంగితజ్ఞానం అంటే వేలాది సంవత్సరాలుగా, వేలాది మైళ్ల విస్తీర్ణంలో గల వారి మధ్య సాధారణంగా ఉండే జ్ఞానం. వారి అనుభవాలు సూక్తులు, మంచి మాటలు, ప్రయోజనకర నీతులు. మనం వాటిని విత్తనాలుగా వేసుకోవటానికి, సాగుచేయడానికి, పంటకోసుకోవడానికి వీలుగా మనముందు తరాల వాళ్లు దుక్కులు దున్ని, నేలను సిద్ధంగా ఉంచారు. వారి అనుభవాలను అంతర్జాలంలో వెదికి చూడండి. జ్ఞానాన్ని విస్తరింపజేసుకొని అవగాహనను పెంచుకోవడానికి ఎంత మంచి మార్గం!. పట్టభద్రులు కావడం కంటే మించిన విద్యార్హత. ''ఎవరికి వారు జ్ఞానులుగా ఉండటం మేలు, అది వీలు కాకపోతే కనీసం జ్ఞానుల మధ్య ఉండటం మేలు'' అన్నాడు సి.యస్. లూయిస్.

ఇలాంటి చాలా సూక్తులు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. అవి సూచనాత్మకంగా ఉంటాయి. ఇవి నాకు తట్టిన ఆలోచనలు, పరిశీలనలు, దృక్కోణాలు, వ్యాఖ్యలు, మేధోమొలకలు అంటాను. కొన్ని మాటలు, చమత్కారాలు, గాఢంగా ఆలోచించే అంశాలమధ్య విరామాలుగా చేర్చాను. సముద్రయానంలో ద్వీపాలను గుర్తు పెట్టుకోవడానికి, నొక్కి చెప్పడానికి చిన్న సమాసాలను చేర్చాను. ప్రస్తుతం వ్యాప్తిలో గల నమ్మకాల బంధాలను తెంచుకొంటే తప్ప సృజనాత్మకత సాధ్యం కాదు. మరి, కొన్ని బంధాలనైనా వదిలించుకుందాం.

సంక్లిష్టత తడబడుతుంది, నిరాడంబరత్వం మాట్లాడుతుంది.
మన అజ్ఞానం వల్ల వాళ్లు గెలుస్తారు, మనం ఓడిపోతాం.

పరిపూర్ణులు ఎవ్వరూ లేరు. అపరిపూర్ణంగానే జీవించాలి. మనమందరం చేసేది అదే. పరిపూర్ణత్వం లేకపోయినా చేయగలిగినంత బాగా చేద్దాం. పరిపూర్ణత సిద్ధించేదాకా వేచి ఉండాలనుకుంటే ఈ గ్రంథాన్ని ఎన్నటికీ ప్రచురించగలిగే వాడిని కాను.

''సిద్ధాంత ప్రతిపాదనలు ఎంత సులభంగా ఉంటే అంత బాగా ఆకట్టుకుంటాయి. అవి అంతగా భిన్న విషయాల మధ్య ఉన్న సంబంధాలను చూపగలుగుతాయి. అంత ఎక్కువగా అన్వయించడానికి వీలుగా ఉంటాయి''. ఆల్బర్ట్ ఐన్ స్టీన్

అనేక అర్థతలుగల ఈ పుస్తకం చాలా సులభమైనది. మానవులందరూ వారి వారి సమర్థతలను బట్టి ఉపయోగపెట్టుకోవచ్చు. విశ్వంలో అందరికీ ప్రయోజనకారి.

నా మెదడులో చొరబడి, అన్వేషణ ఆరంభించమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నా. అందులో మీకు పనికొచ్చేది ఏదయినా కనిపిస్తే దాన్ని తీసి మీ జేబులో వేసుకొని దాచుకోని వెళ్లిపొండి.

ఇది చాలా జిజ్ఞాస కలిగించేది. దానిని మీరు తీసుకుపోయినా మీ తరువాత వచ్చే వాళ్ల కోసం ఇంకా చాలా మిగిలే ఉంటుంది. దానిని వాళ్లు తీసుకుపోవచ్చు. ఇది క్వాంటమ్ సిద్ధాంతవిశ్వాసులకోసం-ఒకే వస్తువు ఒకేసారి రెండుచోట్ల, ఇంకా ఎక్కువ చోట్ల ఉండవచ్చు. మౌలిక మానవ సామర్థ్యాలు మూడు. ఆలోచన, అధ్యయనం, భావప్రసారణ.

వీటిని మనం ఎంత బాగా ఉపయోగించుకో గలిగితే మన వివాహాలు, కుటుంబాలు, సమాజాలు, వ్యాపారాలు అంత బాగుపడతాయి.

ఆలోచించడం, నేర్చుకోవడం, వ్యక్తీకరణ (భావాలు ఇతరులతో పంచుకోవడం) లేకుండా వ్యక్తివికాసం సాధ్యం కాదు.

ఇది బిడ్డల వికాసానికి, వ్యాపారాభివృద్ధికి ఉత్తమగ్రంథం. మానవ సామర్థ్యాలను మెరుగు పరచుకోలేని వాళ్లు అనివార్యంగా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోలేరు, వచ్చే మార్పులకు తగిన సర్దుబాట్లు చేసుకోలేరు.ఇవి అతి ముఖ్యమూ, సులభమైనవి, ప్రాచుర్యం పొందినవి, రహస్యమైనవి.

''చాలా ముఖ్యమైనవి సులువైనవిగా, చిరపరిచయమైనవిగా ఉంటాయి. కాని అవి దాగి ఉంటాయి''. లడ్విగ్ విట్జన్ స్టైయిన్. ఈయన ఆస్ట్రియాలో జన్మించిన తత్వవేత్త. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులు.(1889 – 1951)

ఈ పుస్తకం చాలా ముఖ్యమైన వాటి గురించి, కళ్లముందే ఉండీ కనిపించని వాటి గురించి చెబుతుంది.

అదే శూన్యం/సున్న కథ.**సున్న** కనుక్కోవడంలో విశేషం ఏముంది? అనుకుంటాం. కాని మానవ మనుగడలో, ప్రగతిలో దాని ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఒకదాని పక్కన మరొకటిగా ఎన్ని సున్నాలు పెట్టుకుంటూ పోయినా వాటి విలువ సున్నాయే. ఏమీ లేదు. శూన్యం. శూన్యం నుంచి ఏమీ పుట్టదు, ఏదో దానినుంచి మరేదో రావాలి. వరుసగా ఆరు సున్నాలు పెట్టాము. ఏమీ విలువ లేదు. వాటి ముందు చిన్న అంకె-1-చేరుద్దాం. 10,00,000 పదిలక్షలు ( మిలియను) అయింది. శూన్యం- నుంచి విలువైన అంకె వచ్చింది. సున్న లేకపోతే గణితశాస్త్రమే లేదు. సమానాన్ని సూచించే = ను చూద్దాం. దీనికి రెండు వైపుల ఉండేవి సమాన విలువ గలవి. వాటి విలువ శూన్యం. ఆర్థిక ఆదాయ, వ్యయాల పత్రంలో జమలు, ఖర్చులు సమానంగా ఉండాలి. సున్న లేకపోతే మొబైల్ ఫోనులు, కంప్యూటరులు పనిచేసే 0,1 లతో కూడిన ద్విసంఖ్యామాన భాష లేదు.శూన్యం లేకుండా వైద్యరంగం ముందుకు వెళ్లగలిగేది కాదు. శూన్యసహనం, “zero tolerance”, “ground zero”, absolute zero,

zero defects, zero gravity, అనే మాటలే ఉండేవి కావు. ముఖ్యంగా శీతలపానీయాల్లో కోక్- Zero వంటి పదాలు పుట్టేవి కావు.

5000 సంవత్సరాల క్రితం మెసొపొటేమియాలో (ప్రస్తుత ఇరాక్) సంఖ్యలు రాయడం మొదలయింది. కాని వాటిలో - సున్న- లేదు. ప్రపంచానికి దానిని గురించి తెలియదు. 3000 సంవత్సరాల తరువాత భారతదేశంలో ఆర్యభట్టు – 'సున్న'- 0- కనుగొన్నాడు. అది అక్కడి నుంచి బాబిలోనియా చేరి, ఉన్నత గణితం ఆవిర్భవించడానికి కీలకమయింది.

ఆరబ్బులు బీజగణితాన్ని అభివృద్ధి చేశారు. Algebra – అనేది అరబ్బీ మాట. "algorithm" అనే మాట పర్షియన్ భాష నుంచి వచ్చింది.

'సున్న' వాడకం ఆరంభం అయిన తరువాత సుమారు 1000 సంవత్సరాలకు అది యూరప్ లోకి ప్రవేశించింది. అప్పటి వరకు అక్కడ రోమన్ అంకెలు వాడకంలో ఉండేవి. వాటిలో- సున్న- లేదు. ఏమీ లేని దానిని, ఏ విలువా లేని దానిని శూన్యం నుంచి ఎంతో విలువైన దానిని వేరుచేసి చూపడం నిజంగా సవాల్ గదా? ఒక చిన్న భావన అభివృద్ధి చెందటానికి వేల సంవత్సరాలు పట్టింది. అది దేశాలను దాటి ప్రయాణం చేసింది, ఎన్నో మానవ మస్తిష్కాలను మథించింది. ఇవాళ ప్రపంచంలో ‘‘ 0 ’’ ను అర్థం చేసుకోవడం, దానితో పనిచేయడమే అతికీలకం.

21వ శతాబ్దంలో 'సున్న' గురించి మాట్లాడటం అనవసరం అనిపించవచ్చు. కాని సున్న, గణితాలను అర్థం చేసుకోవడానికి, నాగరకతలను మార్చడానికి ఉపయోగపడింది. అది ప్రపంచాన్ని మార్చింది. ఇవాళ సున్న అందరికీ పరిచయమైన సంఖ్య. ఇందుకు భారతీయుడు ఆర్యభట్టుకు ప్రపంచం రుణపడి ఉంటుంది. ఇంత చిన్న అంశం- **సున్న**- అన్ని సంవత్సరాలు ఎందుకు, ఎక్కడ దాగి ఉన్నదో మనకు అంతుబట్టదు.

**పరిశీలన- ఆలోచన**

ఈ పుస్తకంలోని ముఖ్య అంశం సున్నా ఆవిష్కరణ కంటే ముఖ్యమయింది. ఇందులో సంఖ్యలగురించి ఉంది, సున్నా గురించీ ఉంది.

సంఖ్యలు, వాటి గుర్తులు యూరప్ రావడానికి నాలుగు వేల సంవత్సరాలు పట్టింది. ఒక్క మాట ఆవిర్భవించడానికి దానికంటే ఎక్కువ కాలం - మానవ మనుగడ మొదలైన తర్వాత పదుల వేల సంవత్సరాలు గడిచాయి. అదీ మానవ ఆలోచన గొప్పతనం.

అధ్యయనం, భావప్రసారం అన్నిటికీ మూలం. సున్నాకు ఉన్నట్లే దానికి కూడా ఒక సంకేతం ఉంది. అదే ఈ పుస్తకంలో కనుగొన్న కొత్త అంశం. ఈ ఒక్క మాటలేకుండా మన ఆలోచన, అధ్యయనం, సంభాషణ మెరుగు పడవు. నీకు ఆశ్చర్యం కలగవచ్చు. అది తెలియడానికి ఎందుకు అంతకాలం పట్టింది? మనం దానిని ఎందుకు పట్టించుకోలేదు? కాని అది తెలిసిన తరువాత - సున్నాను గురించి తెలిసిన తర్వాత అన్నట్లే 'ఇంతేనా?' అంటావు. మనకు చాలా ముఖ్యమైన విషయాల గురించి తెలియదు. ఎందుకంటే అవి సులభమైనవి, చిరపరిచితమైనవి. వాటి శక్తి సామర్థ్యాలను ఉపయోగించు కుందాం.

ప్రతివాళ్లూ, పిల్లలు, పెద్దలూ, ప్రపంచం అంతటా ఈ సులభమైన 11 అక్షరాల మాట (The Human Key)ను అర్థం చేసుకొని వాళ్ల సామర్థ్యాలను పెంచుకోవచ్చు, నేర్చుకోవచ్చు, అధ్యయనం చేయవచ్చు. భావ వ్యక్తీకరణ కూడా చేయవచ్చు. దీని ద్వారా జీవితాలు, సమాజాలు, వ్యాపారాలు మరింత భద్రంగా ఉంటాయి. మరోసారి గట్టిగా చెపుతున్నాను.

'మానవ సత్తా' అనే ఐదు అక్షరాల మాట అనంతవిశ్వ రహస్యాలను తెలుపు తుంది. బాగా ఆలోచించగల వాళ్లు అధికంగా గెలుస్తారు. అలాగే బాగా నేర్చుకోగల వాళ్లు కూడా బాగా విజయాలు సాధిస్తారు.

తమ మనసులోని మాటలను భావాలను వ్యక్తపరచగల వాళ్లు గొప్ప విజయాలు సాధిస్తారు.

ఏ వ్యక్తి / పురుషుడు / స్త్రీ / పిల్లలు / సముదాయము / సంఘము / సంస్థలోనైనా ఈ మూడు నైపుణ్యాలు బాగా ఉన్నవాళ్లకు తిరుగులేదు.

ఇదంతా మీరు అనుకునే దానికంటే చాలా సులభం.ఈ పుస్తకంలో విషయాలు ఉత్తేజం కలిగించేవి కాకపోవచ్చు, కాని జీవితానికి చాలా ముఖ్యమైనవి.

మానవ సామర్థ్యాలలో ముఖ్యమైన మూడు -

**ఆలోచించడం, అధ్యయనం చేయడం, మనసులోని భావాలను చెప్పగలగడం.**

అధ్యయనం ఆరంభం- అక్షరాలతో ఈ నైపుణ్యాలను నేర్చుకోవడం ఎలా ప్రారంభించాలో చూద్దాం. ఏదో ఒక స్థాయిలో వీటి అధ్యయనం మొదలు పెట్టాలి. తల్లి / తండ్రి / జీవిత భాగస్వామి / ఉద్యోగి / గురువు / వ్యాపారవేత్త / విద్యార్థి / ఆరోగ్యకార్యకర్త. ఎవరికైనా ఇవి కావాలి, అవి అత్యవసరం కూడా. ఈ ప్రారంభ గ్రంథం అన్ని వృత్తులు, వయసుల వారందరికీ ఉపయోగపడుతుంది. దీనిలో చిక్కని ఆలోచనలు దట్టంగా నిండి ఉన్నాయి. చదవడానికి ఎంత సమయమైనా తీసుకొండి. పెట్టుబడికి సరైన ఫలితాలను ఇస్తుంది. పుస్తక పుటల మూలలు నలిగి పోనివ్వు. దీనిలో నీకు నచ్చిన విషయాలన్నిటినీ గుర్తు పెట్టుకో. మళ్లీ మళ్లీ గుర్తులు పెట్టుకో. ఖాళీలలో నోట్సు రాసుకో. బాగా ఉపయోగపడతాయి. జ్ఞానులు గెలుస్తారు, అజ్ఞానులు ఓడిపోతారు. మూడు భాగాలలో మొదటిది ఆలోచన.

## ఆలోచనా విధానం

ఆలోచించడం గురించిన మూలాలను తవ్వి చూద్దాం. తెలుసుకున్న విజ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువద్దాం. ఒకసారి వేళ్లను తవ్వి తీయగలిగితే మన పని సులభమైపోతుంది. పాఠశాల విద్యార్థికి కూడా అర్థం అవుతుంది. ప్రక్రియ, ఉత్పాదన అనే పదాలను నేను ఎక్కువగా వాడాను. ప్రకృతిలో ప్రక్రియలు (ఉత్పాదక విధానాలు), ఉత్పత్తులు మాత్రమే ఉంటాయి. ఒక ప్రక్రియ ద్వారా తయారు చేస్తేనే ఉత్పాదన తయారవుతుంది. మానవ మస్తిష్కం ఉత్పాదక యంత్రాగారం.అతిచిన్నవస్తువునైనా, విశ్వాన్నయినా సృష్టించగలదు. మెదడు ఏదైనా పనిని ఒకక్రమంలో ఒకదాని తరువాత మరొకదానిని చేస్తుంది.

'ఒక ప్రక్రియలాగా క్రమపద్ధతిలో వరుసగా పనులను వివరించలేకపోతే నువ్వు ఏమిచేస్తున్నావో చెప్పలేవు' అన్నాడు అమెరికన్ ఇంజనీర్, గణాంకశాస్త్ర ఆచార్యులు, రచయిత, యాజమాన్య విషయాల సంప్రదింపుదారు. డబ్ల్యూ. ఎడ్వర్డ్స్ డెమింగ్ (1900 –1993)

ఆలోచన ఒక ప్రక్రియ. అది ఉత్పాదనలను ఉత్పత్తి చేస్తుంది, అవి పరిష్కారాలు, జవాబులు, చర్యలు. ఆలోచన, ఆచరణ, భావప్రసరణ విభాగాలుగా ఉండవచ్చు.

వీటిమధ్య అంతర్గత సంబంధం ఉంటుంది. ఈ పుస్తకంలో చాలా ప్రతిపాదనలను మళ్లీ మళ్లీ చెప్పాను, ముఖ్య విభాగాలు చర్చించాను. పదేపదే చెప్పడం వల్ల చెపుతున్న విషయం లోతుగా నాటుకుంటుంది.

## అజ్ఞానం (అమాయకత్వం)

ఈ మాట చాలాసార్లు సరిగా అర్థం కాక అపార్థం చేసుకోబడుతుంది. అజ్ఞానం అంటే జ్ఞానం/సమాచారం లేకపోవడం  అనుకుంటాం. అలా అనుకుంటే మనలో ప్రతివ్యక్తికీ తెలియనివి ఎన్నో ఉంటాయి. మన అమ్మలకు తెలిసిన చాలా విషయాలు మనకు తెలియవు.ఈ సందర్భంలో స్టీవ్ జాబ్స్ చెప్పిన మంత్రాన్ని గుర్తుచేసుకోవచ్చు. 'మన ఆలోచనను సులభం చేసుకుంటే అది స్పష్టం అవుతుంది. అప్పుడు మనం పర్వతాలనైనా కదిలించగలుగుతాం'. దీనికి ఐన్‌స్టీన్ చెప్పిన సులభమైన, స్పష్టమైన మూడు అక్షరాల  సూత్రం మంచి ఉదాహరణ. 3-letter formula $E=MC^2$. ఈ సూత్రం కేవలం  మూడు అక్షరాలకే పరిమితం, అయినా అనంతమైన  విశ్వం ఎలా పనిచేస్తుందో తెలియజేస్తుంది. లియోనార్డొ డావించి  చెప్పిన సూక్తి  "అత్యంత క్లిష్టమైన దెప్పుడూ నిరాడంబరంగా, అతి సులభమైనదిగా ఉంటుంది." మనం వివరించలేనిది క్లిష్టమైనది అంటాం. క్లిష్టమైన దానికై వెతుకుతూ సరళమైన వాటిని  పట్టించుకోము. మెదళ్లలో ఊక నింపుకుంటాం.

మరమనుషులు ఇప్పుడు యుద్ధాలను ప్రత్యక్షంగా చేయగలుగుతున్నాయి. అమ్మకాలు చేసే గుమాస్తాలు, వాహనాలు నడిపే డ్రైవర్లు, ఫాస్ట్ ఫుడ్ వ్యాపారులు, మిగతా శ్రామికులు చేసే పనులు చేయగల మరమనుషులు రాబోతున్నాయి. ఈ రోబోలు ఏదో రూపంలో మానవశ్రమను చేయబోతున్నాయి. అవి వైద్యులలాగా రోగనిర్ధారణ చేయబోతున్నాయి. శస్త్రచికిత్సలు చేస్తున్నాయి.

కృత్రిమమేధస్సుతో అంతర్జాలం నుంచి సమాచారాన్ని సేకరిస్తాయి. వీటివల్ల న్యాయవాదులు దాదాపు కనుమరుగు కావచ్చు.

ఈ ప్రక్రియ అంతా ఎప్పుడూ ఊహించనంత వేగంగా సాధ్యం అవుతుంది. మనం ఈ మార్పులకు సన్నద్ధులం అవుతున్నామా?సర్దుబాట్లు చేసుకో గలుగుతున్నామా?

అందుకు ప్రయత్నిస్తున్నామా? ఆంగ్ల,భౌతిక సిద్ధాంతిక శాస్త్రవేత్త, విశ్వవిజ్ఞాని, రచయిత స్టీఫెన్ హాకింగ్ అన్నట్లు “మార్పుకు అనుకూలంగా సర్దుబాటు చేసుకోగలగడమే తెలివి.”

తెలివి అంటే  జ్ఞానాన్ని సంపాదించడం, దానిని అన్వయించగల సామర్థ్యం. చాలామంది వ్యాయామశాలలకు వెళుతున్నారు.శారీరక పటిష్టత కోసం అద్దం ముందు నుంచొని వ్యాయామాలు చేస్తున్నారు. ఎందుకు అలా చేస్తున్నారో నాకు అంతుపట్టదు.“ఏదిముఖ్యం–అందమైన శరీరమా?ప్రయోజనకరమైన మెదడా?”

నాకు ఆశ్చర్యం కలుగుతుంది; అమెరికాలో ఎంతమంది తమ సమయాన్ని, శ్రమను, డబ్బును తమ మెదళ్లను బలపరచుకోవడానికి వెచ్చిస్తున్నారు. ఇక్కడ 36,000 శరీర వ్యాయామకేంద్రాలు ఉన్నాయి. అవి వ్యాపారదృష్టితో పనిచేస్తున్నాయి.  మరి మేధస్సును బలపరచే కేంద్రాలు ఎన్ని పనిచేస్తున్నాయి? ‘చాలామంది తమ అందాల గురించి అసంతృప్తిని వ్యక్తపరుస్తుంటారు, కాని ఎవరూ తమ మేధస్సును గురించి ఫిర్యాదు చేయరు’ - అనేది సామెత.

మనిషి మెదడులో కార్టెక్స్ అనే భాగం పూర్తిగా ఎదగడానికి / వికసించడానికి చాలా కాలం తీసుకుంటుంది.25-30 యేళ్లు వచ్చేదాకా ఈ భాగం పరిణతి చెందుతుంటుంది. ఈ దశలో ఉండే యువతకు ఈ పుస్తకం ఎక్కువ ఉపయోగం. హేతుబద్ధ ఆలోచన వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అది వినాశకర, బలహీన ప్రభావాలు, ప్రతికూలతలను, తీవ్రవాంఛలను, భయాలను నియంత్రిస్తుంది. మంచీ, చెడు ఆలోచించకుండా అభిప్రాయాలను ఏర్పరచుకోవడం, గర్వం, అపరాధభావన, అసూయ వంటి వాటిని కూడా అదుపు చేస్తుంది. కుటుంబం, స్నేహితులు, సమాజ సంబంధ సానుకూల నిర్ణయాలను ప్రోత్సహిస్తుంది. ప్రతికూల, సానుకూల ఆలోచనల మధ్య సమతూకం ఉండేలా చేస్తుంది. హేతుబద్ధత (కార్యనిర్వాహక నియంత్రణ) పుట్టుకతో వచ్చిన హానికరమైన కోరికలను అణచి ఉంచుతుంది.

సైనికులు, శతఘ్నులు పేల్చేవాళ్లు, రక్షకభటులు, గజఈతగాళ్లు, ప్రాణాపాయకర పరిస్థితుల్లో పోరాడగల వ్యక్తులు సాధన చేసి అనుభవాలు పొందుతారు. ‘పోరాడు

- గెలవలేననుకుంటే పారిపో. మొత్తం మీద ఎలాగైనా ప్రాణాలు కాపాడుకో. గడ్డకట్టిపో లేదా మూర్ఛపో' అనేవి మనిషి తన పూర్వీకుల నుంచి నేర్చుకున్న స్పందనలు. హెన్రీ డేవిడ్ థోరో అన్నట్లు ''వేరు దగ్గర దెబ్బ కొట్టేవారు ఒకరు అయితే ఆలోచనల అజ్ఞానపు కొమ్మల్లో వేయిమంది ఆటంకకారులు ఉన్నారు''. ఆటంకకారులను సమూలంగా దెబ్బతీయాలి.

నైరాశ్యం నిరాశకు జన్మను ఇస్తుంది. తటస్తత ఏ ఫలితాన్నీ ఇవ్వలేదు. సానుకూలత మాత్రమే సానుకూలతను ఇవ్వగలదు.

## మరో దృక్కోణం

శాస్త్రం రోగనిర్ధారణ పరికరాలను, వైద్యాన్ని అందించింది. చిల్లరదుకాణాల్లో ప్లాస్టిక్ వస్తువులు, వాహనాల విడిభాగాల నుంచి, వాయుయాన సామగ్రి వరకు అసంఖ్యాక వస్తువులు దొరుకుతున్నాయి. ఇవన్నీ ఆలోచనా ప్రక్రియ ద్వారా శాస్త్రం వల్లనే అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా శాస్త్రం, ఆలోచనా ప్రక్రియ, మనుగడకు ఆత్మరక్షణకు అవసరమైనవి. ఆలోచించటమంటే ప్రశ్నించే తత్వమే. కాబట్టి నిన్ను నువ్వు ప్రశ్నించుకో. ఆలోచనల్లో నాణ్యతను పెంచుకో. అందుకు ప్రత్యేకంగా ఏమి చేయాలో ఆలోచించు.

**ఆలోచన**-ఆలోచన సరిగా ఉండాలి. సరిగా లేకపోతే మనుగడ ప్రమాదంలో పడుతుంది. మానవుడి మెదడు చాలా ప్రత్యేకతలు కలిగినది. అందుకే మనిషి మిగతా జాతుల ప్రాణులకంటే భిన్నంగా ఉన్నాడు.

మనిషికి పూర్తిగా అభివృద్ధి చెందిన భాష ఉంది. ప్రపంచంలో సుమారు 6,300 లిపి గల భాషలున్నాయి. సంగీతంలో ఏడు స్వరాలే ఉంటాయి. వాటిని కలిపి వేలాది రాగాలను కూర్పు చేయగలము.

మనిషి చంద్రమండలం మీద కాలు మోపాడు.

వైద్యశాస్త్రాభివృద్ధితో కేవలం ఒక్క శతాబ్దిలోనే అమెరికాలో సగటు జీవన ప్రమాణం పెరిగింది.

1900లో అక్కడ పౌరుని సగటు వయసు 47 సంవత్సరాలే. ఇప్పుడు అది 79 కి పెరిగింది. అంటే 68% వృద్ధి జరిగింది.

తెలివితేటలతో ముందుకు సాగే అద్భుతమైన శక్తి మనిషికి ఉంది. నడకతో ప్రారంభించాం, వేగం పెంచాం, స్వారీ చేశాం, నౌకలపై ప్రయాణాలు చేశాం. ఆవిరి నౌకలను వాడుకున్నాం. వాహనాలు నడుపుతున్నాం. రెక్కల యంత్రాలతో గాలిలో ఎగురుతున్నాం. ఎడారుల్లో, ధ్రువాల అంచుల్లో ఉండగలుగుతున్నాం. గడచిపోయిన కాలాన్ని మననం చేసుకోగలం, రాబోయే కాలంలో జరగబోయే పనులను కూడా అంచనా వేయగలం. మంచి పరిష్కారాలు కనిపెట్టి, వాటిని ఆచరణలో పెట్టి మన, మన పిల్లల జీవితాలను మెరుగు పరచు కోవటానికి ఇవి కావాలి :

1.సమస్యలు పరిష్కారం కావాలంటే ఆలోచించాలి.
2.కుటుంబాలు కలసి ఉండేలా చూసుకోవాలి.
3.ఆర్థికభద్రత కల్పించాలి.
4.ఉత్తమవిద్యను అందించాలి.
5.క్యాన్సర్ వంటి వ్యాధులకు చికిత్స అందించాలి.
6.లాభదాయక వ్యాపారాలను సృష్టించాలి.
7.నేరాలను అరికట్టాలి.
8.శాంతిని సాధించాలి.
9.సైబర్ దాడులను తట్టుకోగలగాలి.

ఇలాంటి సమస్యలకి పరిష్కారాలు కావాలంటే వాటి గురించి ఆలోచించాలి. ఆలోచన అంటే ఏమిటి? ఈ ప్రశ్నను నిన్ను ఎవరైనా, ఎప్పుడైనా, అడిగారా? పోనీ నువ్వు ఎవరినైనా అడిగావా? ఆలోచన అంటే ఏమిటి? నేను వందలమందిని ప్రశ్నించాను. బహుకొద్దిమంది తత్వశాస్త్ర విద్యార్థులు ఏదో జవాబు చెప్పారు. వారు తార్కికంగా ప్రశ్నించారు. కాని నా ప్రశ్నకు స్పష్టమైన జవాబు రాలేదు. చాలామంది వారి దగ్గర సమాధానం లేదన్నారు.అజ్ఞానచీకట్లు నాలోనే కాదు, అవి విశ్వవ్యాప్తం అని గ్రహించాను.

## ఏమి ఆలోచిస్తున్నాము?

మనుగడకు ఆధారమైన ఆలోచన, ఆత్మరక్షణ, సర్దుబాటు పట్ల మనం ఎందుకు

జిజ్ఞాస చూపం? శ్రద్ధ తీసుకోవలసిన వాటిని ఎందుకు నిర్లక్ష్యం చేస్తాము? మనం చేసే ప్రతిపని కూడా ఆలోచన పైన ఆధారపడి ఉంటుంది. ఆలోచన తరువాతే నిర్ణయం తీసుకుంటాం. కనుక ఆలోచన అంటే ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అది మన నాలుకల మీదనే తారాడుతుండాలి. అది మనకు అంతుబట్టే విషయం కాదు, ఆలోచన గురించి తెలుసుకోవడం చాలా కష్టం అనిపించవచ్చు, కానీ తెలుసుకోవాలి. ఆలోచన అంటే ఏమిటో తెలియకపోతే మంచి ఫలితాలు సాధించలేవు. వయసు పెరిగే కొలది, ఆలోచనల్లో అభివృద్ధి కనిపిస్తుంది. నీ పొరపాట్లనుండి నువ్వు నేర్చుకోవడం ఎక్కువ అవుతుంది. నేర్చుకునే వేగాన్ని, ఆలోచనల్లో నాణ్యత పెంచుకోవాలంటే, **ఆలోచన** నిర్వచనాన్ని తెలుసుకోవడం తప్పనిసరి. నీకు నువ్వుగా ప్రయత్నించు.

దేనినయినా కొలత వేయలేకపోతే దానిని మెరుగు పరచలేము.- లార్డ్ కెల్విన్ (ఐరిష్ గణితశాస్త్ర, భౌతికశాస్త్రవేత్త, ఇంజనీర్. ఉష్ణోగ్రతను ఆయన పేరు మీదనే కెల్విన్ లలో కొలుస్తారు.)

ఆలోచన గురించి స్పష్టంగా నిర్వచించలేకపోతే, దానిని అభివృద్ధి పరచలేము. ఆలోచన అంటే ఏమిటో పెద్దలకే స్పష్టంగా తెలియకపోతే మన పిల్లలు ఏమి చెప్పగలరు. వారేమి ప్రగతి సాధించగలరు!! ఆలోచించడం ప్రాధమికం. దానిని గురించి ప్రాధమిక పాఠశాల స్థాయిలోనో లేదా, ఇంకా ముందే బోధించాలి. మన విద్యావిధానం పిల్లలకు ప్రశ్నించడం నేర్పడానికి, వారి ఆలోచనా శక్తిని పెంచడానికి ఉద్దేశించినట్లుగా లేదు, అది కేవలం సమాచారాన్ని అందిస్తే చాలనుకుంటుంది. పిల్లలు బడికి వెళ్లడానికి ముందు నుంచే వాళ్ల మేధస్సు వికసించడానికి, వారిలో ప్రశ్నించే శక్తిని పెంచడానికి పెద్దలు ప్రయత్నిస్తే పిల్లలకూ, వాళ్లకు నేర్పటం వల్ల పెద్దలకూ లాభదాయకం.

ఆలోచించకుండా నేర్చుకోగలమా? ఆలోచన అంటే ఏమిటో తెలియకుండా నేర్చుకోవడానికి ఏది మంచి పద్ధతో చెప్పగలమా? ఇంటిలో, బడిలో పిల్లలు నేర్చుకోవడానికి వీలయినన్ని ఎక్కువ అవకాశాలు కలిగించాలి.

నేర్చుకోవలసిన అంశాలలో ప్రాధమికంలో ప్రాధమికమైనది – **ఆలోచన అంటే ఏమిటో** తెలుసుకోవడం. ప్రతిరోజూ మనం చాలాసార్లు- ఆలోచించు,

ఆలోచించడం, ఆలోచన – అనే పదాలను వాడుతుంటాం. మీ ఆలోచన ఏమిటి?" "నేను అనుకున్నది అది. "అతను గనుక ఆలోచిస్తే! "నీకు నువ్వు ఆలోచించుకో!" "నువ్వు ఇప్పుడు చెప్పినదాని గురించి ఆలోచించు.", "సూటిగా ఆలోచించు!" "వాడికి ఆలోచించే బుర్రలేదు," "దానిని గురించి ఆలోచించి దానికొక పరిష్కారంతో రా." విమర్శనాత్మక ఆలోచన, వ్యూహాత్మక ఆలోచన, సృజనాత్మక ఆలోచన, వంటి మాటలను కూడా వాడుతుంటాం. కాని ఆలోచన అంటే అర్థం ఏమిటో తెలియకుండానే ఇలాంటి మాటలను వాడుతుంటాం.

మనుషులకు ఆలోచన ఒక ప్రక్రియ. మీకు ఆలోచించే జ్ఞానం పెరిగితే మీలో, మీ కుటుంబంలో ఎంత మార్పు వస్తుందో ఆలోచించండి. మనకు చాలా ముఖ్య మైనవి సులువైనవిగా, పరిచయమైనవిగా ఉంటాయి. కాని అవి దాగి ఉంటాయి.

'సున్న' లాగానే - ఆలోచన - గూడా మనకు బాగా తెలిసిందే. కాని దాని అర్థం మాత్రం, బహిరంగంగా కనిపించదు.

''సుస్పష్టమైనది కనపడటానికి చాలా సమయం పడుతుంది''. ఎడ్వర్డ్ ఆర్. ముర్రే

ఆలోచనల ద్వారా ఫలితం వస్తుంది. ఆలోచనలు శక్తిసామర్థ్యాలకు, సర్దుబాటు తనానికి, సృజనాత్మకతకు పునాదులు. ఆలోచన ద్వారా ఉత్పత్తి అయే అతిశక్తి వంతమైన ఉత్పాదన క్రియాశీలత.

***ఎక్కడ ఉన్నామో తెలియకపోతే ఏ దారిన వెళ్లాలో తెలుసుకోలేము.***

ఆలోచన అంటే ఏమిటో, దాని అర్థమేమిటో ముందుగా తెలుసుకుందాం.

ఆలోచించు - క్రియ - ఒక విషయంపై మనసు పెట్టు, తర్కించు, పరిగణించు - శ్రద్ధగా ఆలోచించు, నిర్ణయం తీసుకోబోయే ముందు ఆలోచించు. మనోశక్తిని ఉపయోగించి ఆలోచించు, అర్థం చేసుకొను, హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించి తీర్పు చెప్పు అని అర్థాలు. ఆలోచన అంటే ఏమిటో ఏ నిఘంటువు లోనూ స్పష్టంగా లేదు. అలా ఉంటే నేను ఈ పుస్తకం రాయవలసి వచ్చేది కాదు. మనం అజ్ఞానంలో ఉన్నాం.

ఇప్పుడు శాస్త్రజ్ఞులకు తెలుసు - విశ్వంలో 5 వంతులు సాధారణ పదార్థం, శక్తితో

నిండి ఉంటుంది. మిగిలిన 95 పాళ్లు 'అజ్ఞాతం' అంటున్నారు. దానిని **అజ్ఞాతం** అని ఎందుకు అంటున్నాం? అదేమిటో మనకు తెలియదు గనుక అర్థం తెలియని వాటిని అజ్ఞాతాలు అంటున్నాం.

మన మనోభావాలను గురించి చెప్పమంటే చాలా రకాలుగా చెప్పగలం. అందులో కొన్నిటిని చూపించగలం కూడా. కాని ఆలోచన గురించి చెప్పలేం. ఆలోచనకు కచ్చితమైన, స్పష్టమైన నిర్వచనం చెప్పగలిగితే అది మన జీవితాలలో, కుటుంబంలో, సమాజంలో, ప్రపంచంలో ఎంతో మార్పు తెస్తుంది.

ఆలోచన–అనే ఈ అధ్యాయంలో దీనిని గురించి వివరంగా చర్చించాలను కుంటున్నాను. ఇది మానవ మనుగడకు, ప్రగతికి కీలకమైనది. దానిని తెలుసుకుంటే నువ్వు ఆశ్చర్యపోతావు. అది సులువుగా ప్రాథమిక పాఠశాల విద్యార్థికి కూడా అర్థమయ్యే 'మానవసత్తా' అనే ఐదు అక్షరాల్లో ఉంది. ఇంగ్లీషులో 11 అక్షరాల్లో ఉంది. "The Human Key".

ఆ అర్థాన్ని తెలుసుకోగలిగితే ఆలోచన గురించి, జీవితం గురించి, నీ ఆలోచనా ధోరణే మారిపోతుంది. అది జ్ఞానప్రభావం చూపే ఓ సిద్ధాంతం. కొన్ని సిద్ధాంతాలు, వాటి అడుగున దాగి ఉన్న పిలకలతో గందరగోళంగా ఉంటాయి. వాటిని అర్థం చేసుకోవడం కష్టం. వ్యక్తం చేయడం ఇంకా కష్టం. ఇలాంటి వాటికి ఒక ఉదాహరణ. మనలో చాలామందికి పునరుత్పత్తి గురించి ఏమీ తెలియక పోవచ్చు. కాని పునరుత్పాదన చేయగలము. అమ్మలం, నాన్నలం కాగలం. ఏమి చేయాలో తెలుసు, ఎలా చేయాలో తెలుసు.

మరో ఉదాహరణ. మనలో చాలామంది ఇంజనీర్లు కారు. కాని చాలామంది కొత్తతరం ఫోనులు వాడుతున్నాం. వాటిగురించి చాలామందికి తక్కువ తెలుసు. కాని సామాన్యులు కూడా ఇవాళ ఆ ఫోనులు వాడుతున్నారు. మనకు వాటిగురించి చాలా తక్కువ తెలుసు, కానీ ఎక్కువగా వాడుతున్నాం, అవి పని చేస్తున్నాయి.

అలాగే మానవుని మెదడులో 100 బిలియన్ల నాడీ కణాలు, 100 ట్రిలియన్ సినాప్సెస్ (సంధులు) ఉంటాయి. అందులో ఏ కణం ఏమి చేస్తుందో మనకు తెలియదు. కాని మెదడును ఇంకా మెరుగైన యంత్రంగా వాడుకోగలం. అది పని చేస్తుంది. మనం సమస్యను కనుక్కోలేకపోతున్నాము, దానిని చూడగలిగితే పరిష్కారాన్ని కనుక్కోగలం. ఆలోచన అంటే ఏమిటనే ప్రశ్నకు జవాబు కావాలంటే ఆలోచించాలి. *అలోచన అతి సులభమైనది, బాగా తెలిసినది, అతి ముఖ్యమైనదీ, దాగి ఉన్నదీ, బహిర్గతం చేయబడేది.*

మనం కొలవలేని దానిపైన  మనకు ఆధీనత రాదు. ఆలోచన గురించిన ప్రయోగాలు క్రమపద్ధతిలో సాగుతాయి. ఈ నిర్వచనం నిర్దిష్టమైనది. అందరికీ బాగా తెలిసినది, వాడిచూడటానికి అనుకూలమైనది, దీనికి పరిమితులు లేవు, ఎంతగానైనా వాడుకోవచ్చు. అది ప్రభావాన్ని చూపగలిగేది, పనిచేసేది. “సిద్ధాంతం  ఆకర్షణీయంగా ఉండాలంటే దాని ఉపపత్తి  ఎంత సులభంగా ఉంటే అంత మంచిది. అది ఎక్కువ విషయాలకు సంబంధించినదై ఉండాలి. దానిని అన్వయించడానికి పరిధి ఎక్కువగా ఉండాలి.” ఐన్ స్టీన్

“పరిణామక్రమం అంతా అస్పష్టత నుంచి స్పష్టత దిశగా కదులుతుంది''. చార్లెస్ శాండర్స్ పియర్స్. (తర్క, గణిత, ఖగోళ శాస్త్రవేత్త, ఆవిష్కర్త).ఆలోచన అంటే మనను మనం ప్రశ్నించుకోవడమే. అది సాధారణ తర్కానికి నిలవాలి. జవాబు లేని  ప్రశ్నలు ఉండవచ్చు, కాని ప్రశ్నలు లేని జవాబులు ఉండవు. ఎప్పుడూ ప్రక్రియ(ప్రశ్న) లేకుండా ఉత్పత్తి(జవాబు) సాధ్యం కాదు. ప్రశ్న చేతన స్థితిలో ఉండి గాని/లేకుండా గాని వేసుకున్నది కావచ్చు. ఆలోచనా ప్రక్రియ (ప్రశ్నించే విధానం) లో 90 శాతం అచేతనంగానే జరుగుతుంది. నువ్వు చెప్పే జవాబు నీ ఆలోచనా ప్రక్రియకు స్పందనే. జవాబులు ప్రశ్నలకు ఫలితాలే. ఆలోచన, ప్రశ్నించడం ఒకే రకమైన ఫలితాలను ఇస్తాయి.

ఆలోచించడం, ప్రశ్నించడం  రెండూ ఒకే ప్రక్రియకున్న రెండు పేర్లు. ప్రశ్న చేతనా పూర్వకమైనా, కాకపోయినా ఆలోచిస్తావు. ఒక జవాబు తట్టింది. ఇంకా ఆలోచిస్తావు, ఇంకా, ఇంకా ప్రశ్నిస్తావు. ఈ ప్రశ్ననుంచి నీకు జవాబు వస్తుంది.

ప్రశ్నించటం ఒక ప్రక్రియ. ఎవరిని వారు ప్రశ్నించుకునే ప్రక్రియ ఆలోచన. నిన్ను నువ్వు ప్రశ్నించుకోవడం, ఆలోచించడం రెండూ ప్రక్రియలే.

**నవనిర్మితాలు- సమానత్వాలు**

తర్కము, జీవితంలో మార్పు తీసుకువస్తుంది. మనం ఎక్కడ చూసినా ప్రశ్నించడం / ఆలోచించడం కనపడుతుంటాయి. నువ్వు ఇంకా చదువుకుంటూ, ముందుకు పోయే కొలది ఈ మాటలు నీ చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటాయి. ఆలోచించడం అంటే మనను మనం ప్రశ్నించుకునే ప్రక్రియ. అందరూ ఇలా ఏకగ్రీవంగా ఆమోదించడం విశేషం కదా? కొందరు ఆలోచన అంటే మనను మనం ప్రశ్నించుకోవడమే కాక మరింకా ఏదో ఉందంటారు. కాని 'మరింకా ఉన్నది ఏమిటో' వాళ్లు చెప్పలేరు. నీ మెదడులో 90% ఆలోచించడం / విశ్లేషించడం / ప్రశ్నించడం అనే విధానాలలో పనిచేస్తుంది. ఆలోచించడం అనే మాటకు అర్థం చెప్పడం కష్టం. ఏదో తడుతుంది, కాని చెప్పలేని స్థితి. ఈ పుస్తకాన్ని రాసేటప్పుడు నేను కూడా అదే స్థితిని ఎదుర్కొన్నాను. ప్రయాణం సాగించేకొలది అర్థం అయింది. మన విద్యావిధానం కూడా మనం వాడుకోవడానికి నిర్వచనాన్ని నేర్పలేదు. మనను మనం ప్రశ్నించుకోవడం (ఆలోచించడం) ముందుంటుంది. జవాబులు అనేక అదృశ్యరూపాలలో- పరిష్కారాలు, ఆలోచనలు, నయం కావడాలు, ఎంపికలు, నిర్ణయాలు, సిద్ధాంతాలు, తీర్పులు, ఆవిష్కరణలు, చర్యలు, ఫలితాలు, తీర్మానాలు వంటి అనేక రూపాలలో ఉంటాయి.

ఈ పుస్తకం ద్వారా ఆలోచన అంటే ఏమిటో గ్రహించగలిగితే నా శ్రమ సార్థకం అవుతుంది. ఆలోచనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అంతర్జాలంలో చాలా పుస్తకాలు, వెబ్ సైట్లు ఉన్నాయి. ఆలోచన జవాబుల్ని అందిస్తుంది.
ప్రశ్నలు లేకపోతే జవాబులు ఉండవు. ఆలోచించడం అంటే ప్రశ్నించడం. ఇప్పుడు మనం అజ్ఞానం నుంచి జ్ఞానం దిశకు అంధకారం నుంచి వెలుతురు వైపుకు వచ్చాం. *సంక్లిష్టత తడబడుతుంది. నిరాడంబరత్వం మాట్లాడుతుంది.* ఒక్క కునుకు తీయి.

మబ్బులు విడిపోయాయి. కళ్లు మిరుమిట్లు గొలిపే సూర్యకాంతి వచ్చింది. ప్రశ్న జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. సంస్కృతంలో 'గురు'లో గు అంధకారం, చీకటి. 'రు' – తొలగించు వ్యక్తి. వెలుగు అంటే జ్ఞానం. అది అంతటా చుట్టుముట్టి ఉంది. ప్రతిచోటా ఉంది. "ఆవిష్కరించబడిన తరువాత అన్ని వాస్తవాలు అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటాయి. ఆవిష్కరించడమే కష్టం." గెలీలియో

## సామర్థ్యాన్ని పెంచే తాళంచెవి ప్రశ్న

"మానవుడిలో వింత లక్షణం ఒకటి ఉంది. అదే సులభమైన దానిని సంక్లిష్టం చేసుకోవడం." వారెన్ బఫెట్

ఆలోచన నిర్వచించడానికి వీలుకాని ప్రక్రియ, ప్రశ్నించడం అనే విశిష్ట ప్రక్రియకు సమానమైనది. ఇది కొలిచి చూచుకోగల ప్రక్రియ. దీనిని ఇంకా మెరుగు పరచుకోవచ్చు. మనం చేతనావస్తలో జీవితానుభవం ద్వారా ఆలోచనాశక్తిని పెంచుకుంటాం. పొరపాట్లు చేస్తుంటాం, పొరపాటుగా మలుపులు తిరుగుతాం. జ్ఞానం జీవితానుభవం ద్వారా లభిస్తుంది. అది విజ్ఞానాన్ని సరిగ్గా ఉపయోగించుకోగలుగుతుంది. ఈ పుస్తకం మీ జ్ఞానవిస్తరణకు తోడ్పడుతుంది. ఆలోచనా పరిధిని పెంచుతుంది. మెదడును కదిలించే ఈ పుస్తకం నిజంగా ప్రశ్నల పుస్తకం.

మనిషి యాదృచ్ఛిక స్పందననుంచి ప్రయత్నపూర్వక ప్రక్రియ వైపుకు పయనం సాగిస్తాడు. ఈ నిర్వచనాన్ని ప్రాథమిక విద్యార్థులు కూడా అర్థం చేసుకొని తక్షణం ఆచరించ గలుగుతారు. **ప్రశ్న చైతన్యం లేనిది – జవాబు చైతన్యం కలది.**

"కొత్త ఆలోచన హఠాత్తుగా వస్తుంది. సరిగా చెప్పాలంటే సహజాతంలాగా వస్తుంది. సహజాతం అంటే గతకాలపు అనుభవం వల్ల కలిగినది''. ఐన్ స్టీన్
"సహజాతం అంటే చేతనాపూర్వక ఆలోచనతో అవసరం లేకుండా దేనిగురించి అయినా అర్థం చేసుకోగల సామర్థ్యం."

ఈ సహజాతానికి తోబుట్టువులు చాలా మంది ఉన్నారు. అవి వెలిగిన దీపాలు, ఆశ్చర్యం కలిగించేవి, ఉద్దీపనలు, ప్రేరణలు, అంతర్ దృష్టులు, అంతర్ ప్రతిస్పందనలు, ఇవన్నీ అచేతనప్రశ్నల నుంచి బుడగలు వేస్తూ చేతనవైపుకు దూసుకువచ్చే జవాబులు. ఎప్పుడూ జవాబుకు ముందు ప్రశ్న ఉంటుంది.

ఎవ్వరూ ''ముందు జవాబు - తరువాత ప్రశ్న'' అనరు. నేను ప్రశ్న, ప్రశ్నించడం అనే మాటలను ఒకే అర్థంలో వాడాను. ఆలోచన – ఆలోచించడం అనే మాటలను కూడా అలాగే వాడాను. ఈ రెండూ విభజించడానికి వీలు లేనంతగా కలసి ఉంటాయి. ప్రశ్నించడం తగ్గే కొలది మన శక్తి తగ్గిపోతుంది. ప్రశ్నించగలిగే వారు అధికశక్తిని కలిగి ఉంటారు. విజ్ఞానాన్ని వివేకంతో వాడుకోగల సామర్థ్యమే జ్ఞానం. అది ప్రతిచోటా ఉంది.

ఆలోచన అనే రైలుబండిని నడిపే ఇంజను ప్రశ్న.ఆలోచించడం అంటే ఎవరికి వారు తమను తాము ప్రశ్నించుకోవడం అని తార్కిక ప్రక్రియ ద్వారా తెలుసుకున్నాం. ఆలోచన మనసులో గట్టిపడుతుంది, ఘనరూపం దాల్చుతుంది. అక్కడ దీనికి సరిపోయే ఆధారాలు ఏమున్నాయా అని వెదుకుతుంది. మనందరి జీవితానుభవాలు వేర్వేరుగా ఉంటాయి. సమాచారాన్ని గ్రహించడంలో ఎవరి విధానం వారిదే. అందుకే ఈ పుస్తకం భిన్నదృక్కోణాలనుంచి రాయబడింది. దీనిని అనియత రూపంలో, సాధారణ వ్యావహారిక శైలిలో, మాట్లాడుకునే భాషలో రాశాను. ఎవరికి కావలసింది వారు తీసుకొండి. మిగతా దాన్ని పట్టించుకోకండి. ఆలోచన వంటి అతి ముఖ్యాంశం గురించి చెప్పేటప్పుడు అసలు చెప్పకుండా ఉండేకంటే అధికంగా చెప్పడం మంచిది కదా!

ప్రశ్న పాత్ర ప్రాముఖ్యాన్ని గ్రహించిన తరువాత అన్నీ వాటికవే సర్దుకుంటాయి. ఎటువంటి నొప్పి లేకుండా అప్రమత్తత కలిగించడమే నా లక్ష్యం. ఇలా ప్రతి ఒక్కరూ ప్రశ్న బలాన్ని గ్రహించగలుగుతారు. **"సత్యం ఎప్పుడూ నిరాడంబరత లోనే నిండి ఉంటుంది."** ఐజక్ న్యూటన్. మున్ముందు ఎక్కడైనా ఆలోచించడం, ఆలోచన అనే పదాలు నీ చెవుల్లో పడగానే అవి నీకు తెలియ కుండానే 'ప్రశ్నించడం', 'ప్రశ్న' అని వినపడతాయి. నీలో గల అనంతశక్తిని బయటికి తీసుకువస్తాయి. చుక్కలను కలపడానికి ముందుగా అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలి. "ముందుకు చూస్తూపోతే బిందువులను కలపలేం. వెనక్కు చూస్తూ వెళితేనే వాటిని కలపగలం."స్టీవ్ జాబ్స్.

*అతిక్లిష్టమైనది సులభమైన వాటితో కలసి ఉంటుంది*

సులభమైన వాటిపై ఆధిపత్యం సాధించు, క్లిష్టమైనవాటిని జయించగలవు.

వేర్వేరు సిద్ధాంతాల ఆధారంగా కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాలి. సమాజ శాస్త్రాలు, జీవశాస్త్రాల మధ్య సమన్వయం కనిపిస్తుంది. విడివిడిగా సాక్ష్యాధారాలు బలంగా లేకపోయినా ముగింపు బలంగా ఉండవచ్చు. "ఏ మేధావి ఐనా సమస్యను వినగానే పరిష్కారం చెప్పగలిగేలా ఉండాలి". అన్నాడు ఇంగ్లీష్ తత్వవేత్త, తర్కవేత్త, బెర్ట్రాండ్ రస్సెల్(1872-1970) జవాబు ప్రశ్నతోనే ప్రారంభం అవుతుంది.

**విశ్లేషణ**

మెదడు విశ్లేషణ చేసే అవయవం. నీకు తెలియకుండానే అది ప్రతి విషయాన్ని, శరీర అంతర భాగాలను, బయటి వాతావరణ అంశాలను విశ్లేషిస్తుంటుంది. నువ్వు చదివే పుస్తకాన్ని కూడా నీకు తెలియకుండానే విశ్లేషిస్తూ ఉంటుంది. నాడీమండల శాస్త్రవేత్తలు ఇలా జరిగేది 90 శాతం దాకా ఉంటుందని చెపుతున్నారు. మనిషి నిద్ర పోయేటప్పుడు కూడా మెదడు విశ్లేషిస్తూనే ఉంటుంది. అయినా మంచం మీదనుంచి కిందకు పడకుండా కొంత స్మారకస్థితిలోనూ ఉంటుంది. మద్యం వంటి మత్తు ప్రభావంలో ఉంటే తప్ప మనం కిందపడం. ఏదైనా వింతధ్వని వినిపిస్తే మేల్కొనమని హెచ్చరిస్తుంది మెదడు. అంతే కాకుండా ఒక గుంపులో కలిసి నడిచేటపుడు దేనినీ గుద్దుకోము.

ప్రశ్నలు అడగటం ఒక ప్రక్రియ అనుకుంటే, దానిని పునాదుల దగ్గరనుంచి, సమూలంగా విశ్లేషించటమే ప్రశ్నించడం. కొంతమేరకు స్పృహతో, ఎక్కువ భాగం మనకు తెలియకుండానే ప్రశ్నల పరంపరను వదులుతుంటాము. గబ్బిలాలకు చూపు తక్కువ. అవి చేసే చప్పుళ్లు, శబ్దతరంగాలుగా ముందున్న వస్తువులకు తగిలి తిరిగి వచ్చి వాటికి తగులుతాయి. ఆ ధ్వని తరంగాలను బట్టి వస్తువు ఉన్న దూరం అంచనా వేసుకోగలుగుతాయి. అలాగే మన బాహ్య, అంతర పర్యావరణాలను మనం అర్థం చేసుకుంటాము. విశ్లేషణ ఆలోచనా ప్రక్రియ, ప్రశ్నించే ప్రక్రియ. విశ్లేషించడం ఉత్పాదన. విశ్లేషణ జవాబు. ఆలోచించడం, మనకు మనం ప్రశ్నించే ప్రక్రియలకు మధ్య జరిగే సంభాషణ.

నీలో నువ్వు ఆలోచించడం, నిన్ను నువ్వు ప్రశ్నించుకోవడం అనే ప్రక్రియల మధ్య జరిగే సంభాషణే ప్రశ్నించడం.

చేపకు తాను నీటిలో ఉన్నట్లు తెలియదు. అలాగే ప్రతి క్షణం, అదృశ్యప్రశ్నల సముద్రంలో ఈదులాడుతున్నానని మనిషికి తెలియదు. జ్ఞానాన్వేషణలో ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉంటాయి. జ్ఞానం అంటే జవాబుల కుప్ప. అన్ని జవాబులు, ఉత్పత్తులు, ప్రశ్నలతోనే ప్రారంభం అవుతాయి. అదొక ప్రక్రియ. ప్రశ్నలేకుండా జవాబులు లేవు. విజ్ఞానం అంతా, ఇటీవల సముపార్జించు కున్నదీ, గతంలో సమకూర్చుకున్నదీ, ఎవరో ఒకరి ప్రశ్నలవల్లనే సమకూరింది.

**జిజ్ఞాస:** ప్రశ్న అంటే ఏమిటో తెలియని పసిబిడ్డలను గమనిద్దాం. వాళ్లొక వస్తువును తేరిపార చూస్తారు, నుదుటి కండరాలను ముడుచు కుంటారు. వస్తువును చేతిలోకి తీసుకుంటారు, నోట్లో పెట్టుకుంటారు, రుచి చూస్తారు, అనుభూతి చెందుతారు. వాళ్లకు జిజ్ఞాస మెండు. మానవుడికి అవసరమైనది అర్థం చేసుకోవాలనే జిజ్ఞాస. అర్థం చేసుకోవడం అంటే జవాబును అందు కోవడం. ప్రశ్న లేకుండా జవాబు లేదు. మనకు జిజ్ఞాస కలిగినప్పుడు ఉపయోగించే పరికరాలూ, పనిముట్లే ప్రశ్నలు. ప్రశ్నించే ప్రక్రియను మెదడు విశ్లేషించడం మాతృగర్భం నుంచి బయటకు వచ్చిన మరుక్షణం నించి- బహుశా అంతకు ముందు నుంచి మొదలౌతుంది. అంతేకాదు అర్థం చేసుకోవడమే నేర్చుకోవడం.

పాకులాడే పసిపిల్లలను చూసి ఆలోచన అంటే ఏమిటో మనం గ్రహించవచ్చు. అది మనకెంతో పరిచయమైనది.

'సున్న' అనే భావన అందరికీ తెలిసినప్పటికీ దానిని ఆర్యభట్టు చెప్పే దాకా వేల సంవత్సరాలు ప్రపంచానికి తెలియలేదు. భావానికి రూపం ఇవ్వడం ప్రశ్నించడంలో భాగం. దాని ఫలితమే జవాబు. చిన్నపిల్లల నుంచి వచ్చే ప్రశ్నల సునామీ తాకిడిని తట్టుకోలేక వాళ్లను అదుపు చేస్తుంటాం.వాళ్ల మానసిక వికాసాన్ని కుదిస్తున్నాం. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా పిల్లలు ప్రశ్నించడాన్ని ఆపే పెద్దలప్రవర్తన పిల్లలపై చేసే అత్యాచారం లాంటిది. దీనివల్ల పిల్లల మనోవికాసం ఆగిపోతుంది. జిజ్ఞాస పరిశోధన మొత్తాన్ని నడుపుతుంది.

పరిశోధన ప్రశ్నించే ఒక ప్రక్రియ. శాస్త్రవేత్తలు పిల్లల్లాగా ఎప్పుడూ జిజ్ఞాస చూపడంలో ముందుంటారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఇలా వ్యాఖ్యానించాడు. ''నాకు ఏమీ ప్రత్యేక నైపుణ్యాలు లేవు. నాకు విపరీతమైన జిజ్ఞాస ఉంది. అంతే''. ముఖ్య విషయాన్ని ఆపకుండా ప్రశ్నించడం ఆయన ప్రత్యేకత. "ఒక క్రమపద్ధతిలో జిజ్ఞాసతో కొనసాగించేది పరిశోధన. అది కూర్పు, ఒక కారణంతో అన్వేషించడం"- అన్నాడు జోరా హర్స్ టన్ (1890 – 1960)"వ్యక్తి వయసును బట్టి అతని యౌవనాన్ని కొలవము. అతనికి గల జిజ్ఞాసని బట్టి దానిని కొలవవచ్చు.'' అన్నాడు స్పానిష్ రచయిత, తత్వవేత్త, సాల్వడార్ పానికర్(1927 – 2017)

మేధావులు ఎన్నో ఆవిష్కరణలు చేశారు, నూతన విషయాలను కనుగొన్నారు. నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించారు, రోగకారణాలను కనుగొన్నారు, రోగ చికిత్సలను లోకానికి తెలియజేశారు. ఇవన్నీ కేవలం ప్రశ్నలవల్లనే సాధ్యం అయ్యాయి. జవాబులు లేని ప్రశ్నలు ఉండవచ్చు, కాని ప్రశ్నలు లేని జవాబులు ఉండవు. మహా మేధావులు అంటే మహాస్థాయిలో ప్రశ్నించేవాళ్లు, విశ్లేషించే సామర్థ్యం కలవాళ్లు. సామర్థ్యాలు అంటే ప్రశ్నలకు సంబంధించిన విశేష తెలివితేటలు, ఆసక్తులు, అభిరుచులు. ఉత్తమ ప్రశ్నలనుంచి ఉత్తమ జవాబులు వస్తాయి. ఒక వ్యక్తికి గల మేధస్సును మేధోమాపనం ద్వారా కొలతవేస్తారు. అది గూడా ప్రశ్నలద్వారానే తెలుస్తుంది. కనుక దానిని మేధో మాపనం (IQ test) ప్రశ్నామాపనం(QQ), (Question Quotient) అనడం సమంజసంగా ఉంటుంది.

అందరికీ పుట్టుకతోనే కొంత స్థాయి తెలివి ఉంటుంది. కాని చాలామంది దానిని ఉపయోగించుకోరు. ఉద్దేశపూర్వకంగా, ఒక పద్ధతిప్రకారం ప్రశ్నించడం నేర్చుకుంటే, ప్రశ్నించే సహజశక్తిని పెంచుకోగలుగుతాము. కష్టించి పనిచేయడం కంటే చురుకుగా పనిచేయడం వల్ల ఫలితాలు అధికం అవుతాయి. సరైన విధంగా మెరుగైన ప్రశ్నలు అడగాలి. సాధన ద్వారా క్రమక్రమంగా ప్రశ్నించే నైపుణ్యం పెంపొందించుకోవాలి. అపుడే జ్ఞానసంపద వృద్ధి అవుతుంది.

ప్రశ్నించే నైపుణ్యాలను పిల్లలకు కూడా నేర్పాలి.
పెద్దలు తమ సంతానానికి ఇచ్చే ఏ పెద్ద కానుక అయినా ఇంత కంటే చిన్నదే.
“మార్పుకు అనుగుణంగా మారగల సామర్థ్యమే తెలివి.” అన్నాడు ఇంగ్లీష్ భౌతికశాస్త్రవేత్త, విశ్వదార్శనికుడు, రచయిత- స్టీఫెన్ హాకింగ్. మేధస్సు అంటే విజ్ఞానాన్ని పొందడం, పొందిన దానిని ఆచరణలో పెట్టడం. సరైన విధంగా ప్రశ్నించడం ద్వారా జ్ఞానాన్ని పొందటం, పొందిన జ్ఞానాన్ని సద్వినియోగ పరచుకోవచ్చు. శాస్త్రీయ పద్ధతి-శాస్త్రం అంటే జ్ఞానం. శాస్త్రవేత్తలు శాస్త్రీయ విధానం అనే పదాన్ని వాడతారు. 400 సంవత్సరాల పూర్వం సర్ ఫ్రాన్సిస్ బేకన్ ఈ విధానానికి నామకరణం చేశాడు. ఈ పద్ధతిలో ప్రశ్నల పరంపరను క్రమమైన మెట్లలాగా ఉపయోగించి జ్ఞాన సముపార్జన చేస్తారు.
ఇలా ప్రశ్నించడంలో దశలు :

- ప్రశ్నను వేసుకోవడం
- నేపథ్యాన్ని పరిశోధించడం. పరిశోధన క్రమపద్ధతిలో ప్రశ్నించే ప్రక్రియ.
- ఒక పరికల్పన (రావడానికి వీలయిన జవాబు)ను ఏర్పరచుకోవడం
- ప్రయోగంతో పరీక్షించడం (పరీక్షించడం కూడా ప్రశ్నించే ప్రక్రియయే.)

**చివరి దశ**: లభించిన సమాచారాన్ని విశ్లేషించి దాని ఆధారంగా ముగింపును కనుక్కోవడం.

శాస్త్రీయవిధానం అంటే ప్రశ్నించే విధానం. ఈ పద్ధతి ద్వారా జ్ఞానసముపార్జన చేసేది కేవలం శాస్త్రజ్ఞులు మాత్రమే కాదు, అందరమూ తెలిసో, తెలియకో జ్ఞానసముపార్జనకు ఈ విధానం అమలు పరుస్తాం. ఈ రకంగా చూస్తే మనం కూడా శాస్త్రజ్ఞులమే. ఈ విధానమే నేర్చుకోవడం.
ప్రశ్న లేకపోతే ఏ శాస్త్రమూ లేదు. ప్రశ్నలను మరింతగా మెరుగు పరచుకునే కొలది మనం నేర్చుకునేది అధికం అవుతుంది. ఒక మూసవిధానంలో కాకుండా నేర్పుగా ప్రశ్నించగలిగితే నేర్చుకోవడం మెరుగు అవుతుంది. మన మేధో పేటికకు వెలుపల ఉన్నదంతా మనం నేర్చుకోవలసిందే.

**విమర్శనాత్మక ఆలోచన –**

'విమర్శనాత్మక ఆలోచన' ఒక విషయం మంచిది, చెడ్డది అని తీర్పు చెప్పబోయేముందు పక్షపాతం లేకుండా విశ్లేషించుకొని మదింపు చేసుకోవడం. విశ్లేషణ, మదింపు ప్రశ్నించే ప్రక్రియలు. చెప్పే తీర్పు జవాబు.
విమర్శనాదృష్టితో ఆలోచించడం, తన ఆలోచన గురించి ఆలోచించడం, తన ప్రశ్నించే సామర్థ్యాన్ని ప్రశ్నించుకోవడం, జాగ్రత్త, శ్రద్ధలతో కూడిన మదింపు.

ఇప్పటికంటే ఇంకా మెరుగైన ప్రశ్నలను అడగగల నైపుణ్యంతో ఏఏ ప్రశ్నలు ఉపయోగించాలో తెలుసుకోవాలి. విశ్లేషణ, మదింపు అనేవి ప్రశ్నించే ప్రక్రియలు. మానవుని హేతుబద్ధమైన విమర్శనాత్మక ఆలోచనలో కేవలం ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉంటాయి. విమర్శనాత్మకంగా ఆలోచించడం అనే కంటే విమర్శనాత్మకంగా ప్రశ్నించడం అనటం సమంజసం.

అప్పుడే అంతు చిక్కని రహస్యం బట్టబయలు అవుతుంది. మనందరం- పిల్లలు, పెద్దలు - దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలో తెలుసుకోగలుగుతాం. విమర్శనాత్మక ఆలోచన ప్రశ్నించటం పైననే దృష్టిని కేంద్రీకరిస్తుంది.

శాస్త్రీయవిధానం, విమర్శనాత్మక ఆలోచన, సోక్రటీస్ పద్ధతి – అన్నీ, ఏ పేరుతో పిలిచినా ప్రశ్నించే వ్యూహాలు. మతాన్ని ఉత్తేజితం చేసేవి ప్రశ్నలు. అవి జవాబులకోసం చేసే అన్వేషణలు. చాలామందికి పరిశుద్ధగ్రంథం, ఖురానులు ప్రశ్నలకు జవాబు చెప్పే పుస్తకాలు. నువ్వు చదివే పుస్తకం ప్రశ్నలవల్ల పుట్టింది. నిఘంటువులు, విజ్ఞానసర్వస్వాలు కూడా జవాబులతో నిండిన పుస్తకాలే. ''ప్రశ్నలు అడగగల సామర్థ్యమే మనల్ని మనుష్యులుగా మారుస్తుంది. అది భాష వల్ల మనకు లభించింది'. అన్నాడు జేన్ గుడాల్ (బ్రిటీష్ సామ్రాజ్య అధికారి, ప్రాథమిక ప్రాణులు, జాతుల అధ్యయనవేత్త, మానవశాస్త్రవేత్త, చింపాంజీల అధ్యయనంలో ప్రపంచ అగ్రగామి.)

నిర్ణయం తీసుకోవడం ప్రశ్నించే ప్రక్రియ. చర్య సమర్ధవంతమైన జవాబు, అంతిమ జవాబు. ఇది తెలిసి తీసుకున్నది కావచ్చు, తెలియకుండా తీసుకున్నది కావచ్చు, ప్రశ్నించటం, విశ్లేషించటం అనే ప్రక్రియలు అచేతనంగా జరుగుతాయి.

పని మన ముందుంటే మనం తీసుకునే నిర్ణయాలు మూడు రకాలుగా ఉండొచ్చు.

1. పనిచేయకుండా ఉన్నదాన్ని ఉన్నట్లు వదిలేయటం.
2. అనుకూలతలు, ప్రతికూలతలను బేరీజు వేసుకొని, ప్రతికూలాలను అధిగమించి పనిని పూర్తి చేయటం.
3. ప్రతికూలతలను చూసి భయపడి పనిని చేయకుండా వదలివేయటం.

ఈ మూడింటిలో ఏ నిర్ణయం తీసుకున్నా, ఆ నిర్ణయం వెనుక ఉండేది ప్రశ్నల పరంపరే.

ఈ పుస్తకం ఆలోచించడంలో భిన్నమార్గాన్ని అందిస్తుంది.

**ఆలోచించని వాళ్లు ప్రశ్నించరు- ప్రశ్నించని వాళ్లు ఆలోచించరు.**

“నీ భాషను మార్చుకో. ఆలోచించడం అనడానికి బదులుగా ప్రశ్నించడం అను. నీ ఆలోచనలు జవాబులుగా మారి పోతాయి”. అన్నాడు కార్ల్ ఆల్ బ్రెక్ట్ (జర్మన్ ఔత్సాహిక వ్యాపారవేత్త, ఆల్డీ సూపర్ మార్కెట్ల సముదాయాలను నెలకొల్పి నిర్వహిస్తున్నాడు. 2011లో ఆయన ఆస్తుల నికర విలువ 25.4 బిలియన్ల అమెరికన్ డాలర్లు)

ఆలోచించడం స్వయంగా ప్రశ్నించుకునే ప్రక్రియ. మనల్ని ఇప్పుడున్న అంధకారకూపం నుంచి వెలుతురు ప్రపంచంలోకి తీసుకురావాలంటే ఈ నిర్వచనాన్ని అన్ని భాషల నిఘంటువుల్లో చేర్చాలి. ఆలోచన – తనలో తాను ప్రశ్నించుకోవడం. ఇది అందరికీ సులభంగా అర్థం అయ్యే నిర్వచనం. అంతేకాదు ఫలితాలను చూపగలిగేది కూడా. ఈ నిర్వచనం సామాజిక, ఆర్థిక, వయోబేధాలకు అతీతంగా అందరికీ వర్తిస్తుంది. బాతు పరీక్ష అనేది ఉంది.

Inductive Reasoning బాతులాగా కనిపిస్తుందా?

అయితే అది బాతులాగా నడుస్తుందా?, బాతు లాగా ఈత కొడుతుందా?, బాతులాగా అరుస్తుందా?, అన్నిటికీ అవునని జవాబులు వస్తే అది బాతే. ప్రశ్నించడమే ఆలోచించడం. ఇది మేధోపరమైన సంస్కరణ, మామూలుకంటే లోతుగా అర్థం చేసుకోవడం.

## సిద్ధాంతం- శాస్త్రీయసిద్ధాంతం

సిద్ధాంతం అంటే ఏదో ఒక ఆలోచన / అభిప్రాయం / భావన / అనుకుంటారు. కాని కాస్త లోతుకు పోయి, శాస్త్రీయంగా చూస్తే ఇది ఉపపత్తి, దీనిని పరిశీలించవచ్చు, సాక్ష్యాధారాలతో నిరూపించవచ్చు. అలా నిరూపించ లేకపోతే ప్రతిపాదనను కొట్టివేయవచ్చు. నిరాధారంగా నమ్మటం కాదు, ఊహించడం కాదు, మళ్లీ మళ్లీ రుజువు పరచుకోవడానికి వీలుగా ఉంటుంది. ముందుగా చెప్పడానికి వీలయినదై ఉంటుంది. అనేక అంశాలను నిరూపించ డానికి, వివిధ సందర్భాలకు అన్వయించడానికి ఉపయోగపడుతుంది శాస్త్రీయ సిద్ధాంతం. ఇదే విమర్శనాత్మక ఆలోచన. జిజ్ఞాస కలిగించే ఫలితం.

అంతర, బాహ్య విషయాలను పరిశీలించడానికి మంచి మార్గం ప్రశ్నించడం. దీనికి విరుద్ధంగా మరో సిద్ధాంతం ఉంది. ఇది చీకటిలో పొడిచిన కత్తిపోటు వంటిది. రుజువు చేయడానికి వీలుకానిది. ప్రశ్నించడాన్ని ఆలోచించడం, పరిగణించడం, విశ్లేషించడం, పరిశోధించడం, మదింపు చేయడం, నెమరు వేసుకోవడం, మననం చేసుకోవడం వంటి ఏ పేరుతో చెప్పినా, అవన్నీ ఒకే ఊసరవెల్లికి గల అనేక రంగులు మాత్రమే. ప్రశ్నించే మూల ప్రక్రియలోని వాస్తవాన్ని ఇది మార్చదు.

మళ్లీ మొదటికి వద్దాం. ఆలోచనను ఇంకా మెరుగు పరచటానికి 'ఇదే తుది' అని చెప్పలేము. ఆలోచన ముఖ్య విషయం. దీని గురించి తక్కువ చెప్పడం కంటే ఎక్కువ చెప్పడం మంచిది. ఇది పైపైన చెప్పుకుపోయే విషయం కాదు. మనం అన్వేషించవలసిన మూలలు, సందులు, గొందులు చాలా ఉన్నాయి. "అంధకారం అంధకారాన్ని తరిమి వేయలేదు, వెలుతురు మాత్రమే ఆ పని చేయగలుగుతుంది." మార్టిన్ లూథర్ కింగ్ జూ.

ప్రశ్న జ్ఞానోదయాన్ని కలిగిస్తుంది. ప్రశ్న వల్ల మెదడులో ఉన్న చీకటి గదులు వెలుగుతో నిండిపోతాయి. ఆలోచన ఆకర్షణీయంగా ఉంటుంది. చరిత్రలో ఎందరో ఎన్నో విషయాలను గురించి సమాచారాన్ని అందించారు.

“నేను ఆలోచిస్తున్నాను” అంటే నేను ఉన్నట్లే”, నేను సందేహిస్తున్నాను అంటే నేను ఉన్నట్లే- అన్నాడు రెనీ డెకార్ట్ (ఫ్రెంచ్ గణితశాస్త్రజ్ఞుడు, మహాచరిత్రకారుల్లో ఒకడు, తత్వవేత్త, శాస్త్రవేత్త, (1596-1650). ఆయనే గణితంలో concept of Cartesian coordinates ను తొలిసారిగా ప్రతిపాదించిన మహాశయుడు.

వాస్తవలోకంలో ఒక వస్తువు ఎక్కడ ఉన్నదో, కచ్చితంగా చెప్పడం దీని వల్ల వీలయింది. ఆహారం ఎక్కడ దొరుకుతుంది? అని ప్రశ్నించుకోవడం వల్లనే మానవులం మనగలుగుతున్నాం. చరిత్రలో సోక్రటీస్ లాంటి ఎందరో మహాను భావులు ప్రశ్నించడానికి, ఆలోచించడానికి గల సంబంధాన్ని కచ్చితంగా చెప్పారు. మాటలు చాలా తేడాలను కలిగిస్తాయి. అవి ప్రపంచాలను తారుమారు చేస్తాయి.

Semantics అంటే భాషను ఉపయోగించి తెలుపగల అర్థాలను అధ్యయనం చేసే శాస్త్రం. ఆలోచించడం, ఆలోచించు, ఆలోచన, ఏమిటీ మాటలన్నీ ఒకటి కావా? అవే ఉత్పాదనలు, ఉత్పత్తులు ఎలా అవుతాయి? అని గందరగోళం కలగవచ్చు. ఆలోచన అంటే ఏమిటి?, నువ్వు ఆలోచిస్తున్నప్పుడు ఏమి జరుగుతుంది?,“దీర్ఘ ఆలోచనలో మునిగి ఉన్నాను''. అంటే ఏమిటి? మనం ఎలా ఆలోచిస్తాము?ఆలోచన ఒక ప్రక్రియ. దీనిని నువ్వు ఏమను కుంటున్నావు?

భావోద్వేగం అంటే ఆలోచన ఎలా అవుతుంది? ఇది మహాప్రశ్న. సాధారణ అర్థంలో మనసులోకి వచ్చే ప్రతిదానినీ ఆలోచనగా పరిగణించవచ్చు. అది భావోద్వేగమైనా, హేతుబద్ధమైనదైనా కావచ్చు. భావోద్వేగమైనవి వ్యక్తిగత మైనవి. వాటిని అనుభూతి చెందుతున్న వ్యక్తి మాత్రమే వివరించగలడు. అందుకు విరుద్ధంగా హేతుబద్ధ ఆలోచనలు objective వాస్తవాలపై ఆధార పడి ఉంటాయి. వీటిని కొలవవచ్చు. మనం గమనించవచ్చు కూడా.

**గూగుల్ కథ**:

ప్రశ్నకు విలువ కట్టగలమా?అది సాధ్యమా? వ్యాపారదృష్టితో తెలుసుకోవలసిన విషయం ఇది. డబ్బును ప్రమాణంగా తీసుకొని చూద్దాం. ఒక కంపెనీ లక్ష డాలర్ల పెట్టుబడితో ప్రారంభించబడింది అనుకుందాం. వ్యాపారం కొనసాగింది.

ఐదేళ్లు గడిచి పోయాయి. ఆరో ఏట ప్రవేశించింది, మార్కెట్లో దాని విలువ 600 కోట్లు అయింది. అంటే ప్రజల ప్రశ్నలకు ఒక మార్గాన్ని అందించడం వల్ల మాత్రమే ఇది సాధ్యమైంది. అన్వేషణ అంటే ప్రశ్నించే ప్రక్రియ. ఏవైనా సందేహాలు కలిగితే గూగుల్ కు వెళ్లి, అక్కడ సందేహాలను నివృత్తి చేసుకుంటాం గదా!

**గూగుల్‌లో ప్రశ్నించే సేవల విభాగం**: దీన్ని ప్రారంభించి నప్పటి నుండీ గూగుల్ విలువ, మార్కెట్లో దాని బలం పెరుగుతూనే ఉన్నాయి. ప్రశ్నకు గల వాణిజ్య విలువను, ప్రత్యక్షంగా అంచనా వేసుకోవడానికి ఈ ఉదాహరణ గణనీయ మయింది. ఈ పుస్తకం తయారయే నాటికి గూగుల్ ను నెలకొల్పిన ఆల్ఫాబెట్ అనే సంస్థ మార్కెట్ విలువ $820 billion. కేవలం ప్రశ్నించే శక్తి వల్ల విలువ ఇంతగా పెరగడం సాధ్యం అయింది.

గూగ్లింగ్ అంటే ప్రశ్నించడం. ప్రశ్నల్లో పెట్టుబడి పెట్టడం మాత్రమే మానవవిలువ, ఆర్థిక పెట్టుబడి విలువ పెరగడానికి మనకున్న మార్గం.

గూగుల్ సిబ్బంది చాలా తెలివైన పని ప్రారంభించారు. ఉద్దేశపూర్వకంగా చేశారో లేదో తెలియదు గాని, ఒకే ఒక శక్తివంతమైన దానిపైన దృష్టి కేంద్రీకరించి పెట్టుబడి పెట్టారు.

వారు ప్రశ్నమీద పెట్టుబడి పెట్టారు. వాళ్లకు వస్తున్న రాబడి ఎంతో చూడండి. మిగతా వ్యాపారులకు ఇది కనువిప్పు కలిగిస్తుందేమో చూడండి. గూగుల్ ఎంతో శక్తివంతమైనదైనా దానికి కొన్ని పరిమితులున్నాయి.

అది ఇంకా చట్టబద్ధమైన సమాచారానికి, కాని దానికీ తేడా చెప్పలేదు. ప్రశ్నలు వేసే మన మెదళ్లు మాత్రమే ఆ సమాచారాన్ని చెప్పగలవు. మానవజీవితంలో ప్రతిచోటా ప్రశ్నల అడుగుజాడలు ఉంటాయి. దీనికి సాక్ష్యాధారాలు సమృద్ధిగా లభిస్తాయి. మనం చేసే ప్రతి పనిలోనూ ప్రశ్న నిగూఢంగా ఉంటుంది.
అరబిక్ సంఖ్యలు, 'శూన్యం' లోకంపై ప్రభావం చూపాయి.

ప్రశ్నించడం ఈ రెండు ఆవిష్కరణలకు కూడా మూలం. ప్రశ్నలే ప్రపంచానికి సంఖ్యలను, శూన్యాన్ని చూపించాయి.

అనుకోకుండా జరిగే పరిణామాలు మాత్రం అసమగ్రంగా వేసుకున్న అరకొర ప్రశ్నల వల్ల కలిగిన ఫలితం అనుకోవచ్చు.

ప్రజలు, సంస్థలు తీసుకునే అరకొర నిర్ణయాల వల్లనే అనుకోని / ఊహించని / ఆశించని పరిణామాలు కలుగుతాయి. సాధారణంగా ఈ ఫలితాలు నష్టం కలిగిస్తాయి. ప్రశ్నించగల సత్తాయే మనకున్న అత్యంత ముఖ్య సత్తా.
తమసోమా జ్యోతిర్గమయ – అనేది హిందూ ప్రార్థనలో వాక్యం. మెదడులో జరిగే ప్రక్రియల్లో 10వ వంతు మాత్రమే మనకు తెలుస్తుంటాయి. మిగతా 90 శాతం మనకు తెలియకుండానే జరుగుతుంటాయి. అంటే దాదాపు 90 శాతం చీకటిలో ఉన్నాం. విశ్వంలో ఏమేమి ఉన్నాయో మనకు తెలిసింది 5 శాతం మాత్రమే. తెలియనిది 95%.మనకు తెలిసిన దానికి తెలియని దానికి తేడా అంత ఎక్కువ. **మిగతా అన్ని పరికరాలను తయారు చేసే మహా పరికరం ప్రశ్న.** ప్రశ్నలద్వారా జ్ఞానాన్ని సమకూర్చుకుంటున్నాము. ''ప్రశ్నలు మరచిపోతాము, కానీ జవాబులు గుర్తు ఉంటాయి''.ఓవిడ్,రోమన్ కవి. నమోదు చేయబడి అందుబాటులోగల ప్రతి సమాచారపు ముక్క వెనుక నమోదు చేయబడని ప్రశ్నలు లెక్కలేనన్ని ఉన్నాయి.

''ఇంతవరకూ ఎవ్వరూ చూడనిదాన్ని చూడటం గొప్ప పని కాదు. ప్రతివాళ్లూ చూసే దానిని ఎవ్వరూ ఆలోచించని విధంగా ఆలోచించడం గొప్ప పని''. ఆర్థర్ స్కొపెన్ హార్(1788 –1860), జర్మన్ తత్వవేత్త.

'సున్న' బయటికి, ప్రచారంలోకి రావడానికి 4,000 సంవత్సరాలు పట్టింది. మనిషి భూమి మీద పాదం మోపిన నాటి నుండి ప్రశ్న అనే పరికరం వాడుకలో ఉంది. ఆలోచించడం అంటే తనను తాను ప్రశ్నించుకోవడమే. ఇది అసంభవం కాదు కీలకం, మౌలికం.



**అసాధారణమైన సాధారణ ప్రశ్న**

ఈ స్పష్టమైన నిర్వచనం – భూగర్భ పొరలను భూకంపం ఊపేసినట్లుగా మానవ అవగాహనను ఊపేస్తుంది.

“మనం సృష్టి చేసుకున్న ప్రపంచం మన ఆలోచన ఫలితం. దాన్ని మార్చాలంటే నీ ఆలోచనా క్రమాన్ని మార్చుకోవాలి. (ప్రశ్నించడం).” ఆల్బర్ట్ ఐన్ స్టీన్. ఏదైనా కొంత మారితేనే గాని ఏదీ మారదు. జ్ఞానం విలువైనదే కానీ ఆచరణలో పెట్టడం, అన్వయించడం చేయకపోతే అది వృథా, విలువలేనిది.

ప్రశ్న సాధారణ మయిందీ, అసాధారణ మయిందీ కూడా! ప్రశ్న లేకపోతే ఏమీ లేకపోవచ్చు. మామూలు మేకు/శీలను ప్రత్యేకమైనదానిగా చూడం. అదొక సాధారణ వస్తువు. అందులో కదిలే భాగాలు ఏవీ లేవు. కేవలం ‘మేకు’ అంతే. ఇంట్లో పని చేసేటప్పుడు ఒక మేకు పైనుంచి జారి కిందపడితే నిచ్చెన దిగి ఆ మేకు కోసం కిందికి రాము. అయితే అంత చిన్న వస్తువు అయినా భూగోళం మీద కోట్లాది కొయ్య ఇండ్ల గోడలను, భాగాలను కోట్లాదిమందిని భద్రంగా కలిపి ఉంచుతుంది. ఇలా చిన్న మేకును కొత్త వెలుగులో చూడొచ్చు.

ఆలోచనకు నిర్వచనం చెప్పటం సులభం. ఇది విశ్వవ్యాప్తంగా శక్తివంతమైనది. భూగోళం పైన ఉన్న మానవ సమాజాలన్నిటిని కలిపి ఉంచేవి ప్రశ్నలు. అందువల్లనే మనందరం ఇలా కలిసి ఉన్నాం. ప్రశ్నలు మేకును కనుగొన్నాయి. ప్రశ్నలు చెక్కలను ముక్కలుగా చేసి కలిపి ఉంచుతాయి. ప్రశ్న మానవ నాగరకతకు కూకటి వేరు. ప్రశ్న మానవజన్యువుల్లో మేధస్సు అనే కణం.దానిలో అన్ని సూచనలు నిక్షిప్తమై ఉంటాయి. అది అన్ని పనుల్లో అంతర్గతంగా పాలు పంచుకుంటుంది.

**వ్యూహాత్మక ఆలోచన-** ఇదొక ఆలోచనా ప్రక్రియ. వ్యాపారంలోగాని, వ్యక్తిగత జీవితంలో గాని లాభం పొందాలంటే ఏ వ్యూహాన్ని అనుసరించాలో తెలియ జేస్తుంది. వ్యూహాత్మకంగా చేయడం ప్రశ్నించే ప్రక్రియ. వ్యూహమే ఒక ఫలితం, ఒక జవాబు. చిన్న వస్తువులే ఎక్కువ ప్రభావం చూపుతాయి. సున్న చిన్నదాని కంటే చిన్నది. అసలు దానికి విలువే లేదు.

చిన్న తాళంచెవి పెద్ద తలుపులను తెరుస్తుంది. టర్కిష్ సామెత. ఒక ప్రధాన తాళంచెవి అన్ని తలుపులను తెరుస్తుంది.

వయస్సులను బట్టి సంఖ్యలో, నాణ్యతలో ఇంకా ఎక్కువగా ప్రశ్నలు అడిగేందుకు పిల్లల్ని ప్రోత్సహించాలి. అలా చేస్తే వాళ్లు మంచి ఆలోచనా పరులు అవుతారు. అంతకుమించి మనం కోరుకునేది ఏముంటుంది? లోకజ్ఞానం అంటే వేల యేళ్లు గడిచినా, సంస్కృతి, వాతావరణాలు మారినా స్థిరంగా, సామాన్యంగా ఉండేది.

కొందరు పెద్దలకు పిల్లలు వేసే ప్రశ్నలు పనికిమాలినవి అనిపిస్తాయి. వాళ్లను విసుక్కొని నోరు మూయిస్తారు. ఇలా చేయడం వల్ల నష్టం జరుగుతుంది. పిల్లలు ఎదుగుదల ఆగిపోయి వామనవృక్షాలుగా మారతారు. తెలియక అలా చేసినా ఫలితాలు రాకుండా ఆగవు కదా? పిల్లలు ఎదిగేకొలదీ, వయసుకు తగిన మంచి ప్రశ్నలను, కష్టమైన వాటిని అడిగేలా ప్రోత్సహించాలి పెద్దలు, గురువులు. అప్పుడే పిల్లలు మేధావులవుతారు.

***సాధన లేకపోతే ప్రగతి లేదు***. విద్యార్థులను ఎక్కువ ప్రశ్నలను అడిగే గురువు గొప్ప అనుకుంటారు కొందరు, కాని ఉపాధ్యాయుడు సైతం జవాబులు చెప్పలేని ప్రశ్నలను విద్యార్థులు అడిగేలా ప్రోత్సహించగలవాడే గొప్ప గురువు - అన్నాడు అలైన్ వెల్లింగ్టన్ రోలిక్స్, (1847 - 1897) విద్యావేత్త, రచయిత.

సాంకేతికత మారి ఉండొచ్చు, మనుషులం అంతగా మారలేదు. వాతావరణం, సంస్కృతి, ఏదైనా మనుషుల లోకజ్ఞానం దశాబ్దాలు,శతాబ్దాలు, సహస్రాబ్దులు గడిచినా అంతగా మారటం లేదు. ఎందుకు?

***"ఎందుకు?"*** పిల్లలు వేసే ప్రశ్నల్లో " ఎందుకు**?"** చాలా ముఖ్యమైనది. ఇది నిజంగా సవాల్ వంటిది. పిల్లల ప్రశ్నలకు జవాబులు చెప్పకుండా తప్పించుకోలేము, అవి పెద్దలను ఇబ్బంది పెడతాయి. వాటికి జవాబులు చెప్పలేము. వాటికి జవాబులు చాకచక్యంగా చెప్పడం ఎలా? వారి ప్రశ్నలకు స్పందించాలి. పెద్దలు పిల్లల ప్రశ్నలను తిప్పి పిల్లలనే అడగటం కూడా ఒక రకమైన మంచి స్పందనే.

మనం ఆలోచిస్తున్నాం అనుకుంటాం, కాని ఆలోచించడం లేదు, ప్రశ్నిస్తున్నాం. మన చర్యలు, నిర్ణయాల నాణ్యత అవి ఆధారపడిన సమాచారాన్ని బట్టి ఉంటాయి. భవనపు గట్టితనం దాని స్థంభాల గట్టితనంపై ఆధారపడి ఉన్నట్లు, సమాచార నాణ్యత ముందు వేసుకున్న ప్రశ్నల నిర్ణీత ప్రమాణాలను బట్టి ఉంటుంది.

**ప్రశ్న అమాయకత్వంపై దాడిచేసి దానిని అంతం చేస్తుంది. అది అజ్ఞానానికి విరుగుడు మందు.** ప్రపంచంలో కొన్ని జాతులు, తెగల పిల్లలు పెద్దవాళ్లను, గురువులను, అధికారులను ప్రశ్నించగూడదు, వాళ్లను గౌరవించాలి.

ఇది పిల్లలకు నష్టం కలిగించేది కదా? పిల్లల్లో ప్రశ్నించే స్వభావాన్ని పెంచి పోషించడానికి బదులుగా వాళ్లను మరగుజ్జు మొక్కలుగా మార్చడం న్యాయమా? ప్రశ్నించడం నేర్పే సమాజాలకంటే నేర్పనివారు వెనకబడి పోతారు. ప్రశ్న మార్పుకు మార్గం. ఇది కొందరికి భయం కలిగిస్తుంది. మార్పు ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. మార్పు లేదంటే సర్దుబాటు లేదు. సమాధిలోకి చేరే దాకా మారుతూనే ఉంటాడు మనిషి.

సృజనాత్మకత అంటే ఏదైనా సమస్యను మరో కోణం నుంచి /కొత్త కోణం నుంచి చూడగలిగేలా చేయడమే." అని ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ బిజినెస్ స్కూలులో వ్యాపార నైతికవిలువలు బోధించే ఆచార్యులు జోసెఫ్ బాడరాకో అన్నాడు.

**ప్రశ్నించడం అంటే మానవుడిగా ఉండటం.**

**మానవుడిగా ఉండటం అంటే ప్రశ్నించడం.**

ప్రశ్నించే నైపుణ్యం మూలనైపుణ్యం. ''భౌతిక శాస్త్రవేత్త అయినా అందరికీ అర్థం అయ్యే సాధారణ భాషలో చెప్పగలగాలి'' వెర్నర్ హైసెన్ బెర్గ్ (1901 –1976) జర్మన్ సిద్ధాంత భౌతిక శాస్త్రవేత్త,1932లో క్వాంటమ్ మెకానిక్స్ లో నోబెల్ బహుమతి గ్రహీత.

దీనిని ఇంకాస్త లోతుగా చూద్దాం. మనకు మనం వేసుకునే ప్రశ్నలను గమని స్తుంటాం. వాటిని తెలుసుకుంటాం.

మనకు తెలియకుండా మన మనసులో పాక్షికచైతన్యంలో జరిగే ఆలోచనల విషయం ఏమిటి? మనిషి మెదడు ఎప్పుడూ, నిరంతరంగా బయటి పరిసరాల్లో జరుగుతున్న మార్పులను, శరీరం లోపల జరిగే మార్పులను గమనిస్తూ వాటిని విశ్లేషిస్తూ ఉంటుంది. విశ్లేషణ అంటే ప్రశ్నించడం. అయితే ఈ ప్రక్రియ మొత్తం మనకు తెలియకుండానే జరుగుతుంటుంది.

**మెదడు - మానవ మనుగడ**

మనకు తెలియకుండానే కలిగే సందేహాలు ప్రశ్నలు. "unconscious" అనే మాటకు అర్థం చెపుతాను. స్పృహలో లేకుండా ఉండటమే అని కొందరు అంటారు. దానికి ఇంకా లోతైన అర్థం ఉంది. దాదాపు మెదడు మొత్తం చేసే పని మనకు తెలియకుండానే జరుగుతుంది. దానిని తెలుసుకునే సామర్థ్యం మనకు లేదు. అది మన స్పృహలో ఉండదు. "మెదడులో జరిగే చర్యల్లో 90 శాతం మనకు తెలియవు" అంటారు నాడీమండల మనోవిజ్ఞానవేత్తలు. మెదడులో 10 శాతం మాత్రమే వాడుకుంటున్నాం అనేది భ్రమ. నాడీమండల శాస్త్రవేత్త బారీ గోర్డాన్, జాన్ హాప్‌కిన్స్ వైద్యశాలలో పనిచేస్తారు. ఆయన అంటారు – ''మనం మెదడులో 10 శాతాన్ని కాదు నూటికి నూరు శాతాన్ని ఉపయోగిస్తాం. దాదాపు మెదడు మొత్తం ఎప్పుడూ, నిద్రపోయేటప్పుడు కూడా, పని చేస్తూనే ఉంటుంది''.

ఎదిగిన మనిషి శరీరంలో మెదడు కిలోన్నర బరువు ఉంటుంది. అది విశ్లేషిస్తూ ఉంటుంది. అది ప్రశ్నించే విభాగం. మెదడులో తయారయేవి ప్రశ్నలు. మన మనుగడకు ప్రశ్నలే కీలకం. స్పృహలో లేకుండానే, పాక్షిక చేతన దశలోనే, వచ్చేవి జవాబులు.

మనకు తెలిసీ, తెలియకుండా ప్రశ్నలు వస్తాయి, సందేహాలు కలుగుతాయి. అలాగే వాటికి తార్కికమైనవీ, కానివీ జవాబులు వస్తుంటాయి. అవి దీర్ఘకాలిక / స్వల్పకాలిక జ్ఞాపకాల అరల్లో నిక్షిప్తం చేయబడి ఉంటాయి. కంప్యూటరులో సమాచారాన్ని దాచినట్లు కాక ఈ జ్ఞాపకాలు, మనోభావాలు భావోద్వేగాల ప్రభావాలకు గురి అవుతుంటాయి, ఈ ఫైల్స్ లో సవరణలు జరుగుతుంటాయి. కొన్ని శిథిలం అవుతుంటాయి.

వాటికి అనుగుణంగా మన దృక్కోణం, అవగాహన మారుతుంటాయి, మన అనుభవాలు సవరింపబడుతుంటాయి. పదిహేను సం.రాల వయసులో జీవితం,విలువలు అంటే అర్థం వేరు. 50 ఏళ్ల వయసులో అవి వేరు.

**గుర్తుంచుకోవడం, గుర్తు చేసుకోవడం**

**ఎంపిక**: కంప్యూటర్‌లో /మానవుని మెదడులో మిలియన్ల సమాచార ముక్కలు నిల్వ ఉంటాయి. వాటిలో మనకు కావలసిన వాటిని వెతికి తీయాలంటే, మెదడులో నిక్షిప్తమై ఉన్న జ్ఞాపకాలను బయటకు తీసుకురావాలంటే, కంప్యూటరులో లాగానే వెదికి తీయాలి. ఒక మనిషి పేరు గుర్తు రావటం లేదు. ఫలానా పేరు అయి ఉంటుందా? కాదు, మరోపేరు? కాదు, మరేది? ఇలా వెదుకుతుంది. చాలా సేపటి తరువాత గుర్తు వస్తుంది. లోపల అన్వేషణ జరుగు తూనే ఉంటుంది. సరైన జవాబు వచ్చేవరకూ వెతుకుతూ ఉంటుంది. ఇదంతా అనేకమైన వాటిలో ఒకదానిని ఎంపిక చేసుకోవడం. ఎంపిక ఒక ప్రశ్నించే ప్రక్రియ. ఎంపిక అంటే ఆలోచన. నిర్దిష్టమైన జ్ఞాపకంగా ఉంచబడిన జవాబు. మనకు తెలియకుండానే జరిగే ఎంపిక ప్రశ్నించే ప్రక్రియలో భాగమే.

కంప్యూటర్ సాంకేతికతలో ఎంపిక చేయడం అంటే ప్రశ్న, క్వెరీ. క్వెరీ అంటే నిల్వఉన్న సమాచారనిధినుంచి కావలసిన సమాచారాన్ని అందించమని కోరడం. ప్రశ్నించు అని అర్థం. విజ్ఞప్తి చేయడం అంటే నీ సమాచారనిధి నుంచి సమాచారాన్ని అందించమని మెదడును కోరడం. మెదడు ఆ సమాచారాన్ని సేకరించడానికి ఒక ప్రాధాన్యతను ఎంచుకుంటుంది. అనేక విధానాలలో ఏదో ఒక విధానాన్ని కోరుకుంటుంది. అలా కోరుకోవడం కూడా ఎంపికయే. ఎంపిక అంటే ప్రశ్నించే ప్రక్రియ. ఎంపిక అంటే జవాబు.

చైతన్యరహితమైన మెదడు – మాట్లాడటం. మామూలుగా మాట్లాడేటప్పుడు మెదడు ఆ సందర్భానికి అనుగుణంగా వాడవలసిన మాటను వెదికి అందిస్తుంది. ఆ మాటలను వ్యాకరణపరంగా తప్పులు లేకుండా వాక్యాలుగా కూరుస్తుంది. ప్రశ్నించడం, ఎంపిక చేసుకోవడం, ఎంపిక – ఇవన్నీ ప్రశ్నించే ప్రక్రియలే. ఎంపికలే జవాబులు.

అప్పుడు ఎదుటి వ్యక్తి నుంచి భాష, సంజ్ఞలు, సంకేతాల ద్వారా అందించే స్పందనలను స్వీకరిస్తాం.

వాటి ద్వారా ఎదుటి వ్యక్తి అందించేవి గ్రహిస్తాం, సంభాషణలను విశ్లేషిస్తాం. విశ్లేషణ కూడా ప్రశ్నించడమే.

మాట్లాడటం తెలుసు కనుక మాటలను వాక్యాలుగా, అంశాలుగా కూర్చ గలుగుతాం. ఇదంతా నేర్చుకున్నాము కనుక మనకు తెలియకుండానే మెదడులో ఈ ప్రక్రియ అంతా జరుగుతుంటుంది. తెలియకుండానే మెదడులో ఈ క్లిష్టమైన, శీఘ్ర ప్రక్రియ అంతా జరుగుతుంటుంది. ఇదంతా ఎలా జరుగుతుంది? కేవలం సాధన ద్వారానే వేగంగా మాట్లాడటం సాధ్యం అయింది. **సాధన ఒక ప్రక్రియ.** తెలిసి, స్పృహతో చేసే చర్యను స్పృహలో లేకుండా చేసే పనిగా మార్చడమే సాధన ఫలితం.

చేతనతో చేసే సాధన చేతన లేకుండా చేసే సాధన అవుతుంది. ప్రశ్నించడాన్ని జాగ్రత్తగా, నిరంతరం సాధన చేస్తే ప్రశ్నించే శక్తి అభివృద్ధి అవుతుంది. అంటే ఆలోచన పెరుగుతుంది. సామర్థ్యం పెంపొందాలంటే చాలా సాధన కావాలి. సంగీత సాధన చేసే ఏ కళాకారుడినైనా అడిగి చూడండి, తెలుస్తుంది. చలికాలంలో నీరు గడ్డ కడుతుందా అన్నంత చలిగా ఉన్నపుడు చన్నీళ్లలో స్నానం చేస్తూ గాత్రసంగీతం సాధన చేయమంటారు.

ప్రశ్నించడం (ఆలోచించడం) కళను అభివృద్ధి చేసుకోవడానికి అంతిమ మార్గం. ప్రావీణ్యం ఒక పని కాదు, అదొక అలవాటు''- అన్నాడు గ్రీకు శాస్త్రవేత్త, తత్వవేత్త, అరిస్టాటిల్. (క్రీ.పూ. (385 – 322). ప్రపంచంలో ఇంతవరకూ పుట్టిన మానవులలో మేధావులు ముగ్గురు అంటారు. అందులో ఒకడు ఈయన. మిగతా ఇద్దరూ ప్లేటో, సోక్రటీస్.

ఆలోచనలు(ప్రశ్నలు)నీకు తెలియకుండానే వస్తుంటాయి.

వాటిని తెలిసి చేసే సాధనతో అభివృద్ధి చేయగల్గుతావు?

వైద్యులు, న్యాయవాదులు, అమ్మలు, నీళ్లగొట్టాల పనులు చేసేవాళ్లు, కంప్యూటర్ కార్యక్రమాలు రూపొందించేవాళ్లు, గణితశాస్త్రజ్ఞులు, జన్యు శాస్త్రజ్ఞులు, ఇంకా అన్ని రకాల వృత్తుల్లో ఉండే వాళ్లు, వృత్తుల్లో లేనివాళ్లు ఏళ్లతరబడి సాధన చేస్తుంటారు. దానివల్ల వాళ్లు అభివృద్ధి చెందుతున్నారు. జీవితమంతా సాధనే.

అన్ని వృత్తుల్లో ఉండేవాళ్లు తమ ప్రశ్నించే శక్తిని, ప్రశ్నించే ప్రక్రియను అప్పుడప్పుడు మదింపు చేసుకుంటుంటారు. వాళ్ల విజయాలకు, పరాజయాలకు కారణాలు ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అలా అంచెలు అంచెలుగా అభివృద్ధి చెందుతుంటారు.

**పిల్లలు- ప్రశ్నలు**

ఐదేళ్ల లోపు వయసుగల పిల్లలు పెద్దలతో పోల్చిచూస్తే నేర్చుకోవడంలో మేధావులు.వాళ్లు ప్రతి విషయం నేర్చుకుంటారు,వేగంగా నేర్చుకుంటారు. భాషను తమంతట తామే నేర్చుకుంటారు. ఎవరూ పనిగట్టుకొని నేర్పనవసరం లేదు.

అందుకే వాళ్లకు వచ్చిన ప్రతి సందేహాన్ని ప్రశ్నలుగా అడగటానికి సిగ్గు పడరు, సంకోచించరు. చాలా సందర్భాల్లో అడిగిన ప్రశ్నలనే మళ్లీ, మళ్లీ విసుగులేకుండా అడుగుతుంటారు. అదే వారికి సాధన. ప్రశ్నించే నైపుణ్యాన్ని పెంచి పోషించడానికి సరైన సమయం బాల్యమే. ప్రశ్నించే నేర్పరితనాన్ని పెంచడంవల్ల వారి సృజనశక్తి, సామర్థ్యాలు పెరుగుతాయి.

లేత వయసులో గనుక దీనిని గుర్తించి, పెంచడానికి సహాయపడితే, ఆ మొక్క పెరిగి జీవితాంతం ఫలితాలను అందిస్తుంటుంది. కనుక ఎంత త్వరగా సాధనకు పిల్లలను సన్నద్ధం చేస్తే అంత మంచి ఫలితాలు కలుగుతాయి. పిల్లల మెదళ్లలో, పెద్దల కంటే నాడీ సంధులు ఎక్కువ. (సినాప్సెస). అందుకే పిల్లలు పెద్దల కంటే మేధావులు. పిల్లలు ప్రతి విషయాన్ని చూసి నేర్చుకుంటారు. పెద్దలు కొన్నిటి పైనే దృష్టిని కేంద్రీకరిస్తారు. మెదడులోగల సమాచారం ఒక నాడీసంధి నుంచి మరొక దానికి మారుతుంటుంది. యుక్త వయస్సు వచ్చేసరికి అనవసరమైన నాడీ సంధులు బలహీనపడి రాలిపోతాయి. అవసరమైనవి పటిష్టమౌతాయి.జార్జి డార్సీ అమెరికన్ ఆదిమజాతుల అధ్యయన నిపుణుడు(1868 – 1931) అన్నాడు.

*'మెదడును ఎంత ఎక్కువ ఉపయోగిస్తే అంత ఎక్కువ అందుబాటులోకి వస్తుంది'.*

కండరాలు బలిష్టం కావాలంటే ప్రతిఘటనను ఉపయోగిస్తాం. మెదడులో నాడీ సంధులు బలపడాలంటే వాటిచేత ఆలోచనా వ్యాయామాలు చేయించాలి.

ఎంత గట్టి వ్యాయామం చేస్తే అవి అంత ఎక్కువగా బలపడతాయి. ప్రశ్నలే మెదడుకు వ్యాయామాలు. పెద్ద ప్రశ్నలకు జవాబులు వెదకటంలో తప్పు, ఒప్పులను వేరు చేసుకోవాలి. ఆలోచనా ప్రక్రియలో పొరపాట్లు, తప్పులు దొర్లడం సహజం. కొత్తప్రశ్నలు, మంచిప్రశ్నలు రావడానికి తప్పులుసహాయ పడతాయి.

మనం తరచుగా వింటుంటాం 'వాడుతుండండి, లేకపోతే పాడయిపోతుంది' అని. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు కరోల్ డ్వెక్ ''మెదడులోని నాడీ సంధులు సాఫల్యాల ద్వారా కాక వైఫల్యాల వల్లనే ఎక్కువ నేర్చుకుంటాయి. మెదడు పెరుగుతుంటుంది. దానిని ఉపయోగించండి, ఎదగండి'' అన్నారు.

**వాడుతుంటే మెదడు పెరుగుతుంటుంది.**

ఇది కండరాల పెరుగుదల వంటిదే. వ్యాయామాలు చేసినప్పుడు, కొత్త కండర కణాలు పెరుగుతాయి, కండరాలు బలపడతాయి. వాడటం ఎక్కువయే కొలది కండరాల పటిష్ఠత ఎక్కువవుతుంది. కండరాలు సాగదీస్తే మళ్లీ సాధారణ స్థితికి రావడానికి నలభై గంటలు పడుతుంది. కండరాలు వ్యాయామాలు చేసేటప్పుడు పెరగవు, తరువాత శరీరం విశ్రాంతి తీసుకునేటప్పుడు పెరుగుతాయి. మనిషి నిద్రపోయేటప్పుడు శరీరం, మెదడు పునర్నిర్మాణం జరుగుతుంది. రిపేర్లు జరుగుతాయి, బలపడతాయి. అందుకే నిద్ర ప్రాణులకు చాలా ముఖ్యం.

పొరపాట్లు చేయకుండా ఉండాలంటే నేర్చుకోవడం ఆపాల్సిందే. ఏ తప్పూ చేయకుండా ఉండాలని చేసే ప్రయత్నం సృజనాత్మకశక్తిని కూడా నిలిపేస్తుంది. న్యాయవాది, వైద్యుడు, ఉపాధ్యాయుడు, ఏ వృత్తిలో వున్న వ్యక్తి అయినా ప్రశ్నించడం ద్వారానే కావలసిన సమాచారం సేకరిస్తాడు. ప్రయత్నం లేకపోతే ఫలితం ఉండదు. వ్యాయామం కండరాలను, మెదడును బల పరుస్తుంది ఇది తిరుగులేని నిజం. వైవిధ్యం లేకపోతే సృజనాత్మకత లేదు. రెండు, అంతకంటే

ఎక్కువ వేరువేరు వస్తువులను / ఆలోచనలను కలిపితే కొత్త వస్తువును సృష్టిస్తాం.
వైవిధ్యం అంటే అందులో సామాన్య విషయాలు ఏమీ లేకపోవడం. సామాన్యం అంటే సముదాయం. భిన్నత్వం పెరిగితే సముదాయం తరుగుతుంది.

మానవులకు భిన్నత్వం, ఏకత్వం రెండూ కావాలి. బలమైన సమాజాన్ని నిర్మించడానికి సృజనాత్మక పరిష్కారాలు తప్పక అవసరం.

"ఏ ఒక్కరూ ప్రతిఒక్కరితో సమాన చురుకుదనం కలవాళ్లు కారు''.జపాన్ సామెత

ఇప్పుడొక కొత్తమాట వాడుకలోకి వచ్చింది. అదే మేఘాలలో దాచుకోవడం. Cloud computing "ప్రతివారూ ఒకే రకంగా ఆలోచిస్తుంటే కొంతమంది ఆలోచించడం లేదనుకోవచ్చు''సైనికాధికారి జార్జ్ యస్.పాటన్(1885- 1945)

ఓటమి ఎదురయిందంటే నువ్వు ఇంకా అక్కడ లేవని అర్థం.

**పట్టుదలతో మళ్లీ మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి**

ప్రశ్నలు లేకపోతే పరిష్కారాలు లేవు, మేలైన ప్రశ్నలు, మేలైన జవాబులు, మరిన్ని ప్రశ్నలు, మరిన్ని పరిష్కారాలు.

"ఎంతగా నేర్చుకున్నప్పటికీ మనసు అలసిపోవడం జరగదు. మిగిలిన అమాయకులే అలసిపోతారు" లియోనార్డ్ డావిన్సీ. నేర్చుకోవడం వల్ల మనసు శక్తివంతం అవుతుంది. మానసిక ప్రక్రియల విషయంలో ఇది మరీ వాస్తవం.

శాస్త్రవేత్తలు కూడా మళ్లీ మళ్లీ తప్పులు చేస్తూనే ఉంటారు. తప్పులు వస్తున్నా యని ప్రయత్నాలను ఆపరు. మెదడు గురించి తెలుసుకోవాలంటే ప్రశ్నలతో మెదడును నింపేయాలి.

మెదడు చాలా వింతైన అవయవం. ఎవరైనా నీ తలను పరీక్షించాలి అంటే నీ మనసును పరీక్ష చేస్తున్నారనే అర్థం. అజ్ఞానానికి, అమాయకత్వానికి విరుగుడు ప్రశ్న. అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని దగ్గరకే రానివ్వని టీకామందు ప్రశ్న. ప్రశ్నించడం ఎలాగో తెలుసుకొని దానిపై పెత్తనం చేయగల ప్రతివ్యక్తి ప్రపంచంలో మార్పు తీసుకురాగలడు.

"సమస్య ఎదురైనప్పుడు మాత్రమే ఆలోచిస్తాము (ప్రశ్నిస్తాము)''- అమెరికన్ తత్వవేత్త, మనోవిజ్ఞానవేత్త,విద్యావేత్త,జాన్ డూయీ(1859-1952)

ప్రశ్నించడం మెదడును క్షుణ్ణంగా కదిలించి, కుదిపి, ఉత్తేజపరుస్తుంది, శస్త్రచికిత్సతో అవసరం లేకుండా మెదడును విస్తరింపజేస్తుంది.

పిల్లలకు మనం ఇవ్వగలిగిన గొప్ప కానుకల్లో మొదటిది ప్రేమ, రెండోది ప్రశ్నించే కళను నేర్పడం. యోచించటం, ఆలోచించటం రెండూ ఒకటే.

“శాస్త్రీయపదాలు కూడా సామాన్యులకు అర్థం అయేలా ఉండాలి” ఐన్‌స్టీన్

“నిరాడంబరం మహా క్లిష్టమైనది, నిరాడంబరం అంటే సాధారణంగా ఉండటమే.” లియొనార్డ్ డావించి

‘‘శాస్త్రం కేవలం ఒక విజ్ఞానపు కుప్ప మాత్రమే కాదు, అది ఆలోచించే (ప్రశ్నించే) ఒక మార్గం’’.అమెరికన్ ఖగోళశాస్త్రవేత్త,రచయిత కార్ల్ సగాన్(1934 –1996)

‘‘శాస్త్రవేత్త సరైన జవాబులు చెపితే చాలదు. సరైన ప్రశ్నలను కూడా అడిగేవాడు కావాలి’’- మానవ, జాతి అధ్యయనవేత్త క్లాడ్ లెవి స్ట్రాస్. (1908 – 2009)

**పరిశీలన**

శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన వాళ్ళు. వాళ్లను వాళ్లు బహిరంగ పరచుకోవడానికి, వ్యక్తం చేసుకోవడానికి, ఇతరుల చేత నిశితంగా పరిశీలించబడడానికి, విశ్లేషించ బడడానికి వీలుగా తమ అనుభవాలను ముందుగా సహచరులు చూడటానికి వీలుగా ప్రచురిస్తారు.

అందుకోసమే అంతర్జాలం ఆవిర్భవించింది. దానిని ఆర్పా నెట్ ARPANET (Advanced Research Projects Agency) అంటారు. వేర్వేరు పరిశోధనా రంగాల వారి మధ్య అనుసంధానకర్తగా ఇది పనిచేస్తుంది. శాస్త్రజ్ఞులు వారిమధ్య భావమార్పిడి చేసుకుంటూ చర్చలు జరపడానికి ఇది దోహద పడుతుంది. ఆ స్థాయి నుంచి అంతర్జాలం నేడు మనం చూస్తున్న స్థాయికి పెరిగింది. మరే ఇతర సంఘమూ ఇలా శాస్త్రీయంగా తాము కనుగొన్న అంశాలను బహిర్గతం చేయదు. వ్యాపారంలో పోటీ కలుగుతుందని భయపడతారు. ప్రభుత్వాలు రహస్యాలు వెల్లడి అవుతాయనుకుంటాయి. రాజకీయ నాయకులు తమ రహస్యాలను వెల్లడించరు.

**శాస్త్రవేత్తల విజ్ఞానం వాస్తవ ఆధారం.** శాస్త్రాలు వేగంగా ముందుకు పోతున్నాయి. శాస్త్రజ్ఞుల జీవితశయాలు వాస్తవాలను తెలుసుకోవడం, రుజువు చూడటం, పరిశోధించటం, ప్రశ్నించటం. ప్రశ్నలు భవిష్యత్తుకు వాహనాలు.

జవాబులు నీ బాటలో మైలురాళ్లు. భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించాలంటే ముందుగా దానిని ఊహించుకుంటూ ప్రశ్నలు వేసుకోవడం ఒక్కటే మార్గం. సమాజంలో ఒక వర్గం వారు శాస్త్రం, మేధావులు చెప్పే దానిని విశ్వసించరు. అలాగని వాళ్లు జ్ఞానానికి వ్యతిరేకులు, అజ్ఞానానికి అనుకూలురు అనుకోలేము. వాళ్లు దేనినైనా ముందుగా నమ్మరు. కళ్లముందు కనపడినా సందేహిస్తారు. అజ్ఞానం / పాక్షికజ్ఞానం వల్ల భయం కలుగుతుంది. తెలియనిది అంటే భయం. ఏమి చేయాలో వాళ్లకు తెలియదు. నీకు తెలియని దానిని కొలత వేయలేవు.

**భయం** : ఎలా అడగాలో వాళ్లకు తెలియదు. ప్రశ్నలు అడగాలంటే భయం. అడగటానికి అహం అడ్డు రావచ్చు. వేధింపులకు గురి అవుతామని భయం. కుక్కకు భయం వేసినప్పుడు అరుస్తుంది. భయం వేసినప్పుడు పోరాడి గెలవలేకపోతే అక్కడి నుంచి పారిపోవడం ప్రాణికి సహజం.

భయం శక్తివంతమైన ఆయుధం. తెలియని విషయంపట్ల భయమేలేకుండా చేయగల పరికరం ప్రశ్నించడమే. జీవితంలో భయపడవలసింది ఏదీ లేదు. భయం గురించి అర్థం చేసుకోవాలి,

''ఇదే బాగా అర్థం చేసుకోవలసిన సమయం. అలా చేస్తేనే భయం తగ్గుతుంది." మేరీ క్యూరీ, రెండుశాస్త్రాల్లో నోబెల్ బహుమతి అందుకున్న తొలి మహిళ.

"భయం తప్ప భయపడవలసింది మరేదీ లేదు."ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్, అమెరికాకు 32 వ అధ్యక్షుడు.

భయం పనికి శత్రువు. పని చేసే కొలది భయం తగ్గుతుంది. పని ఎంత ఎక్కువ చేస్తే, భయం అంతగా తగ్గుతుంది.

అజ్ఞానానికి స్నేహితుడు భయం. ఈ ఇద్దరూ సన్నిహిత మిత్రులు, మానవాళికి మహా శత్రువులు. అజ్ఞానం అనుమానాన్ని, భయాన్ని కుప్పలు తెప్పలుగా పుట్టిస్తుంది. తలబిరుసుతనాన్ని వదిలించుకునే దాకా అమాయకత్వాన్ని అధిగమించలేము.

**తీర్పు :**

అజ్ఞానం వల్ల భావోద్వేగం, దానితో పూర్వ నిశ్చితాభిప్రాయం(సరిగా వినకుండానే తీర్పు చెప్పడం) ఏర్పడుగుతుంది. తీర్పు చెప్పడం అంటే ప్రశ్నలు అడగడం. న్యాయమూర్తులు తీర్పు చెప్పబోయే ముందుగా, ఉద్దేశపూర్వకంగా, నిశితంగా, ఒక పద్ధతి ప్రకారం ప్రశ్నిస్తారు, వాస్తవాలను తెలుసుకుంటారు, జాగ్రత్తగా ఆలోచిస్తారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

పరిగణనే జవాబు. పూర్వనిశ్చితాభిప్రాయం(prejudice)అపోహతో కూడిన అభిప్రాయం వల్ల, ఎటువంటి ప్రశ్నలూ వేసుకోకుండానే, సాక్ష్యాధారాలను చూడకుండానే నిరాధారమైన, తప్పు అవగాహన కలుగుతుంది. అపోహ వల్ల ప్రశ్నలు వేయరు, అందువల్ల తార్కికంగా ఆలోచించలేరు, తీర్పు సరిగా చెప్పలేరు, నిర్ణయాలు సరిగా తీసుకోలేరు.

ప్రశ్నలు అడగడం హేతుబద్ధమైన ప్రక్రియ. న్యాయస్థానంలో వాది, ప్రతివాదులు ఇద్దరూ చెప్పినవి విని న్యాయమూర్తి తీర్పు చెప్పాలి. అలా కాకుండా పూర్వనిశ్చితాభిప్రాయంతో తీర్పు చెప్పగూడదు, ఒక అభిప్రాయానికి రాగూడదు. పూర్వ నిశ్చితాభిప్రాయం భావోద్వేగంతో నిండి ఉంటుంది. అది సహేతుకం కాదు, తర్కానికి నిలవలేదు, హేతుబద్ధం కాదు. భావేద్యోగాలతో కూడిన ఆలోచనలు వ్యక్తిగతమైనవి. వీటిని ఆయా వ్యక్తులు మాత్రమే అనుభూతి చెందగలరు. హేతుబద్ధ ఆలోచనలు అందుకు విరుద్ధంగా సత్యంపై ఆధారపడి ఉంటాయి. వాటిని కొలవవచ్చు, ఇతరులు పరీశిలించవచ్చు.

మూర్ఖులు ప్రశ్నించరు. తెలివితక్కువ వాళ్లు ప్రశ్నించలేరు. బానిసలు ప్రశ్నించడానికి సాహసించలేరు, అజ్ఞానికి సహనం ఉండదు. నమ్మకాలు రుజువు చేసి చూడగల ఆధారాలపై ఆధారపడి ఉండవు. నువ్వు ఆధారపడిన పునాదులను బట్టి నీ భవనం తయారవుతుంది.

**సృజనశీలత**

సృజన ప్రశ్నించే ప్రక్రియ. సృష్టించబడింది జవాబు. ప్రశ్నలు సృష్టిస్తాయి.

*ప్రశ్నలే జవాబులు – జవాబులే ప్రశ్నలు.*

ప్రశ్నలు నిన్ను బానిసత్వం నుంచి స్వేచ్ఛ వైపుకు తీసుకువెళతాయి.ప్రశ్న మాటల సూక్ష్మదర్శిని. ప్రవర్తనలో ఒకే మూసవిధానాన్ని పసిగట్టడం మానవులకున్న వరం. ఆ పనిని కంప్యూటర్లు కూడా చేయలేవు. నువ్వు చేసే ప్రతి పనిలో ప్రశ్న ఇమిడి ఉంటుంది. మెదడుకు గల శక్తి ద్వారా విశ్లేషణ, ప్రశ్నించడం, నేపధ్యంతో పోల్చి చూడటం వంటి చర్యల ద్వారా మూసపద్ధతిని పసిగట్ట గలుగుతాము. ప్రశ్నించే సామర్థ్యం వల్లనే మానవజాతి ముందుకు పోగలుగుతుంది, మనుగడ సాగించగలుగుతుంది. ప్రశ్నించడం చేతకాకపోతే మనుగడ లేదు. ప్రశ్నించడం జీవితాంతం ఉండే ప్రక్రియ. ప్రశ్నలు అడగకపోవడం నీకు నువ్వే ఆపాదించుకునే అజ్ఞానం. మనం విత్తనిదే ఏ పంటలను కోసుకోలేము. ప్రశ్న లేకపోతే నోబెల్ పురస్కారమే లేదు. అమాయకత్వం అంతరించడానికి ఆరంభం ప్రశ్న.

ఎక్కువగా నేర్చుకునేది మన విజయాల ద్వారా కాదు పొరపాట్ల ద్వారానే. పొరపాట్లను మళ్లీ గుర్తు చేసుకుంటుంటాం. ఎందుకు? ఏమిటి?ఎక్కడ? ఎప్పుడు? ఎలా జరిగిందని విశ్లేషించుకోవాలి. వ్యాపారవర్గాలు వీటిని (నేర్చుకున్న పాఠాలు) గుణపాఠాలు అంటారు. విజయంలో ప్రశ్నించడానికి ఏముంటుంది? విజయాల వల్ల లభించిన తీపి గుర్తులు, ఆనందాల కంటే వైఫల్యాల వల్ల కలిగిన చేదు జ్ఞాపకాలే ఎక్కువ కాలం గుర్తు ఉంటాయి.

‘‘సమాంతర సమస్యా పరిష్కారం.” ఈ పదం 1967లో వైద్యుడు, రచయిత, సలహాదారు, వైద్యంలో పిహెచ్.డి, డి.ఫిల్, డాక్టర్ ఆఫ్ డిజైన్ చేసిన ఎడ్వర్డ్ డి బోనో నిర్వచించాడు. (వికీపీడియా) ప్రశ్న సృష్టిస్తుంది, అది సృష్టించ బడుతుంది కూడా. ప్రశ్నించడం అంటే ఆలోచించడమే. అయితే దానికి ముసుగు ఉండదు. తెలుసుకునేది ఎక్కువయ్యే కొలది మనకు తెలియనిది ఎక్కువ అని తెలుస్తుంది.

ప్రశ్నలే గదా అని నిర్లక్ష్యం చేయగూడదు, పోలికను గమనించు. చెప్పిన దానిని తరచుగా మర్చిపోతాం. కాని ప్రశ్న రూపంలో అడిగితే దానిని పట్టించుకోకుండా ఉండలేము. మెదడు సహజంగా మాట్లాడేది ప్రశ్నల భాషే. ప్రశ్నను సూటిగా/

ముఖాముఖి అడిగినా, పరీక్షలలో పరోక్షంగా అడిగినా, ఆ ప్రశ్నను నీ మెదడును అడుగుతావు. ఆలోచిస్తావు బయటనుంచి వచ్చిన ప్రశ్న లోపలి ప్రశ్న అవుతుంది. ఆశ్చర్యం కలగవచ్చు.ఆశ్చర్యం కూడా ప్రశ్నించే ప్రక్రియలో భాగమే.

**ప్రశ్నలను పట్టించుకోకుండా వదలగూడదు**

అధిక సంరక్షణ చేయడం అల్పసంరక్షణతో సమానం. పిల్లలను అతిగా సంరక్షించటం, గారాబం చేయటం వాళ్లకు హానిచేయటమే.

అమ్మ చెపుతూనే ఉంటుంది. వేడిపాత్రలను పట్టుకోవద్దని, అయినా పిల్లలు ఏదో ఒకసారి పట్టుకొని చేతులు కాల్చుకుంటారు. అనుభవాల ద్వారానే చాలా పాఠాలు నేర్చుకుంటారు. **ప్రశ్న ఒక ఉపకరణం**, అది మానవ, సాంకేతిక ఉపకరణాలను అన్నిటినీ తయారు చేసేది. మహా ప్రశ్నకారులే మహామేధావులు.

నేటి విజ్ఞాన ఆధార ఆర్థిక విధానంలో పిల్లలు సరైన ప్రశ్నలు అడగడటం నేర్వకుండా జ్ఞానం పొందగలరా? ప్రశ్నించకుండా (ఆలోచించకుండా) తెలివైన వారు కాలేరు. సూర్యుని కింద కొత్తది అనేది లేదు.

క్రీ.పూ. 1500 సం,.లో సంస్కృత భాష ఆరంభం అయింది. ఇది ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినది. ఇంగ్లీషు, చాలా యూరోపియన్ భాషలు ఈ కుటుంబానికి చెందినవి.

**ఆత్మావలోకనం** అంటే ఆత్మను - తనను తాను ప్రశ్నించుకోవడం.

ప్రార్థనకు ప్రశ్న అనే అర్థం కూడా చెప్పుకోవచ్చు. ప్రార్థనే జవాబు.

తప్పు కంటే ఒప్పు - హింస కంటే అహింస, క్రూరత్వం కంటే కరుణ,

చెడు కంటే మంచి మేలయినవి. ఇలా నిర్ణయించుకో గలగడంలో అంతిమ విజయం ప్రశ్నదే. పట్టించుకోకుండా ఉండటం ప్రశ్న కాదు.

**ప్రశ్న- మార్పుకు ప్రతినిధి**

''మనిషి తన ఆలోచనలను బట్టే తయారవుతాడు'' ప్రఖ్యాత అహింసావాది, నోబెల్ శాంతి పురస్కారానికి ఐదుసార్లు ప్రతిపాదించబడిన గాంధీజీ. మేధో నిధులు అంటే ప్రశ్నల రాశులు; పరిశోధనా సంస్థలు, నిర్దిష్ట ప్రాంతంపై దృష్టి పెట్టేవి. పరిశోధన ప్రశ్నించే విధానం. కొన్ని విషయాలు కొన్నిసార్లు చాలా ఇబ్బంది పెడతాయి. ప్రశ్నలను పరిమితంచేసుకుంటే నేర్చుకోవడం గిడస

బారినట్లే. అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని పెంచుకున్నట్లే. ప్రస్తుత సమాజం తక్షణమే కోరికలను తీర్చుకోవాలని ఆశిస్తుంది.
పిల్లల మీద దీర్ఘకాలిక పెట్టు బడులు పెట్టడం మన ముందున్న సవాళ్లు.
**విత్తనాలు నాటటం-** ప్రశ్నించే అలవాటును పెంచి పోషించడం చిన్నతనం నుంచి ఆరంభించాలి. అదొక ఆనందం. అయితే ఆ అలవాటు చేయడానికి శ్రద్ధ, ఓర్పు, పట్టుదల కావాలి. ఒకసారి నాటి, పోషించిన పిమ్మట శ్రమ ఉండదు. మొక్క స్వయం పోషకం అవుతుంది. దానికదే సంస్కరించబడుతుంది, పుష్పిస్తుంది. పరపరాగ సంపర్కం జరుపుకుంటుంది. స్వంత విత్తనాలను సృష్టిస్తుంది. తరతరాలకు కాయలను అందిస్తుంది. భూగోళం మీద ప్రతి ప్రాణి మనుగడ సాగించడానికి విశ్వంలో గల అతి సాధారణ మూలకం హైడ్రోజన్. దానిలో ఒక ఎలక్ట్రానే ఉంటుంది. మిగతావి అన్నీ కలిసిన మొత్తం కంటే 83 శాతం అధిక పరిమాణంలో నిండి వుంది. పీరియాడిక్ పట్టికలో మొదటిది.
ప్రశ్న నుంచే మానవజీవితం, ఉత్పన్నం అవుతుంది. "అత్యంత ప్రాధమికమైన, శక్తివంతమైన అణుమూలకాలు, ప్రశ్నలు మానవుడు సృజించిన ప్రతి వస్తువునూ సృష్టించాయి." అన్నాడు మార్క్ ట్వైన్. పిడుగు దృష్టిని ఆకర్షించేలా ఉంటుంది. కాని దానిని కలుగజేసేది మెరుపు. అలాగే ఉత్పన్నమైన జవాబుకు కారణం ప్రశ్నయే. ప్రభావవంతమైన జవాబులు ప్రభావవంతమైన ప్రశ్నల (ఆలోచనల) వల్లనే వస్తాయి.
**భావోద్వేగాలు-** భావోద్వేగాలతో నడపబడే అమాయకులు మాత్రమే ప్రశ్నించరు.
ఆవిష్కరణలో అతిచిన్న విడిభాగం ప్రశ్న, అతి పెద్ద విడిభాగం కూడా అదే. అవగాహన గురించిన అవగాహన, ఆలోచన గురించిన ఆలోచన,
ప్రశ్నను గురించి ప్రశ్న. స్వీయ అధ్యయన ప్రక్రియ స్వీయఆలోచనా ప్రక్రియలను గురించి అప్రమత్తత.
ఒక విషయం ఆలోచించండి. కంప్యూటర్లు రాకపూర్వం సమాచారం కోసం గ్రంథాలయాలకు వెళ్లాలి. ఇప్పుడు అంతర్జాలమే ప్రపంచంలో అతి పెద్ద గ్రంథాలయం. తాజా ఫోనుతో అది అరచేతిలో ఇముడుతుంది. దీంతో ప్రస్తుతం సమాచారం లేకపోవడం సమస్య కాదు. సమాచారం ఎక్కువై దేనిని స్వీకరించాలో

తెలియకపోవడం సమస్య. మనకు దొరుకుతున్నది అరకొర విజ్ఞానం. కనుక అజ్ఞాన మేఘాల్లో తేలిపోతున్నాం. ప్రపంచ గ్రంథాలయం నుంచి సరిగా రూపొందించిన ప్రశ్నలను అడగగల సామర్థ్యమే అసలు సమస్య.

అపుడే మనం విశ్వవ్యాప్త గ్రంథాలయం నుంచి వచ్చే తప్పు / ఒప్పు సమాచారం మధ్య తేడా తెలుసుకోగలుగుతాం.

మేధస్సుకు శైలిని, సౌందర్యాన్ని, క్లిష్టతను జోడించేది ప్రశ్న. మనం అడిగే ప్రశ్నలు మన గమ్యాన్ని నిర్ణయిస్తాయి. సృజనాత్మకంగా ఆలోచించడం అంటే సృజనాత్మకంగా ప్రశ్నించడమే. ఇంతకు ముందెన్నటి కంటే కూడా ప్రశ్నలు అడగవలసిన సమయం ఇదే, ఇప్పుడే. మనిషి మెదడు ప్రశ్నించే యంత్రం. దానిని గూగుల్ సృష్టించగలిగింది. అది సమాచారాన్ని తీసుకుంటుంది, విశ్లేషిస్తుంది. క్రమంలో పేర్చుతుంది, పోల్చిచూస్తుంది. అన్వయిస్తుంది, ప్రశ్నిస్తుంది, జవాబులను కనుగొంటుంది. సమాచారం విస్తారంగా లభిస్తున్న నేటి ప్రపంచంలో ప్రశ్న యొక్క అవసరం ఇంతకు ముందెన్నడూ లేనంతగా పెరుగుతుంది.

''ఏడాది ప్రణాళిక రచించాలనుకుంటే వార్షికపంట వేయి, పదేళ్ల ప్రణాళిక కావాలంటే మొక్కలను నాటు, జీవితప్రణాళిక కోసమైతే జనాభాకు శిక్షణ ఇవ్వు, వారిని విద్యావంతులను చెయ్యి.'' చైనా సామెత

ప్రపంచంలో **మహా అన్వేషకులు** చాలామంది ఉన్నారు. క్రిష్టోఫర్ కొలంబస్, ఫెర్డినాండ్ మాగెల్లాన్, వాస్కోడ గామా వంటి వారు. వీరంతా అన్ని రంగాలలో వాళ్ల బాటలో ప్రతి అడుగునూ ప్రశ్నలతోనే నింపారు.

**ప్రశ్నలకు జవాబులే పదాలు** -2009 సం.జూన్ 10వ తేది ఉదయం 10.22 లకు గ్రీన్ విచ్ మధ్య సమయాన ఆంగ్లభాషలో మూలపదాలు 10 లక్షల దాటాయి.

వీటిలో అన్నీ కాకపోయినా చాలా మాటలు ప్రశ్నలకు జవాబులుగా వచ్చినవే. ఏసుక్రీస్తు, బుద్ధుడు, మార్టిన్ లూథర్ కింగ్, అమెరికా సంయుక్తరాష్ట్రాల పితామహులు, బానిసత్వ నిర్మూలన, స్త్రీల హక్కుల పరిరక్షణ ఉద్యమనాయకులు, పౌరహక్కులకై పోరాడిన వారు - అందరూ ప్రశ్నించడం ద్వారా విజయాలు

సాధించారు.

“జనం ఆలోచించడానికి సిద్ధంగా ఉంటే
ప్రపంచసమస్యలన్నిటినీ పరిష్కరించటం సాధ్యమే.''
అయితే ఇబ్బంది ఏమిటంటే ప్రజలు ఆలోచించకుండా ఉండటానికి గల అన్ని మార్గాలను వెదుకుతారు.” - నికొలస్ మురే బట్లర్,1931 నోబెల్ పురస్కార గ్రహీత.(1862 –1947)

విద్యావ్యవస్థ మన పిల్లలమీద/మనమీద అనంతమైన ప్రభావం చూపగలిగిన ప్రశ్నలను ఎందుకు వేయలేక పోతుంది? బహుశా అందుకు రెండు కారణాలు ఉండవచ్చు. అదేదో కుట్ర కావచ్చు, వాళ్లు మనకు చెప్పడం లేదు. లేదా వాళ్లకే తెలియకపోవచ్చు. నేను వాళ్లకు తెలియదనుకుంటాను. ముఖ్యవిషయం ఇప్పుడు మనకు తెలుసు. దీని సామర్ధ్యం ఏమిటో తెలుసు. కుటుంబాలు విద్యావ్యవస్థ కంటే ముందుంటున్నాయి. పిల్లల మానసిక ఎదుగుదల, మేధోవృద్ధిని చూసుకోవడంలో అవి శ్రద్ధ చూపుతున్నాయి. ప్రశ్నలను అడగడం ఆచరణలో పెట్టిననాడే అది వీలవుతుంది.ప్రశ్నించడం చేతనైతే చాలా ఆధిపత్యం లభిస్తుంది.

“నీ గమ్యాన్ని నువ్వు అదుపుచేసుకో, లేనిచో మరెవరో దాన్ని నియంత్రిస్తారు.” జాక్ వెల్ష్, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ చైర్మన్

సరిగా ఉపయోగించుకోగలిగితే ప్రశ్నించడం తల్లిదండ్రులకు మంచి ప్రయోజన కరం. ప్రశ్న వల్ల లభించే అద్భుత లాభాలు తెలియని ప్రజానీకం, ముఖ్యంగా తల్లిదండ్రులు, వాళ్ల పిల్లలను సమర్ధవంతంగా పెంచలేరు వాళ్ల పిల్లలు విద్యా వంతులు కాలేరు. పిల్లలు తమ సంపూర్ణ జీవితాలను నిర్వహించుకోలేరు. అంతేకాదు, ఈ జ్ఞానం లేని వాళ్లు విద్యావ్యవస్థకే కీలకమైన ప్రశ్నించే విధానాన్ని అందించలేరు.

విద్యావ్యవస్థలో వినియోగదారులు విద్యార్థులు కారు, తల్లిదండ్రులు. పిల్లలు చెట్ల నుంచి వచ్చిన పిలకలు. అంతే కాని పాఠశాలల్లో మొలచిన మొక్కలు కారు. చట్టరీత్యా పిల్లల సమగ్ర సంరక్షణకు, వారి సంక్షేమానికి బాధ్యత పెద్దలదే కాని బడిది కాదు. ఓటు హక్కుగల పెద్దలకు పాఠశాలలు జవాబుదారీగా ఉంటాయి. విద్యార్థులకు ఆ అధికారం లేదు. వినియోగదారుడు అంటే చెల్లించేవాడు. ఇక్కడ ఫీజులు చెల్లించేది విద్యార్థి కాదు, అతని పెద్దలు- తలిదండ్రులు, తాత ముత్తాతలు

పన్నులు చెల్లిస్తారు. కొందరు తలిదండ్రులు బృందంగా ఏర్పడి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తమ పిల్లలకు విద్యాబుద్ధులు తామే చెప్పుకుంటున్నారు, చట్టబద్ధంగా మధ్యవర్తులు లేకుండా చేశారు.

"ప్రభుత్వం పిల్లల భావోద్వేగపరమైన అవసరాలను తీర్చలేదు. అంతేకాదు, వారి ఆధ్యాత్మిక, నైతిక అవసరాలను కూడా తీర్చలేదు. అది తల్లీ కాదు, తండ్రీ కాదు. ప్రభుత్వం ఎప్పుడూ ఏ బిడ్డనీ పెంచలేదు, ముున్ముందు పెంచబోదు. కనుక దానికేమి తెలుస్తుంది?" అన్నాడు(1985-1988లో) అమెరికా విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేసిన విలియం బెనెట్.

ఆరోగ్యం, విద్య, సంక్షేమం వంటి *అన్ని శాఖలకూ మూలశాఖ కుటుంబమే.* పిల్లల్లో జిజ్ఞాసని అణచే వాళ్లు పిల్లల భవిష్యత్తునే కాక, సమాజ భవిష్యత్తును కూడా అణచి వేస్తున్నట్లే. పిల్లల్లో సహజంగా, పుట్టుకతోనే ఉండే జిజ్ఞాసని తగ్గకుండా చూస్తే వాళ్లు జీవితాంతం చురుకుగా నేర్చుకుంటూనే ఉంటారు.

గాజు పట్టకంలో పోసిన రంగురంగుల గాజుముక్కలు క్షణక్షణం రకరకాలుగా కనిపిస్తుంటాయి. అలాగే మన అవగాహన కూడా సదా మారుతూనే ఉంటుంది.

ఆలోచన, భాషల మధ్య సంబంధాన్ని 2300 సంవత్సరాల క్రితం ప్లేటో గుర్తించాడు. తర్వాత కాలంలో అది మళ్లీ మళ్లీ ఆమోదించబడింది. ఆలోచించడం, ప్రసంగించడం రెండూ వేర్వేరు కావు, అవి రెండూ ఒకటే. ఆలోచించడం అంటే మాటా, పలుకు లేకుండా మనసులో జరిగే అంతర్గత సంభాషణ. ''మనసు ఆలోచిస్తున్నది అంటే అది తనలో తాను మాట్లాడు కుంటున్నట్లు''. ప్రాచీన గ్రీకు తత్వవేత్త,సోక్రటీస్ శిష్యుడు ప్లేటో(428-348 BC)

**సంభాషణల్లో ప్రశ్నలు , జవాబులు మాత్రమే ఉంటాయి.** "శాస్త్రాన్ని, భాషను వేరుచేయడం అసాధ్యం. ఒక భావనకు పేరు పెట్టాలంటే ఒక మాట కావాలి." 18 వ శతాబ్దపు (1743–1794) రసాయనిక విప్లవ ప్రముఖుడు, ఫ్రెంచ్ నోబెల్ మాన్, రసాయనవేత్త, ఆంటోయిన్ లావోయిజర్. భావనే మాట, ప్రశ్నించడమే ఆలోచించడం. ''భాష మనం ఆలోచించే విధానానికి రూపకల్పన చేస్తుంది. దాని గురించి ఏమి ఆలోచించడానికి అవకాశం ఉందో నిర్ణయిస్తుంది''. అమెరికన్ భాషాశాస్త్రవేత్త బెంజమిన్ లీ ఓర్ఫ్. (1897–1941) ఆలోచన,

గ్రహణశక్తులకు భాషతోగల సంబంధాన్ని గురించి ఈయన ప్రతిపాదించిన సిద్ధాంతం చాలా ప్రసిద్ధమైనది. ప్రశ్నించడం మన ఆలోచనా తీరుకు, ఆలోచనా పరిధికి రూపం ఇస్తుంది.

మన ఆలోచనలను ఇతరులకు చెప్పడానికి మాట్లాడతాం. నీకు నువ్వు, మనకు మనం, అంటే ఎవరికి వారు మాట్లాడుకోవడం ఆలోచనలో భాగమే'' అన్నారు. ఆలివర్ శాక్స్(1933 –2015) బ్రిటన్ రచయిత, నాడుల శాస్త్రవేత్త.

మనలో మనం గాని, ఇతరులతో మనం గాని మాట్లాడుకునేటప్పుడు ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉంటాయి. ప్రసంగం ఆలోచనలో భాగమే. తనలో తాను మాట్లాడుకోవడం ఆశ్చర్యం కలిగించేది కాదు. చిన్న పిల్లలు తమలో తాము మాట్లాడుకోవడం మనందరం వింటాం. అది అంతటితో ఆగదు. పెరిగి పెద్దల మైన తరువాత కూడా ఇంకా ఎక్కువగా మనం లోపలి వైపుకు దృష్టిని కేంద్రీకరిస్తాం. అప్పుడప్పుడు గమనిస్తాం మనలో మనం మాట్లాడుకోవడం. అదంతా మనం కావాలని చేసేది కాదు, వ్యక్తికి తెలియకుండానే జరుగుతుంది. "మనుషులను, మానవులుగా మార్చేది ప్రశ్నలు అడిగే సామర్థ్యమే. ఇది మనకు మనం మాట్లాడుకునే క్లిష్టమైన భాష ద్వారా లభిస్తుంది." జేన్ గుడాల్

**భాష – ఆలోచనల మధ్య సంబంధం**

భాష, ఆలోచనల మధ్యగల సంబంధం ఆలోచనలను రేకెత్తిస్తుంది. మాటలు ఆలోచనకు పరికరాలు. మాటల విస్తృతి పెరుగుతుంటే ఆలోచనల విస్తృతి, లోతు, ప్రశ్నించే నైపుణ్యం, విశ్లేషణ కూడా పెరుగుతుంటాయి. ఉదాహరణకు విదేశంలో మాట్లాడే ఒక భాష మనకు అర్థం కాలేదనుకొండి, మన మెదడు దాని గురించి ఆలోచించలేదు, దానిని అర్థం చేసుకోలేదు, 'ఎలా స్పందించాలో అర్థం కావడం లేదు'. "ఏమి ఆలోచించాలో తోచడం లేదు" అనేది మనసులోకి వస్తుంది. మరో ఉదాహరణ. అశ్లీలమైన, అసభ్య, మొరటుమాటలు నేర్చి వాటినే మాట్లాడటం అలవాటు చేసుకుంటే మన ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి.

చాలా దశాబ్దాలనుండి చేసిన పరిశోధనల్లో స్పష్టంగా తెలిసిన విషయం–మనం బాల్యంలో చేసిన అధ్యయనం ప్రకారం యౌవనంలో ఉంటాం. తల్లిదండ్రులు పిల్లలకు కథలు చదివి వినిపించడంతో అది మొదలవుతుంది.

అంతే కాదు, ఇంటివద్ద ఎంత క్లిష్టమైన భాషను, ఎన్ని ఎక్కువ పదాలతో కూడిన దానిని మాట్లాడితే, ఎంత సానుకూల వాతావరణంలో పెరిగితే, పెద్ద అయిన తర్వాత అంత బాగా రాణిస్తారు.

**అధ్యయనం**: ''ప్రారంభ ప్రళయం; మూడేళ్ల వయసు నాటికే 3 కోట్ల మాటలు" కన్సాస్ విశ్వవిద్యాలయంలో పరిశోధకుడు బెట్టీ హార్ట్, టాడ్ ఆర్. రిస్లే లు కలసి 2003లో ఒక అధ్యయనం చేశారు. ప్రతినెలకు ఒకసారి గంటసేపు ప్రతి కుటుంబంలో బిడ్డను ఏడునెలల వయసు నుండి మూడేళ్లు నిండే వరకు పరిశీలించారు.

"ప్రభుత్వసంక్షేమ పధకాల ద్వారా లబ్ధి పొందే కుటుంబాల పిల్లలు గంటకు సుమారు 616 మాటలు విన్నారు. శ్రమజీవుల కుటుంబాలలో పిల్లలు 1257 మాటలను విన్నారు. వృత్తిపరమైన కుటుంబాలలో పిల్లలు గంటకు సగటున సుమారు 2153 మాటలు విన్నారు. ఇది మనం శ్రద్ధగా గమనించవలసిన విషయం. మాటలు నిర్మాణాలకు పనికివచ్చే రాళ్లు. అవి ప్రశ్నలు, ఆలోచనలకు ఆకారం ఇస్తాయి. మాటలు ప్రపంచాలను నిర్మిస్తాయి.

''**నీ భాషా హద్దులే నీ ప్రపంచ హద్దులు**''.అన్నారు, ఆస్ట్రేలియాతత్వవేత్త. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు. (1889 – 1951)లడ్ విగ్ విట్ జన్ స్టెయిన్. నేను **అణువును నమూనాగా** తీసుకొని చెపుతాను. ప్రశ్న ఆలోచనలో చిన్న కణం వంటిది. ఈ కణం చుట్టూ ఉన్నవి మాటలు, అక్షరాలు అనే భాగాలు. మాటలు రాయడం నేర్చుకోవాలంటే ముందుగా అక్షరాలు నేర్చుకోవాలి కదా? ఇంగ్లిష్‌కు 26 అక్షరాలు ఉన్నాయి. వాటిలో చిన్నవి, పెద్దవి, మిగతా సంకేతాలు నేర్చు కోవాలి. ఆంగ్లంలో పదిలక్షలమాటలకు పైగా ఉన్నప్పటికీ అన్నీ ఈ 26 అక్షరాలతో ఏర్పడినవే. ఈ పదిలక్షల మాటలతో లెక్కించలేనన్ని ప్రశ్నలను రాయగలుగుతాం. సరైన ప్రశ్న రాయాలంటే సరైన మాటలు కావాలి."సత్యం స్వభావరీత్యా దానికదే వ్యక్తమవుతుంది, కాని చుట్టూఉన్న అజ్ఞానపు సాలెగూళ్లు, బూజుతొలగిస్తేనే అది స్పష్టంగా ప్రకాశిస్తుంది''గాంధీజీ (1869-1948).

• జవాబు లేని ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న లేకుండా జవాబు పుట్టలేదు.

- ఎక్కువ జవాబులు కావాలనుకుంటే అడగటానికి ఎక్కువ ప్రశ్నలు కావాలి.
- ప్రశ్నల్లో నాణ్యత పెరిగే కొలది అందే జవాబుల్లో నాణ్యత పెరుగుతుంటుంది.
- ప్రశ్నల్లో నాణ్యత పెంచడం సాధనతో సాధ్యం. సాధన లేనిదే ప్రగతి లేదు.

**ప్రశ్నించడం అలవాటు చేయడానికి మంచి సమయం.**

మెదడు అనుభవం ద్వారా మార్పు చెందుతుంటుంది. బాల్యంలో మెదడు చాలా మృదువుగా, మారడానికి అనువుగా ఉంటుంది. అందుకే బాల్యంలో కొన్నేళ్లను వ్యక్తిత్వం ఏర్పడే సంవత్సరాలు అంటారు. ఇవి పుట్టుక నుంచి ఐదేళ్లవరకు ఉంటాయి. ఈ వయసులో బిడ్డకు తెలివితేటలు, వ్యక్తిత్వం, సామాజిక నైపుణ్యాలు ఏర్పడతాయి. అందుకే ఇప్పుడు కే.జి. కంటే ముందే చెప్పవలసిన విషయాలకు, నేర్పవలసిన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. (దానినే భారతదేశంలో అంగన్ వాడి బోధన / శిక్షణ అంటారు)

**గమనిక**: అన్నిరకాల వాదనలు విని ఒక నిర్ణయానికి రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. నిర్ణయాత్మక స్థాయికి చేరడానికి మెదడులో ఉపయోగ పడే భాగం మెదడు ముందున్న కార్టెక్స్. అది నొసలు వెనక ఉంటుంది. మెదడు లోని అన్ని భాగాల కంటే చివరిగా అభివృద్ధి చెందే భాగం. అది సుమారు 25 ఏళ్ల దాకా పరిణతి చెందుతూనే ఉంటుంది.

25 ఏళ్ల దాకా నిర్ణయం తీసుకునే శక్తి పూర్తిగా రాదు గనుక బీమా (ఇన్సూరెన్స్) పథకాలలో ఈ వయసు వారికి అదనపు ప్రీమియం చెల్లించాలి. అలా అధిక ప్రీమియం వసూలు చేయడం గణాంకవివరాల ఆధారంగానే జరుగుతుంది. ఆ వయసు వారిలోనే ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికం కాబట్టి అలా ఎక్కువ వసూలు చేస్తారు.

వయసును బట్టి ఎదుగుదలని(అభివృద్ధి) నిర్ణయశక్తిని కొలవవచ్చు. నాడుల శాస్త్రజ్ఞులు నొసలు వెనకఉండే కార్టెక్స్ పాత్రను తెలుసుకోవడం మొదలై 20-30 ఏళ్లే అయింది. మెదడులోని ఈ భాగమే భావోద్వేగాలను నియంత్రిస్తుంది. “మేధస్సు పుట్టుకతో వస్తుంది, ఆలోచించడం (ప్రశ్నించడం) మాత్రం నేర్చు కుంటేనే వస్తుంది.” ఎడ్వర్డ్ డి బోనో - వైద్యుడు, రచయిత, ఆవిష్కర్త, సలహాదారు,

''lateral thinking'' పదాన్ని మొదట వాడిన వ్యక్తి. వ్యక్తికి పుట్టుకతోనే శారీరక బలం ఉండవచ్చు. కాని ఆ బలాన్ని ఉపయోగించగల నేర్పరితనం, నాట్యంలో, క్రీడల్లో ఉపయోగించగల్గడం వంటివి నేర్చుకుంటేనే వస్తాయి.
బాగా ప్రశ్నించగలగడం కూడా నేర్చుకోవడం వల్లనే అభివృద్ధి అవుతుంది. డబ్బు విస్తారంగా సంపాదించి నప్పటికీ సద్వినియోగపరచలేని వాడు పేదవాడుగానే ఉంటాడు. బాగా ప్రశ్నించడం చేతకాకపోయినా అంతే. ''మేధావులు జన్మిస్తారు, కాని వాళ్లు కూడా నేర్చుకోవలసిందే.'' అన్నారు రిచర్డ్ స్కీమాన్, కార్యక్రమ రూపకర్త, అంతర్జాతీయవక్త.

ప్రశ్నించే నైపుణ్యం అంటే పరిష్కారాలను త్వరగా సమర్ధవంతంగా కనుక్కో గలగడం. సాధన వల్ల ప్రశ్నించే శక్తి మెరుగుపడుతుంది. కొందరిలో అన్వేషణా సక్తులు ఎక్కువగా ఉంటాయి. అంటే వాళ్లు బాగా ప్రశ్నించే వాళ్ళు. అమాయకత్వాన్ని చిన్నచూపు చూడగూడదు. అమాయకత్వమే లేకపోతే ఇంక నేర్చుకునేది ఏముంటుంది?

**నేర్చుకోవడానికి అత్యంత అనుకూల పరిస్థితి** . మనిషికి అప్పుడప్పుడు మెరుపులా ఆలోచనలు తడతాయి. కావాలని ప్రయత్నించి నప్పుడు కాక స్నానం చేసేటప్పుడో వ్యాయామం / దూరప్రయాణాలు / తోటపనిలో / అంట్లు తోము తున్నపుడు / ఒంటరిగా ఉన్నపుడు తడతాయి. వ్యక్తిగతంగా తటస్తపడిన పెద్ద సమస్యలకు గూడా ఒంటరిగా ఉన్నపుడే పరిష్కారాలు తడతాయి. మనిషి జీవితంలో దాదాపు మూడో వంతు నిద్రకే సరిపోతుంది. నిద్రలో మెదడు క్రమపద్దతిలో మార్పులు చెందుతుంది. నాడీసంధులు కొత్తవి ఏర్పడతాయి, పాతవి పటిష్టమౌతాయి.

ప్రపంచ ప్రఖ్యాత ఆవిష్కరణకర్త ధామస్ ఆల్వా ఎడిసన్: ''ఒంటరిగా ఉన్నపుడు ఆలోచనలు అద్భుతంగా,గుంపులో ఉన్నపుడు అధ్వాన్నంగా ఉంటాయి'' అన్నాడు. ఏకాంతంలో మనకు తోడు ఎవరూ ఉండరు. నువ్వు ఎవరిని గురించి ఊహించుకుంటే వాళ్ళు మాత్రమే నీ ఊహాలలోకి రాగలరు. నువ్వు ఎవరినీ అనుమతించకపోతే ఒంటరి సమయం అంతా నీ ఒక్కడిదే. దాన్ని నీ స్వంతానికి ఉపయోగించుకోవచ్చు.

"నిశ్శబ్దం నిండి ఉన్నపుడు ఆత్మ స్పష్టమైన వెలుతురులో చక్కని దారిని చూడ గలుగుతుంది. అంతవరకూ స్పష్టంగా కనిపించనిది, దాగుడుమూతలు ఆడినది సుస్పష్టంగా చుట్టూ తిరుగుతూ కనపడుతుంది."గాంధీజీ. (1869-1948) "నిశ్శబ్దం బంగారంతో సమానమైనది."వంటి సూక్తులు గ్రంథాలయాల్లో పెడతారు. సమాజంతో కలసి జీవించడం, ఏకాంతంగా జీవించడం మధ్య సమన్వయం సాధించడమే ఉత్తమ సమన్వయం. ఏకాంతానికి విలువనిచ్చే వాళ్లు, విలువనివ్వని వాళ్లకంటే ఎక్కువ సృజనాత్మకంగా ఉంటారు.

ఏకాంతం సృజనాత్మక పట్టుగూడు. అది అందమైన అవగాహన అనే అందాల సీతాకోక చిలుకను తయారు చేస్తుంది. ఏకాంతం - ఆత్మ ఆలోచనా సరోవర తీరాన చేసే మౌనధ్యానం. వేల సంవత్సరాల నుంచి ధ్యానసాధన చేస్తున్నారు. అది చాలా విలువైనది. ఎందుకంటే విలువైనది కాకపోతే ఇన్నాళ్లు కొనసాగేది కాదు. అమెరికాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయిలలో కూడా ఇది ఇప్పుడు వ్యాప్తి చెందుతుంది. మేధావులందరికీ ఏకాంతపు విలువ తెలుసు, కొందరికి ఒంటరితనం గురించి మాత్రమే తెలుసు.

* ''నిశ్శబ్దపు గదిలో ప్రశాంతంగా కూర్చోలేకపోవడమే మనిషి సమస్యలకు ప్రధాన కారణం - బ్లెయిసీ పాసల్

* ''గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా, మౌనంగా ఉంటే మెదడు సృజనాత్మకం అవుతుంది'' ఐన్‌స్టీన్

* ''ప్రశాంతత, ఏకాంతం లేకుండా ఏ ముఖ్యమైన పనీ చేయలేము." పికాసో

* "సమాజంలోని వారికి బోధించవచ్చు. కాని ఏకాంతంలోనే ప్రేరణ ఇవ్వగలం'' షాన్ గోయత్

* "ఒంటరి ప్రయాణం చేస్తేనే పలుప్రయోజనాలు పొందొచ్చు."థామస్ జెఫర్సన్

* "అంతా నిన్ను వదలి వెళితే కలిగేది ఒంటరితనం. అందరినీ వదలి నువ్వు వెళితే ఏర్పడేది ఏకాంతం'' ఆల్ ఫ్రెడ్ పోల్గార్

ఒంటరితనం ఎడారి, అందులో ఏకాంతం ఒయాసిస్సు.
జీవితానికి అవసరమైన మాధుర్యాన్ని అందించేది ప్రశ్న.
ఆలోచన గురించి శ్రద్ధగా ఆలోచించడానికి ప్రయత్నించం.
మనకు అన్నీ, అంతా ఇచ్చేది ఆలోచన, కాని దాని విలువ గుర్తించలేకపోతున్నాం. నేను కూడా దానిమీద జారిపడేవరకు అలాగే అనుకున్నాను, దాని విలువ నాకు తెలియలేదు. అలా జరగడానికి నాకు 66 సంవత్సరాలు పట్టింది.
"ప్రశ్నలు మానవవిజ్ఞానానికి అలంకరణను సృష్టించి ఇచ్చాయి. సృష్టికి అంతం లేదు, అది నిరంతరం మెరుగు పడుతూనే ఉంటుంది." మాయా యాంజెలో
''ఏదైనా ఒక విషయాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగిన వ్యక్తి ఎన్ని విషయాలైనా అర్థం చేసుకోగలడు'' విన్సెంట్ వాన్ గోగ్
''ప్రశ్నించడం" ఎలాగో తెలిసి దాని మీద పట్టుసాధించిన వ్యక్తి చాలా అంశాలపై పట్టు సాధించగలడు." టెడ్ అగాన్
''సాధారణ పనుల్ని అసాధారణంగా చేయడం నేర్చుకో.''జార్జి వాషింగ్టన్ కార్వర్

ఒకనికి ఒక చేప ఇస్తే ఆ రోజుకు ఆహారం ఇచ్చినట్లు.

అతనికి చేపలుపట్టడం నేర్పితే జీవితాంతమూ పోషించినట్లే. చైనా సామెత పిల్లవాడి ప్రశ్నకు జవాబు చెప్పండి. ఆ రోజుకు తృప్తి పడతాడు. ప్రశ్నలు అడగటం అతనికి నేర్పండి. ప్రోత్సహించండి. జీవితాంతం లాభపడతాడు.
ప్రశ్న అడగటం మాటలను జిజ్ఞాసతో కూర్చడం.
జ్ఞానాన్ని అందించటం పరిష్కారం కాదు. జ్ఞానాన్ని ఎలా సంపాదించాలో నేర్పడం ఆశయం కావాలి. ప్రశ్నలు ఆ పనిచేస్తాయి.

పుస్తకంలో ప్రతి పేజీ తిప్పినప్పుడు ప్రశ్న వేసుకుంటాం.

ఈ పేజీలో ఏముంది అని స్పృహతో ఆలోచిస్తాం.

''తెలుసుకొన్న దానిని ఆచరించకపోతే అది జ్ఞానమే కాదు, అజ్ఞానమే.''
స్టీఫెన్ ఆర్.కోవే (1931-2012)
"తెలుసుకోకపోవడం తప్పిదం, తెలుసుకోవాలనుకోకపోవడం మహాతప్పిదం''. ఆఫ్రికన్ సామెత.

“పరిపూర్ణ జీవితం ఎందుకు? అనవసరం. ఎదురు చూడటానికి ఏముంది అందులో? అని ఎదురు ప్రశ్నలు సంధిస్తారు సోమరులు.

జరగబోయే వన్నీ ముందే తెలుసు. నిద్రనుంచి లేచి మంచం దిగటమే దండగ. అపరిపూర్ణ జీవితమే పరిపూర్ణం” అంటారు పనిదొంగలు, బద్ధకస్తులు.

**ఐన్‌స్టీన్ పరిశీలన:** ఒక నిర్ణీత వయసు దాటాక చదవటం వల్ల సృజనాత్మకత నుంచి దృష్టి బాగా మరలుతుంది. ఎక్కువగా చదివి మెదడును తక్కువ ఉపయోగించుకుంటారు. సోమరిపోతులుగా మారి ఆలోచనలతో సరిపుచ్చు కుంటారు.

అలాగే కొత్త ఫోనులను ఎక్కువ వాడి మనసును తక్కువ వాడే వారు మతిలేని వారవుతారు. కొత్త తరం ఫోను విలువైన పరికరం అని నాకు తెలుసు *, కొన్ని పనులు దానితో అద్భుతంగా చేయవచ్చు. అలాకాక ఫోనును వినోదవస్తువుగా చేసి దానికి బానిసలు కాకూడదు. కొత్త ఫోనులు కొత్త తరాన్ని మూగవారిగా చేస్తున్నాయి. వాటి వాడకం ఒక వ్యసనంగా తయారవుతుంది. మెదడుకు గల ఆలోచన శక్తిని తగ్గిస్తున్నాయి, మానసిక ఆరోగ్యం దిగజారుతుంది. శరీరానికి వ్యాయామం లేకపోతే శారీరక ఆరోగ్యం తగ్గినట్లుగా మొబైల్ ఫోన్లు మానసిక అనారోగ్యానికి దారితీస్తాయి.

‘‘సత్యం వివాదాస్పదం కాదు. దానిపైన నిందలు దాడిచేయవచ్చు. అజ్ఞానం అవమానపరచవచ్చు. కాని చివరకు అది చెక్కు చెదరకుండా మిగిలి ఉంటుంది.’’ విన్‌స్టన్ చర్చిల్.

ప్రతి దేశంలో వారం రోజులపాటు ‘‘**జాతీయ ప్రశ్న వారోత్సవాలు**’’ జరపాలి. ప్రశ్న ప్రాధాన్యతను ప్రచారం చేయాలి.

‘‘సమిష్టిగా ప్రశ్నలు వేసే కుటుంబం సమిష్టిగానే ఉంటుంది.’’ మరియా మాంటిసొరి (1870-1952) ఇటలీ వైద్యురాలు, విద్యావేత్త.

ఆమె ప్రవేశపెట్టిన మాంటిసొరి విద్యావిధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో అమలు చేస్తున్నారు. 1. దీని ప్రకారం పిల్లల్లో పరిశీలనాశక్తిని పెంచటం ద్వారా ప్రశ్నించే విధానాన్ని మెదడుకు నేర్పవచ్చు.

2. ఇంద్రియాలకు విద్య నేర్పడం. ప్రశ్నల ద్వారా విశ్లేషణ. డా. మాంటిసోరి చెప్పినట్లుగా ‘ఆలోచించండి’ అని చెప్పినంత మాత్రాన ఆలోచనాపరులు

తయారుకారు. వాళ్లు ఆలోచించడానికి ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. నిరంతరంగా ప్రశ్నించడం వల్ల మార్పు నిరంతరంగా జరుగుతుంటుంది.

* *(మూల రచయిత టెడ్ అగాన్ చెప్పేది ఒకటి, చేసేది మరొకటి కాకుండా పాతకాలపు ఫోనునే వాడటం చూసి అశ్చర్యం కలిగింది. పి.యస్.రావ్)*

**ప్రశ్నలు ప్రగతికి మార్గాలు**

సమస్యలకు పరిష్కారాలు ప్రశ్నల ద్వారానే లభిస్తాయి. వైద్యం, విద్య, ఆర్థిక భద్రత, సాంఘిక స్థిరత్వం, జాతీయ రక్షణ, పౌరహక్కులు వంటి రంగాలలో సాధించినవి అన్నీ ప్రశ్నల వల్లనే సాధ్యం అయాయి. ప్రశ్న ఉదయించి, మెరుపు రవ్వగా మారి, ఒక దేశాన్ని సృష్టించింది.

మనకు, మన పిల్లలకు ప్రశ్నమీద పట్టు బిగిసే కొలది స్వేచ్ఛ, స్వాతంత్రం ప్రకటించే దిశగా ముందుకు సాగగల్గుతాం. హక్కుల్ని పరిరక్షించుకొని హాయిగా జీవితాలను గడుపుతాం. అమెరికా రాజ్యాంగపు మొదటి సవరణ ప్రశ్నించే హక్కును పరిరక్షించడమే. ప్రశ్నించడానికి స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు.

మూలాలు ఎంతబలంగా ఉంటే వాటి ఆధారంగా నిర్మించబడిన భవనాలు అంత పటిష్టంగా ఉంటాయి.

**పత్రికలు**: ప్రభుత్వ నియంత్రణలకు గురికాకుండా నడిచే సంస్థలు, వ్యవస్థలు, రాజకీయాలు, సిద్ధాంతాల పరంగా ఆంక్షలు లేనివి. అవి ప్రజల తరపున ప్రశ్నలు అడుగుతాయి. సంపాదకులు వృత్తిరీత్యా ప్రశ్నలు అడిగే నిపుణులు.

**ద్వేషం**-ప్రశ్న శక్తివంతమైనది. నియంతలు, అణచివేతదారులు, ఉగ్రవాదులు, మతశాఖల పెద్దలు ప్రశ్నలంటే వణికిపోతారు.తమనెవరూ ప్రశ్నించ గూడదు.

**మరో ఉదాహరణ**:

ఐయస్ ఐయస్(ISIS. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) తో సంబంధం కలిగిన ఫండమెంటలిస్ట్ ఉగ్రవాద సంఘం పేరు 'బోకో హరామ్' అంటే దాని అర్థం పాశ్చాత్య విద్యను నిషేదించాలి. ఇంతకు ముందెప్పుడైనా ఇలాంటిది చూశామా?

నాజీ పార్టీ నాయకుడు, జర్మన్ ఛాన్సలర్,(1889-1945) అడాల్ఫ్ హిట్లర్

కూడా ఇలాగే అన్నాడు. "ప్రపంచ విద్య అత్యంత హానికరమయింది, మనుషులను ఛిన్నాభిన్నం చేసే విషం" అన్నాడు.

"విద్య ప్రమాదకరమయింది. ప్రతివిద్యావంతుడూ భవిష్యత్తులో శత్రువే." జర్మన్ రాజకీయ, సైనిక నాయకుడు, నాజీపార్టీలో శక్తిమంతుడు, హెర్మన్ గోయరింగ్ ఏదో కొంతసమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఈ సమాచారమే సరయినది కానప్పుడు నిర్ణయాలు కూడా తప్పు అవుతాయి.మనం సేకరించుకున్న సమాచారం సరైనదని రూఢి చేసుకోడానికి పరిశోధన / ప్రశ్నించడం చేయాలి.

"ఆవిష్కరణకు పెద్ద ఆటంకం అజ్ఞానం కాదు, జ్ఞానం ఉందనుకునే భ్రమ." అన్నాడు అమెరికన్ చరిత్రకారుడు, ఆచార్యుడు, అటార్నీ, రచయిత, అమెరికా సంయుక్తరాష్ట్రాల కాంగ్రెస్‌కు 12 వ గ్రంథాలయాధికారి, డానియల్ బూర్‌స్టిన్ (1914 – 2004)

"సందేహం వెలిబుచ్చినవాడిని ఐదు నిమిషాలు తెలివి తక్కువవాడు అనుకోవచ్చు, కాని అడగని వాడు ఎప్పటికీ తెలివితక్కువ వాడే. "అనేది చైనా సామెత. కుట్ర ఉన్నపుడు, దానిని బట్టబయలు చేయాలంటే పరిశోధన (ప్రశ్నించడం) జరగాలి. ఉదాసీనత ప్రశ్నను చంపేస్తుంది. అది ఆలోచించాలనే కోరికను తొలగిస్తుంది. కుట్ర సిద్ధాంతాలు కేవలం అనుమానాలు మాత్రమే. వాటిని క్షుణ్ణంగా పరిశీలించకపోతే అలాగే ఉండిపోతాయి. శాస్త్రీయ సిద్ధాంతాలు అందుకు విరుద్ధంగా కాలానుక్రమంలో పలువురిచేత, పలుమార్లు పరీక్షించబడి, యథార్థం ఆధారంగా, తార్కికంగా, నిరూపించ బడ్డాయి. కాని కుట్ర సిద్ధాంతాలు పరీక్షింప బడలేదు, అవి కేవలం అజ్ఞానం వల్ల కలిగిన పిలకలే.

**మానవ పరిణామానికి, విప్లవానికి మూలం ప్రశ్న**. నిర్ణయాలకు ఆధారాలుగా నిలచిన సమాచారం ఎంత బలంగా ఉంటుందో, నిర్ణయాలు అంత బలంగా ఉంటాయి. సమాచారం బలహీనంగా ఉంటే దాని ఆధారంగా నిలిచిన నిర్ణయాలు కూడా బలహీనంగానే ఉంటాయి.

హిట్లర్‌కు ప్రచారకర్త జోసెఫ్ గోబెల్స్ చాలామంది జర్మనులకు 'యూదులు క్రూరమానవులు, కనుక వాళ్లను నిర్మూలించాలి' అని నచ్చ జెప్పాడు.

చాలామంది దానిని ప్రశ్నించకుండానే స్త్రీ, పురుష, బాలలందరినీ కిరాతకంగా ఊచకోత కోశారు.
యూరప్ రాజధానిలో గల మేధావులలో ఎక్కువమందిని హతమార్చారు.

ఆలోచించే మనుషులు, ఎదురు ప్రశ్నించే వాళ్లుంటే ఇలా జరిగేదా?
ఇవాళ మనకు తెలుసు. నోబెల్ పురస్కారాలు అందుకున్నవారిలో నూటికి 22 మంది (మొత్తంలో 146 మంది యూదు వంశస్తులే) కిరాతకులుగా ముద్ర వేయబడిన వారే. వీరిలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, నీల్స్ బోర్, గుస్తవ్ హెర్జ్, మాక్స్ బార్న్, హెన్రీకిసింగర్, మిల్టన్ ఫ్రైడ్ మాన్ ఉన్నారు. ప్రశ్నలు అడగడం బాగా చేతనైన వారిలో కొందరే వీరు.
1992 ఏప్రిల్‌లో యుగొస్లేవియా రిపబ్లిక్ ఆఫ్ బోస్నియా స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నది. తరువాత చాలా సంవత్సరాల దాకా యుగోస్లావ్ సైన్యం అండతో బోస్నయక్ (బోస్నియన్ ముస్లిం) లను, క్రోషియన్ పౌరులను అతిక్రూరంగా హింసించారు. దీనివల్ల బోస్నయిక్ లలో 80 శాతం1995 నాటికి అంతరించిపోయారు. నాజీల పాలనలో 60లక్షలమంది యూరోపియన్ యూదులు రెండో ప్రపంచయుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు.
నాజీల లాగానే బోస్నయిక్ జనాభా క్రూరమైనదని ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని కూడా ప్రశ్నించిన వాళ్లు లేరు. పక్క ఇళ్లలో తమతో కలసి దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉంటున్న పొరుగు వాళ్ల తలకాయలను అతి కిరాతకంగా నరికారు. తమతో కలసి చదువుకున్న వాళ్లు, ఆడా, మగా, పిల్లా, పాపలు అనికూడా చూడలేదు. "మంచి వాళ్లు ఏమీ చేయకుండా ఉంటే చెడు వర్ధిల్లుతుంది." అన్నాడు రచయిత, వక్త, రాజనీతి సిద్ధాంతకర్త,ఎడ్మండ్ బర్క్ (1729 – 1797)
గలీలియో, ఇటలీకి చెందిన ఖగోళశాస్త్రవేత్త, భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్, తత్వశాస్త్రం, గణితాలలో పండితుడు. ఆయనకు కాథలిక్ చర్చి పదేళ్లపాటు కఠిన కారాగార శిక్షవిధించింది. ఆయన చేసిన నేరము ఏమిటో తెలుసా? ఆయన చర్చి నమ్మకానికి విరుద్ధంగా చెప్పాడు.

సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతుంటాడని చర్చి ప్రగాఢ విశ్వాసం. గలీలియో దానిని ప్రశ్నించాడు, ప్రభుత్వాన్ని నిలదీశాడు. వాళ్ల అజ్ఞానపూరిత, అంధవిశ్వాసాలను సవాల్ చేశాడు, పాలకులకు పక్కలో బల్లెము అయ్యాడు. కాని తరువాత తలెత్తిన ప్రశ్నలతో ప్రభుత్వం తన విశ్వాసాలను సడలించుకున్నది.
"భగవంతుడు మనకు ఇంగితజ్ఞానం, తర్కం, మేధస్సు ప్రసాదించాడు, కాని వాటిని ఉపయోగపడకుండా దేవుడే చేస్తాడని నేను నమ్మలేను. అందుకు నేను సిద్ధంగా లేను." అన్నాడు గలీలియో (1564–1642).

అధికారాన్ని నిలదీయండి, ప్రశ్నించండి, (అధికారం ఎప్పుడూ సరైనది కాదు). ముందు గౌరవంగా చేయెత్తి నినదించండి. "కళ్లముందున్న వాస్తవాలను చూడలేని వాళ్లే అంధులు." జాన్ హ్యూవుడ్. ప్రశ్నలు మాత్రమే నిజాన్ని, అబద్ధాన్ని, తప్పు, ఒప్పులను, వాస్తవాన్ని,కల్పనను, మంచి, చెడులను నిర్ణయించగలవు.

"కనిపించే సంపదలకు పరిమిత ప్రయోజనాలే ఉన్నాయి. కనిపించని సంపదలకు అనంత ప్రయోజనాలు ఉన్నాయి. హ్యూబర్ట్ సెయింట్ ఆన్గె. కనిపించే జవాబులకు పరిమిత అన్వయాలే ఉంటాయి. కనిపించని ప్రశ్నలకు అపరిమితమైన, కనిపించే ఫలితాలు ఉంటాయి.

**ప్రశ్నలే వ్యాపారానికి పెట్టుబడులు:**

గూగుల్ బృందం అపారమైన ప్రశ్నలపై పెట్టుబడి పెట్టింది. దాని ఫలితంగా కనిపించే కోట్లాది రూపాయలను సృష్టించారు. మనం చాలా చాలా ప్రశ్నలను అడగాలి. అలాగే మరిన్ని ప్రశ్నలను అడగగలిగే ఎక్కువ మంది పిల్లల్ని పెంచాలి.

బాగా రూపొందించిన ప్రశ్నకు కేవలం యాదృచ్ఛికంగా అడిగే ప్రశ్నలకు మధ్య తేడా వెంట్రుక వాసి. ఆ తేడా ఒక కళాఖండానికి, ఆదరా బాదరా చేసిన బొమ్మకు ఉన్నటువంటిదే. ప్రశ్న ఎప్పుడూ వ్యంగ్యంతో నిండి ఉండగూడదు. అలా ఉంటే అది నేరమే.

**స్టెమ్ నుంచి స్టీమ్ దాకా.** From STEM to STEAM- మన పిల్లలు స్టెమ్

రంగాలలో రాణించాలని కోరుకుంటున్నాం. ఈ రంగాలు ఏమిటో చూద్దాం. శాస్త్రం, సాంకేతికత, ఇంజనీరింగ్, గణితం- అయితే సరిగ్గా ప్రశ్నించడం ఎలాగో తెలియని వాళ్లు రాణించలేరు.

ఇపుడు liberal ARTS కూడా అవసరమైSTEMను STEAM అంటున్నారు.

**మానవత్వం లేని సాంకేతికత ప్రళయమే**

మన ప్రశ్నలు మన వ్యక్తిత్వానికి నిర్వచనాలు. ప్రతివ్యక్తీ విశిష్టమైన, విలక్షణమైన ప్రశ్నలను అడుగుతుంటాడు. శాస్త్రజ్ఞులు సత్యాన్ని తెలుసుకునే లక్ష్యంతో పరిశోధనలు చేస్తారు. సత్యం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు.

వైద్యులు రోగనిర్ధారణ చేస్తారు, సాంకేతిక నిపుణులు సమస్యలు చక్కదిద్దుతారు, చట్టాలను అమలు పరచవలసిన వాళ్లు పరిశోధిస్తారు, ప్రశ్నిస్తారు. తల్లులు జోక్యం చేసుకుంటారు, శాస్త్రజ్ఞులు అధ్యయనం చేస్తారు, నేత్రవైద్యులు పరీక్షిస్తారు, ఆహారపరీక్షకులు తనిఖీలు చేస్తారు, అన్వేషకులు అన్వేషణలు సాగిస్తారు, పాఠకుడు పరిగణనలోకి తీసుకుంటాడు, ఆభరణాల వ్యాపారి విలువ మదింపు చేస్తాడు, సందేహం కలవాళ్లు అనుమానిస్తుంటారు, నేరపరిశోధకులు పరిశోధిస్తారు, పాత్రికేయులు పరిచయాలు చేస్తారు, వార్తలు రాస్తారు. ఇది అంతర్జాలయుగం, వెబ్ సైటులు అన్నిరకాల వ్యాపార అవసరాలకు తగినట్లుగా తయారు చేస్తున్నారు. ప్రశ్నలు అడగడం అవసరం అయింది. “తరచు అడిగేప్రశ్నలు’’-FAQ. Frequently Asked Questions. వేర్వేరు.

**ప్రశ్న దైనందిన/ రోజవారీ జీవితంలో ఒక భాగం.** నీ రోజువారీ జీవితాన్ని గురించి ఆలోచించు, నువ్వు ప్రతిరోజూ తరచుగా వేసుకునే ప్రశ్నలు నీకు ఉంటాయి. వాటితో పాటే జవాబులు కూడా ఉంటాయి. ఆరోగ్యం శరీర రక్షణ విషయంలో ముఖ్యమైన అంశం. కేవలం ప్రశ్నలు మాత్రమే మన ఆరోగ్యాన్ని, మన పిల్లలు బంధుమిత్రుల ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. తినడానికి అతిమంచి ఆహారం ఏమిటి? మనం చూపించుకుంటున్న వైద్యుడు అన్ని అర్హతలు కలవాడేనా? మన బీమా సంస్థ మంచిదేనా, మనకు లభించే సమాచారాన్ని సరిగా అర్థం చేసుకుంటున్నామా? ఇంకా తప్పక అడగవలసిన ప్రశ్నలు ఏమిటి? మన స్వంత పరిశోధనలు చేయవలసిన అంశాలు ఏమేమిటి? ప్రశ్నించుకోవడమే పరిశోధన.

ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటేనే మనం బాగవుతాం.జీవితమంతా సాధనే. జీవితమంతా ప్రశ్నలే. "ప్రశ్న జీవితానికి కీలకం, అవసరం, మనుగడకు మార్గం. సాధన లేకపోతే ప్రగతి లేదు. మరల మరల ప్రశ్నిస్తుంటే ఇంకా, ఇంకా పరిశుద్ధం అవుతుంటుంది. ప్రశ్నలు ఆలోచనలను నిర్వచిస్తాయి,

యింకా,యింకా తవ్వి తీస్తాయి, వాటిని సంస్కరిస్తాయి. ప్రశ్నలు మెదడును అదుపులోకి తీసుకుంటాయి. తెలిసో, తెలియకో ఆ ప్రశ్నకు జవాబు చెప్పే ప్రక్రియ కంటేముందే దానిని పదేపదే మననం చేసుకోవాలి. ప్రతి ప్రశ్న ఒక స్పందన. అది ఆలోచించే ప్రక్రియకు ఉత్తేజం ఇచ్చి, ఊతంగా నిలుస్తుంది.

ఎవరికి వారు ప్రశ్నించుకోవడం ఆలోచనా ప్రక్రియ. అది విశ్లేషణాత్మకంగా మెదడు పనిచేసే విధానం. ప్రశ్నలు ఆధిపత్యం వహిస్తాయి, ఆలోచింపజేస్తాయి. చిన్నపిల్లలు తమ ప్రశ్నల సునామీతో ఆధిపత్యం సాధిస్తారు. కొన్ని సంస్కృతుల్లో పిల్లలు పెద్దవాళ్లను, తలిదండ్రులను, గురువులను, ఆచార్యులను, అధికారంలో పెద్దలను ప్రశ్నించటం అవమానించడమే అనుకుంటారు. ఇటువంటి సమాజాలు ఆధిపత్యాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనుకుంటారు. కనుక వాళ్ల పిల్లల సామర్థ్యాలు, సర్దుబాటు శక్తి, పెరుగుదల, మనుగడలు ఉండవలసినంతగా ఉండవు.

పిల్లలు, విద్యార్థులు తమ ఆలోచనా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కోరుకుంటాం మనం. వాళ్ల వయసుకు తగిన ప్రశ్నలను అడిగినప్పుడు, వాళ్ల ఆలోచనా ప్రక్రియ ఆరంభమై, మెదడు వ్యాయామాన్ని ప్రారంభించాలని దూరాన్నుంచి నియంత్రించే రిమోట్ కంట్రోల్‌ను మన చేతిలోకి తీసుకుంటాం. మనం వాళ్లను ప్రశ్నలు అడగటం పెంచే కొలది వాళ్లు చేసే వ్యాయామం / సాధన / ఆలోచన పెరుగుతుంటుంది.

సాధన అంటే పదేపదే చేయడం. సాధన చేసేకొలది అంచెలంచెలుగా ప్రయోజనం కలుగుతుంటుంది. ప్రయత్న పూర్వకంగా చేసే పనినుంచి ప్రయత్నం లేకుండానే చేసే పనిలోకి వెళతాం. సాధన ద్వారా అప్రయత్న పూర్వకంగా (automatic) ప్రశ్నించే స్థాయికి (ఆలోచించే స్థాయికి) చేరుకుంటాం. పిల్లలు, విద్యార్థులు తమకు తాము ఆలోచించుకునే స్థాయికి దశలవారీగా చేరుకుంటారు.

పిల్లలు ఇలాగే ఎదగాలని మనం కోరుకుంటాం. ఇదే ప్రక్రియ పెద్దవాళ్లకు గూడా పనిచేస్తుంది. ఇతరులు చెప్పిన దానిని, ఇతరుల ద్వారా విన్నదానిని నువ్వు పట్టించుకోకపోవడం తరచు జరుగుతుంటుంది.
కాని నీ మెదడు ప్రశ్నను నిర్లక్ష్యం చేయదు. మెదడు విశ్లేషించే అవయవం.
అది ప్రశ్నను పట్టించుకోవాలో, వదిలేయాలో ఉద్దేశపూర్వకంగా నిర్ణయించు కోవాలి. నిర్ణయించుకోవడమూ ప్రశ్నించే ప్రక్రియలో భాగమే. నిర్ణయమే జవాబు.

**రాయడం – ఆలోచనా వ్యాయామానికి మాధ్యమం**

మన ఆలోచనలను కాగితం మీద పెట్టడమే రాయటం. ఆలోచనలే జవాబులు.
పాఠశాలల్లో రాయడం సాధన చేయిస్తారు. విద్యార్థుల్లో సృజనశక్తి పెరగడానికి ఇది దోహదపడుతుంది. దానివల్ల సృజనాత్మక ప్రశ్నావిధానం అలవాటవు తుంది. మనం కాగితం మీద ఉంచడానికి ప్రయత్నించిన ప్రతి విషయమూ మెదడు నుంచి వచ్చిందే. అయితే ఈ ఆలోచనలు తార్కికంగా, భావోద్వేగ పరంగా ఒక క్రమంలో ఉండకపోవచ్చు. ఆలోచనలను మనను మనం అర్థం చేసుకోవడానికి, ఎన్నిసార్లైనా, పరిశీలించుకోవడానికి, అర్థవంతంగా అమర్చడానికి వీలవుతుంది. రాయడం వల్ల మన ఆలోచనల రూపం మనకు తెలుస్తుంది. అద్దంలో చూసుకుంటే మన శరీరం మనకు కనిపించినట్లుగా రాయడం వల్ల మన మనోభావాలు, నమ్మకాలు మనకు తెలుస్తాయి. రాసే నైపుణ్యం అలవరచు కోవడానికి నువ్వు రచయితవై ఉండనవసరం లేదు.
నిజానికి రచయిత కాకపోవడమే మేలు, ఇందువల్ల ప్రయోజనాలను త్వరగా గ్రహించగలుగుతాం. మనను మనం ప్రశ్నించుకోవడం నేర్చుకోవడానికి రాసుకోవడం చాలా ఉపయోగపడుతుంది. ప్రతి మాట, ప్రతి వాక్యం, ప్రతి పేరాగ్రాఫ్, ప్రతి అధ్యాయంగా ఒక క్రమం ఏర్పడి ప్రశ్నల పరంపర వెలువడు తుంది. చదవడం, రాయడం తెలిసినప్పటినుండే రాయడాన్ని సాధన చేయవచ్చు. వయసు పెరిగే కొలది విషయాలు మారవచ్చు. మాట్లాడటం చేతనైతే, ఆ మాటలను కాగితం మీదకు అక్షరాల రూపంలోకి తీసుకురావచ్చు. మొదట్లో రోజుకు ఒక వాక్యమే కావచ్చు, క్రమంగా రెండూ, మూడూ. జీవితంలో మిగతా అన్ని విషయాలలాగానే రాయడం కూడా సాధన ద్వారా వస్తుంది.
మన లక్ష్యం పుస్తకాలు రాయడం కాదు, మన ఆలోచనలను ఒక క్రమపద్ధతిలో

ఉంచి పరిశీలించుకోవడమే. విషయం సరదా / క్రీడ / సినిమా వంటిది, మనకు జిజ్ఞాస గలది కావచ్చు."దేన్నయినా సరిగ్గా చేసితీరాలనుకోవద్దు, చెయ్యి, అక్షర రూపంలో ఉంచు,అంతే" అమెరికన్ రచయిత, జేమ్స్ థర్బర్ (1894 - 1961) తిరిగి రాయడం అంటే తిరిగి ప్రశ్నించడమే."తుడిపివేయ గలిగిన చెయ్యే అసలైన విషయాన్ని రాయగలదు." జర్మన్ రచయిత, మతశాస్త్రవేత్త, మెయిస్టర్ ఎక్ హార్ట్ (1260-1328).మనం విమర్శనాత్మక ఆలోచన గురించి మాట్లాడితే గట్టి విమర్శకులం మనమే అవుతాం. రాయడం ద్వారా వ్యక్త పరచాలంటే అది ఎంత ఇబ్బందో తెలుస్తుంది.

రాయడం ఒక ప్రక్రియ. రాయకుండా ఉన్నపుడు ఎలా ఆలోచించాలో అది మనకు నేర్పుతుంది. కెమెరా కాని, రాయడం కాని అవి నిన్ను మరింత జాగ్రత్తగా ఉండమని, శ్రద్ధచూపమని,ఆలోచించమని, హెచ్చరించే పరికరాలు.

ఒక్కరో, ఇద్దరో కాదు, రచయితలు బృందగానంలాగా ఆలపించిన గీతం అది. నన్ను వాళ్లు తమ మోచేతుల్తో పొడిచి. రాయడం అంటే ఆలోచించడమేనని వాళ్లు చెప్పిన మాటలు చూడండి. చాలా మంది ఈ విషయం గురించి రాశారు.

"రాయడం మొదలు పెట్టేదాకా నేను ఆలోచిస్తున్నది ఏమిటో తెలుసుకోలేక పోయాను." అమెరికన్ నవలా రచయిత్రి, సాహితీ పాత్రికేయురాలు, జోన్ డిడియాన్ (1934)

"నేను చెపుతున్నది ఏమిటో, నేను ఆలోచిస్తున్నది ఏమిటో నేను చదివేదాకా తెలియదు గనుక నేను రాస్తాను." "రాయడం అంటే కాగితం మీద ఆలోచించడం." అన్నాడు రెండు నవలలు, 32 కథానికలు రాసిన అమెరికన్ రచయిత, వ్యాసకర్త, ఫ్లానరీ ఓ కానర్ (1925-1964)

"రాయడం, నేర్చుకోవడం, ఆలోచించడం ఇవన్నీ ఒకే ప్రక్రియకు చెందినవే." అమెరికన్ రచయిత, సంపాదకుడు, సాహిత్యవిమర్శకుడు, బోధకుడు, విలియం జిన్సర్. "రాయడం జీవితానికి సాఫల్యం కలిగించడమే. నువ్వు నీ జీవితాంతం కృషి చేసినప్పటికీ, రాయటం ద్వారా ఒక చిన్న రంగంలో గణనీయమైనది సాధించవచ్చు."నాడిన్ గార్డిమర్, సాహిత్యం 1991 సం. నోబెల్ పురస్కార గ్రహీత(1923-2014)."కాగితం మీద కలం పెట్టగానే విరామం దొరుకుతుంది, ఆ విరామం ఆలోచనను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల జీవితం

గురించి మరింత గాఢంగా ఆలోచించడానికి అవకాశం కలుగుతుంది. దానితో జీవనవిధానంలో సమతుల్యత సాధ్యం అవుతుంది.'' నార్బెట్ ప్లాట్.అమెరికన్ రచయిత, సంపాదకుడు, ఉపాధ్యాయుడు, "మనసుకు ఉన్న నాలుక కలం." స్పానిష్ రచయిత, మిగ్యుయల్ డి సెర్వాంటెస్ సావెద్రా (1547-1616)
"రాయడం ప్రారంభించే దాకా నువ్వు ఏమి నేర్చుకుంటావో తెలియదు. నీలో ఉన్నట్లు నీకే తెలియని వాస్తవాలెన్నిటినో నువ్వు తెలుసుకో గలుగుతావు." ఆంగ్ల నవలా రచయిత్రి, కళాచరిత్రకారిణి, అనితా బ్రూక్నర్.

"బాగా రాయడం అంటే బాగా ఆలోచించడం". ఫ్రెంచ్ ప్రకృతిశాస్త్రవేత్త, జార్జ్ లూయిస్ లెక్లర్క్ డి బఫన్ (1707 -1788) "ఎప్పటికప్పుడు గుర్తు వచ్చిన ఆలోచనలను రాసుకో. అడగకుండా వచ్చిన ఆలోచనలు సాధారణంగా చాలా విలువైనవి" ఇంగ్లీష్ తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, శాస్త్రవేత్త, న్యాయ సలహాదారు, వక్త, వ్యాసకర్త, రచయిత, సర్ ఫ్రాన్సిస్ బేకన్ (1561- 1626) మనసు తరగని గని వంటిది, నువ్వు కలం పట్టుకొని రాయడం మొదలుపెట్టే కొలది ఆ గని నుంచి నిక్షేపాలు బయట పడతాయి.
"నీ ఆలోచనలను రాస్తున్నావంటే నీ దృష్టిని, పూర్తి ఏకాగ్రతను వాటిమీద పెడుతున్నట్లే. ఎవరైనా దేనిగురించి ఆలోచిస్తుంటారో దానిమీదనే తమ దృష్టిని నిలుపగలుగుతారు.ఒక దానిని గురించి ఆలోచిస్తూ, మరో దానిమీద దృష్టిని ఎవరూ నిలపలేరు కదా? కనుకనే కాగితం, కలం ఏకాగ్రతను నేర్పే పరికరాలు." అంటారు 20 సంవత్సరాలు ఆచార్యునిగా న్యూ ఆర్లియన్స్ లో పనిచేసిన మైఖాయేల్ లెబోయఫ్.
"ఏమయినా సరే, నేను రాసితీరాల్సిందే, రాయడం అంటే ఆలోచించడమే. అది జీవించడం కంటే అధికమైనది, స్పృహతో జీవించడం" అన్నారు అమెరికన్ రచయిత్రి, విమానయాన ప్రారంభకురాలు, ఆన్ మారో లిండ్బర్గ్.
ఈ రచయితలందరూ మొండిగా రాసిన వాళ్లే అనిపిస్తుంది కదా? వాళ్లకు తెలిసింది ఏదో వాళ్లు రాశారు, ఇదే విషయాన్ని ఇంకా, ఇంకా ఎన్నో రకాలుగా చెప్పిన వాళ్లు చాలామంది ఉన్నారు.
రచయితలు అందరూ వృత్తిపరంగా రచనలు చేసేవాళ్లు నైపుణ్యం కల ఆలోచనా

పరులే అయినా వారందరూ, అన్ని విషయాలలో ఏకీభవించరు.

ఎవరి శైలిలో వాళ్లు రాస్తారు. కాని ఆలోచన, ఆలోచనలను రాయాల్సిన అవసరం గురించి మాత్రం అంతా ఏకాభిప్రాయమే వెలి బుచ్చుతారు. వాళ్ల అనుభవాలను ఆలకిస్తే మనకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. రాయడం అంటే ఆలోచించడం. ఆలోచించడం అంటే ప్రశ్నించడం. రాస్తూ విశ్లేషించుకోకపోతే ఒక్క మాట, ఒక్క వాక్యం, పేరాగ్రాఫ్ కూడా రాయలేము. అప్పుడు మళ్లీ వెనక్కు తిరిగి చూసుకొని మళ్లీ విశ్లేషించుకుంటాం. మన ఆలోచనకు మన అక్షరరూపం సరిగా ఉన్నదో లేదో చూసుకుంటాం.

విశ్లేషించుకోవడం, పునర్విమర్శ చేసుకోవడం ప్రశ్నించడంలో ప్రక్రియలు. మనం రాయడంలో నిమగ్నమై ఉన్నప్పుడు ప్రశ్నించడం, ఆలోచించడంలో సాధన చేస్తుంటాం. మెదడు కండరాలను పటిష్టం చేసుకుంటాం. ఆలోచనలను వేగంగా చేయగలుగుతాము. ఆలోచనా సామర్థ్యాలను పెంచుకుంటాం.

ముందుకు వెళ్లు, రాయడంలో గల లాభాలను స్వయంగా తెలుసుకున్న పిమ్మట నువ్వు నీ పిల్లలకు దీనిని పరిచయం చేయాలనుకుంటావు.

రచయితలు కాని వాళ్లు రచయితలను ‘ బాగా రాయాలంటే ఏం చేయాలి’ అని ప్రశ్నిస్తుంటారు. దానికి రచయితలు చెప్పే జవాబు ఒకటే, ‘ఏముంది, రాయండి, రాస్తుండండి’. ఏదైనా సాధనతోనే సాధ్యం అవుతుంది."దేనిని నేర్చుకోవాలను కుంటామో దానిని చేయడం ద్వారానే నేర్చుకుంటాం" అన్నాడు అరిస్టాటిల్

మనమందరం రచయితలమే. మళ్లీ గట్టిగా చెపుతున్నాను, నువ్వు మాట్లాడగలిగితే ఆ మాటలకు అక్షరరూపం ఇస్తే మాట్లాడంలో ఇంకా మెరుగులు దిద్దగలుగు తావు. అంతే గాని పరిపూర్ణత అనేదే ఉండదు, ఇంకా, ఇంకా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగడమే.

రాయగలగడం ఇంద్రజాలం కాదని నేను తెలుసుకున్నాను. జీవితంలో మిగతా విషయాలలాగానే నేర్చుకోవడం, అభివృద్ధి చేసుకోవడం పట్టువదలకుండా మొండిగా సాధన చేస్తేనే సాధ్యం అవుతుంది. సాధన లేకపోతే ప్రగతి లేదు.చిన్న బిడ్డగా అక్షరాలు రాయడం ప్రారంభించినప్పటి నుంచి రాయొచ్చు. అవి చిత్తుపుస్తకంలో రాసే మాటలైనా, వ్యాకరణబద్ధంగా లేకపోయినా పరవాలేదు.

రాసే నైపుణ్యం,రాతపట్ల ప్రేమ సహజంగాపుట్టి, సాధనతో పెరుగుతాయి.
అమెరికా విద్యావ్యవస్థ వ్యాసాలు రాయించి విద్యార్థుల తెలివితేటలను పరీక్షించే స్థాయిని వదిలేసింది. కేవలం మూల్యాంకన అవగాహనకే పరిమితం చేసింది. విషయం, సారాంశం ఎంతవరకు అర్థం అయిందో చూస్తుంది. 200 మాటలు గల ఒక వ్యాసాన్ని చదవడానికి ఇచ్చి కింద 5 ప్రశ్నలు ఇస్తారు. వాటికి సరైన జవాబులు చెప్పగలిగితే ఆ వ్యాసం అర్థం అయినట్లే. ఇప్పుడు ప్రశ్నలకు అనేక జవాబులు ఇచ్చి, వాటిలో ఏది సరయినదో చెప్పమని అడగటానికే పరిమితమై ఉంటాయి.ఈ ప్రశ్నాపత్రాలను కంప్యూటరులే మూల్యాంకనం చేయగలుగుతాయి. మానవులు పరీక్షించే విధానం నుంచి యంత్రాలు పరీక్షించే స్థాయికి వచ్చాము. వ్యాసరూపంలో గల జవాబుల ద్వారా విద్యార్థుల మేధస్సును, బోధనా నాణ్యతను మదింపు చేయడం చాలా కష్టం. ఒక ప్రశ్నకు చాలామంది తప్పు జవాబు రాశారంటే బోధనలో లోపం ఉన్నట్లు గ్రహించవచ్చు.

ఫ్రెంచ్ రచయిత, చరిత్రకారుడు, తత్వవేత్త వాల్టేర్ (1694 – 1778) అన్న మాటలు ఎంత విలువైన ముత్యాలో చూడండి.- పట్టు విడవకుండా (ప్రశ్నించడం) కొనసాగిస్తే లొంగని సమస్య ఏదీ లేదు"

నిరంతరాయంగా, విసుగులేకుండా, ఏకబిగిన, మొండిగా కొనసాగించిన పనికి ఈ పుస్తకము కూడా ఒక ఉదాహరణే. ఎనిమిదేళ్లు, ఎన్నో సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు గడచిపోయాయి, పోతున్నాయి. ఇంకా రాస్తూనే ఉన్నాను. తిరిగి రాస్తున్నాను, మళ్లీ మళ్లీ మెరుగులు పెడుతున్నాను.
రాయడం, చదవడం, అవగాహనల మధ్య సంబంధం ఏమైనా ఉన్నదా? నేర్చుకోవడానికి రెండే మార్గాలు ఉన్నాయి. అనుభవం సంపాదించు కోవడం, అనుభవాలను అధ్యయనం చేసుకోవడం, పరుల అభిప్రాయాలను తెలుసు కోవడం. విషయం లెక్కలు, శాస్త్రం, ఇంకా ఏదైనా కావచ్చు, దానిని నేర్చు కోవాలంటే వాటిని చదవడం చాలా ముఖ్యమైన మార్గం.

**రాయడం వల్ల కలిగే జీవిత ప్రయోజనం**

రాసే సామర్థ్యం అన్ని రంగాల్లో అవసరం, రాయడంతో చాలా ప్రయోజనాలు

ఉన్నాయి.
వ్యక్తిగతమైనవి, వృత్తిపరమైనవి, విద్యాపరమైనవి మనం రాసేది ఎక్కువయే కొలది మన పదాలసంపద ఎక్కువవుతుంది.
ప్రశ్నలను బాగా అడగగలుగుతాం. వాటికి మంచి జవాబులు వస్తాయి. అవే మంచి పరిష్కారాలకు దారులు.కత్తి కంటే కలం గొప్పదని సామెతను పదేపదే వింటుంటాం, నేను అంటాను -కలం కంటే ప్రశ్న శక్తివంతమైనది.

రాయటం మెదడుకు భౌతిక వ్యాయామం. మానవుని శరీరబరువులో మెదడు కేవలం 2 శాతం మాత్రమే ఉంటుంది. అయినప్పటికీ అది గుండె అందించే రక్తంలో 15 శాతాన్ని వినియోగించుకొని శరీరం అందించే ప్రాణవాయువులో 20 శాతం తీసుకొని శరీరపోషకపదార్థాల్లో (గ్లూకోజ్, చక్కెరలో) 70 శాతం వాడుకుంటుంది.

ప్రశ్నించడం అనేది అజ్ఞానం అంటుకోకుండా వేసే టీకామందు, ఒకవేళ అంటుకున్నప్పటికీ అజ్ఞానాన్ని తగ్గించి, జ్ఞానవంతులుగా చేయగల ఔషధం.
పిల్లలు విజయాలను సాధించలేకపోతే, వ్యాధి వచ్చిన తరువాత ఒక కిలోమందు వాడేకంటే రాకముందే 100 గ్రా.లు వాడటం మంచిది.

కొందరు పిల్లలు ఇంటిదగ్గర, బడిలో చదవడంలో నిమగ్నం కాకపోవచ్చు. అటువంటి వారికి, ఇంటిదగ్గర అందించే ఈ 100 గ్రాముల మందు బాగా ఉపయోగపడుతుంది. ప్రేమ, తీవ్రమైన ఆకలి, తనివి తీరని తపన, జిజ్ఞాస మనకు ఉంటాయి.

వీటివల్ల పిల్లల్లో ప్రశ్నించాలనే ప్రగాఢ కోరిక మొదటి బడికి వెళ్లక ముందే కలుగుతుంది. పెద్దలు చేయవలసింది వాళ్లను బలపరచడం, ప్రోత్సహించడం.
మానవ, ఆర్థిక మూలనిధిలో పెట్టుబడి పెట్టడానికి ప్రశ్నల్లో పెట్టుబడి పెట్టటమే ఏకైక మార్గం. చదరంగం ఆటని కూడ ఓ ప్రశ్నల పోటీ అనుకోవచ్చు.

కంప్యూటర్ సమాచారాన్ని దొంగలు దోచుకోకుండా, నాశనం చేయకుండా చూసే కాపలాదారులు, ఆ సమాచారాన్ని దోచుకోవడానికి ప్రయత్నించే దొంగలు కూడా

ప్రశ్నల పరంపరను కొనసాగిస్తుంటారు.

కుటుంబాలను బంధించి ఉంచడానికి పరిష్కారాలు, ఆర్థిక భద్రతను కల్గించటానికి, ఉత్తమవిద్యను అందించడానికి, కేన్సరు వంటి జబ్బులను బాగు చేయడానికి, శాంతిని నెలకొల్పడానికి, నేరాలు జరగకుండా చేయడానికి, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, సైబర్ దాడులను తట్టుకోవడానికి, జీవితంలో ప్రతి విషయాన్నీ తట్టుకోవడానికి, అన్ని శక్తులూ ఒక్క వనరు నుంచే లభిస్తాయి. ఉత్తమ జవాబుల లాగానే, అవి ఉత్తమ ప్రశ్నలవల్లనే అందుతాయి.చాలాకాలం నుంచి అసాధ్యం అనుకున్నవి సుసాధ్యం కావడం కచ్చితంగా సాధ్యమే. విమాన ప్రయాణాలు, చంద్రమండల యాత్రలు ఒకనాడు అసాధ్యాలుగా భావించబడినవే. మన ఆలోచనా విధానాన్ని పక్కదారికి మరలిద్దాం. మనం వెళ్లదలచిన వైపుకు తిప్పుదాం. "చిన్న తాళంచెవి పెద్దతలుపుల్ని తెరుస్తుంది''. టర్కిష్ సామెత. మనం ఎక్కడ బయలుదేరామో గుర్తు చేసుకుందాం. ప్రశ్న అడగడం మాత్రమే చాలదు. ఆ ప్రశ్నను ఎందుకు? ఎలా? ఎవరిని ఉద్దేశించి? ఎప్పుడు? అడుగుతున్నామో అప్రమత్తులమై అడగాలి. అప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలను పొందగలుగుతాం. ప్రశ్నల్లో నాణ్యతను పెంచుకోగలుగుతాం.
**నిర్వచనం**-ఆలోచన అంటే నిన్ను నువ్వు ప్రశ్నించుకోవడం, ఆత్మావలోకనం, స్వీయపరిశీలన.

ప్రశ్నించడాన్ని మెరుగు పరచుకో, ఆలోచించడాన్ని మెరుగుపరచుకో.
భౌతిక ప్రపంచం అణువులతో నిండి ఉన్నట్లుగానే నీ మనోవిశ్వం ప్రశ్నలతో నిండి ఉంది. ప్రశ్నల ద్వారా తరువాతి నిర్ణయం తీసుకోవలసింది నీ మనసే.
సాధారణ ప్రశ్నకు గల శక్తిని తక్కువగా అంచనా వేయకు, అది అణుశక్తి అంత బలమైనది. చిన్నదే గొప్పది, చిన్న వస్తువులే పెద్ద తేడాలను చూపించాయి.
సున్నా చిన్నవాటికంటే చిన్నది, దానికి విలువే లేదు. అలాంటి శూన్యమే మన జీవితాలలో ఎంతమార్పు తెచ్చిందో చూడండి.

**నేర్చుకోవడం ఎలా?**

“నేర్చుకోవడం ఎలాగో తెలిసిన వాళ్లే చాలినంత తెలిసిన వాళ్లు'' హెన్రీ ఆడమ్స్.

“నిజంగా చెప్పాలంటే, రచయిత తనకు తాను బోధించుకోవడానికే రాస్తాడు; తనను తాను అర్థం చేసుకోవడానికి, తనకు తాను తృప్తి చెందటానికి; తన ఆలోచనలను ప్రచురితం చేయడానికే రాస్తాడు.రాయడం ఊరట కలిగిస్తుంది'' అమెరికన్ రచయిత, సాహితీ విమర్శకులు, ఆల్ ఫ్రెడ్ కజిన్. (1915 – 1998) ఆయన మాటలు అనుభవాలుగా నా చెవుల్లో మార్మోగుతుంటాయి. అసలు చేయకుండా ఉండేకంటే అతిగా చేయడం మంచిది. యౌవనంలో మంచి అలవాట్లను నేర్పడం వల్ల కలిగే మంచి ఫలితాలు జీవితాంతం ఉంటాయి. పరిశీలించడం ద్వారా, చేయడం ద్వారా నేర్చుకుంటాం. ఏ పని చేస్తున్నప్పటికీ, నేర్చుకునే ప్రక్రియ, ఆలోచించే ప్రక్రియలు అందరికీ సమానమే.‘‘నేర్చుకోవడం ఎలాగో నేర్చుకోవడమే జీవితంలో ముఖ్య నైపుణ్యం'' అంటారు ఆంగ్ల రచయిత, విద్యావిషయ సలహాదారు, టోనీ పీటర్ బుజాన్.

ఈ అతిముఖ్యనైపుణ్యాన్ని ఎలా నేర్చుకుంటామో చూద్దాం. నీ కోసం మరొకరు నేర్చుకోలేరు, నీకు నువ్వే బోధించుకోగలవు. నేర్చుకోవడం అంటే ప్రాచీన అర్థం బోధించడం. అంటే నీకు నువ్వే బోధించుకోవడం. దీనిని బట్టి నీకు నువ్వే గురువు. చదవడం ఎలాగో నాకు ఆయన నేర్పాడు. నేను నేర్చుకున్నాను - అనడం సముచితంగా ఉంటుంది. బోధించడం అంటే ప్రదర్శించడం, చూపడం అని అర్థాలు ఉన్నాయి. గురువు విషయాన్ని చూపుతాడు. విద్యార్థి నేర్చుకుంటాడు. గురువుల్లో వరప్రసాదులు ఉంటారు. వారి బోధనలు కూడా ఉన్నతంగా ఉంటాయి. వాళ్లు కేవలం ప్రదర్శించరు, ఇంద్రజాలం చేస్తారు, ఆకర్షిస్తారు, సమ్మోహితులను చేస్తారు, ఉద్దీపన కలగజేస్తారు.

ఈ కోణంలో భాష లక్ష్యం నేర్చుకోవడం. గురువు / బోధకుడు / ఉపాధ్యాయుడు / అధ్యాపకుడు వంటి పేర్లతో గురువును బ్రహ్మ,విష్ణు, మహేశ్వరుల రూపుడిగా ఆరాధించి, అభిమానించి అనాదికాలం నుంచి పూజించే వారు. విద్యార్థులు నేర్చుకోవడానికి దోహదపడేవారు గురువులు. పెద్దలు కూడా ఒక రకంగా గురువులే. వాళ్లు కూడా నేర్చుకోవడానికి సహాయపడే వాళ్లే. మనకు

మనమే నేర్చుకుంటాం అనే తర్కాన్ని అనుసరిస్తే విద్య నేర్చుకోవడానికి సహాయపడేవారు సహాయకులు అనుకోవచ్చు.

మన లక్ష్యం నేర్చుకోవడం కనుక ప్రభుత్వ విద్యాశాఖ అనకుండా ప్రభుత్వ అధ్యయనశాఖ అనడం సముచితం.

"మనిషికి ఏమీ నేర్పలేము, తనలో నిక్షిప్తమై ఉన్న శక్తియుక్తులను తాను ఆవిష్కరించుకోవడానికి సహాయపడగలం అంతే." ఇటాలియన్ ప్రకృతి ప్రేమికుడు, ఖగోళ, గణితశాస్త్రవేత్త, తత్వవేత్త, గలీలియో గలిలై (1564-1642)

"నా విద్యార్థులకు నేను ఎప్పుడూ పాఠాలు చెప్పను. వాళ్లు నేర్చుకోవడానికి అనుకూల వాతావరణం కల్పిస్తాను." ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. మనందరం మనకు మనమే పాఠాలు చెప్పుకుంటాం, కనుక అందరమూ విద్యావేత్తలమే. గురువు లేకుండా శిష్యుడు నేర్చుకోగలడు, కాని శిష్యుడు లేకుండా గురువు బోధించలేడు.

**మనం ఎలా నేర్చుకుంటాం?**

భూగోళం మీద ఉండే ప్రాణులన్నిటిలో బాగా నేర్చుకునే ప్రాణి మనిషి. ఇక్కడ వచ్చే ప్రశ్న ఒకటి. మనం ఎలా నేర్చుకుంటాం?" నేర్చుకునే యంత్రాంగం ఏమిటి? నేర్చుకునే ప్రక్రియ ఏమిటి? ఇదంతా ఎక్కడ జరుగుతుంది, మన మెదడు ఎలా నేర్చుకుంటుంది?" ఎలా? అనేదే కీలకప్రశ్న.

మెదడులో నేర్చుకునే ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఆ ప్రక్రియను గురించి ముందుగా తెలుసుకుంటే దానిని మనం అనుసరించి ఫలితాలను పొందగలుగుతాం, తరువాత దాన్ని మన పిల్లలకు నేర్పగలుగుతాం.

మిరియమ్ – వెబ్ స్టర్ నిఘంటువు ప్రకారం నేర్చుకోవడం: "అధ్యయనం / సాధన / బోధన / అనుభవంతో ఏ విషయంలోనైనా నైపుణ్యం సంపాదించుకునే ప్రక్రియ." నైపుణ్యాన్ని పొందడం అంటే జ్ఞానాన్ని పొందడమే.జ్ఞానాన్వేషణలో, నేర్చుకోవడంలో ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉన్నాయి.

"ఎలా నేర్చుకోవాలో తెలిసిన వాళ్లకు అవసరమైనదంతా తెలిసే ఉంటుంది." అంటారు హెన్రీ ఆడమ్స్

పెద్దవాళ్లమైన మనతో పోలిస్తే ఐదేళ్లలోపు వయసుగల పిల్లలు నేర్చుకోవటంలో

మేధావులు.వాళ్లు ప్రతివిషయాన్నీ నేర్చుకుంటారు, వేగంగా నేర్చుకుంటారు. ఎలా నేర్చుకోవాలో వాళ్లకు తెలుసు.

వాళ్ల మెదడులో అనుసంధాన నాడులు చాలా ఎక్కువగా ఉంటాయి. వాళ్లు లక్షల ప్రశ్నలు అడిగి నేర్చుకుంటారు.

ఇదంతా చిరపరిచయమైన విషయం లాగా అనిపిస్తుందా?

1. నేర్చుకోవడం జ్ఞానాన్ని పొందే ప్రక్రియ.
2. జ్ఞానం జవాబుల సమాహారమే.
3. ప్రశ్నలు లేకుండా జవాబులు ఉండవు.
4. నేర్చుకునే ప్రక్రియ ప్రశ్నలు అడిగే ప్రక్రియ.

**ప్రశ్నల సునామీ**

ఈ పుస్తకంలో – ఆలోచించడం- అనే అధ్యాయంలో పిల్లలు బాల్యంలో, కౌమార దశలో ప్రశ్నల వర్షాన్నే కాదు, సునామీలను సృష్టిస్తారు అని చెప్పాను. 'మమ్మల్ని నేర్చుకోనివ్వండి' అని వాళ్లు పెద్దలను యాచిస్తారు, అభ్యర్థిస్తారు. అవి గూడా ప్రశ్నలు అడిగే పద్ధతులే. అహంభావాలను కూడా పట్టించుకోకుండా వాళ్లు సహజసిద్ధంగా నేర్చుకోవడాన్ని, పెద్దల హెచ్చరికలను దాటి, కొనసాగించడం చూస్తాం. అంతే కాదు, మనం చూసేది వాళ్లు మాటలరూపంలో సంధించిన ప్రశ్నలనే. మనం వినే ప్రతి ప్రశ్నమాటున మనకు వినపడని వేలప్రశ్నలు, నేర్చుకునేవి / విశ్లేషించేవి దాగి ఉంటాయి.ఈ ప్రశ్నల కుంభవృష్టి ద్వారా పిల్లలు సాధించదలచుకున్నది ఏమిటి? ఎలా నేర్చుకోవాలో నేర్చుకుంటున్నారు.

పిల్లలు ఎప్పుడూ నేర్చుకునే (mode) విధానంలోనే సిద్ధంగా ఉంటారు. గర్భంలో పిండంగా ఏర్పడినప్పటి నుంచి పిల్లల్లో సహజంగా జిజ్ఞాస – అర్థం చేసుకోవాలనే తపన ఉంటుంది. ప్రశ్నించడమే నేర్చుకునే ప్రక్రియ అని తెలుసుకోవడానికి ఇంతకంటే రుజువు కావాలా? పెద్దలు వాళ్ల ప్రశ్నల ధాటికి తట్టుకోలేక వాళ్ల నోళ్లు మూయించడమో, మరో అంశం వైపు దృష్టి మరల్చడమో చేస్తారు.

వాళ్లు నేర్చుకునే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంటారు. ఒక రేడియో / సి.డి. ప్లేయరు ఉన్నపుడు ఒక దానిలో కార్యక్రమాలు ఇష్టంగా లేకపోతే మరోదానిని

ఎంచు కున్నట్లుగా వారితో ప్రవర్తిస్తాం. "పెద్దవాళ్ల ప్రవచనాలకంటే పిల్లల ప్రశ్నలనుంచే నేర్చుకోవలసింది ఎక్కువ ఉంటుంది."ఆంగ్ల తత్వవేత్త / వైద్యుడు, క్లాసికల్ ఉదారవాద పిత, జాన్ లాక్. (1632 - 1704)
పిల్లలు ప్రశ్నించకుండా వారిని అణగదొక్కుతూ ఆధిపత్యం చలాయిస్తారు పెద్దలు. అహంకారంతో, పెద్దరికం వల్ల అలా చేస్తారు. పిల్లల ముందు తమకు తెలియదని చెప్పడం తలవంపులు అనిపించి, తాము అమాయకులని ముద్ర పడకుండా చూసుకోవటం కోసం పెద్దలు తంటాలు పడుతుంటారు. వారు పిల్లలలాగా బహిరంగంగా నేర్చుకోవడానికి జంకుతారు.

ప్రశ్న మొదట మెదడులో మొలకెత్తుతుంది. ఆ ప్రశ్నకు జవాబు తట్టకపోతే దానిని ఇతరులను అడుగుతాం. విశ్లేషణాత్మక (నేర్చుకునే) మెదడుకు చేరుస్తాము. బయటినుంచి మన ఇంద్రియాలకు అందిన సమాచారానికి తోడు సహజవిశ్లేషణ (ప్రశ్నించడం) ద్వారా అదనపు సమాచారం(నేర్చుకోవడం) కూడా సేకరించ బడుతుంది. సహజ జిజ్ఞాస ఉన్నదని ప్రదర్శించడానికి తార్కాణమే ఇది.

**జిజ్ఞాస**: జిజ్ఞాసకి గల ఏకైక పరికరం ప్రశ్న. నేర్చుకోవాలనే తపనను ప్రేరేపించేవి జిజ్ఞాస, అవసరం. జ్ఞానసర్వస్వమూ ప్రశ్నలనుంచే చేకూరుతుంది. "అనుభూతులు, ప్రక్రియలు, వస్తువులు, వ్యక్తులు, సంఘటనలను మెదడు నిరంతరంగా విశ్లేషణ చేస్తుంది (ప్రశ్నిస్తుంది).జిజ్ఞాస మానవునికి అవసరం. అది లేకపోతే ప్రశ్నించడం లేదు, సర్దుబాటు లేదు, నేర్చుకోవడం లేదు. ప్రశ్నలు ఆధిపత్యం వహిస్తాయి. ప్రశ్నల సత్తాకు ఉదాహరణ :

**సోక్రటీస్ పద్ధతి**-సోక్రటీస్ బోధించడానికి, ఆలోచించడానికి ఈ విధానాన్ని చెప్పి, చేసిచూపి 2,300 సంవత్సరాలకు పైగా అయింది. ఈ రోజుకూ ఆయన గురువులకు గురువుగా అభిమానించబడుతున్నాడు. ఆయన గమనించిన విషయాలు ఇవి.

"నేనెవరికీ, ఏ విషయమూ నేర్పను, వాళ్లు ఆలోచించేలాగా చెయ్యగలను, అంతే." నేర్చుకోవడానికి సహాయపడే సోక్రటీస్ పద్ధతి న్యాయకళాశాలల్లో అర్ధశతాబ్ది

పైనుంచి వాడబడుతుంది. అక్కడ ఆచార్యుడు ప్రశ్నలు అడగటం ద్వారా విద్యార్థులు నేర్చుకునేలాగా చేస్తాడు.

**ప్రశ్నలు అడగటం ద్వారా రెండు విషయాలు జరుగుతాయి.**

**మొదటిది**: బోధకుడు ఉంటాడు. ఆయనకొక లక్ష్యం ఉంటుంది. ఆయన విద్యార్థికి గల అధ్యయన ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని, దానిని నియంత్రిస్తూ లక్ష్యసాధనకోసం పనిచేస్తాడు. రెండవది."ప్రశ్నలను పట్టించుకోకుండా వదల కూడదు" ఇతరులు అడిగిన ప్రశ్నలను పదేపదే గుర్తు చేసుకుంటుంది మనను.

**ఆలోచించు, ప్రశ్నించు, నేర్చుకో**

ఆలోచించు, ప్రశ్నించు, నేర్చుకో అనే మాటలను సోక్రటీస్ సమాన అర్థాల్లో వాడాడు.ఆయన లక్ష్యం విద్యార్థులు నేర్చుకోవడం. కనుక ఆయన చెప్పినదానిని ఇలాకూడా చెప్పుకోవచ్చు."ఎక్కువగా ప్రశ్నించేవ్యక్తి ఎక్కువ నేర్చుకుంటాడు, ఎక్కువ గుర్తుంచుకుంటాడు." సర్ ఫ్రాన్సిస్ బేకన్

ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ప్రశ్నించడం ఆలోచనకు, నేర్చుకోవడానికి మూల కారణం. మెదడు విశ్లేషణ చేసే అవయవం. విశ్లేషించడం ప్రశ్నించే ప్రక్రియ. సోక్రటీస్ తన శిష్యులు ఆలోచించేలాగా చేయడం మాత్రమే కాదు, ప్రశ్నల ద్వారా అదుపుచేయడమూ నేర్పాడు. నేర్చుకోదలచిన అంశంపైన దృష్టిపెట్టటం నేర్పాడు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మారని జీవితవిధానం ఒక్కటే. అదే ప్రశ్నలు నడిపే జీవితం.సోక్రటీస్ విధానం నేటికీ ఆచరణీయం కావడానికి కారణం ఆయన ప్రశ్నించే విధానమే.

విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులు కావాలని శిక్షణ పొందే విద్యార్థులకు సోక్రటీస్ పద్ధతిలో ప్రశ్నించడం నేర్పుతారు. ఈ విధానం ప్రశ్నలను యాచిస్తుంది. కాని విద్యారంగం అంతటా నిలువునా, అడ్డంగా- పూర్వ పాఠశాల స్థాయి నుంచి పట్టభద్రానంతర స్థాయివరకు, ఈ విధానాన్ని ఎందుకు అమలు చేయరు? తలిదండ్రులకు సోక్రటీస్ విధానం, దాని ప్రభావం ఎందుకు తెలియదు?

దీనిని అందరికీ చేర్చడం విద్యాశాఖ బాధ్యత. లేకపోతే ఇంత సమర్ధవంతమైన,

ప్రయోజనకరమైన జ్ఞానం అడవిలో కాచిన వెన్నెల అవుతుంది! నేర్చుకునే ప్రక్రియ ప్రశ్నలను ప్రేరేపించిదిగా లేకపోతే నిధులు వృధా చేయడమే.

**ఆధునిక కాలపు సోక్రటీస్** - నేడు మనమధ్య ఉన్న మరో గురువును, సోక్రటీస్ మార్గంలో అడుగులు వేసి, అసాధారణ ఫలితాలను చూపుతున్న మేధావిని గురించి తెలుసుకుందాం. ఆయన ఆచార్య జె.డెన్నిస్ హూస్టన్. ఆయన టెక్సాస్ రాష్ట్రంలోని హ్యూస్టన్ లో రైస్ విశ్వవిద్యాలయం నుంచి 50 సంవత్సరాలు ఆంగ్ల ఆచార్యపదవిలో కొనసాగి పదవీవిరమణ చేశారు.

విద్యావేత్తలకు సాధారణంగా పురస్కారాలు తక్కువగా వస్తాయి. సమాజంలో విద్యారంగంలోగల విశిష్ట గురువుల ప్రభావాన్ని గుర్తిస్తూ ఇవ్వబడే పురస్కారాలు అవి. ఆచార్య హ్యూస్టన్ అలాంటి పురస్కారాలను కుప్పలు తెప్పలుగా స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో అందుకున్నారు. ఆయనను దేశ అధ్యక్షుడు జార్జి బుష్ శ్వేతసౌధానికి స్వాగతించాడు.

ఆయన తన సుదీర్ఘబోధనాకాలంలో తన విద్యార్థులు సులభంగా నేర్చుకోవటానికి దోహదపడే, సులభీకరించిన విధానాలను ఆచరించి చూపి, విద్యార్థులపై చూపిన అత్యద్భుత ప్రభావానికి నిదర్శనంగా ఈ పురస్కారాలు అందుకున్నారు. అంతర్జాలంలో చూస్తే స్వయంగా ఆయన వారసత్వసంపదను, కృషిని తెలుసుకోవచ్చు.యూ-ట్యూబ్ లో కొన్ని సోక్రటీస్ శైలీ విన్యాసాల విశేషాలను చూడవచ్చు.

Unconventional Education at Rice– Dennis Huston.

“కళాశాల చదువు అంటే చాలా వాస్తవాలు తెలుసుకోవడం కాదు, మనసుకు ప్రశ్నించడంలో శిక్షణ ఇవ్వడం. అన్నాడు'' ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ప్రశ్న మెదడు గోడలను చీల్చుకొని లోపలికి పోతుంది. అది బయటి నుంచి వచ్చే చొరబాటుదారు కాదు. అది మెదడుకు అర్థం అయే భాషను మాట్లాడుతుంది.

**ప్రకృతి + పోషణ**- ప్రశ్నించడం ఎలాగో ఎవరూ పిల్లలకు నేర్పే అవసరం లేదు. మనం ప్రకృతికి పోషణ జతపరిస్తే చాలు. ప్రశ్నించే నైపుణ్యాన్ని ప్రోత్సహించి, పెంచితే చాలు.

వాళ్లలో గల ప్రశ్నించే సామర్థ్యాన్ని, తద్వారా ఆలోచనాసామర్థ్యాన్ని, నేర్చుకునే

శక్తిని పెంచగలుగుతాం.
పెద్దలు తాము ఆదర్శవంతంగా ఉండి పిల్లలకు మార్గదర్శకులు కావచ్చు.
ప్రశ్నలు మానవుని జిజ్ఞాసకి సహజ ప్రతినిధులు. ప్రశ్నలను పరిమితం చేయడం ప్రకృతికి విరుద్ధం. ''ప్రశ్నలు ఎలా అడగాలో తెలిసిన వాళ్లు మరింకేమీ నేర్చుకోవలసిన అవసరం లేదు. జీవితంలో అత్యంత ముఖ్య నైపుణ్యం ప్రశ్నించడం నేర్చుకోవడమే''. ఆంథొని బుజాన్
నేర్చుకోవడానికి దోహదపడే వ్యక్తి ముందుగా ప్రశ్నలు రావడానికి ప్రేరేపించే వాడై ఉంటాడు. ''ఆలోచించడం (ప్రశ్నించడం) చేతనైన వాళ్లకు ఉపాధ్యాయులతో అవసరం లేదు" అన్నారు మహాత్మా గాంధీ. ప్రశ్నించే ప్రక్రియ అధ్యయనంలో అంతర్భాగమై ఉంటుంది. "నేర్చుకోవడం నేర్చిన వాళ్లకు తెలియనివి ఏవీ ఉండవు."ప్రశ్నించడం ఎలాగో తెలిసిన వాళ్లకు తెలియనిది ఏదీ ఉండదు.

**సహజ అధ్యయనం**

1. మన మెదడులో ఇప్పటికే ఉన్న అవగాహనకు తోడుగా కొత్త సమాచారాన్ని జోడించడమే నేర్చుకోవడం. పాత సమాచారానికి (జ్ఞానానికి) కొత్త సమాచారం కలపడం. ఇందులో చాలా భాగం మనకు తెలియకుండానే జరుగుతుంది. దానివల్ల అతీంద్రియజ్ఞానాలు, జ్ఞానోదయాలు కలిగినట్లు అనుభూతి కల్గుతుంది. ఇవి జవాబులు కనుక అచేతనాస్థితి నుంచే వస్తాయి.
2. నేర్చుకోవడం ఒక విశ్లేషణా ప్రక్రియ. బాహ్యప్రపంచపు సంబంధాలను, ఇంద్రియాల ద్వారా విశ్లేషించటం, ఓ నేపధ్యంతో చూడటం, పోల్చడం, సమైక్యం చేయడం, ప్రాధాన్యతలు కల్పించడం. ప్రశ్నించే ప్రక్రియలను అనుసరించి వచ్చే జవాబుల ఫలితమే నేర్చుకునేది.
"సందేహాలు తీర్చుకోవడానికి సందేహించే వాడు, సిగ్గుపడేవాడు, వెనకాడే వాడు, నేర్చుకోవడానికి సిగ్గు పడినట్లే''. డేనిష్ సామెత
సోక్రటీస్ భాష చాలా సరళంగా, సులభంగా ఉంటుంది. దానికి అనువాదం కూడా అంత కష్టం కాదు.
కంప్యూటరుకు అర్ధమయ్యే భాష -0-1- ల రూపంలో ఉంటుంది.
మెదడు అనే మహా కంప్యూటర్‌కు కూడా ఒక భాష ఉంటుంది. అందులో

సున్నలు, ఒకట్లు ఉండవు. మెదడుకు అర్ధమయ్యే భాషలో ప్రశ్నలు ఉంటాయి. అవి విశ్లేషణ చేసేవిగా ఉండాలి.

మన మెదడు లాగానే కంప్యూటరులో కొన్ని భాగాలు ఒకే రకమైన పనులు చేసేవి ఉన్నాయి. అది కాకతాళీయం కాకపోవచ్చు.రెంటికీ సమాచారాన్ని లోనికి పంపే భాగాలు, బయటకు పంపే భాగాలూ, విశ్లేషించే నిర్వహణా వ్యవస్థ, జ్ఞాపకశక్తి నిల్వసామర్ధ్యం ఉన్నాయి. ఇవి ఆలోచనలో మూడు దశలుగా పనిచేస్తాయి. ఉద్దీపన, ప్రశ్న, జవాబు.

కన్ ఫ్యూజియస్ చెప్పిన సామెత : “నాకు చెప్పండి, నేను మరచిపోతాను, నాకు చూపండి, నేను గుర్తుంచుకోవచ్చు,నన్ను లీనం చేయండి.అర్థం చేసుకుంటాను.”

**సోక్రటీస్ మరో పరిశీలన:**

“మానవ మేధస్సులో అత్యంత అధిక స్థితి తనను తాను ప్రశ్నించుకోవడం, ఇతరులను ప్రశ్నించడం.”

సుభాషితాలు వల్లె వేయడమే కాదు, వాటిని అక్షరాలా ఆచరించి చూపాలి, రెండూ విడదీయలేనంతగా ఏకమైనవి – అన్నాడు రెనీ డెకార్ట్

ఏదో ఒక విషయాన్ని నేర్చుకోకుండా దాన్ని గురించి ఆలోచించలేము. దేనినీ ఆలోచించకుండా నేర్చుకోలేము.

ప్రశ్న అధ్యయనానికి దోహదపడే పరికరం. అది అధ్యయనానికి కేంద్రబిందువు, ఉపాంగం కాదు, ప్రధానాంగం. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఏ తల్లిదండ్రులైనా, బోధకుడైనా తమ దృష్టిని, నైపుణ్యాన్ని తగిన ప్రశ్నలను, తగిన సమయంలో, తగిన క్రమంలో అడగాలి.

1.ఉద్దీపన కలిగించేది 2.ప్రశ్న 3. జవాబు.

జ్ఞాన అన్వేషణలో ప్రశ్నలు , జవాబులు మాత్రమే ఉంటాయి. ప్రశ్నించే ప్రక్రియను పనిచేసేలాగా చేస్తుంది ఉద్దీపన. దీనినే ప్రేరేపణ, ఉత్సాహం, ప్రోత్సాహం, కారణం, నడిపేది, తార్కికత వంటి పలు పేర్లతో గూడా పిలుస్తాము. ఉద్దీపనల్లో చాలా భాగం మన పరిసరాల నుంచి అనేక ఇంద్రియాల ద్వారా

ప్రేరేపితమౌతాయి. (కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మము) ఎవరైనా మనను ప్రశ్నిస్తే గట్టి ప్రేరణ కలగవచ్చు.
ఈ ఉద్దీపన మంచి ముత్యం తయారుకావడానికి దోహదపడే చిన్న ఇసుకరేణువు వంటిదే. ఇసుకరేణువు ముత్యం తయారు కావడానికి కారకం అయింది. అలాగే మేధోవంతమైన ఉద్దీపన చుట్టూ ఒక ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. దానిని కేంద్రక ఉద్దీపన అనుకుందాం, లేదా మెదడుకు మేత అనుకోవచ్చు. ఎందుకంటే ప్రశ్నను రేకెత్తించిన ఉద్దీపన విత్తనం, కేంద్రకం.
అధ్యయనం అనుకూలంగా సాగే వాతావరణాన్ని కలిగించడం ప్రేరకుని బోధకుడి బాధ్యత. ఆకలిగొన్న బిడ్డకు పదేపదే అవసరాన్ని బట్టి ఆహారం అందించినట్లుగా ప్రేరణను అందిస్తుండాలి. అంతుచిక్కని రహస్యాలను సృష్టించగలిగితే జిజ్ఞాస కలుగుతుంది. జిజ్ఞాస కలిగితే ప్రశ్నలు మొలకెత్తుతాయి. అప్పుడు దీనిలో తగు పాళ్లలో ఆటలు, వినోదం జోడించాలి. అంతే కాని తెరలపై ఊపిరిసలపని విన్యాసాలు, ఒంటరి కాలక్షేపాలు కావు. పిల్లలు తమ శక్తిమేరకు ఎదగాలంటే కల్పించవలసిన వాతావరణం అలాంటిదే. విద్యావ్యవస్థల్లో ఏమి ఆలోచించాలో చెపుతారు, కాని ఎలా ఆలోచించాలో ఏ మాత్రం చెప్పరు.

## The Common Core- **ఉమ్మడి మూలాలు**

“లెక్కలు, ఇంగ్లిష్, భాషలు, కళలు,భాషను రాయటంలో పట్టు వంటివి విద్యా విషయాలన్నిటిలో సామాన్యంగా ఉండేవి. ప్రతి తరగతి తరువాత ఏమేమి నేర్చుకోవాలనే లక్ష్యాలు గురువులకు, శిష్యులకుముందే తెలిసి ఉంటాయి.
ప్రశ్నలు లేకుండా ఏ ఉత్తమప్రమాణాలు కూడా సాధించలేము. ప్రశ్నల నాణ్యత పెరగనిదే ప్రమాణాల నాణ్యత పెరగదు. అధ్యయనం అంతటికీ, దాని మూల ప్రణాళికకూ ప్రాణం ప్రశ్నయే.

Those who don’t learn don’t question.

**నేర్చుకొనని వాళ్లు ప్రశ్నించలేరు.**

Those who don’t question don’t learn.

**ప్రశ్నించనివాళ్లు నేర్చుకోలేరు.**

ప్రశ్నించడాన్ని నిరుత్సాహపరచడం నేర్చుకోవడాన్ని నిరుత్సాహపరచడమే.

ప్రశ్నించడం పట్ల విముఖత చూపడం నేర్చుకోవడం పట్ల విముఖతే. ప్రశ్నించడాన్ని ఆహ్వానించడం అధ్యయనాన్ని ఆహ్వానించడమే.

**లక్ష్యం ప్రగతి, పరిపూర్ణత కాదు**

తీవ్రమైన మార్పులు వేగంగా వస్తున్న ఈ కాలంలో భవిష్యత్తు అంతా నేర్చుకునే వాళ్లదే(ప్రశ్నించే వాళ్లదే). ఇంతవరకూ లేని ప్రపంచంలో (రాబోయే నవతరంలో) జీవించేవాళ్లలో ప్రశ్నించే వాళ్లే సన్నద్ధులుగా ఉంటారు." అమెరికన్ నైతిక, సామాజిక తత్వవేత్త, రాష్ట్రపతి స్వేచ్ఛాపతక గ్రహీత ఎరిక్ హాఫర్ (1902 –1983) ఉరుకులు, పరుగులతో ఊపందుకొని దూసుకు వస్తున్న సాంకేతిక ప్రగతి నేపథ్యంలో ఈ మాటలు కఠోరసత్యాలు.

ఎక్కువప్రశ్నలు అడుగు, ఇంకా ఎక్కువగా, ఇంకా బాగా అడగడం నేర్చుకో, లేకపోతే వెనకబడిపోతావు.

ఎక్కడ రహస్యం ఉంటే అక్కడ జిజ్ఞాస ఉంటుంది. ఈ రెండు తల్లీ, పిల్లల వంటివి. ఈ రెండూ ఉన్నచోట ప్రశ్నలు పిలకలు వేస్తాయి.

ఏ ఇద్దరు వ్యక్తులూ ఒకే రకంగా ఉండరు. మనం వేరువేరు రకాలుగా నేర్చుకుంటాం. అందువల్ల మనం ప్రశ్నలు వేర్వేరుగా ఉంటాయి.

పిల్లలు ప్రశ్నలు అడగకుండా పెద్దలు ఆంక్షలు విధించవద్దు. విద్యార్థులు ప్రశ్నలు వేయకుండా గురువులు ఆపొద్దు. ప్రశ్నలు అడగనివ్వకపోతే వాళ్లు ఎదుగుదలకు ఆటంకాలు కల్పించినట్లే.

నేర్చుకోవడంలో రెండు విభాగాలు ఉన్నాయి.

తెలిసి గానీ, తెలియకుండా గానీ ప్రశ్నించడం వల్లనే **జ్ఞానసముపార్జన** సాధ్యమే.

**జ్ఞానపరిరక్షణ**–''ఎక్కువగా ప్రశ్నించేవాళ్లు ఎక్కువ నేర్చుకుంటారు, ఎక్కువ గుర్తుంచుకుంటారు''. సర్ ఫ్రాన్సిస్ బేకన్

**ప్రశ్న నిమగ్నం చేస్తుంది. ఇతరులు పాలుపంచుకునేలాగా చేస్తుంది.**

విద్యారంగంలో "Active Learning" అనే పదాన్ని తరచుగా వాడుతుంటారు. అది 1990 ప్రాంతాలలో వాడుకలోకి వచ్చింది. అది తలలో పేల గుడ్లను ఏరినట్లుగా ఉండవచ్చు. నేర్చుకున్నంత సేపు మెదడు చురుకుగా ఉంటుంది.

దీనిని "Engaged Involved Learning" లీనమైన అధ్యయనం, తన్మయమై నేర్చుకోవడం – అనవచ్చు. ఈ విధానం విద్యార్థులు నేర్చుకోవడంలో రెండు రకాలుగా భాగస్వాములను చేస్తుంది.
పనులు చేయడం, చేస్తున్న పనులను గురించి ఆలోచించడం. కేవలం వినడం మాత్రమే కాదు. చదవడం, రాయడం, చర్చించడం, సమస్యలను పరిష్కరించడం -అన్నీ తగుపాళ్లలో మేళవించబడి ఉంటాయి. నేర్చుకునే బాధ్యత నేర్చుకునే వారిపై ఉంటుంది.

ప్రశ్నల వల్ల జ్ఞాపకశక్తి పటిష్టం అవుతుంది. అభిలాష బలపడుతుంది. జిజ్ఞాస ఒక తపన. అది ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడానికి సహాయపడుతుంది.
జ్ఞానసముపార్జనకు మానసిక, శారీరక సుముఖత అవసరం. తెలుసుకున్న జ్ఞానాన్ని అన్వయించడానికి నిరంతర సాధన కావాలి. చైతన్యంతో (తెలిసి) (స్పృహతో) చేసే పనిని అచేతనంగా చేసేలాగా మార్చే ప్రక్రియ సాధన.ఒకసారి జవాబు దొరికిందంటే ఆ సమాచారాన్ని చాలా కాలం పదిలంగా దాచుకుంటాం.

విద్యా సంస్థల ప్రాథమిక లక్ష్యం విద్యార్థులు జీవితాంతమూ నేర్చుకునేలా చూడటమే.మనందరమూ గురువులమే. ఉదాహరణలను చూపుతూ బోధిస్తాము.
"ప్రభావితం చేయడానికి ఉదాహరణే ఏకైక అంశం."అన్నారు నోబెల్ బహుమతి గ్రహీత, ఫ్రెంచ్,జర్మన్ తత్వవేత్త, సంగీతకారుడు, రచయిత, వైద్యుడు, సమరేయుడు.(1875 – 1965) ఆల్బర్ట్ ష్విట్జర్.
ప్రశ్నించడం అంటే నేర్చుకోవడం. మనిషి రూపుదిద్దుకోవటానికి తోడ్పడే ప్రక్రియ విద్య, అదొక సంస్థ కాదు.

**మార్పును ప్రతిఘటించడం**

"ప్రపంచం మార్పును అసహ్యించుకుంటుది, ఇష్టపడదు. కాని మార్పు మాత్రమే ప్రగతిని తెస్తుంది." అమెరికన్ ఆవిష్కర్త,ఇంజనీర్, వ్యాపారి, జనరల్ మోటార్స్ పరిశోధన పెద్దగా 1920 to 1947 వరకు పనిచేసి 186 పేటెంట్ హక్కులు పొందిన చార్లెస్ కెటరింగ్ (1876 –1958)

"అభివృద్ధి అనేది చాలా అందమైన మాట, మార్పు దానిని ప్రోత్సహించే అంశం.మార్పుకు శత్రువులు ఉన్నారు." అమెరికా అటార్నీ జనరల్, సలహాదారు, రాబర్ట్ యఫ్. కెనెడీ (1925-1968) ప్రగతి రథచక్రాలు కదలకుండా చేసేది బ్యూరోక్రసి. అన్ని వేళల్లో మనం మారుతున్నాం, కాని అదెన్నడూ మారదు.

**ప్రశ్నలు ప్రగతికి రాజబాటలు**

మనం మారుతున్నామా లేదా అనేది ప్రశ్న కాదు, ఎంత మారుతున్నాం? ఏ దిశలో మారుతున్నాం? అనేవి చూడాలి. దేనినైనా ఎంచుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం మన ఇష్టం పైన ఆధారపడి ఉంటాయి."స్థిరత్వం వల్ల ప్రయోజనం ఉండదు, దానివల్ల నువ్వు ఏడాది క్రితం ఉన్నట్లే ఇవాళ కూడా ఉంటావు." అమెరికన్ కళా విమర్శకుడు, బెర్నార్డ్ బెరెన్సన్ ,(1865-1959)

పిల్లలు అప్పుడప్పుడు అద్భుతమైన, దూరదృష్టిగల మాటలను, ఆశ్చర్యం కలిగించే విషయాలను చెపుతుంటారు. అవి పెద్దలకు కూడా ఆ పరిస్థితులకు తగిన జ్ఞానోదయం, అవగాహన కలిగించేవిగా ఉంటాయి. (ఆ మాటలను మనం వినగలిగితేనే).. బైబిల్ - మత్తయి సువార్తలో 20:16 లోని ప్రవచనసారం ఇది.

"వ్యక్తిని ( మనిషిని / బిడ్డను / విద్యార్థిని) తాను చెప్పే జవాబులను బట్టి గాక అతను అడిగే ప్రశ్నలను బట్టి అంచనా వేయండి. " అన్నాడు ఫ్రెంచ్ రచయిత, చరిత్రకారుడు, తత్వవేత్త, వాల్టెయిర్ (1694 – 1778)

"పెద్దల ప్రసంగాలకంటే పిల్లలనుంచి వచ్చిన ఆశించని ప్రశ్నలనుంచే నేర్చుకోవలసింది తరచుగా ఎక్కువ ఉంటుంది'' జాన్ లాక్.

"చెప్పిన విధంగా పిల్లవాడు నేర్చుకోకపోతే, అతను నేర్చుకునే విధంగా చెప్పగలగాలి" ఇగ్నాషియో ఎస్ట్రాడా

"పాఠశాలల ప్రాథమిక కర్తవ్యం పిల్లలు ప్రశ్నలు అడగకుండా ఉండటానికి

సరిపోయే వాస్తవాలను తెలియజెప్పగలగడమే అనుకుంటారు. కాని కొందరు పిల్లలు ప్రశ్నించకుండా ఆగరు, ప్రశ్నిస్తూనే ఉంటారు. వాళ్లే శాస్త్రవేత్తలు అవుతారు. నేను ఎప్పుడూ ప్రశ్నలు అడగకుండా ఆగలేదు." డ్యూక్ విశ్వ విద్యాలయపు శరీరధర్మశాస్త్ర ఆచార్యుడు, స్కిమిడ్ట్ నైల్సన్. (1915 – 2007)

"విద్య వాస్తవలక్ష్యం (విద్యార్థి) నిరంతరం ప్రశ్నలు వేస్తూనే ఉండేలాగా చేయడం" మాన్ డెల్ క్రెయిటన్. (1843 – 1901)

"ఒక గురువు గొప్పవాడా? కాదా? అని తెలుసుకోవడానికి అడగ్గానే , విద్యార్థులు తడుముకోకుండా ప్రశ్నలకు జవాబులు చెప్పగలగడం కొలమానం కాదు, విద్యార్థుల ప్రశ్నలకు గురువే జవాబు చెప్పలేకుండా ఉండాలి.

ఆ స్థాయి ప్రశ్నలు వేయడం నేర్పగలిగిన వాడే గొప్ప గురువు." విద్యావేత్త, అలైస్ వెలింగ్టన్(1847 – 1897)

"ప్రశ్నలు అడగటం కళ, శాస్త్రజ్ఞానానికి అంతటికీ ఇదే మూలం." అమెరికన్ నవలాకారుడు, థామస్ బర్గర్ (1924- 2014)

గురువు తన విద్యార్థుల్లో గల సామర్థ్యాన్ని పూర్తిగా నమ్మాలి. తన సామర్థ్యాన్ని అంతా ఉపయోగించి విద్యార్థి స్వయంసామర్థ్యాన్ని సాధించేలాగా చేయాలి." ఆస్ట్రియా దేశపు మానసిక వైద్యుడు, 'ఆత్మన్యూనతా భావం' అనే పదాన్ని మొదట వాడిన ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ (1870-1937). అవును, ప్రదేశం, కాలం, సంస్కృతులు మారినా ఈ పరిశీలన స్థిరంగా ఉంటుంది. వ్యక్తులు ఏ వయసు వారైనా తమ సహాధ్యాయులతో పాటు బాగా నేర్చుకుంటారు. నేర్చుకునే వ్యక్తి దృక్కోణం వేరు, నేర్పే వ్యక్తి దృక్కోణం వేరు. నేర్పే వాళ్లు తమ అంశంలో నిపుణులు.

పిల్లలు వాళ్ల వయసును బట్టి, ఎదుగుదల స్థాయిని బట్టి వైవిధ్యం కల ప్రశ్నలు అడుగుతుంటారు. నేర్చుకునే వారిని పెద్దల ఆలోచనా మార్గంలోకి తీసుకురావాలంటే పెద్దలు పిన్నల దారిలోకి వెళ్లితీరాలి. దారి చూపాలంటే ముందుగా వాళ్ల బాటను అనుసరించాలి." బ్రిటీష్ రచయిత, విలియమ్ హేజ్‌లెట్ (1778-1830) ప్రశ్నలు అడగడంలో ప్రావీణ్యంలేని వ్యక్తి, ప్రశ్నలు అడగమని విద్యార్థులను స్వాగతించని వ్యక్తి, విద్యార్థుల జిజ్ఞాసని రగిలించలేని వ్యక్తి, అడిగిన

ప్రశ్నలకు సరిగా స్పందించని వ్యక్తి మంచి గురువే కాలేడు.
ప్రతి తరగతి, ప్రతి అధ్యాయం ముందు నేర్చుకునే ప్రక్రియను ముందుకు పంపే వీలుగా ప్రశ్నలు ఉండాలి. అలాంటి ప్రశ్నలు మనసును అన్వేషణలో, విశ్లేషణలో, ఆశ్చర్యంలో ముంచాలి.
తరువాత ఏం జరగబోతున్నదో తెలుసుకోవాలనే జిజ్ఞాసని పరాకాష్టకు చేర్చాలి. పిల్లలచేత ఎవరికి ఎక్కువ జవాబులు వస్తాయోనని ఆటల్లాగా ఆడించాలి.
"అహంకారం, అజ్ఞానం కలసి పుట్టిపెరుగుతాయి. ఒకటి మరొక దానిని మరొకటి పోషిస్తుంది."బ్రిటీష్ క్రీడాకారుడు, రచయిత, చార్లెస్ కాలెబ్ కాల్టన్, (1780-1832)
"నాకు తెలియదు" అనే మాట అనవద్దని నీ నాలుకకు నేర్పు. అప్పుడే నీ ప్రగతి ప్రారంభం అవుతుంది." స్పానిష్, యూదు తత్వవేత్త, ఖగోళశాస్త్రవేత్త, మైమాండైడ్స్(1135 – 1204)
అహంకారాన్ని పారదోలే దాకా, అమాయకత్వం నుంచి బయటపడలేము.

**తరగతి గదుల్లో జరిగే హాని**:

కొంతమంది ఉపాధ్యాయులు తరగతిలో పిల్లలు ప్రశ్నించం ఇష్టపడరు. అలా అనుమతిస్తే తరగతి గజిబిజిగా మారుతుందట, పాఠాలు సాగవట. అర్థం కాకుండా పాఠాలు చెపుతూ కాలక్షేపంగా, గానుగ ఎద్దులను తిప్పినట్లు పాఠాలు చెపుతుంటే లక్షల గంటల మానవశ్రమ వృధా అయిపోతుంది.
మానవుల జిజ్ఞాసని తక్కువగా అంచనా వేయగూడదు. రహదారులమీద, ప్రతి యేటా మనం కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తుంటాం. వ్యక్తుల జీవితాలలో కోట్ల గంటలను వెచ్చిస్తుంటాం. పనిగంటలు వృధా, లక్షల లీటర్ల వాహనాల ఇంధనం ఖర్చు వృధా. రవాణా ఆలస్యం ఇష్టం ఉండదు. రవాణాను తిడుతుంటాము, శాపాలు పెడుతుంటాం, అయినా రవాణా నత్తనడక నడుస్తుంటుంది.
ఎదురుగా వచ్చే రహదారిపైన ప్రమాదం జరిగితే దానిని చూడాలని జిజ్ఞాస ఉంటుంది. మానవుడికి జిజ్ఞాస లేకుండా ఉండాలంటే గర్వం గాని, తెచ్చిపెట్టుకున్న భయం కాని ఉండాలి.
మూర్ఖులు ప్రశ్నించరు. మందమతులు ప్రశ్నించలేరు. బానిసలు ప్రశ్నించే

సాహసం చేయరు. ప్రశ్న మెదడులోకి చొరబడకుండా ఆపలేము. అది కలవరం సృష్టించకుండా ఆపలేము. ప్రశ్న తరగతిలో మిగతా పిల్లలందరి దృష్టిని ఆకర్షించక మానదు. వాళ్లంతా గురువు గారి ప్రశ్నను, తోటి విద్యార్థి జవాబును తెలుసుకోవాలని జిజ్ఞాసగా ఎదురు చూస్తారు. ఎక్కడా అరాచకం లేదు.

జిజ్ఞాస కలిగినవాళ్లు విజయం సాధిస్తారు. కళాశాల విద్యార్థులు, వాళ్ల తల్లి దండ్రులు వీలయినన్ని ఎక్కువ ప్రశ్నలు అడగడానికి గురువులకు డబ్బు చెల్లిస్తున్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగకపోతే పెద్దల డబ్బు వృధా చేసినట్లే. తల్లిదండ్రుల శ్రమ వృధా అయినట్లే.

తినమని పిల్లవాడిని బలవంతం చేయలేము, కాని అతని ఆకలి తీర్చగలం. విద్యార్థులను నేర్చుకోమని బలవంతం చేయలేము. నేర్చుకోవాలనే వారి తృష్ణ తీర్చగలం. ముందుగా ఆకలి పెంచే మందులు ఇవ్వడం మన పాత్ర. తరువాత ప్రధాన ఆహారం ఇస్తూ ఉండాలి. ప్రశ్నలు అడగటం ద్వారా విద్యార్థులు ఉపాధ్యాయునికి / తోటి విద్యార్థులకు ఒక బహుమానం ఇచ్చినట్లే. వీరంతా ప్రశ్న వల్ల ప్రయోజనం పొందుతున్న వాళ్లు. తరానికి మరో తరానికి అంతరాలు ఉండటం మామూలే. కాని ఆ అంతరాలు గత కొన్ని తరాలలో మరీ ఎక్కువగా పెరుగుతున్నాయి.ఈ వ్యవధిని మరోవైపు నుంచి పెద్దలు ఎలా చూడగలరు? ఇంతకు ముందు చెప్పినట్లుగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కళాశాలలు ఈ అంతరాన్ని తగ్గించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పెద్దలు మానసికంగా, భావోద్వేగాలు, హార్మోనులు, సంస్కృతి పరంగా పిల్లల స్థాయికి దిగి రాలేరు.

**తరచుగా అడిగే ప్రశ్నలు**

ఖర్చులు తగ్గించుకునే మార్గాలు : తమకు స్వంత వెబ్ లు గల కంపెనీల వారు వినియోగదారులు తరచుగా అడిగే ప్రశ్నలను(Frequently Asked Questions) గుర్తించి వాటికి మనుష్యుల ద్వారా కాకుండా నేరుగా కంప్యూటరు ద్వారా జవాబులు చెప్పిస్తున్నారు. ఇలా చేయడం వల్ల నిర్వహణ వ్యయం తగ్గుతుంది, సమయం ఆదా అవుతుంది, సేవల నాణ్యత పెరుగుతుంది. ఇది సంస్థకు వినియోగదారులకు లాభదాయకం.

“బిడ్డలు చాలా తేలికగా నేర్చుకుంటారు. ఎందుకంటే వారికి ప్రశ్నలు అడిగే

సహజ సామర్థ్యం వరంగా వుంటుంది. కాని పెద్దలు నియంతలు. సహజ వరాలను పట్టించుకోరు. తాము నేర్చుకున్న విధంగానే తమ పిల్లలు కూడా నేర్చుకోవాలని మొండిగా ఉంటారు.

బలవంతంగా వారు నేర్చుకున్న పాఠాలనే పిల్లల మానసిక పోషణకు అందిస్తారు" అన్నారు. భారతీయ కవి, నాటకకర్త, వ్యాసకర్త,1913 లో నోబెల్ పురస్కార గ్రహీత విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ (1861-1941)

ఈ ప్రక్రియను ఎందుకు ఆచరించగూడదు? సాధారణంగా, అనేక విషయాలపై అడగబడే ప్రశ్నలను సేకరించి, పట్టికగా కూర్చి అడుగుతుంటే అనేక లాభాలు కలుగుతాయి.

అత్యుత్తమ ప్రశ్నలు అడిగేవాడే నిపుణుడు.

నేర్చుకోవడానికి జిజ్ఞాస కలవాడంటే ప్రశ్నించడానికి జిజ్ఞాస కలవాడే.

**"మరో అందమైన ప్రశ్న"** వారెన్ బెర్గర్ అమెరికన్ పాత్రికేయుడు.-మరింత అందమైన ప్రశ్న-అనే వెబ్ సైట్ ను నిర్వహిస్తున్నాడు. అదే పేరుతో ఒక పుస్తకం కూడా రాశాడు. ఆ వెబ్ లో మనం ఎలా నేర్చుకుంటాం అని బాగా రాసిఉంది. గాని ప్రశ్నలపట్ల ఆయనకున్న వైఖరి మాత్రం చాలా విలక్షణంగా ఉంటుంది. ప్రశ్నించే సంస్కృతి గురించి చెప్పాడు. ఏ ఒక్కరూ ప్రతి ఒక్కరిలాగా చురుకైన వారిగా ఉండరు గదా!

నేను ఆ వెబ్ నుంచి కొన్ని విషయాలు తీసుకున్నాను. "పిల్లలు 2 నుండి 5 ఏళ్ల మధ్యకాలంలో సగటున 40,000 ప్రశ్నలు అడుగుతారు. దురదృష్టవశాత్తు" 5-6 సంవత్సరాల మధ్యకాలంలో ప్రశ్నించడం శిఖరంపై నుంచి జారిపోయినట్లుగా తగ్గుతుంది." వారెన్ బెర్గర్

**విద్యార్థులు మంచి ప్రశ్నలు అడిగేలా చేయడానికి ఐదు సూత్రాలు.**

### 1. సురక్షితంగా చేయండి

"ఇది చాలా ముఖ్యమైనది" అంటాడు బర్గర్. చాలామంది పిల్లలు తరగతిలో మిగతా పిల్లలందరి ముందు ప్రశ్న అడగటానికై చేయి ఎత్తడానికి బిడియ పడతారు, ఉద్రిక్తతకు లోనవుతారు. "భయం జిజ్ఞాసని చంపేస్తుంది" బర్గర్

భయమూ, జిజ్ఞాస ఒకదానితో మరొకటి కలవవు. అందరిముందు ప్రశ్న

అడగటానికి భయపడే కుర్రవాడు కొద్దిమంది ముందు అడగటానికి / ప్రశ్నను కాగితం మీద రాసి ఇవ్వడానికి భయపడకపోవచ్చు. అటువంటి వారికోసం గురువు తరగతిని చిన్న బృందాలుగా చేసి అడగటాన్ని ప్రోత్సహించవచ్చు.

మంచి ప్రశ్నలు అడగటానికి అనుభవం కావాలి. పిల్లలనుంచి అంత స్థాయిని వెంటనే ఆశించగూడదు.

### 2. ప్రశాంతంగా ప్రశ్నించండి

మంచి ప్రశ్నలు అడిగేవాళ్లు ప్రశాంతంగా ఉంటారు. ప్రశ్నలు అడిగే వాళ్లు నూతన పద్ధతుల్లో ఉంటారు. ప్రశ్నలు వేసే పిల్లలు అన్వేషకులు, వింతగా ప్రవర్తించే వాళ్లు అయి ఉంటారు.

ప్రశ్నలు వ్యక్తులను ఇబ్బంది పెడతాయి. ముఖ్యంగా అవి నిజాన్ని గురించి అడిగినప్పుడు నువ్వు గనుక ప్రశ్నించే వ్యక్తివి అయితే, నీ ప్రశ్నల ద్వారా చాలా ఇబ్బంది పెట్టే అవకాశం ఎక్కువ. అది యువకుల దృష్టిని ఆకర్షించవచ్చు.

### 3. తమాషాలాగా అడగడం మేలు

ప్రశ్నలను కేవలం ఏదో తేలికగా ఆటలు ఆడుకున్నట్లుగా అడగవచ్చు. అపరాధ పరిశోధకునిలాగా మెల్లగా చొచ్చుకుపోతూ సమాచారం సేకరించడమూ మంచిదే. పిల్లలచేత బహిరంగ ప్రశ్నల ఆటలు ఆడించవచ్చు. రకరకాల ప్రశ్నలను వాళ్లకు పరిచయం చేయొచ్చు. పరిమిత ప్రశ్నలు కూడా అడగవచ్చు. బహిరంగ ప్రశ్నలకు, పరిమిత ప్రశ్నలకు గల తేడాలు సోదాహరణంగా చెప్తే చాలా ఉపయోగం. ఎందుకు? ప్రశ్నలతో ప్రారంభించి, అయితే ఏమిటి? ప్రశ్నలను అడగాలి. తర్వాత ఎలా మనం? తో చర్చలు కొనసాగించి పరిష్కారాలు చూపవచ్చు. ఎలా చేస్తే బాగుంటుంది? ఎందుకు మనం చేసి తీరాలి? వంటి ప్రశ్నలతో ఆటను కొనసాగించవచ్చు. ఇలా ప్రశ్నిస్తుంటే పిల్లల్లో మదింపు చెయ్యటం ఎలాగో తెలుసుకునే శక్తి పెరుగుతుంది.

### 4. ప్రతిఫలాన్ని ఇచ్చేవిగా ఉండాలి

అడిగే ప్రశ్నలు ఆలోచనా శక్తిని ప్రేరేపించేవిగా ఉండాలి. నవ్వుతూ అడిగే మాటలుగా అనిపించాలి. చాలామంది విద్యార్థులు గురువుల పొగడ్తలు వినడానికి ఇష్టపడతారు. వాటిలో సారం లేకపోయినా, మొక్కుబడిగా చెప్పే, 'మంచిది',

'చాలా మంచిది', 'గుడ్', 'వెరీ గుడ్', 'నైస్', వంటివైనా సరే. కాస్త ఆకలిని తీరుస్తాయి. ప్రత్యేకంగా విద్యార్థిలో గల ఏదో సుగుణాన్ని పైకెత్తి చూపుతూ ప్రశంసిస్తే ఆ ప్రశంస మరింత బాగా, చాలా బాగా పనిచేసి, ఎక్కువ కాలము గుర్తుండి అదొక ఉద్దీపనగా నిలుస్తుంది.

ప్రశ్నించే వారిలో నిజమైన జిజ్ఞాస కనిపిస్తే విద్యార్థులకు గూడా జిజ్ఞాస కలుగుతుంది. 'అది గొప్ప ప్రశ్న', 'అది చాలా లోతైన ప్రశ్న', 'నీ ప్రశ్న కీలకమైనది', వంటి ప్రశంసలను గురువు ద్వారా విన్న విద్యార్థులు పరవశిస్తారు. నకిలీ ప్రశంసలను పిల్లలు ఇట్టే పట్టేస్తారు.

దాహం వేస్తున్నప్పుడు మంచి నీళ్లు దొరకక పోతే మురికి నీళ్లు అయినా తాగుతాము. అలాగే ప్రశంసలు లేనపుడు ఏవైనా పరవాలేదు గదా. కాని మనఃపూర్వకంగా మంచి, నిర్మలమైన ప్రశంసలు ఇవ్వడం గురువుల గురుతర బాధ్యత. ఆలోచించి చూస్తే ప్రతి విద్యార్థిలో ప్రశంసించదగిన అంశం ఏ చిన్నదైనా ఉంటుంది. దానినే వెలిగించాలి. అది అతనిలోని మరో దీపాన్ని, ఇంకో దీపాన్ని వెలిగిస్తుంది.

ప్రశ్నలతో పోటీలు కూడా పెట్టవచ్చు. 'ఈ వారంలో మంచి ప్రశ్న' వంటి పోటీలు పెట్టి ఏ ప్రశ్నను ఎందుకు మంచిది అనవచ్చో చర్చించవచ్చు. ఆ ప్రశ్న అడిగిన విద్యార్థిని ప్రశంసించవచ్చు. మంచి ప్రశ్నను ఎంపికచేయడంలో విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవచ్చు. ''నేటి ప్రశ్నలపోటీలో ఉండడానికి అర్హత గలిగి కూడా లేని మరోప్రశ్న ఏది" అని కూడా చర్చించవచ్చు. ఇవన్నీ చేయడానికి సమయం ఎక్కడ సరిపోతుంది? సిలబస్ కావాలి'', అని ఏవో సంజాయిషీలు చెప్పే వారికి జవాబు నా దగ్గర లేదు. మనసు ఉంటే మార్గం లేకపోదు.

### 5. నియమబద్ధంగా చేయాలి

ప్రశ్నలకు సమయాన్ని పాఠాలలో భాగంగా కేటాయించాలి. అలా చేస్తే అదొక అలవాటుగా మారి జీవితంలో భాగమై పోతుంది. వారంలో ఒకరోజు కొంతసమయాన్ని ప్రశ్నించడానికి కేటాయించవచ్చు.

ఏదైనా రోజూ చూసే విషయాన్ని గాని, వస్తువును గానీ, ఇంతవరకూ తెలియని

దానిలాగా ప్రశ్నించవచ్చు. ఇలా ప్రశ్నించడం అలవాటు అయితే ఆ బాలలే రేపు అన్వేషకులు, ఆవిష్కర్తలు కాగలరు. గురువులు కనుక తమ విలువైన కొన్ని నిమిషాలను ఇలా వినియోగించగలిగితే, ఆ కొన్ని నిమిషాల తమ కృషి భవిష్యత్తు కాలంలో తమ శిష్యుల జీవితాలపై ఎంతో ప్రభావం చూపగలుగుతుంది.

వారు విమర్శనాత్మక పరిశోధకులు కాగలరు.

''ఈ ప్రస్తుత వ్యవస్థలో ఇవేవీ ఆచరణ సాధ్యాలు కావు,అన్ని పనులూ పంతుళ్లే చేయాలి, అన్ని ప్రయోగాలు ఎక్కడో కూర్చొని చెప్పడానికి, వినడానికి బాగానే ఉంటాయి కాని, అవెంత కష్టమో ఆచరించే బడిపంతుళ్లకు, మాకు తెలుస్తుంది'' అనేవి భారతదేశంలో సాధారణంగా వినపడే సంజాయిషీలు.

కానీ కావలసింది, చిన్నస్థాయి తిరుగుబాటు, విప్లవం, పౌరసహాయనిరాకరణ వంటివి. దేశ స్వాతంత్ర్యం కోసం నాటి నేతలు చేసిన ప్రయోగాలన్నిటినీ నేడు మనం చేయాలి.

సోక్రటీస్, వారెన్ బెర్గర్ లాంటి వారు ఆచరణీయ సలహాలను, ఇంట్లో, బడిలో చేపట్టడానికి వీలైన వాటినెన్నిటినో అందించారు. విద్యార్థులు, పిల్లల్లో బాగా ప్రశ్నించే అలవాటును పెంపొందించడానికి ఈ ఐదు విధానాలు చాలా ఉపయోగకరమైనవి. ఇది మంచి ఆరంభం అవుతుంది. మనలో అందరూ సృజనశక్తి కలవాళ్లమే. తమతమ అనుభవాలను బట్టి ఎవరి శైలి వాళ్లకు ఉంటుంది. అలా మీ స్వంత శైలిని కనుగొన్నవారు ఎవరైనా ఉంటే నాకు మా వెబ్ సైట్ ద్వారా తెలియజేయండి.మీకు తెలిసిన ఇతరులకు  తెలియజేయండి. నేను కూడా నా వెబ్ సైటు ద్వారా ఇతరులకు తెలియజేస్తాను. ధన్యవాదాలు.

వ్యాపారంలో కూడా ఇలాగే ప్రశ్నించవచ్చు. ప్రశ్నలను ఆహ్వానించటం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని కలిగించవచ్చు.స్వయంగా వ్యక్తంచేసే సామర్థ్యం వల్ల  ఆత్మ విశ్వాసం  లభిస్తుంది, అంతేకాని ఇతరుల నిరర్థకప్రశంసల వల్ల కాదు.

**ప్రశ్న అధ్యయనాన్ని నేర్పుతుంది, జీవితాన్ని నడుపుతుంది**

మౌఖికంగా ( నోటిద్వారా) అడగబడని ప్రశ్నలను కళ్లద్వారా వినాలి.ఎదుటివ్యక్తి వాడుతున్న సంకేతాలలో సగానికిపైగా కనిపించేవిగా ఉంటాయి. మనుషుల ప్రవర్తనను కొంత మేరకు జంతువులు కూడా గ్రహించగలుగుతాయి. సంజ్ఞల ద్వారా భావాలను వ్యక్తపరచవచ్చు.

**సృజనాత్మకత - పరిష్కారాలు-** మీలో ఒక కొత్తదాన్ని తయారు చేయగలవాళ్లు ఎంతమంది ఉన్నారని 2వ తరగతి పిల్లలను అడిగితే 95 శాతం మంది (దాదాపు అందరూ) చేతులెత్తుతారు. వాళ్లు వేసిన బొమ్మలను, రంగులను, చేసిన వస్తువులను ఆనందంగా చూపుతారు.

5వ తరగతికి వచ్చే సరికి తమలో సృజనాత్మకత ఉన్నదని సగం మంది మాత్రమే చెపుతారు. 10 వ తరగతికి నూటికి పది మందే చెపుతారు.

ప్రశ్న సృజనాత్మకతకు పరికరం. ఎప్పుడూ ప్రశ్నలు ఒకే రకంగా అడగటం ఎక్కువయే కొలది పిల్లల ఆలోచనలు తగ్గిపోతాయి.సృజనశీలత కోసం బలవంతం పనికిరాదు. సృజనాత్మకత స్వేచ్ఛకు కలిగే బిడ్డ.

సృజనకోసం బలవంతం చేస్తే పిల్లలు దౌర్జన్యం నుంచి విముక్తులై స్వేచ్ఛగా ఎగిరిపోతారు."మనం సృజనశీలతలోకి పెరగం. దాంతో విద్యావంతులం అవుతాం."

"ప్రశ్న మాత్రమే జవాబును సృష్టించగలుగుతుంది'' ఆంగ్ల రచయిత, వక్త, అంతర్జాతీయ విద్యా సలహాదారు, సర్ కెన్ రాబర్ట్ సన్."పిల్లలు ప్రపంచం ఎలా ఉందో జిజ్ఞాసగా తెలుసుకోవడానికే పుడతారు. కాని పెద్దలు మాత్రం వాళ్ల వేడి మీద నీళ్లు చల్తారు."నీల్ డగ్రాస్ టైసన్."పిల్లలు పుట్టుకతోనే సహజంగా ఆశావాదులు, మనం (పెద్దలు) వాళ్లను నిదానంగా దారి మళ్లిస్తాం."అమెరికన్ కవయిత్రి, వ్యాసకర్త, సంపాదకులు, లూయిస్ ఇమోజన్ గినీ (1861 – 1920) "పిల్లలు బడిలోకి ప్రశ్నల గుర్తులుగా వస్తారు, బిందువులుగా, విరామ చిహ్నాలుగా బయటకు వస్తారు". అమెరికన్ రచయిత, సాంస్కృతిక విమర్శనకారుడు, నైల్ పోస్ట్‌మన్ (1931 – 2003)చిన్నపిల్లలకు భయాలు ఉండవు. అందుకే వాళ్లు ధైర్యంగా ప్రశ్నిస్తారు. *మానవాళికి ఉన్న అనంత శక్తివనరు జిజ్ఞాస.*

ప్రశ్నలు మానవ జిజ్ఞాసకు సహజ ప్రతినిధులు. ప్రశ్నలను పరిమితం చేయడం అసహజం, ప్రకృతికి విరుద్ధం. పుట్టిన తరువాత మొదటి కొన్ని సంవత్సరాలు

జీవితంలో జిజ్ఞాస సహజంగానే చాలా ఎక్కువగా ఉంటుంది. తరువాత లైంగికవాంఛలు ఆ స్థానాన్ని ఆక్రమిస్తాయి. జిజ్ఞాసకి గల ఏకైక పరికరం ప్రశ్న. జిజ్ఞాస గదిలో బంధించబడిన ఏనుగు వంటిది.
తల్లిదండ్రులు, గురువులు చేయవలసింది – ఆ ఏనుగు వీపు పైకి ఎక్కి దానికి దారి చూపి నడిపించాలి. మనం ఏనుగుకు మేత వేయాలి, అందుకు వేరుశనగ కాయలు సరిపోవు. అవగాహన కావాలంటే మనిషికి కావలసింది జిజ్ఞాస. అవగాహన కలగడం అంటే దేనినైనా నేర్చుకోవడమే. నేటి జ్ఞానం ప్రవాహ ప్రశ్నావళి నుంచి లభించింది.''ఎప్పుడు యౌవనంగా ఉండాలనుకుంటే పైపై మెరుగులు సరిపోవు ఎప్పుడూ కుతూహలంతో ఉండాలి'' సాల్వడార్ పనికర్.

**జిజ్ఞాసకు కలిగిన బిడ్డ సృజనాత్మకత**

మన పిల్లలు నేర్చుకోవడానికి మనం సహాయపడితే వాళ్లు మనం ఇంకా బాగా నేర్చుకోవడానికి సహాయపడతారు. మన అవగాహన పరిమితులు గ్రహించి, వాళ్లు పాఠాలు ప్రారంభిస్తారు. "ప్రశ్న పరిణామాత్మకశక్తి. అది అమాయకత్వాన్ని అవగాహనగా మార్చగలుగుతుంది.
పిల్లలు చొరవ తీసుకోవాలి. వాళ్లు కేవలం అనుకరణదార్లు కాకూడదు." సీజర్ చావెజ్
మన ముందున్న సవాలు అజ్ఞానమే కాని మూర్ఖత్వం కాదు. ఎంచుకోవడానికి ఉన్న మార్గాలను వివరిస్తే చాలామంది మంచి నిర్ణయాలే తీసుకోగలరు."విద్యను ఎలా సులభతరం చేయబోతున్నావు? అని ఆలోచించడానికి బదులుగా అతణ్ణి క్రీడాకారుడిగా చేయడానికి ప్రయత్నించు. తినడానికి, తాగటానికి కోరుకున్నవన్నీ ఇవ్వు.''అమెరికన్ కల్పనాసాహిత్యరచయిత,ఎడ్గర్ పాంగ్‌బార్న్(1909 - 1976)
ఆలోచించడం అంటే ప్రశ్నలు అడగటం. ప్రశ్న కష్టం అయే కొలది, మెదడు చేయవలసిన వ్యాయామం అధికం అవుతుంటుంది. ఎక్కువ పని చేసే కొలది మెదడు సామర్థ్యం పెరుగుతుంది.
"ప్రయత్నాన్ని బట్టి ఫలితం ఉంటుంది" సోఫోక్లిస్. "స్వేదం చిందకపోతే మోదం రాదు" అని ఇవాళ మనం అంటున్నాం, వింటున్నాం. ఎవరూ బాధను ఇష్టపడరు. కానీ, ప్రయత్నం లేకపోతే ఫలితమూ లేదు. అతిసంరక్షణ అధమ సంరక్షణకు

దారి చూపుతుంది. ఎటువంటి పరాజయాల బారిన పడకుండా పిల్లలను పెంచాలనుకోవడం కేవలం భ్రమ. అలా పిల్లలను రక్షించాలనుకోగూడదు. అలా చేస్తే అవాస్తవాలను నేర్పి, వారిని జీవితాంతం చూపు తక్కువ ఉన్నవారిగా చేస్తాము. జీవితం ఎప్పుడూ పరాజయాలను అందిస్తూనే ఉంటుంది. వాటిని తప్పించలేము. ఓటమి నుంచి మనిషి విజయవంతంగా కోలుకుంటాడు. పెద్దలు ఈ వాస్తవాలను పిల్లల అనుభవంలోకి తీసుకురావాలి.

ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలకు ఫీజులు కట్టేది ఎందుకో తెలుసా? పిల్లలు ఎప్పుడైనా, ఏదైనా ప్రశ్నను, ఎన్నిసార్లయినా అడిగేందుకు. మనం ప్రక్రియను ప్రశంసించాలి, ఫలితాన్ని కాదు, ఎందుకంటే ఫలితాన్ని ఇచ్చేది ప్రక్రియయే గదా. నేర్చుకునే ప్రక్రియ, జ్ఞానసముపార్జన, మనను మనం ప్రశ్నించుకోవడం ద్వారానే సాధ్యం. సృజనాత్మకత ఆమోదిత నేలలపై గల మొక్కలను మొరటుగా తొక్కుకుంటూ ముందుకు సాగిపోతుంది. భూమిమీద గల అత్యంత విలువైనది, తిరిగి నింపుకోగలది ఏది? నేటి హరిత ప్రక్రియలు, సాంకేతికత నేపథ్యంలో పునరుద్ధరణీయ వనరుల విలువ గురించి చాలా చర్చ జరుగుతున్నది. పూరించగల ప్రతి వనరు గురించి పోటాపోటీగా ఆలోచనలు వస్తున్నాయి. ప్రతి వనరు వల్ల-గాలి, సూర్యరశ్మి, సముద్రతరంగాలు, భూధార్మికత, వంటివాటి లాభనష్టాలను నిశితంగా బేరీజు వేస్తున్నారు.

భూమి మీదగల వనరులు అన్నిట్లో విలువైన వనరు ఏది? ప్రజలు. దాని ద్వారా మిగతా వనరులు అన్నిటినీ తెలుసుకుంటాం. అన్ని మౌలిక వనరులకు మౌలికమైనది విద్యారంగం.

**ఫిన్ ల్యాండ్ ఆదర్శం - ఫిన్లాండ్ అక్షరాస్యతలో ప్రపంచంలో మేటి**

ఐరోపా ఖండంలో, 56 లక్షల జనాభా కలిగిన దీవుల సముదాయం, ఓ చిన్న దేశం ఫిన్‌లాండ్. విద్యార్థులపైన ఏ మాత్రం ఒత్తిడి పెట్టకుండానే వాళ్లను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నది. అక్కడ ఏ బాలుడూ బడికెళ్లనని మారాం చేయడు, భుజాన పుస్తకాల సంచితో ఆపసోపాలు పడుతూ కనిపించడు. చదువు కోవటానికి ఏ ఒత్తిళ్లూ ఉండవు. విద్యార్థులకు కష్టం కలిగించని ఏకైక దేశం ఇది.

ప్రపంచంలో అత్యధిక అక్షరాస్యతకల దేశాల్లో తొలిస్థానం ఫిన్లాండ్ దే(100 శాతం).

* తరగతి విద్యార్థుల ప్రతిభ విషయంలో అతి తక్కువ వ్యత్యాసంగల దేశం.

* ప్రపంచంలో అతితక్కువ బోధనా గంటలూ, ఎక్కువ సెలవులూ ఉన్న దేశం. అక్కడ పాఠశాలలు గరిష్టంగా 180 రోజులు మాత్రమే పనిచేస్తాయి. (ఇండియా 240 రోజులు) సగటున ఒక ఉపాధ్యాయుడు ఏడాదికి 600 గంటలపాటు పాఠాలు చెబుతాడు.(ఇండియా -దాదాపు1700 గంటలు)

* పదకొండేళ్లు వచ్చాకే ఫిన్లాండ్ పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు మొదలవుతాయి. అప్పటిదాకా బోధనంతా ఫిన్నిష్, స్వీడిష్ భాషల్లో సాగుతుంది. అక్కడ ఒక్కో విద్యార్థి సగటున నాలుగు భాషలు మాట్లాడగలడు.

తలసరి ఆదాయంలో ఏడు శాతాన్ని చదువుపైన ఖర్చు చేస్తున్నారు. (భారత్‌లో 3.3 శాతం) అక్కడ నెల రోజుల్లో చెప్పే పాఠాల్ని ఇక్కడ వారంలోనే ముగిస్తున్నారు.

పిల్లలు స్కూల్లో అడుగుపెట్టాలంటే కనీసం ఏడేళ్లు నిండాల్సిందే. అప్పటివరకూ వాళ్లు పలకా బలపం, పుస్తకాలూ పెన్సిళ్లూ పట్టుకోరు. అలాగని నేర్చుకునే వయసునీ వృథా చేసుకోరు. సాధారణంగా తొలి ఆరేళ్లలోనే పిల్లల మెదడు కణాలు 90 శాతం విచ్చుకుంటాయి. త్వరగా గ్రహించే శక్తి పెరుగుతూ వస్తుంది. అందరితో కలిసి ఆడుకోవడం, పద్ధతిగా తినడం, నిద్రపోవడం, ఒకరికొకరు సహాయపడటం, శుభ్రత పాటించడం, భావవ్యక్తీకరణ నైపుణ్యం, జాలి, దయ, సామాజికస్పృహ వంటి అన్ని జీవననైపుణ్యాలను అలవరచుకునేందుకు ప్రోత్సహిస్తారు.

**అక్కడ చదువంతా పూర్తిగా ఉచితం.** ఉన్నత విద్యావంతులే మంచి పౌరులుగా మారతారని ఫిన్లాండ్ నమ్మిన సిద్ధాంతం. ఎనిమిది నెలల వయసులో డే కేర్ సెంటర్లో కాలు పెట్టినప్పట్నుంచీ పాతికేళ్ల తరువాత యూనివర్శిటీ నుంచి పీహెచ్.డి. పట్టా అందుకునేంత వరకూ ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య.

ఆరేళ్లదాకా ఆటలు.,పాటలతో పిల్లల్ని బాగా చదివిస్తారు. పక్షులూ, జంతువులూ, చెట్లూ, మనుషులూ, ఆహారం, పరిసరాలు, ఇలా చుట్టూ కనిపించే అంశాల గురించే పిల్లలకు నేర్పిస్తారు.రోజూ ఒంటిపూట బడులే.తొమ్మిదో గ్రేడ్ దాకా ప్రతి ఒక్కరూ కచ్చితంగా చదువుకొని తీరాలి. అందుకే ప్రస్తుత తరంలో అక్కడ నిరక్షరాస్యులు ఒక్కరూ కనిపించరు. పిల్లల నిద్రకు చాలా ప్రాధాన్యమిస్తారు. ప్రతి తరగతిలో 15-20కి మించి విద్యార్థులు ఉండరు.

ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌కు కనీస విద్యార్హత- మాస్టర్స్ డిగ్రీ. సెకండరీ స్కూల్ టీచర్లకు పీహెచ్.డి. తప్పనిసరి. ఉద్యోగాలలో ఉపాధ్యాయ వృత్తిని, వైద్యవృత్తిని ఉన్నతంగా భావిస్తారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాడు. తొలి ఆరుసంవత్సరాల విద్యలో పిల్లలకు బయటప్రదేశాలను చూపటం, బస్సులలో ప్రయాణాలు చేయటం, మొక్కల పెంపకం వంటి విషయాల పట్ల అవగాహన కల్పిస్తారు. పిల్లలకు ఇష్టమయిన పనులను, ఆసక్తివున్న ఆటలను ప్రోత్సహిస్తారు.

ఫిన్‌ల్యాండ్ దేశం ప్రాథమిక, సెకండరీ పాఠశాల విద్యారంగంలో ప్రపంచంలో రెండవ ఉన్నత స్థానంలో ఉన్నది.1960 ల ఆఖరి సంవత్సరాల్లో ఫిన్‌ల్యాండ్ దేశం ఉపాధ్యాయశిక్షణా సంస్థలను మూసివేసింది. ఉపాధ్యాయబోధనను దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు అప్పగించింది. ఉన్నత పాఠశాలలో పై స్థాయిలో ఉన్న 10 శాతం మంది విద్యార్థులను మాత్రమే విశ్వవిద్యాలయాల్లో చేరడానికి, విద్యాబోధన వృత్తిలోనికి అనుమతిస్తారు. ఫిన్ ల్యాండ్, కొరియా, సింగపూర్ దేశాల్లో అధ్యాపకవృత్తి అత్యంత గౌరవప్రదమైన వృత్తి. ఇవి ప్రపంచంలో విద్యారంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నాయి.

విద్య ఒక విలువైన వనరు. దాని విలువను గుర్తించినప్పుడే నాణ్యత పెంచడానికి ప్రాధాన్యత ఇస్తారు, తగిన వేతనాలు చెల్లిస్తారు.

**భావప్రసారణ-మానవసంబంధాలు అతి గొప్ప నైపుణ్యాలు**

భూమి మీద దేనిని గురించి ప్రణాళికలు వేయాలన్నా మానవవనరులు లేకుండా వేయలేము. బంగారపు గనులను తవ్వాలనుకుంటే మంచి సామానులు, నైపుణ్యాలు కావాలి. బంగారం ఉన్న ప్రాంతాలను కనుక్కోవాలి, ముడి ఖనిజాన్ని తవ్వి తియ్యాలి. దానిని సరిగా శుద్ధి చేయాలి. మానవవనరులు అత్యంత విలువైనవి అని గుర్తించాము. బంగారం కంటే విలువైన తిరిగి నింపగల వనరు మానవవనరు. మరి ఈ విలువైన వనరును అభివృద్ధి చేయడానికి కావలసిన నైపుణ్యాలను, పరికరాలను సమకూర్చుకోవడం, రానున్న తరాలకు ఈ నైపుణ్యాలు అందించడం మన బాధ్యతలు కావా? మన పిల్లలకు విజ్ఞానం, అనుభవం, మానవసంబంధాలు నేర్పాలి గదా? ఆ పరికరాలు ఏమిటో చూద్దాం. ప్రజలతో కలిసి పనిచేయడానికి కావలసినవి మానవ నైపుణ్యాలు, మానవుల మధ్య అంతఃసంబంధాలు.

సాంకేతికత, ఇంజనీరింగ్, శాస్త్రాలూ మానవహత్యాకాండను, యుద్ధాలను, మత విద్వేషాల వంటి అనేక అరాచకాలను రూపుమాపలేవు. వ్యక్తులు మాత్రమే వాటిని నిర్మూలించగలుగుతారు. ప్రశ్నించడం అంటే ఆలోచన అని చూడలేక పోతున్నాం.

మానవుల అవసరాలను గ్రహించలేని సాంకేతికత నిరర్థకం. అది విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో మానవీయ విలువలను చూడలేక కళ్లు మూసుకుంది. మానవసంబంధాలకు పరిష్కారాలు తెలుసుకోవాలంటే పైన తెలిపిన రంగాలలో తగినంత వాటా మానవీయశాస్త్రాలకు ఉండాలి. అప్పుడే మానవీయత, శాస్త్రీయత మధ్య సమతూకం వస్తుంది. కళ సృజనాత్మకం. భావోద్వేగాలకు నిలయం. అవసరమైన సందర్భాల్లో కళ వీటి మధ్య సమన్వయాన్ని సాధిస్తుంది.

ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది మనుష్యుల మధ్య భావప్రసరణ (రాత,మాట్లాడటం, దృశ్యం, వాసన, స్పర్శలు) లేకుండా ఏమైనా సాధించగలమా? లేదు. విజ్ఞానం, నేర్పు, దృక్కోణం, భావోద్వేగాలు భావప్రసరణ

ద్వారానే మార్పిడి జరుగుతాయి. అది అందం కాదు అవసరం. గుహల్లో నివసించిన మన పూర్వీకులు వేటాడే జంతువు ఎక్కడ ఉందో కనుక్కోవడానికి దాన్ని వేటాడటానికి సహకారంతో చేయిచేయి కలిపారు. భావమార్పిడి వల్లనే కుటుంబాలు ఏర్పడ్డాయి. రాబోయే తరాల మంచిని దృష్టిలో ఉంచుకొని కలసి మెలసి కాపురాలు చేశారు. అందుకే నాటికీ, నేటికీ భావమార్పిడి అతి గొప్ప నైపుణ్యం.

మనుష్యుల మధ్య భావమార్పిడి లేకుండా సహకారం, సమన్వయం, సమస్యా పరిష్కారం ఉండవు. అదొక లోహపు తీగవంటిది. అన్ని వ్యక్తిగత నైపుణ్యాలు ఈ తీగద్వారా బయటికి పంపబడతాయి, లోనికి స్వీకరించబడతాయి.

వివాహం, కుటుంబం, దేవాలయం, పని, ఆట, వ్యాపారం, సమాజం, దేశం, ప్రపంచం దేనిలోనైనా ఈ నైపుణ్యం అవసరం. ప్రతి మానవ కృషిలో, ముఖ్యంగా విద్యారంగంలో భావమార్పిడి చాలా ముఖ్యం. మనం బోనులో చిక్కుకొని ఉన్నాం. భావమార్పిడి లేనిదే ఈ బోనులో నుంచి బయటకు రాలేము, లోపలే ఉండిపోలేం. భావమార్పిడి ఒక పరికరాల పెట్టె. అందులో వ్యక్తులమధ్య సంబంధాలు అనే సామానులు అన్నీ ఉంటాయి.

మనలో చాలామంది మనసులోని భావాలను చక్కగా వ్యక్తం చేయగల సమర్థులు. లేకపోతే చాలామంది మాట్లాడేటప్పుడు శ్రోతలు వింటూ తలలు ఊపరు గదా?

ఒక సందేహం. ఎక్కువ మంది తమ భావాలను ఇతరులకు వ్యక్తం చేయగలిగిన వారయితే అమెరికాలో, ఇతరదేశాల్లో వివాహ విచ్ఛిన్నాలు ఎందుకు పెరుగుతున్నాయి? భావమార్పిడిలో ఎక్కువ హానికలిగించేది అసలు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయకుండా మౌనంగా ఉండటమా? చెప్పినదాని అర్థం స్పష్టంగా లేకపోవడమా? మన అజ్ఞానం గురించి తెలియకపోవడమే గొప్ప అజ్ఞానం. మనకు తెలియదని తెలియకపోవడమే ప్రమాదం. కొందరు దీనిని అచేతనా పూర్వక అసమర్ధత అంటారు. మనకు తెలుసని మనం అనుకున్నప్పుడు మనం కొత్తగా నేర్చుకోవలసింది లేదా?

“ఏదైనా నూతన ఆవిష్కరణను కనుక్కోవడానికి పెద్ద ఆటంకం అమాయకత్వం కాదు, జ్ఞానం అనే భ్రమ.” అన్నాడు డేనియల్ బూర్ స్టెన్.

మనకు తెలియదని తెలిస్తే నేర్చుకోవడానికి అవకాశం వస్తుంది. ఇల్లాలు ఇంటిని పరిశుభ్రంగా, అందంగా అలంకరించి ఉంచుతుంది.

దాని విలువ ఆమె పని చేయనప్పుడు తెలుస్తుంది. అలాగే భావప్రసరణ విలువ కూడా అది లేనప్పుడు తెలుస్తుంది. భావప్రసారణా నైపుణ్యం కూడా గృహ నిర్వహణ వంటిదే. లేనప్పుడు దాని విలువ తెలుస్తుంది.'ఏదైనా సమస్య ఎదురైనప్పుడు మాత్రమే ఆలోచిస్తాము' అన్నాడు జాన్ డూయీ (అమెరికన్, తత్త్వవేత్త) మనో విజ్ఞానవేత్త, విద్యావేత్త (1859-1952) సమస్య పెద్దదయే కొలది ఆలోచించవలసిన అవసరం పెరుగుతుంది. కుటుంబంలో భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోతే వివాహం(దాంపత్యం) చిక్కుల్లో పడుతుంది. విబేధాలు తలెత్తుతాయి. అవి పిల్లల పెంపకం, వారి చదువులు, ఆరోగ్యసంరక్షణ, జీవిత నాణ్యతలపై చాలా హానికర ప్రభావాన్ని చూపుతాయి.

**భావమార్పిడి అవసరం - భావప్రసారలోపం:** వైద్యరంగంలో రోగులు, రోగి వెంట వచ్చిన సహాయకులు, వైద్యుడు, ఎన్నో శాఖలకు చెందిన వైద్యసహాయకులు ఉంటారు. వీరందరిమధ్య భావప్రసారమార్పిడి జరుగుతుంది.

అయితే ఈ రంగంలో చెప్పదలచుకున్నది చెప్పక, చెప్పింది అర్థం కాక, కొంత మాత్రమే అర్థమై, ఒకటి చెపితే మరొకటి అనుకోవడం వల్ల, రోగులకు మందులు ఇచ్చేటప్పుడు, రోగుల పడకలు మార్చేటప్పుడు ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతుంటాయి. తీవ్రమైన వైద్య ప్రమాదాల్లో 80 శాతం భావమార్పిడి సరిగా లేక జరుగుతాయి.

(2016) అమెరికాలో ఏటా 98,000 మంది అపార్థాల వల్ల ఆసుపత్రుల్లో మరణిస్తున్నారు. ఇది వాషింగ్టన్‌లో ఒక ప్రాంతంలో ఏటా మరణించే వారి సంఖ్యకు సమానం. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఏటా చనిపోయే వారికి పదిరెట్లు ఎక్కువ. వియత్నామ్ యుద్ధంలో పదేళ్లలో మృతుల సంఖ్యకు రెట్టింపు.

**విద్యారంగం:**అన్ని మౌలిక వనరుల్లో విలువైనది విద్యారంగం.విద్యావ్యవస్థ స్వచ్ఛమైన భావ ప్రసరణ ప్రక్రియకు ఉదాహరణ. ఈ పుస్తకం రాసే సమయానికి ప్రపంచంలోని మిగతా దేశాల కంటే గూడా అమెరికా ఎక్కువ డబ్బును

ప్రతివిద్యార్థిపైనా, విద్యారంగంపైనా కుమ్మరిస్తుంది. అయినా శాస్త్రరంగంలో 27వ స్థానంలో, గణితంలో 31 వ స్థానంలో ఉన్నది.

అంటే మనం కావలసినంత సరిగా భావప్రసరణ చేయటం లేదేమో!సముద్రంలో మంచు పర్వతం మునిగి ఉంది, మనకు దాని పైభాగపు కొన కనిపిస్తుంది. అలాంటివే ఇప్పుడు మీకు చెప్పిన ఉదాహరణలు.

నువ్వు ఇక మూడోది, ఆఖరుది అయిన ముఖ్య విషయం తెలుసుకోవడానికి సిద్ధంగా ఉన్నావా?

**ఇదీ ప్రశ్న:** భావ మార్పిడి - నిర్వచనంలో ముఖ్య పదం – మార్పు - కనీసం ఇరువురి మధ్య సంభాషణ – అది స్వగతం కాదు. భావప్రసారం ఏకముఖం కాదు, ద్విముఖం, బహుముఖం. ప్రసారం అంటే సమాచారాన్ని ఏకదిశలో పంపడం. రేడియో, టి.వి. వగైరాలు. ఎవరు వింటున్నారో లేదో తెలియదు. ఒకవేళ విన్నప్పటికీ వాళ్ల స్పందనలు తెలియవు. ఎదుటి వాళ్లు ఆమోదిస్తున్నారో, వ్యతిరేకిస్తున్నారో తెలియదు. మార్పిడి ఉన్నప్పుడే మనం చేసే భావప్రసారం స్పష్టంగా, సరిగా ఉందా లేదా అని తెలుస్తుంది. మనం ఇతరులతో మన భావాలను పంచుకుంటాం. ఇలా పంచుకోవడం వినికిడిశక్తి లేనివారితో మాట్లాడటం వంటిది కాదు.

మనిషి మెదడులో వివిధ భాగాలమధ్య కూడా సమాచార మార్పిడి - ఇవ్వడం, తీసుకోవడం - జరుగుతుంటుంది. ఈ ప్రక్రియ జరగకపోతే మెదడు పనిచేయదు. నీ వేలును ఈ పుస్తకంలో, ఈ పేజీలో ఉంచాలంటే నీకు ఆ ఆదేశాలు మెదడు నుంచి రావలసిందే. ఆ ఆదేశం అమలు జరుపబడిందా? లేదా? అనే స్పందనను మెదడుకు చేరవేసే పని కన్ను, స్పర్శనాడులు చేస్తాయి. ఇదంతా మెదడు లోపల జరిగే మార్పు. అది మెదడులో క్షణాలకంటే తక్కువ సమయంలోనే సరిగ్గా, కచ్చితంగా జరుగుతుంది. ఇలాగే రెండు మెదళ్లమధ్య / ఇంకా ఎక్కువ మెదళ్ల మధ్య జరిగే బాహ్య మార్పిడి చాలా క్లిష్టంగా ఉంటుంది.

ఈ పుస్తకం ఏకదిశా ప్రసారాలు చేసే ఒక ప్రసారణ వ్యవస్థ. నేను చెపుతున్నాను. అది నీకు చేరిందో, లేదో, నువ్వు చదువుతున్నావో, లేదో నాకు తెలియదు. నేను రాసింది ఎలాఉందో నాకు తెలియదు. దీని గురించిన స్పందన వెంటనే

తెలియదు.
“నేను మీకు ఏమి ఇచ్చానో నాకు తెలుసు. అయితే నువ్వు ఏమి అందుకున్నావో నాకు తెలియదు.” ఇటలీలో పుట్టిన అర్జెంటీనియన్ కవి, ఆంటోనియో పోర్షియా (1885 - 1968)అన్నారు. దీనికి జవాబు రాబర్ట్ మాక్లోస్కీ సూక్తిలో ఉంటుంది. ‘‘నువ్వు విన్నది ఏమిటో, నేను అన్నదీ అదీ ఒకటే అవునో, కాదో నాకు కచ్చితంగా తెలియదు. భావప్రసరణ ఒక క్రియాశీల వర్ణన, ఒక ప్రక్రియ.

**భావమార్పిడిలో ప్రశ్న ఎక్కడ ఉన్నది?**

నీ దగ్గరి సమాచారాన్ని ఇతరులకు అందించటం, ఇతరుల అభిప్రాయాలను నువ్వు తెలుసుకోవటం భావప్రసరణ. జీవితభాగస్వామితో / పిల్లలతో / పెద్దలతో / స్నేహితులతో / అపరిచితులతో / అధికారులతో పొరుగింటి వారితో / పరాయి దేశం వారితో ఎవరితోనైనా భావమార్పిడి జరుగుతుంది. అవి చర్చలు / సంప్రదింపులు / బేరసారాలు లాంటి ఏ రూపంలో నైనా కావచ్చు.
సమాచారంలో దాదాపు సగం మాట్లాడే భాష ద్వారా వ్యక్తపరుస్తాం. మిగతా సగాన్ని ఎదుటివాళ్ళు నింపాలని ఆశిస్తాం. ప్రశ్నలు భావప్రసరణకు దోహదపడతాయి. ప్రశ్నలు స్పందనలుగా పనిచేయాలంటే వాటిని బాగా మలచుకోగలగాలి. వాడుక భాషలో పదాలు, శారీరక / ఆంగిక సంజ్ఞలు, కంఠస్వరం అన్నీ ఒక దాని కొకటి పూరకంగా ఉండాలి. సంభాషణ నాణ్యత ఎంత తరచుగా ప్రశ్నలు అడుగుతున్నాం అనే అంశంపై ఆధారపడి ఉంటుంది.
నాణ్యమైన భావప్రసరణ అడిగే వాళ్లకు, చెప్పే వాళ్ళకు తృప్తిని ఇస్తుంది. సంభాషణ సరిగా సాగాలంటే పాల్గొనే వారందరూ సరిగా పాల్గొనాలి.“ఇతరులు నీ దారిలోకి రావాలంటే నువ్వు వాళ్ల దారికి వెళ్లాలి. నువ్వు దారి చూపాలంటే ముందు వాళ్ల దారిన నడవాలి.”బ్రిటీష్ రచయిత విలియం హేజ్ లిట్ (1778–1830)

అలా ఇతరుల దారికి నువ్వు వెళ్లాలంటే ప్రశ్నలు అడగాలి. నీకు ప్రశ్నలు అడగటం చేతకాకపోతే, ప్రశ్నలు వేసేలా ఎదుటివారిని ప్రోత్సహించలేకపోతే నీకు భావప్రసరణ సామర్ధ్యం తగినంత లేదనుకోవాలి.

ఇందుకు కారణాలు

1. భావప్రసరణ అంటే సమాచార మార్పిడి.
2. జవాబుల వల్ల నేర్చుకునే దానికంటే ప్రశ్నల వల్ల నేర్చుకునేది ఎక్కువ.
3. ప్రశ్నలను శ్రద్ధగా వినాలి.

ఇపుడు ప్రశ్న గురించి చెపుతాను.

నువ్వూ, నేనూ భావప్రసారం చేసుకునే వాళ్లం అని నిజంగా అనుకోవాలంటే మనిద్దరి మధ్య సమాచార మార్పిడి జరగాలి. కేవలం తలకాయ ఊపడం, అవునన్నట్లుగా ఆఁ, ఊఁ అనడం వల్ల ఎదుటివాళ్లు వింటున్నారని / అర్థం చేసుకుంటున్నారని / ఆమోదిస్తున్నారని అనుకోలేము.

ఇద్దరు వ్యక్తుల మధ్యభావప్రసారం జరుగుతున్నదంటే సమాచారం ఒకరినుంచి మరొకరికి మారుతున్నట్లే. ఈ సూత్రం అన్ని సందర్భాలకూ వర్తిస్తుంది. భార్యాభర్తలు, పిల్లలు, వ్యాపారులు, ప్రభుత్వాలు, సమాజాలు, అంతర్జాతీయ సంబంధాలు, సంప్రదింపులు, ఒప్పందాలు ఇలా ఏదైనా కావచ్చు. ఇవన్నీ భావప్రసార స్థావరాలే.

భావప్రసారం ప్రశ్నలతో కూడి ఉండాలి. సంభాషణలు జిజ్ఞాసకరంగా సాగాలంటే ప్రశ్నలు బాగా సన్నద్ధం చేయబడినవి కావాలి. బాగా చేయబడినవి అంటే భాష / కంఠస్వరం, శరీరభాగాల ద్వారా వ్యక్తీకరణ అన్నీ కలసి అడగబడేవిగా ఉండాలి. అడిగే ప్రశ్నలలో నాణ్యత పెరిగే కొలది సమాచార మార్పిడిలో నాణ్యత పెరుగుతుంది. పరస్పర అవగాహన, ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉంటుంది.

ఈ భావప్రసారణచట్రంలో ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉంటాయి. ప్రశ్నలు సమాచారాన్ని సేకరిస్తాయి. సమాచారమే ప్రశ్నలు.

మంచి భావప్రసారకులుగా ఎదగాలనుకుంటే బాధ్యత మనదే. సంభాషణ ప్రారంభించడం, ఎదుటివారి ప్రశ్నలకు స్పందించడం సమర్ధవంతంగా జరపాలి. మన అభిప్రాయాలు చెపుతాం, బాగా తయారుచేసుకున్న ప్రశ్నలు అడుగుతాం.

సంభాషణ అయిన తరువాత ఇతరులను బాధ్యులను చేస్తూ నిందించగూడదు. వివాహితుల మధ్య జరిగే సంభాషణలు, చర్చల్లో ఎదుటి వ్యక్తి అవసరాలను గ్రహించడం ముఖ్యం.

ఎదుటి వ్యక్తి మనోభావాలను తెలుసుకోవాలంటే ఏం చేయాలి? అతనిని ప్రశ్నలు

అడగాలి. చురుకుగా ప్రశ్నలు అడుగుతుండాలి, ఇతరులను ప్రశ్నలు అడగడానికి ఆహ్వానించాలి, బాగా ప్రోత్సహించాలి. అలా చేయలేకపోతే మనం భావప్రసారం చేయలేని వాళ్ల కిందే లెక్క.

అందుకు కారణాలు మూడు.

1.సమాచారాన్ని బదిలీ చేయడం,మనసులోని మాటను చెప్పగలగడం, వినడమే భావప్రసారణ.

2. వ్యక్తిని గురించి తెలుసుకోవడానికి అతని జవాబులకంటే ప్రశ్నలే ఎక్కువ సహాయపడతాయి.

3. ప్రశ్నలు వినడానికి తోడ్పడతాయి. శ్రద్ధగా వినడం, శ్రద్ధగా ప్రశ్నించడం
వైద్యుని వద్దకు వెళ్ళినపుడు రోగి సహాయకుడు డాక్టరును / నర్సులను / ఇతర వైద్య సిబ్బందిని ప్రశ్నలు అగడకపోతే రోగి ప్రాణాల మీదకు రావచ్చు. ప్రమాదాలు జరగవచ్చు.

ఏ వ్యక్తి అయినా, ఏ కుటుంబసభ్యుడైనా  డాక్టరును / నర్స్ ను / వైద్యరంగ సిబ్బందిలో సభ్యుడిని / ప్రశ్నించడానికి సంకోచించారంటే, ప్రశ్నించకుండా వాళ్ల ఆసుపత్రిలో చేరారంటే, రోగి ప్రాణాలను / వాళ్లపై ఆధారపడిన వాళ్ల ప్రాణాలను త్యాగం చేయడానికి, వాళ్లకు జీవితాంతం ఉండే వైకల్యాలు రావడానికి అవకాశం కల్పించినట్లే అనుకోవాలి.

**అంతర్గత, బాహ్య భావప్రసారణ**

సంభాషణ ఇద్దరు / అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల మధ్య జరుగుతుంది. మెదడు చేస్తున్న పనిలో 90 శాతం నీకు తెలియదు. పాక్షికచేతనంగానే జరుగుతుంది.

భావ ప్రసారణ చేయడం బాగానేర్చుకుంటే నీతో నువ్వు కూడా బాగా మాట్లాడుకోగలుగుతావు. కొంతకాలం జాగ్రత్తగా, పట్టుదలగా, ఉద్దేశపూర్వకంగా సాధన చేస్తే అది నీలో భాగమైపోతుంది. తరువాత నువ్వు ప్రయత్నం చెయ్యకుండానే వస్తుంది. మనసును సన్నద్ధం చేయడం ఎంత ఎక్కువగా చేస్తే ఇతరులతో భావ ప్రసారణ అంత బాగా చేయగలుగుతావు.

**అంతర భావ ప్రసారణ:**

నువ్వు బయటకు ఒక్కవ్యక్తిగా కనిపిస్తునావు. కాని మెదడులో అనేక మంది వ్యక్తులు ఉన్నారు. అదొక మంత్రి మండలి లాగా, వేర్వేరు నిపుణుల బృందంగా పనిచేస్తుంది. విశ్లేషణ చేసే వ్యక్తి మనుగడ కోసం పని చేసే వ్యక్తి, భావోద్వేగాలను అదుపు చేసే వ్యక్తి, న్యాయనిర్ణేత, ఇంద్రియ సుఖాల అవసరాలు చూసే వ్యక్తి, కార్య నిర్వాహక వ్యక్తి, స్వయంచాలకంగా ఎవరి నియంత్రణ లేకుండా పనిచేసే వ్యవస్థ / శ్వాసక్రియ, జీర్ణక్రియ, గుండె పని, చరిత్రకారుడు, గ్రంథాలయాధికారి. ఇన్ని రకాల అధికారులు, ఉద్యోగులు అందరి మెదళ్ళలో ఉంటారు. కనుక నువ్వు ఏక వచనం కాదు, అనేక 'నువ్వు' ల బహువచనం 'మీరు'.

సంభాషణలో ఎన్ని ప్రశ్నలు వేశావు అనే దాన్ని పరిగణనలోకి తీసుకోవద్దు. ఎంత నేర్చుకోగలిగిన ప్రశ్నలు వేశావు అనేది ముఖ్యం. నేరస్తులను ప్రశ్నలు అడిగినట్లు కఠినంగా కాకుండా మృదువుగా మాట్లాడాలి. ఎక్కువ ఈగలను ఆకర్షించాలంటే ఉంచవలసింది తేనెను కాని పులుసును కాదు.

ఈ పుస్తకం ప్రశ్నలను గురించినది. భావప్రసారణలో ఎన్ని ప్రశ్నలు అడిగావు అన్నది ముఖ్యం కాదు, ఎటువంటి ప్రశ్నలు అడిగావన్నది ముఖ్యం. ఏదో మొక్కుబడిగా, తోచినవి అడిగితే ఉపయోగం లేదు. ముందుగా ఆలోచించి తయారుచేసుకున్న ప్రశ్నలు అడగాలి. సంభాషణలో కంఠస్వరం చాలా ముఖ్యమైనది. మిఠాయిలు పిల్లలను ఆకర్షిస్తాయి, కాని ఉడకబెట్టిన క్యాబేజీ వాళ్లను ఆకర్షించలేదు. ప్రశ్న చిన్నదిగా అనిపించవచ్చు, కాని దాని శక్తి ఎంత గొప్పదో చూద్దాం. మనం ఇతరులతో చేసిన సంభాషణ వల్ల వీలయినంత ఎక్కువగా మంచి ఫలితాలు రావాలని ఆశిస్తాం. మంచి ఫలితాన్ని ఆశిస్తుంటే ఆ సంభాషణకు ఒక లక్ష్యం / గమ్యం / ఉద్దేశం ఉండాలి.

రెండు పక్షాల్లో ఒకరు తప్పక దారిచూపాలి. ప్రక్రియను లక్ష్యం దిశగా కొనసాగించాలి, బండిని పట్టాలమీద నడిపించాలి. బృందం, దంపతులు, పిల్లలతో కూడినది ఏదైనా సరే భావప్రసారం సరిగా జరపలేకపోతే, ఫలితం ప్రయోజనకరంగా ఉండదు. ఫలితం ఏమవుతుందో ఊహించలేము. గుడ్డి ఎద్దు పొలంలో ప్రవేశించినట్లు ఉంటుంది. ఏం తినాలో తెలియదు.

ఉత్తరం / ఈ మెయిల్ వంటి పరోక్ష లావాదేవీల వల్ల ఇది సరిగా జరగదు. ముఖాముఖి, ఎదురెదురుగా రెండు పక్షాలు ఉన్నపుడే మంచి భావప్రసరణ

సాధ్యం అవుతుంది. ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపికలో ముఖాముఖి ప్రశ్నిస్తున్నపుడు ఆధిపత్యం చలాయిస్తున్నట్లు / అధికారంతో చిన్నవారిని అడిగినట్లున్న కంఠస్వరంతో మూసప్రశ్నలు అడగగూడదు. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నించే వారికి నైపుణ్యం ఉండాలి. వార్తలు చెప్పేవాళ్లు, ముఖాముఖి పరీక్షలు చేసేవాళ్లు, సామాజిక పరిశోధకులు, వైద్యులు, న్యాయవాదులు, ఓదార్చే వాళ్లు, తలిదండ్రులు, సంతానం, రక్షకభటులు ఇలా, ఇలా ఎవరైనా కావచ్చు. ప్రశ్నించేటప్పుడు పరిస్థితులను తమ అదుపులో ఉంచుకోగలగాలి. సమాచారమంతా చిట్టడవిలాగా అగమ్యగోచరంగా చుట్టు ముట్టి ఉంటే సంబంధాల మధ్య లక్ష్యం చేరటం కష్టం.

అలాకాక గమ్యాన్ని ఎంచుకొని, దాని దిశగా, బాగా తయారుచేసుకున్న ప్రశ్నలతో ప్రయాణం కొనసాగించటం వల్ల ఫలితాలు బాగుంటాయి. యుద్ధానికి వెళ్లేటప్పుడు ఆయుధాలను సరిగా సన్నద్ధం చేసుకోవాలి గదా? అలాగే, సంభాషణలో పాల్గొనేముందు తగు విధంగా సన్నద్ధులు కావాలి. ప్రశ్నించడం ఒక ప్రక్రియలా కొనసాగించాలి. ప్రక్రియలో చాలా పనులు, ఒక క్రమంలో సాగాలి. అందులోని అన్ని పనులూ జరిగితేనే సరిపోదు, అవి వరుసలో, ఏ భాగానికి అది సరిగ్గా చేయాలి, లేకపోతే మంచి ఫలితాలను ఆశించలేము.కొందరు వ్యక్తులు ప్రశ్న అడిగితే జవాబుగా ఎదురు ప్రశ్న వేస్తారు. వారు ఎందుకలా చేస్తారు? పరిస్థితిని తమ అదుపులోకి తీసుకోవాలనుకుంటారు గనుక ఇద్దరు వ్యక్తులు / రెండుపక్షాల మధ్య భావప్రసారం జరుగుతున్నపుడు ఒకరి తరువాత మరొకరు పరిస్థితిని తమ అదుపులోకి తీసుకుంటూ ఉండాలి. సంభాషణ కదులుతూ ఉంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

**జీవితానికి అనుమతిపత్రం ప్రశ్న- ప్రశ్న ప్రాణాలతో చెలగాటం**-విజయవంతంగా, ఫలవంతంగా ప్రశ్నించడంలో గల ప్రయోజనాలకు ఒక మంచి ఉదాహరణ లండన్ కు చెందిన నైల్ లేబార్న్ అడిగిన ప్రశ్నల పరంపర.

జానీ బెంజమన్ అనే వ్యక్తి 2008 లో వాటర్ లూ వంతెన పైనుంచి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అతన్ని ఆత్మహత్య చేసుకోకుండా ఆపడానికి లేబార్న్ అడిగిన ప్రశ్నలు సహాయపడ్డాయి. ఆయన అది మంచి, ఇది చెడు అంటూ అతని వ్యక్తిత్వాన్ని బేరీజు వేసే ప్రశ్నలు వేయలేదు, విలువల గురించి తన అభిప్రాయాలను చెప్పలేదు, ప్రసంగాలు చేయలేదు, ఎందుకు ఆత్మహత్య తగదో చెప్పలేదు. భావోద్వేగాలకు అతీతంగా ప్రశ్నించాడు. బెంజిమన్ ను ఆకట్టుకున్నాడు. జీవించడం వల్ల గల ప్రయోజనాలను గురించి ఆలోచించే ప్రశ్నలను అడిగాడు. జానీ తనను తాను ప్రశ్నించుకునేలా, అతనిలో ఆలోచనల మధనం జరిగేలా చేశాడు. ఇది "Find Mike" అనే డాక్యుమెంటరీ కథ. దీనిని అంతర్జాలంలో చూడవచ్చు.

**కౌన్సెలింగ్ సమయంలో ప్రశ్నలు**

ఆత్మహత్యలను నివారించడానికి పోలీసు అధికారుల ప్రశ్నలు. సెల్ ఫోన్ టవర్ ఎక్కి చనిపోవడానికి సిద్ధంగా ఉన్నాననే వాళ్ల నిర్ణయాన్ని ఆపగల్గడం, నిర్ణయాన్ని అమలు చేయడానికి ఆలస్యం చేయడం ప్రశ్నల ద్వారానే సాధ్యం అవుతుంది. హెచ్చరికలు, బెదిరింపుల వల్ల కాదు. మామూలుగా బాగా తెలిసినవాళ్లతో మాట్లాడుతున్నట్లుగా ప్రశ్నలు అడగాలి.

ముఖ్య సమస్యల పరిష్కారాల కోసం, తీర్మానాల కోసం పైన చెప్పిన ప్రక్రియ చాలా కీలకమయింది. తెలిసిన వాళ్లతో మాట్లాడినట్లు మాట్లాడటం వల్ల, ప్రశ్నల్లో కాస్త ప్రభావం తగ్గినట్లనిపించవచ్చు. ఇది ఎవరైనా ఉపయోగించడానికి సాధ్యమైనదీ, ప్రశ్నకు గల సత్తాను వివరించేదీ.

ప్రశ్నల వల్ల ప్రయోజనాన్ని నువ్వు జీవితంలో మరచిపోలేవు. ఎదుటి వ్యక్తి ధారాళంగా చేసే ప్రసంగాన్ని ఆపగలుగుతుంది. జాగ్రత్తగా ఆలోచించి తయారుచేసుకున్న ప్రశ్న మృదువుగా సంధించబడిన బాణం వంటిది.

అది లక్ష్యాన్ని చేరగలుగుతుంది. ఎదుటి వ్యక్తి అహాన్ని దెబ్బతీయదు.

ఆత్మాభిమానం పెరుగుతుంది. ప్రశ్న పీఠం ఎక్కుతుంది.

**దూర నియంత్రణ**

తమ నివాసం నుంచి ఎన్నో మైళ్లు దూరంగా ఉన్నవారితో సంభాషణ జరుపుతాం. ఇలా మాట్లాడేటప్పుడు చాలామంది తలవంచి ల్యాప్ టాప్ వైపు చూస్తూ మాట్లాడు తుంటారు. వ్యక్తిగత ఈ- మెయిళ్లు చూసుకుంటూ, వాటికి జవాబులు రాసుకుంటూ ఉంటారు. శ్రద్ధ ఎక్కడో ఉంటుంది. మనసు ఏదో ఆలోచిస్తూ ఉంటుంది. అలా పరధ్యానంగా ఉంటే మీకు ఏమి తెలుస్తుంది అని అడిగితే- మాకు అదేమీ ఉండదు, అది మా జీవనవిధానంలో భాగమై అలవాటయిపోయింది అంటారు.

**చిన్న సంభాషణ**

ఏదైనా అంశాన్ని హృదయాలకు హత్తుకునేలా చెప్పాలంటే నిజజీవితంలో సంఘటనను వివరించి చెపుతాం. మాట్లాడేటప్పుడు అనువైన సమయంలో తగిన ప్రశ్న అడగాలి. ఆ ప్రశ్న కొన్ని వాక్యాలతో కూడిన చిన్న ప్రసంగం అనిపించేలా, ఎవరికీ ఇబ్బంది కలిగించనిదిగా ఉండాలి. ఆ తరువాత అవసరం అయితే మరో చిన్న ప్రశ్న అడగాలి. అలా వ్యక్తితో, ఇతరులతో సామాజిక సంబంధాలు కొనసాగించాలి. ఇలా ప్రశ్నించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. చిన్న ప్రసంగాలు సులువుగా చేయగల ధైర్యం వస్తుంది.

ఒక్క ప్రశ్న గణనీయమైన తేడాను చూపగలుగుతుంది. సరైన ప్రశ్న సంఘటనల ప్రవాహవేగాన్ని పెంచగలుగుతుంది.'**అడిగేవాడికి చెప్పేవాడు లోకువ**' అనేది అందరికీ తెలిసిన సామెత. ప్రశ్నించేవాడి చేతిలో పగ్గాలుంటాయి. కనుక గుర్రాలు అతను చెప్పినట్లు నడుస్తాయి. ఆ గుర్రాలు లాగే రథం సారథి కోరినట్లు సాగుతుంది.

ప్రశ్న అడగడంలో ఉద్దేశం ఏదైనా అది ఫలితాన్ని సాధిస్తుంది. దానివల్ల కొన్ని ఉపఉత్పాదనలు లభిస్తాయి. తక్షణమే మన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా, ప్రశ్నలు అడిగేటప్పుడు మనం ఆధిపత్యంలో ఉంటాం. ఆధిపత్యం అంటే ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసం ఉన్నపుడు మనం కోరుకున్న వేగంలో, కోరుకున్న దిశలో ప్రయాణం చేయగల్గుతాం. ఉద్యోగాల కోసం వెళ్లి

ముఖాముఖి ప్రశ్నలను ఎదుర్కొనే సందర్భాలలో ఆత్మ విశ్వాసాన్ని సడలనీయకుండా, కూడగట్టుకోవాలి. ప్రశ్నలు అడిగే వాళ్లను ఎదురు ప్రశ్న అడగగలగాలి.

ప్రశ్నను సున్నితంగానే అడగాలి, అది జవాబులాగానే అనిపించాలి. మనం చెప్పే జవాబుల ద్వారా కంటే అడిగే ప్రశ్నలద్వారానే ఎక్కువ వివరించ గలుగుతాం. ఉద్యోగాలలో కావలసింది వెంటనే జవాబులు చెప్పేవాళ్లు కాదు, అవసరమైనప్పుడు ప్రశ్నించగలిగే వాళ్లు.

పిల్లలు లక్షలకొద్దీ ప్రశ్నలు అడుగుతూ తలిదండ్రులపై ఆధిపత్యం చలాయిస్తారు. దీనివల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, మరికొన్ని లక్షల ప్రశ్నలు అడగడానికి సంసిద్ధులవుతారు.

పరిచయం చేయడం కూడా ఒక క్రియాత్మక చర్య, కళాత్మక రూపం. పరిచయం చేయడంలో దిట్టలైన వారు కొందరు దేశప్రముఖుల నుంచి సామాన్యులదాకా ప్రశ్నించి తెలుసుకున్న సత్యాలు.

విజయాలు సాధించిన వాళ్లు బాగా ప్రశ్నలు అడగగల నేర్పు గలిగిన వాళ్లే. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలంటే మంచి ప్రశ్నలను బాగా అడగడం ఎలాగో చూపించాలి,నేర్పించాలి.అది అమ్ముతున్నట్లు తెలియకుండానే అమ్మడం లాంటిది. ఉద్యోగ ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు అడిగే ప్రశ్నలకు నిన్ను గురించి నువ్వు సున్నితంగా జవాబులు చెప్పుకోగలగాలి. అతిగా చెపితే 'స్వంత డబ్బా' అనిపిస్తుంది. స్వయం పరిచయానికి, స్వయం ప్రస్తుతికి తేడాను గమనించాలి.

వాల్టేర్ అన్నట్లు "నువ్వు ఒక వ్యక్తిని తన జవాబుల ద్వారా కంటే ప్రశ్నల ద్వారానే ఎక్కువగా, సరిగా, స్పష్టంగా అంచనా వేయగలుగుతావు." నిన్ను ఉద్యోగానికి ఎంపికచేయడానికి ప్రశ్నించే వాళ్లు నిన్ను గురించి బాగా తెలుసుకోవడానికి అవకాశం కలిగించేవి నువ్వు అడిగే ప్రశ్నలే. నీ బలాలు, నైపుణ్యాలు ఏమిటో చెప్పగలగాలి. నువ్వు అమ్ముడుపోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పవద్దు.

ఇంటర్వ్యూ చేసేవాళ్లు తమ ప్రశ్నల ద్వారా సన్నివేశాన్ని, ప్రక్రియను తమ అదుపులో ఉంచుకుంటారు. అది అతను / ఆమె విధిగా చేయవలసిన పని. దీనితో నీకు కాస్త ఇబ్బంది అనిపించవచ్చు. ఇబ్బంది ఉన్నపుడు ఆత్మవిశ్వాసం కాస్త

తగ్గుతుంది. ఈ రెండూ ఒకదానితో మరొకటి విలోమ సంబంధం కలిగి ఉంటాయి. ఒకటి పెరిగితే మరొకటి తగ్గుతుంది.

ప్రశ్నలు అడిగే వ్యక్తిని నువ్వు సరైన ప్రశ్న అడగగలిగితే నీది పైచేయి అవుతుంది. ప్రశ్న అడిగిన ప్రతిసారీ ఆధిపత్యం నీదే అవుతుంది. అలాంటి ప్రతిసారీ నీ ఆత్మవిశ్వాసం సమస్థాయిలో ఉంటుంది. ఒత్తిడి తక్కువ స్థాయిలో ఉంటుంది. నువ్వు ఆందోళన లేకుండా విశ్రాంతిగా ఉంటావు. నీ కాళ్లమీద నుంచొని ఆలోచించ గలుగుతావు. ఎదుటి వ్యక్తి కళ్లలోకి సూటిగా చూడగలవు. కాళ్లు ఊపడం, గుటకలు మింగడం వంటి కదలికల వల్ల నీ ఆందోళన స్పష్టంగా వ్యక్తం అవుతుంది. దానిని ప్రశ్నలు అడిగే వాళ్లు గుర్తిస్తారు.

మానవ సంబంధాలలో నాకు చాలా అనుభవం ఉంది అని నేరుగా చెపితే — స్వంతడబ్బా అనుకునే ప్రమాదం ఉంది. అలా కాక దానిని నీ సందేహం లాగా వెలిబుచ్చితే ఆత్మస్తుతి అనిపించదు. ఇది ప్రశ్నకు గల మృదువైన గొప్పశక్తిని నిరూపిస్తుంది.

ప్రశ్నకుగల శక్తి అలాంటిది, నువ్వు ఊదకుండానే నీ బాకా శబ్దం వినిపిస్తావు. ఎప్పుడైనా, ఎవరైనా ప్రశ్న అడిగినప్పుడు వారిదే ఆ సందర్భంలో పైచేయిగా ఉంటుంది. నువ్వు ప్రయత్నించి చూడు. నీకే తెలుస్తుంది. నువ్వే నమ్ముతావు. బాగానే ఉంది, ఒకవేళ ఇద్దరూ మంచి ప్రశ్నలను తెలివిగా అడిగే వాళ్లయితే అప్పుడేమవుతుంది?

వాళ్లు ఇద్దరూ నిజంగా మంచి భావప్రసరణ శక్తి గలవారైతే వాళ్లు ఒకళ్లతో ఒకరు పోటీ పడరు. వాళ్లు ప్రశ్నలను, సరైన సమయంలో కళాత్మకంగా అడిగి భావప్రసరణ విజయవంతంగా చేస్తారు. ప్రశ్నలు అనుసంధానపరుస్తాయి, లీనం చేస్తాయి, కలుపుకుంటాయి.

మరోసారి చైనా తత్వవేత్త కన్‌ఫ్యూసియస్ సూక్తిని చూద్దాం. “నాకు చెపితే మరచి పోతాను, చూపితే గుర్తుంచుకోవచ్చు, నాచేత చేయిస్తే అర్థం చేసుకుంటాను.” ఈ సూక్తిలో అంతరార్థాన్ని దైనందిన జీవితంలో చూపవచ్చు. ప్రశ్న కలుపుతుంది.

కొత్త రహదారుల్లో ప్రయాణం చేయాలంటే దారులు గుర్తు పెట్టుకోవడం కష్టం.

ఒకటి రెండుసార్లు స్వయంగా వాహనాన్ని నడిపితే తరువాత గుర్తు పెట్టుకుంటాం.

**వైద్యుని శ్రద్ధ**

ఆసుపత్రిలో నర్సు/ఆరోగ్యకార్యకర్త పొంచిఉన్న ప్రమాదాన్ని పసిగట్టగలరు. కాని తలబిరుసు వైద్యుడు పసిగట్టలేకపోవచ్చు. తెలివైన నర్సు ప్రమాద సంభావ్యతను ఒక తెలివైన ప్రశ్నతో గుర్తించి హెచ్చరించ గల్గుతుంది. ఆ ప్రశ్న ఇలా ఉండవచ్చు "డాక్టరుగారూ, నాకు మీ అంత అనుభవం లేదు. నేను గతంలో మరో డాక్టరుగారి దగ్గర పనిచేస్తున్నప్పుడు ఒక రోగికి ఇలాంటి లక్షణాలే కనిపించాయి. నాకు బాగా గుర్తుంది. అప్పుడది ఫలానా జబ్బు అని నిర్ధారణ అయింది. మీకు కూడా అలాగే అనిపిస్తుంది కదండీ?"

ఈ ప్రశ్నతో వైద్యుడు అప్రమత్తం అవుతాడు. ప్రమాదం జరగవచ్చని జాగ్రత్త పడతాడు. ముఖాముఖి పోట్లాడుకునే కంటే, డాక్టరును తన దారిన వెళ్లనిచ్చేకంటే ఇది చాలానయం కదా. మౌనం సమ్మతికి సంకేతం. ప్రశ్న కూడా రోగికి/ కుటుంబసభ్యునికి/ రోగిసలహాదారుకు మంచిది.

**సరుకుల వాహనం**

ముఖాముఖి- ఒకరితో మరొకరు జరిపే సంభాషణల్లో పాల్గొనడంవల్ల ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకరు గురువు / ఆచార్యుడు/ పర్యవేక్షకుడు(తల్లి/తండ్రి) అయినప్పుడు, ఒకరు అనేకులను ఉద్దేశించి మాట్లాడి నప్పుడు కూడా ఫలితాలు బాగుంటాయి.

క్లాసులో వెనక బల్లమీద కూర్చున్న విద్యార్థి పాఠం వింటున్నాడో, లేదో, పాఠంమీద దృష్టి పెట్టాడో, లేదో కనిపెట్ట లేడు. ఆ విద్యార్థి తలిదండ్రులు కొత్తగా కొని ఇచ్చిన సైకిలును ప్రమాదానికి గురిచేశాడు. ఆ విషయం పెద్దలకు ఎలా చెప్పాలా అనే దిగులులో ఉన్నాడు. పాఠం పైన దృష్టి ఎలా ఉంచగలడు? ఎడమపక్క మూడో వరుసలో ఉన్న విద్యార్థి ఏదో విషయం గురించి పగటి కలలు కంటున్నాడు. అతను పాఠం వినడం లేదు.

టీచరు చెపుతున్న పాఠంలోని ప్రశ్న అడిగితే తరగతి లోని అందరూ అప్రమత్తం

అవుతారు. గురువు ప్రశ్నలు అడగడం ఎక్కువయే కొలది పిల్లల జోక్యం ఎక్కువవుతుంటుంది.

తరగతిలోనే కాదు, ఇంట్లో, జీవితంలో, వ్యాపారంలో, ఎక్కడైనా భావ మార్పిడి జరిగే ప్రతి సందర్భంలో ఇవి ఉపయోగపడతాయి, ప్రయోజనాలు ప్రస్ఫుటంగా

*ప్రశ్న ప్రతిభాషలో వాడబడుతుంది. అది సంస్కృతులకు అతీతమైనది. భిన్న సంస్కృతుల మధ్య అంతరాలను నింపడానికి వారధులు నిర్మించనినిర్మించదలిస్తే ప్రశ్నను ఉపయోగించడమే సరైన జవాబు.*

కనిపిస్తాయి. ప్రశ్నలు ఇతరులు పరిగణించడానికి, ఆలోచించడానికి సహాయ పడతాయి. సోక్రటీస్ లాంటి మేధావులు (క్రీ.పూ.469–399) 2,400 సంవత్సరాల పూర్వమే ఎంత తెలివిగా ఆలోచించగలిగారు?

నువ్వు ఎప్పుడైనా గమనించావా? ఎవరైనా ఒక ప్రశ్న వేస్తే నువ్వు దాన్ని మనసులో పదేపదే మననం చేసుకుంటావు. జవాబుకై మనసులో వ్యాయామం చేస్తావు. “నువ్వు ఇవాళ ఎంత దూరం ప్రయాణం చేశావు? అని నిన్ను అడిగితే (ఉః. నేను ఎంతదూరం ప్రయాణం చేశాను? 1,2,3 అదీ, దాని తరువాత అక్కడకు, మళ్లీ ఇంకోచోటికి, మొత్తం కూడుకుంటే ఇంత దూరం.) జవాబు వచ్చింది. ఇదంతా కలం, కాగితం లేకుండానే మనసులో జరగవచ్చు, (కలం, కాగితంతో, మరో ప్రశ్నకు వెళ్లవచ్చు) జవాబును రాబట్టే ప్రక్రియ అంతా మెదడులో జరగాలి. ప్రశ్న వల్ల అంతరంగంలో అన్వేషణ ఆరంభం అవుతుంది. పరిగణన / ఆలోచన / నిన్ను నువ్వు ప్రశ్నించుకోవడం జరుగుతుంది. ఆలోచన అంటే మనను మనం, తెలిసిన స్పృహతో, తెలియకుండా- ప్రశ్నించుకోవడం. మనసులోని మాటను ఇతరులకు అందజేయగలగడం.

***ప్రశ్నలు దారి చూపుతాయి, దృష్టిని కేంద్రీకరింపజేస్తాయి.***

“ఆట ఆడేవారికి కళ్లు సరిగా కనపడవు, బయటినుంచి చూచే వాళ్లే స్పష్టంగా చూడగలుగుతారు.” చైనా సామెత. నీకో గొప్ప ఆలోచన తట్టింది. దాన్ని అమలు చేస్తే నీకు చాలా ప్రయోజనాలు ఉన్నాయనిపించింది. వెంటనే దానిని గురించి, నీ స్నేహితులతో, శ్రేయోభిలాషులతో మాట్లాడతావు. వాళ్లతో కలసి బాగోగులు

చర్చిస్తావు. ఒక మెదడు కంటే అనేక మెదళ్లు కలిసి ఆలోచించి చర్చిస్తే విఫలం కావడానికి అవకాశాలు తక్కువ.

ఏదైనా సంస్థలో పనిచేసే పెద్ద ఉద్యోగికి కొత్త ఆలోచన వస్తే వెంటనే సంబంధిత సిబ్బందితో చర్చిస్తాడు.

అటువంటి సందర్భాలలో నీ ఆలోచనను వాళ్లకు చెప్పి, దానిని వాళ్ల నోటి నుంచి వినాలని ప్రయత్నించవద్దు.

**దారి చూపే ప్రశ్నలు**

ప్రశ్నల్లో దారి చూపే ప్రశ్నలు ఉంటాయి. వ్యక్తికి వచ్చిన ఆలోచనను పరిశీలించ డానికి బృందంతో చర్చించడం మంచి ఫలితాలను ఇస్తుంది. నువ్వు ప్రశ్నించ వచ్చు. ఆ ప్రశ్నలు వాళ్ల అభిప్రాయాలను బయటికి తెచ్చేవిగా ఉండాలి. దీనికి ఒక ఉదాహరణ చూద్దాం.

*"ఈ రంగంలో పెట్టుబడులు పెట్టటం చాలా ఇబ్బందులతో కూడినదని మీకు అనిపించడం లేదా?"* అని అడిగితే -నువ్వు *'అవును కష్టనష్టాలు చాలా ఉన్నాయి'* అని చెప్పమని దారి చూపుతున్నావు.

అలా కాకుండా *"ఈ రంగంలో పెట్టుబడులు పెట్టటంలో గల సాధకబాధకాలను చెప్పండి"* అని అడిగితే వాళ్ల మనసులోని భావాలు బైటికి వస్తాయి. అలా కాకుండా నీ అభిప్రాయం చెప్పి మీరేమంటారు అని అడిగితే ప్రశ్నల వరద ప్రవహిస్తుంది. అందులో పనికివచ్చేవి, పనికి రానివి, వ్యాఖ్యానాలు కుప్పలుగా ఉంటాయి. అవన్నీ ఒక క్రమంలో ఉండవు. వాటి మధ్య సమన్వయం లేక గందరగోళం ఏర్పడుతుంది.

ఈ గజిబిజి అంతా లేకుండా ప్రయోజనకర ప్రతిఫలం రావాలంటే చర్చను అంచెలంచెలుగా కొనసాగిస్తూ, దశలవారీగా ప్రశ్నలు వేయడం మంచిది. ప్రశ్నలను లక్ష్యం దిశలో వేయాలి. వాళ్ల ఆలోచనలు నీ ఆలోచనలు సరిపోతే ముందుకు పోవచ్చు. ప్రతి దశలో, ముగింపులో ఆలోచనలు వాళ్లవే. నువ్వు కోరుకున్నవి కాకపోవచ్చు. అయినా అవి వాళ్లవే.

**ఏకరూప ప్రశ్నలు.** వీటిని పరిమిత జవాబు గల ప్రశ్నలు అంటారు. నువ్వు మగవాడివా? అని అడిగితే చెప్పగలిగిన జవాబులు రెండే - అవును / కాదు.

ఈ దారిలో ఎర్రచొక్కా అబ్బాయి వెళ్లాడా? దీనికి జవాబులు నాలుగు ఉండటానికి

అవకాశం ఉంది. చూశాను / చూడలేదు / నేను గమనించలేదు / నాకు తెలియదు.
మరో వైఖరి
నిర్దిష్ట ఉదాహరణ. సాధారణ ప్రశ్నలు. ఇందులో కొన్నయినా నీకు ఉపయోగపడవచ్చు.
- భూమిమీద ఉన్న వనరుల్లో అత్యంత విలువైనది, తిరిగి పూరించ గలదేది?
- భూమిమీద దేనినైనా ప్రజలు లేకుండా సాధించడం సాధ్యమేనా?
- దేనినైనా సాధించాలంటే ఏ నైపుణ్యాలను ఉపయోగిస్తాము?
- మానవనైపుణ్యాలలో అతి ముఖ్యమైనది ఏది?
- భావప్రసరణ లేకుండా ఇద్దరు / అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల మధ్య ఏదైనా సాధించగలమా?
- భావప్రసారం ఉత్తమంగా ఉంటే ఫలితాలు ఉత్తమంగా ఉంటాయా?
- భావప్రసరణ అంటే ఏమిటి?
- ప్రశ్నలే జవాబులా?
- ప్రశ్నలద్వారా దారి చూపగలమా?

ప్రశ్నలను ఉపయోగించే ప్రక్రియ దారిచూపుతుంది, దిశానిర్దేశనం చేస్తుంది, చర్చను కొనసాగించడానికి సహాయపడుతుంది. జవాబులు చెప్పే వ్యక్తి ప్రశ్నలను పరిగణనలోకి తీసుకోవడానికి వీలుకలుగుతుంది. జవాబులు చెప్పడానికి ఆలోచిస్తూనే, తన స్వంత మదింపులు, తీర్పుల గురించి ఆలోచిస్తాడు. తన ప్రతి అడుగూ ఒక జవాబే. అతను ఆధిపత్యం సాధించినట్లు అనుభూతి చెందుతాడు.
బాగా వాడుకలో గల ఒక సామెత ఉంది "నువ్వు గుర్రాన్ని నీటిదగ్గరకు తీసుకు వెళ్లగలవు, కానీ దాన్ని నీళ్లు తాగించలేవు." నేను చెపుతాను, 'దానికి దాహం వేసేలాగా చేస్తే అదే నీటి దగ్గరకు వెళ్లి స్వంతగా నీళ్లు తాగుతుంది. ఇదే ప్రశ్నలు కూడా చేయగల పని. ప్రశ్నలు అంటే దాహం అనుకోవచ్చు.
ప్రశ్నలు ప్రజలకు దారిచూపలేవు. అవి ఎవరినీ వెళ్లదలచని చోటుకు తీసుకు పోవు. మనం జవాబుల ఆధీనంలో ఉన్నాము. తర్కం, భావోద్వేగం, నిజాయితీ, శీలం, వ్యక్తిగత తత్వం, మతపరమైన నమ్మకాలను ఆధారం చేసుకొని వాటిని అంగీకరించవచ్చు, లేకపోవచ్చు.

ప్రశ్నలు భావప్రసారాన్ని కలిగిస్తాయి. ప్రశ్నలు సమాచారాన్ని ద్విముఖంగా- ఇవ్వడానికి, తీసుకోవడానికి వీలు కలిగిస్తాయి. కనుక ఏకపక్ష ప్రసారాలను నివారిస్తాయి. ప్రశ్న ప్రతి భాషలో ఉంటుంది. అది సంస్కృతులకు అతీతమయింది.

వేర్వేరు సంస్కృతుల మధ్య వారధులు నిర్మించాలంటే, వాటి మధ్యగల అంతరాలను తగ్గించాలంటే ప్రశ్న ఒక్కటే మార్గం.

లాభాలు వస్తాయనే ఆశతోనే పెట్టుబడులు పెడతాం. బాగా అనుభవంతో ఆలోచించి పెట్టిన పెట్టుబడులే ఫలితాలను ఇవ్వగలుగుతాయి. ప్రశ్నలు ప్రతిఫలాన్ని పొందడానికి పెట్టుబడులు. ప్రశ్నను ఎంతగా యోచించి పెట్టుబడి పెట్టగలిగితే ఫలితం అంత బాగా ఉంటుంది.

కళ్లు అబద్ధాలను చూస్తాయి, చెవులు వినలేవు. నిర్ణయాలు తీసుకోవడానికి కావలసిన సమాచారాన్ని ప్రశ్నలు సేకరిస్తాయి. అవి తమ అవగాహనను పరీక్షించుకుంటాయి.

వైద్యుడి నైపుణ్యం అతని జ్ఞానం పైననే ఆధారపడి ఉండదు, ఇంకా సరిగ్గా వ్యాధి నిర్ణయం చేయడం పైన(సరిగా రూపొందించిన ప్రశ్నలను అడగడం పైన) గూడా ఆధారపడి ఉంటుంది.

తెలివి అంటే మనకు తెలిసింది మాత్రమే కాదు, అది లేనప్పుడు మనం దేనిని వాడుకుంటున్నామన్న దానిపై కూడా ఆధారపడి ఉంటుంది.

**ఆసుపత్రుల్లో భావప్రసార పొరపాట్లను తగ్గించే మరో మార్గం ఉందా?**

పౌరులు తమ ప్రతినిధులను ఎన్నుకొని ప్రభుత్వ నిర్వహణకు కేంద్రానికి పంపుతారు. అక్కడ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పనిని గమనిస్తారని ఆశిస్తారు.

"ఒక వివాదంలో గాని చర్చలో గాని లక్ష్యంవిజయం కారాదు, అది ప్రగతి కావాలి."ఫ్రెంచ్ నీతిశాస్త్రవేత్త,వ్యాసకర్త,జోసెఫ్ జౌబర్ట్ (1754 - 1824)

మనం వినేది, అర్థం చేసుకునేది, తెలుసుకునేది, అవసరం అనుకునేది, కోరుకునేవాటిని ప్రశ్నలు కనిపెడతాయి. "నిర్ణయాలు తగినంత సమాచారం మీద ఆధారపడి ఉంటాయి.

సమాచారం అరకొరగా ఉంటే దాని ఆధారంగా తీసుకునే నిర్ణయాలూ అలాగే ఉంటాయి." (నిర్ణయం తీసుకోవడం ఒక ప్రశ్నించే ప్రక్రియ)

**వినడం** -ప్రశ్న వినేటట్లు చేస్తుంది. అదే దానిలోని ఒక గొప్పతనం. పదిమందిలో బహిరంగంగా మాట్లాడటం ఎలాగో నేర్పడానికి శిక్షణా తరగతులు జరుపుతుంటారు. బహిరంగంగా వినడం ఎలాగో నేర్పే శిక్షణాలయాలు ఎక్కడా లేవు. వినక పోవడం మన ముందున్న పెను సవాల్. ఇతరులకైనా, మనకైనా సమాచారం మెదడును చేరాలంటే దానిని వినడం అవసరం కదా? మాట్లాడడం ఆపి వినడం సాగిస్తేనే కదా భావప్రసరణ జరిగేది.

జీవితాంతం వింటూనే ఉంటాం. వినండి, నేర్చుకోండి – అని. మనం ఎప్పుడైనా "మాట్లాడండి, నేర్చుకొండి'' అని విన్నామా? నేర్చుకోవడం, అవగాహన అంతా లోపలికి పంపే ప్రక్రియ. దానితో అంతర్గత ప్రక్రియలు కలిసి ఉంటాయి. "ప్రశ్నలు అడిగేవాడు జవాబులు ఇవ్వకుండా తప్పించుకోలేడు."ఆఫ్రికన్ సామెత. "నేను ప్రతిరోజూ గుర్తు చేసుకుంటాను. నేను ఈరోజు మాట్లాడింది ఏదీ నాకు నేర్చుకోవడానికి ఉపయోగపడలేదు. నేను నేర్చుకోవాలంటే అది వినడం వల్లనే సాధ్యం అవుతుంది." అమెరికన్ టి.వి, రేడియో అతిధి, అనేక ప్రతిష్టాత్మక పురస్కారాల గ్రహీత, లారీ కింగ్. అయితే లారీ కింగ్ ఏమి చేస్తాడు? ఆయన ఏళ్ల తరబడి టి.వి.కార్యక్రమాలు నిర్వహించాడు. అతను ప్రశ్నలు అడిగాడు. (అతను, శ్రోతలు విన్నారు)

వ్యక్తి మేధస్సు కంటే బృందమేధస్సు ఆటపాటల్లో, దాంపత్యాలలో బలంగా ఉంటుంది. అది అలాగే బృందమేధస్సు కూడా వైవిధ్యంపై ఆధారపడి ఉంటుంది. బృందంగా యాజమాన్యం నిర్వహిస్తే అమ్మకాలు పెరుగుతాయి. పెట్టుబడికి అధిక రాబడులు వస్తాయి. వాటాపై ప్రతిఫలం పెరుగుతుంది. ఒక బృందంలో చురుకైన కొందరు ఉద్యోగులు ఉంటేనే సరిపోదు. ఆ ఉద్యోగుల మధ్య సహకారం ఉండాలి. సామాజిక స్పృహ ఉండాలి, సహకారం తప్పని సరి. భావమార్పిడి బాగా జరగాలి.

**మేఘాలలో దాచడం**- ఇప్పుడు మనం.. "సామూహిక వనరు." అనే ఒక మాట తరచు వింటున్నాం. Cloud Computing.

(ఈ పుస్తకంలోని సూక్తులు అన్నీ సామూహిక వనరులకు ఉదాహరణలు)

నేర్చుకోవడానికి గర్వం, అహంకారం, భయాలు ఆటంకాలు. నేర్చుకోవడంలో తొలిఅడుగు తనలో తాను గాని, ఇతరులతో గాని "నాకు తెలియదు" అనుకోవడంతో ఆరంభం అవుతుంది. ప్రశ్నలు అడగలేనివారు భావప్రసారకులే కాదు. పదే పదే అడగబడే ప్రశ్నలు తరచుగా వినేటట్లు చేస్తాయి. చూడటం, గమనించడం వేర్వేరు. వినడం, ఆలకించడం ఒకటే కావు. వినడం శ్రద్ధగా ధ్వనులను కనిపెట్టడం. వాటిని మనసులోకి తీసుకుపోవడం ఆలకించడం.

**సామాజిక భావప్రసారణ**

స్పృహతో చేసే పనిని అచేతనంగా, అర్ధచేతనంగా, పాక్షిక చేతనంగా చేయ గలగడమే సాధన."మనం పదేపదే చేసే పనే మనం. ప్రావీణ్యం కేవలం పనిమాత్రమే కాదు, అదొక అలవాటు". అరిస్టాటిల్

"నేర్చుకోవడం ఒక చురుకైన ప్రక్రియ. చేయడం ద్వారా దానిని నేర్చుకుంటాం. ఉపయోగించబడిన జ్ఞానం మాత్రమే మెదడుకు అతుక్కుపోయి నిలుస్తుంది. వాడుకలో కల జ్ఞానం మాత్రమే నీ మనసుకు అతుక్కొని ఉంటుంది." అమెరికా రచయిత, ఉపన్యాసకుడు, వ్యక్తిత్వవికాసంపై అద్భుత పాఠాల రచయిత, శిక్షణనిపుణులు డేల్ కార్నిగె ఇలా అంటాడు."మైఖేల్ భవననిర్మాత. ఆయన ప్రతిరోజూ తన శ్రామికులకు పనిచేయమని ఆదేశాలు ఇస్తాడు. అప్పుడు వాళ్లు ఎలా చేయమంటారు?" అని ఎదురు ప్రశ్న. అందుకు మైఖేల్ తిరిగి వారినే ప్రశ్నిస్తాడు- మీరు ఎలా చేస్తారో చూపండి? అని. ఇలా అడగడం వల్ల తనకు, తన సిబ్బందికి రెండు లాభాలు కలుగుతాయి.

ఆ పని గురించి శ్రామికులకు అవగాహన ఉన్నదో, లేదో తెలుస్తుంది. అప్పుడప్పుడు తాను కూడా కొత్త/మెరుగైన/త్వరగా చేసే విధానాలు తెలుసుకుంటాడు. అతను ఎదుగుతాడు.

"ఏ ఒక్కడూ ప్రతిఒక్కని అంత తెలివైన వాడు కాడు.' జపాన్ సామెత

అతని దగ్గర అదే శ్రామికబృందం యేళ్ల తరబడి పనిచేస్తున్నది. అలా ఉండటానికి కారణం యజమాని కార్మికులను గౌరవించడం కావచ్చు. ఈ పద్ధతి సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుతుంది''.

ఆలోచించవలసిన అంశం ఒకటి ఉంది. నివేదికలు ప్రతిచర్యలను చూపుతాయి. ప్రశ్నలు ప్రతిస్పందనలను స్వాగతిస్తాయి. సభ్యత గమనిస్తుంటుంది. ఏ సందర్భానికి / పరిస్థితికి తగినట్లుగా ఉండవలసిన పద్ధతి ఏదో నిర్ణయించుకోవలసింది మనమే.

పని చేయడంలో మైఖేల్ విధానం:

- తన వ్యాపారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు.
- కార్మికులను తన లక్ష్యం వైపుకు తీసుకువస్తాడు.
- ఇతరులు చెప్పేవి శ్రద్ధగా వింటాడు.
- భావమార్పిడికి పరస్పర మార్గాలను ఎంచుకుంటాడు. ద్విముఖసమాచార వ్యాప్తిని పాటిస్తాడు, తాను చెపుతాడు, తాను వింటాడు.
- సిబ్బంది స్వంతగా ఆలోచించడాన్ని ప్రోత్సహిస్తాడు. వాళ్లు విలువైన వారిగా ఎదుగుతారు, సుహృద్భావ వాతావరణం నెలకొల్పుతారు. మర్యాదగా మెలగుతారు, నిర్ణయాలు తీసుకోవడానికి, పరీక్షించుకోవడానికి, అవగాహనకు కావలసిన సమాచారాన్ని పొందుతారు.

ఇదంతా కేవలం ప్రశ్నల ద్వారా సాధించవచ్చు. ఇవే ఫలితాలను అన్ని మానవ రంగాలలో,కుటుంబం నుండి అంతర్జాతీయ వ్యవహారాల వరకు సాధించవచ్చు.

**ప్రశ్న ఎన్నో రకాలుగా ఉపయోగపడే పరికరం**

- ప్రశ్నించడం అంటే ఆలోచించడం, నేర్చుకోవడం.
- భావాల మార్పిడి ప్రక్రియ జరగడానికి ప్రశ్నలు పరిస్థితులను తమ అధీనంలోకి తీసుకుంటాయి.
- ఇతరుల నుంచి ప్రశ్నలను ఆహ్వానించడం ద్వారా ఇతరుల అభిప్రాయాలను తెలుసుకోగలుగుతాము.

(ఉదా: వారికి ముఖ్యమైనవేవి? వాటిని సాధించడానికే మార్గాన్ని ఎంచుకుంటారు? ఏ సృజనాత్మకతను / సమస్యాపరిష్కార మార్గాన్ని కోరు కుంటారు? వగైరాలు.)

- ప్రశ్నలు అడిగేవారి ఆత్మవిశ్వాసాన్ని తక్షణమే పెంచుతాయి.
- తలబిరుసుతనం లేకుండానే ప్రశ్నలతో వివరించవచ్చు.

- ప్రశ్నలు లీనం చేసుకుంటాయి, ప్రమేయం కలిగిస్తాయి, కలుపుకుంటాయి, తమలో చేర్చుకుంటాయి.
- ప్రశ్నలు ఇతరుల అభిప్రాయాలు పరిగణించడానికి, ఆలోచించడానికి, నేర్చుకోవడానికి వీలు కలిగిస్తాయి.
- ప్రశ్నలు దారిచూపుతాయి, మార్గదర్శనం చేస్తాయి. దృష్టిని కేంద్రీకరింప జేస్తాయి.
- ప్రశ్నల వల్ల వినడానికి అవకాశం కలుగుతుంది, భావప్రసారణ జరుగుతుంది.
- నిర్హేతుక అభిప్రాయాలకు, అజ్ఞానానికి విరుగుడుమందులు ప్రశ్నలు.
- ప్రశ్నలను సృజనాత్మకంగా, అప్రమత్తంగా, స్పృహతో, చైతన్యంతో అడగడం పెంచే కొలది సహజ ప్రక్రియలాగా పెరుగుతుంటాయి.
- ప్రశ్నలు ఇతరుల పట్ల గౌరవభావాన్ని కలిగిస్తాయి, సహానుభూతిని కలిగిస్తాయి.

ప్రశ్నలు అడగటం వల్ల ఇంకా ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

ఇంకా తరచుగా, ఇంకా మేలైన ప్రశ్నలు వేయడం నేర్చుకుంటారు.

అధికంగా ప్రశ్నలు అడగడం మంచిది అనేది నిత్యసత్యం. కాని విసుగు, విరామం లేకుండా ప్రశ్నలవర్షం కురిపిస్తుంటే విసుగు పుడుతుంది. వేధించినట్లు అనిపిస్తుంది. ప్రశ్నల సంఖ్య పెరిగినందున ఫలితం పెరగదు. బాగా తీర్చి దిద్దబడిన ప్రశ్నలు, తరచుగా అడగడం వల్లనే ఫలితాలు అధికం అవుతాయి. మనసు లోపల, వెలుపల అంతర్గతంగా, బాహ్యంగా భావప్రసారాలను కొనసాగించడం ప్రశ్నతో కలిసిన త్రిభుజం వంటిది. అది ప్రశ్నా త్రిభుజంలో భాగం. ఆలోచన, అధ్యయనం ఉన్నపుడు వాటి వెంటనే ప్రశ్న ఉంటుంది.

## ఆలోచన → అధ్యయనం → ప్రశ్న

అచేతనంగా జరిగే ఆలోచన, భావప్రసారము, చేతనాసహిత అంతర్గత ఆలోచనల వల్ల ప్రశ్న ఆవిర్భవిస్తుంది. సంభాషణలు, చర్చలు, ప్రసంగాలు వంటివి క్రియాత్మక ప్రక్రియలు కాగా జవాబులు స్థిరాలు.

భావప్రసారానికి, ఆలోచించడానికి, నేర్చుకోవడానికి ప్రశ్న మూలాధారం. ఈ మూడింటిలో ప్రతి అంశమూ ప్రశ్నపై ఆధారపడి పనిచేస్తుంది, సంబంధాలను పటిష్టపరుస్తుంది.

మానవలక్షణాలు మూడు- ఆలోచించడం, నేర్చుకోవడం, ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం – ఇవి సమైక్యమైనవి. సమన్వయంతో ఈ మూడూ కలసి పనిచేస్తాయి. ఇవి పనిచేసే విధానం అణువులో భాగాలు పనిచేసినట్లే ఉంటుంది. అణువులో మూడు భాగాలు- ఎలక్ట్రానులు, ప్రోటాన్స్, న్యూట్రాన్స్.- కలసి పనిచేయకపోతే అణువులు మనుగడలో ఉండలేవు, పనిచేయలేవు.

- నేర్చుకోకుండా ఆలోచించలేము. •ఆలోచించకుండా నేర్చుకోలేము.
- అంటే మనం ఆలోచించలేము, నేర్చుకోలేము.

మనసులోని భావాలను, వెలుపలి ఆలోచనలను ఇతరులకు చెప్పలేకపోతే మనం ఆలోచించలేము, నేర్చుకోలేము.

ఈ మూడు పరిశీలనలను కలిపి ఒక్కదానిగా చెప్పవచ్చు.

ఆలోచించగల సామర్థ్యం లేకపోతే మన భావాలను ఇతరులకు చెప్పలేము.

ప్రశ్నించడం ఆలోచించడానికి మూలం కనుక అది కూడా నేర్చుకోవడానికి, భావప్రసారానికి మూలం కావాలి.

ప్రశ్నించడం ఒక్కటే సమగ్ర జీవితానికి దారిచూపే వైఖరి.

ఈ మూడు మౌలికక్రియల్లో ప్రతి ఒక్కదాన్నీ మెరుగుపరుచుకోవాలి. అప్పుడే మన జీవితాలు మెరుగుపడతాయి.

ప్రశ్నల అధ్యయనం, వాటిని తీర్చిదిద్దడం, ఉపయోగించడం – నిరంతరం కొనసాగే అత్యంత కీలకమైన జీవనచర్యలు.

చిరకాలం కొనసాగగల మహా ప్రభావితమైన వ్యక్తిత్వం అలవడాలంటే చిన్నతనంనుండి ప్రశ్నించే ప్రక్రియను అలవాటుగా నేర్చి ఆచరిస్తూ, సాధన

చేయాలి. ఇక పెద్దలు మార్పును సవాలుగా స్వీకరించి తమ అలవాట్లను, చర్యలను మార్చుకోవాలి. ఇది సాధ్యమైనదే, అసాధ్యం కాదు. స్వానుభవం ద్వారా ఎంతోమంది తెలుసుకున్నారు.

*(ఈ పుస్తకం రాయటం టెడ్ అగాన్ 66 వ యేట మొదలు పెట్టాడు. దీనిలో ముఖ్య ఉద్దేశం – ఒక దృక్కోణం నుంచి విషయాన్ని నివేదించడం, ఆలోచనలను రేకెత్తించడం(ప్రశ్నించడం),కార్యాచరణకు నడుము బిగించడానికి పాఠకుల మెదళ్లలో రవ్వలను రాజేయడం ఆలోచించడం, అధ్యయనం చేయడం, మనసులో మాట ఇతరులకు తెలియజేయడం గురించిన ఏకసూత్రం ఇందులో కనిపిస్తుంది. అలా కనిపించిన దాని ప్రాధాన్యతను గ్రహించికూడా ఆచరించకపోతే దేనిని ఆచరిస్తారు?ఈ పుస్తక సారాంశం అంతా ఒక్క వాక్యంలో చెప్పవచ్చు. మనం సృష్టించాలి, ఒక సంస్కృతిని సృష్టించాలి, మనకు మనం, మన పిల్లలు వాళ్లకు వాళ్లు తప్పక ప్రశ్నించుకోవడం తెలిసిన సంస్కృతిని సృష్టించాలి.* అజ్ఞానాన్ని నిరంతరంగా నాశనం చేసే మార్గాలు ప్రశ్నలు.ప్రశ్నల సారధ్యంలో పయనిద్దాం.

ఆలోచన ఎవరిని వారు స్వయంగా ప్రశ్నించుకునే ప్రక్రియ, నేర్చుకోవడం అని అనేకసార్లు నొక్కి చెప్పాను. జ్ఞానాన్వేషణలో ప్రశ్నలు, జవాబులు మాత్రమే ఉంటాయి.జవాబుల సమాహారమే జ్ఞానం. జ్ఞానాన్ని పోగుచేసుకోవడం జవాబులు నేర్చుకునే ప్రక్రియలో భాగం. జవాబులు ప్రశ్నలనుంచి ఉత్పన్నమౌతాయి.ఎవరికి వారు ప్రశ్నించుకునే ప్రక్రియ నేర్చుకోవడం. జవాబులు తెలియకపోతే అవే ప్రశ్నలు ఇతరులను అడుగుతాం.జవాబులకై బయటి వనరులను ఆశ్రయిస్తాం.

**భావప్రసారం**

ఒకరి భావాలను మరొకరితో పంచుకోకుండా ఆలోచన, నేర్చుకోవడం సాధ్యం కావు. భావప్రసారం తనలో తాను జరుపుకునే అంతర్గతమైనది కావచ్చు లేదా ఇతరులతో జరిపే బహిరంగమైనది కావచ్చు.భావప్రసారం అంటే సమాచార మార్పిడి. మన నిర్ణయాలు బాగుండాలంటే అవి తీసుకోవడానికి ఆధారమైన సమాచారం నాణ్యమైనదిగా ఉండాలి. కట్టదలచిన ఇంటినిబట్టి పునాది వేయాలి, కట్టిన పునాదికి తగినట్లే ఇల్లు కట్టాలి. నిర్మాణ నాణ్యత అందుకు వాడిన సరుకులను బట్టి ఉంటుంది.

భావమార్పిడి చేయడం వల్ల కచ్చితత్వానికి హామీ ఉంటుంది. సమాచారానికి అన్వయం ఉంటుంది.సమాచారాన్ని సమర్ధవంతంగా సేకరించి, మార్పిడి చేయగల ప్రక్రియ కేవలం ప్రశ్నించడం మాత్రమే. ప్రశ్నించడానికి ప్రయత్నం, శ్రమ, ఆత్మవిశ్వాసం, సాధన అవసరం.

నాణ్యమైన సమాచారాన్ని సేకరించి, దాని ఆధారంగా నాణ్యమైన నిర్ణయాలు తీసుకోవాలంటే నేర్చుకోవడం, భావమార్పిడి నిరంతరంగా, సాధనలాగా జరగాలి. సాధన అంటే ఒక పనిని పదేపదే చేయడమే.

**భావోద్వేగాలు -తార్కికత**

ఈ కింది సమాచారం చాలా జిజ్ఞాసకలిగించేది. ఈ గణాంకాలు /సమాచారం న్యూయార్క్ టైమ్స్ పాత్రికేయుడు, డేవిడ్ బ్రూక్స్ రాసిన పుస్తకం "సామాజిక జంతువు" లోనిది. అది మిన్నిసోటా విశ్వవిద్యాలయంలో జరిపిన దీర్ఘకాలిక పరిశోధనా ఫలితం.

విజయభవనాన్ని నిర్మించేందుకు అవసరమయ్యే శిలలు, బంధనశక్తులు భావోద్వేగాలేనని కనుగొన్నారు. 18 నెలల వయసు పిల్లలను పరిశోధకులు చూసి వాళ్లు తమ తల్లులతో కలిగియున్న సంబంధ, బాంధవ్యాలను గమనించి ఆ పిల్లలు పెద్దవాళ్ళైన తరువాత ఉన్నతపాఠశాల చదువులవరకు కొనసాగిస్తారో, లేదో చెప్పగలిగారు. వాళ్లు చెప్పిన ఫలితాలు 77 శాతం సరిగా సరిపోయాయి. అబ్బా! దీన్ని మనం దీర్ఘంగా ఆలోచించవలసిందే. మళ్లీ చదువుదాం. ఎంతమంది తలి దండ్రులు, తాతలు, అవ్వలు అలా ముందుగా భవిష్యత్తు చెప్పగలరో తెలియదు.

"జీవితాన్ని జీవించడం ఒక భవనాన్ని నిర్మించడం వంటిది. ప్రారంభించడంలో పొరపాటు చేస్తే ముగింపు కూడా అలాగే ఉంటుంది." మాయా ఏంజలో

ఇవాళ అంతర్జాలం విస్తరించిన పరిస్థితుల్లో సాధారణ ఆదాయం కల ఇంటికి కూడా ఇంతకు ముందు ఎన్నడూ లేనంతగా సులువుగా అంతర్జాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

భావోద్వేగాలు చాలా శక్తివంతమైనవే. అలాగే హేతుబద్ధమైన ప్రక్రియ (ప్రశ్నించడం) మాత్రమే భావోద్వేగాలను మదింపు చేయగలదు.

**శాస్త్రీయ పద్ధతిలో ఒక పరిశోధన**

మనోవిశ్లేషకులు, సలహానిపుణులు, మనోవ్యాధులవైద్యులు క్రమపద్ధతిలో ప్రశ్నలు వేస్తారు. సమాచారం రాబడతారు. భావోద్వేగాలకు గల కారణాలను విశ్లేషిస్తారు. తరువాత వాటికి చికిత్సను, తగ్గించగల మార్గాలను నిర్ణయిస్తారు. చికిత్స చేసే వైద్యులు సోక్రటీస్ పద్ధతినే అనుసరిస్తారు. వైద్యులు అడిగే ప్రశ్నను రోగి తనకు తానుగా ప్రశ్నించుకునేలా చూస్తారు. అందువల్ల తన అంతరాత్మలో గల ఆలోచనలు తెలుస్తాయి. అలాగే వైద్యుడు కూడా రోగినుంచి ప్రశ్నలను ఆహ్వానించవచ్చు. ఒక వ్యక్తిని గురించి తెలుసుకోవడానికి అతను చెప్పే జవాబుల కంటే అతను వేసే ప్రశ్నలే ఎక్కువ వీలు కలిగిస్తాయి.

నేర్చుకోవడం నుంచి భావోద్వేగాన్ని వేరు చేయటం నిర్హేతుకం. భావోద్వేగాలు, హేతుతత్వం, ఆధ్యాత్మికతలు సహజాతాలు. ఇవన్నీ కలిస్తేనే మనం..

**శక్తివంతమైన జ్ఞానం - మరో జ్ఞానోదయం**

ఈ పుస్తకం విలువైన జ్ఞానాన్ని అందిస్తుంది. కాని ఇంతటి తోనే తృప్తి చెందకు. అది చాలదు. మనలో చాలామంది – జ్ఞానమే శక్తి- అని విని ఉంటారు. ఈ విషయాన్ని సర్ ఫ్రాన్సిస్ బేకన్ 400 సంవత్సరాల క్రితమే చెప్పాడు. నిజమేనని పిస్తుంది. దీనిని సంప్రదాయ జ్ఞానం అనుకుందాం. అది తప్పు. జ్ఞానమే శక్తి కాదు.

జ్ఞానమే శక్తి అయితే అతిగా తిని అదుపులో లేనంతగా అధిక బరువు అనారోగ్యకారకం అని తెలిసిన వైద్యులు, వైద్యసిబ్బంది అతిగా తింటూ, అదుపులో లేనంతగా శరీరాలను ఎందుకు పెంచుకుంటారు?

మనం జాగ్రత్తగా ఆహారం తీసుకుంటున్నాం, వైద్యరంగంలోని వాళ్లకంటే ఇతరులకే ఎక్కువ తెలుసు.

మనమంతా వ్యాయామాలు చేస్తాం. మనం పొగతాగం, మనందరం ఓట్లు వేస్తాం, జ్ఞానమే శక్తి కాదు గనుకనే. ఏమంటావు?

విజ్ఞానానికి క్రియాశీలత (ఆచరణ)జోడించినప్పుడే శక్తిమంతం అవుతుంది. కనుక జ్ఞానం శక్తికాదు, శక్తి ఉంటే దానిని పెంచే పరికరం అవుతుంది. జ్ఞానపు శక్తి ఆచరణలోనే ఉంది, క్రియాశూన్యతలో లేదు

ఎప్పుడూ ఆచరణ ద్వారా జ్ఞానం సమకూరుతుంది. ఆచరణ లేని జ్ఞానం దేనినీ సంపాదించలేదు. జ్ఞానం కావాలంటే శారీరక, మానసిక శ్రమ చేయాలి, జ్ఞానాన్ని ఉపయోగపెట్టాలంటే శారీరక, మానసిక శ్రమ కావాలి.

ఆలోచన ఒక ప్రక్రియ. అంటే అది పని. దానివల్ల కలిగే ఫలితాలు పరిష్కారాలు. ఆలోచనాశక్తి వల్ల కలిగే పరిష్కారాలను ఆచరణలో పెట్టకపోతే, ఆ పరిష్కారాలకు ప్రయోజనమేముంటుంది? దానిని మనం జ్ఞాన 'శక్తి' అని ఎలా అనగలం? వినియోగించుకుంటే మేధోశక్తి వాస్తవశక్తిగా మారుతుంది. అప్పుడు ప్రశ్నించే సంస్కృతి వస్తుంది, తరువాత దానిని అమలు పరచే వాస్తవ శక్తి పుడుతుంది.

మనందరికీ జ్ఞానసంపద ఉంది, ఇప్పుడు కావలసింది ఈ జ్ఞానంతో చేయవలసింది, చేయగూడనిది ఏమిటో తెలుసుకోవాలి. చేయడమే శక్తి. ఆచరణే తరువాతి మెట్టు.

"తెలిసి కూడా ఆచరించకపోవడం అంటే తెలియకపోవడమే" అన్నాడు స్టీఫెన్ ఆర్.కోవే, అమెరికన్ విద్యావేత్త, రచయిత, (1931-2012)

ఆచరణ నైపుణ్యాన్ని, మేధస్సును వెన్ను తట్టుతుంది. పనిని పదేపదే చేయడమే సాధన. "పొరపాటు చేయడం కంటే ఏ పనీ చేయకుండా ఉంటే చాలా నష్టం వాటిల్లుతుంది." జర్మన్ రచయిత, తాత్వికుడు, మైస్టర్ ఎగ్ హార్ట్(1260-1328)

ఏ పనీ చేయకుండా ఉండటం మానవుడిలో దాగిఉన్న బద్ధకం, మానవుని మహాబలహీనత. అది చాలామందిలో ఉంటుంది. దానిని కొంతమేరకు అధిగమించినా చాలా సాధించవచ్చు.

మానవులకు సహజంగా "దీర్ఘదృష్టితో కూడిన ప్రణాళికా రచన' ఉండదు. పరిణామం చెందటం మన వారసత్వ సంపద. మన మెదడు చాలాకాలం తరువాత రాబోయే కాలాన్ని గురించి ఆలోచించలేదు. మన దైనందిన కార్యక్రమాలు, ఏళ్ల తరబడి చేసినందున అలవాట్లుగా మారతాయి. వాటివల్ల భవిష్యత్తులో కలగబోయే ప్రభావాలను ఊహించలేము. నేటి మన ప్రవర్తన వల్ల కొన్ని దశాబ్దాల పిదప కలగబోయే చెడ్డ పరిణామాలను ఊహించలేము.

ప్రతి రోజు చేసే పనిలో ప్రశ్నించడం, (ఆలోచించడం) పైన దృష్టి మరల్చేలాగా

చేయడమే మనముందున్న సవాల్. ఇలా చేయడం వల్ల మనం, మన పిల్లలు, రానున్న దశాబ్దాల్లో వచ్చే సానుకూల పరిణామాలను గ్రహించగలుగుతాం. అలా చేయని వాళ్లు చేసిన వాళ్లకంటే వెనకబడి పోతారని మళ్లీ చెపుతున్నాను. ఎటు వెళ్లాలో నిర్ణయించుకోవలసింది మనమే.

ఏ పనీ చేయకుండా ఉండటమే అన్ని పనుల్లో మహా ప్రమాదకరమైనది.

“కేవలం ప్రశ్నలు అడగటంలో ప్రావీణ్యం సంపాదిస్తే చాలదు, ప్రశ్నలను కార్యాచరణలుగా మలచుకోవాలి. వాటి గురించి కృషి చేయాలి, తప్పక చేయాలి.” ఉడ్రో టి.విల్సన్, 28వ అమెరికన్ అధ్యక్షుడు. (1856-1924)

**చెయ్యండి, అంతే**

చెయ్యండి, అంతే అనేది ప్రముఖ వాణిజ్య సంస్థ నినాదం. ఇంత చిన్ని నినాదంలో ఎంతో ఎక్కువ సందేశం ఇమిడి ఉంది. నైక్ “Just Do It.” అది కేవలం పని, చర్య, క్రియ గురించే. పనివల్ల జ్ఞానం, అనుభవం, ప్రావీణ్యం, ఫలితాలు వస్తాయి. జార్జి లూకాస్ చిత్రం స్టార్ వార్స్ లో యోడా అన్నట్లు “ప్రయత్నం అనేది లేదు, చేయడమే ఉంటుంది.” ఈ సూక్తిని విని, ఆలోచనాపరుడైన నా మిత్రుడు “చేయడం” అనేది పెద్దఅర్థం కలిగిన చాలా చిన్నమాట.” అన్నాడు.


చాలామంది ఆలోచన గురించి ప్రశ్నించుకోకపోతే, దానిని గురించి ఆలోచించక పోతే జ్ఞానమే శక్తి అనే సూక్తిని ఎంతవరకూ నిజమో ఆమోదిస్తామా? వాస్తవానికి జ్ఞానమే శక్తి- అనుకోవడం కేవలం దృష్టిని మరల్చే నినాదం మాత్రమే. అది సందేహాన్ని తీర్చేది కాదు, దారి మళ్లించేది మాత్రమే. సరైన జ్ఞానం పేరుతో చెప్పబడ్డ మిధ్యాసూక్తి అది. ఏదో పట్టించుకోకుండా చిలుకపలుకుల్లా వల్లిస్తామే గాని దాని అన్వయాన్ని చూడకుండా జ్ఞానమే శక్తి అంటుంటాం. అసలు శక్తికి మూలం ఏమిటో ఆలోచించం. మనం దారితప్పుతూ, ఇతరులను కూడా దారి తప్పిస్తాం.

క్రియ, చేసే పని. ఇది ముందు నడుస్తుంది, జ్ఞానాన్ని నడిపిస్తుంది. విశ్లేషణకు పక్షవాతం వస్తుంది. మనను మనమే చాలా మంచి ప్రశ్నలు అడగటమే కేవలం జవాబు కాదు. పూర్తి జవాబు అంతకన్నా కాదు. పక్షవాతం అంటే పని చేయకపోవడం, పని చేయడమే అంతిమ జవాబు.

“మనలో పని చేసేవాళ్లు చాలా తక్కువ, పని చేయకుండా దాటవేసే వాళ్లు చాలా ఎక్కువ. వారి ముందున్నవి అనేకం.అందులో దేనినో ఒక దానినే ఎంపిక చేసుకోవాలి. అలాటి పరిస్థితుల్లో నువ్వు తీసుకోవలసిన నిర్ణయాన్ని తీసుకోకపోతే, అదే తప్పిదం.” విలియమ్ జేమ్స్, అమెరికన్ తత్వవేత్త, మనోవైజ్ఞానికవేత్త, ఆచరణీయ ఆధ్యాత్మికతవాద నాయకుడు(1842-1910)

కొన్ని సందర్భాలలో సృజనాత్మకత అంటే కేవలం రోజూ ఇతరులకు సహాయపడే పని చేయడం, ఒక సమస్యను  కొత్తకోణం నుంచి చూడటం- అన్నాడు హార్వర్డ్ బిజినెస్ స్కూలులో వ్యాపారనైతిక విలువలు అంశ ఆచార్యులు,జోసెఫ్ బాడరకో.
ఉన్న సమాచారాన్ని నాలుగురకాలుగా వాడుకోవచ్చు.

1. దీనిలో నీకేమీ ప్రయోజనం కనిపించలేదా?, వదిలేయ్, దానిని పట్టించుకోకు.
2. ఇది గణనీయ ప్రయోజనం కలిగిస్తుందని గ్రహించినా ఆచరణలో పెట్టలేదు. (మనం మనుషులం కదా?) ఇందువల్ల మనం, మన కుటుంబాలు పొంద తగిన విజయం పొందలేము. దీన్ని ఆచరించిన వారికంటే వెనుకబడతాం.
3. బాగా ఉపయోగకరమైనదని తెలుసుకున్నావు, ఆచరించావు, కాని స్వార్థం కోసం ఉపయోగించుకున్నావా?. ఇతరులపైన ఆధిపత్యం చలాయిస్తున్నావా?
4. బాగా ఉపయోగపడుతుందని తెలుసుకున్నావు. దానిని ఆచరణలో పెట్టావు. ఆలోచనాపరులైన ఇతరులకు తెలియజేశావా? వాళ్లను కూడా ఆచరించమని సూచించావా?“


the
human
key
master
ted agon
You'll never look at a question
the same way again

ఇతరుల జీవితాలను, గణనీయంగా మెరుగుపరచడానికి సహాయపడే అవకాశాలు మన జీవితంలో ఎన్నోసార్లు వస్తాయా? రావు. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడం వల్ల మన జీవితాలలో వెలుగులు నిండుతాయి.

*శరణార్థుల శిబిరాలలో ఉన్నాను. ప్రపంచ మహానగరాల్లో నిరుపేదవర్గాలు నివసించే మురికివాడల్లోని దుర్భరజీవన పరిస్థితులను ప్రత్యక్షంగా చూశాను. విషయాలను తెలుసుకోవాలనే కోరిక లేనివారిని చూశాను. మార్పు కోసం ప్రయత్నం చేయని వాళ్లను చూశాను. నిరంకుశపాలనల్లో, బానిసలుగా బ్రతుకులు ఈడుస్తూ మార్పు కోసం పని చేయడానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేని వారిని చూశాను.*

*నేను నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరయ్యే వారు కూడా నేను చెప్పిన ఈ సులభ సూచనలు అన్నీ పాటించకపోవచ్చు.*

***ఎందుకు?***

*నాకు తెలిసింది ఇదే. ఈ విషయాలను తెలిసినప్పటికీ ఆచరించని వ్యక్తులూ, కుటుంబాలకంటే వీటిని ఆచరించినవారు ప్రగతిపథంలో ముందుకు సాగుతారు. ఇందులో ఎంతమాత్రం అతిశయం లేదు. ఏం చేస్తావో ఇక నిర్ణయం నీదే.*

*ఈ పుస్తకం రాయడం వల్ల నా జీవితంలో మేలు జరిగింది. అది ఇతరుల జీవితాలలో కూడా మంచిని నింపుతుందని ఆశిస్తాను.*

*ఈ సమాచారం చాలా కీలకమైనది అనటంలో ఏ మాత్రం సందేహం లేకపోవచ్చు. అది మన పిల్లల సామర్థ్యాన్ని పెంచి, పోటీలలో తట్టుకొని నిలబడేలా చేయగల శక్తివంతం అయిందే. కాని.. ఒకటే షరతు, ఇది ఉపయోగించబడాలి, ఆచరించ బడాలి, లేకపోతే నిరర్థకం.*

*"అదొక అంతు చిక్కని రహస్యం. నిజం వచ్చి నీ వాకిటి ముందు నుంచుంది. నువ్వు అంటున్నావు - "పో, వెళ్లిపో, నేను నిజం కోసం ఎదురు చూస్తున్నాను," అంటున్నావు, అది వెళ్లిపోయింది.. ఆశ్చర్యపడుతూ." జెన్ మరియు మోటార్ సైకిల్ నిర్వహణ- గ్రంథకర్త, రాబర్ట్ యం. పిర్సిగ్*

*ఈ పుస్తకంలో కొన్ని వేల మాటలు ఉన్నాయి. అన్ని మాటలూ ఒక్క విత్తనం నుంచి పుట్టి పెరిగినవే. ఆ విత్తనమే – ప్రశ్న. దీనిని పెంచి, పోషించి దీని ఫలాలను పొందడం నీ చేతుల్లో ఉంది.*

నువ్వు ఇంతకాలం ప్రశ్నను ఎలాగో చూసిఉంటావు. కాని ఇక ముందు తేలికగా తీసుకొని అడగలేవు. ప్రశ్న అడగటం అంటే అంత తేలికైన విషయం కాదని నువ్వు గ్రహించావు. అడిగే వాడికి చెప్పేవాడు లోకువ అంటారు. కాని ఇప్పుడు నీకు అర్థమై ఉండాలి, జవాబు చెప్పడం కాదు , ప్రశ్న అడగటమే కష్టం.

*పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల మేధస్సును పరీక్షించడానికి భాషా నిపుణులు, విషయనిపుణులు ప్రశ్నలతో గూడిన ప్రశ్నాపత్రాలు ఇస్తారు. తీరా మామూలు విద్యార్థులు ఆ పత్రాలను చూసి ఎగతాళి చేస్తారు కొన్ని సందర్భాలలో ఇంకా ఎక్కువగా అభ్యంతరాలను తెలియజేస్తారు. **100** మార్కుల ప్రశ్నల్లో **6,7** దాకా అసంబద్ధమైనవి, అస్పష్టంగా ఉన్నవి ఉంటుంటాయి. అందుకే ఇలాంటి ఆక్షేపణలన్నీ విన్న తరువాతనే ప్రశ్నాపత్రాల - కీ-లో మూల్యాంకన పరిగణనకు తీసుకున్న జవాబులను ప్రకటిస్తారు. ఇప్పుడు ఆలోచించండి ఏది సులభమో, ప్రశ్నించడమో, జవాబు చెప్పడమో. ఏది సవాల్?*

*ఈ పుస్తకం అన్ని రంగాలవారికీ, అందరికీ ఉపయోగ పడాలని నా కోరిక. ఈ ఆలోచన అందరికీ - భూగోళం మీద ఉన్నవారందరికీ కావాలి.*

*ఇది మంచి విషయం. అమలు చేయడంపై దృష్టి పెట్టటమే సవాల్. ఈ ప్రశ్నలు పదేపదే వేధించాయి నన్ను. నాకు కలిగిన కనువిప్పును ఇతరులతో ఎలా పంచుకోవాలి?అమెరికన్ మానవశాస్త్రవేత్త, మార్గరెట్ మీడ్**(1901-1978)** ఇలా అన్నది."ఎప్పుడూ సందేహించకు, కేవలం కొద్దిమంది ఆలోచనాపరులు, అంకితభావం కలవారు మాత్రమే ప్రపంచాన్ని మార్చగలరా? అనుకోకు, మార్చగలరు, ఎప్పుడూ జరిగేదే అది. అది మాత్రమే జరుగుతుంది."*

*ఈ సమాచారాన్ని నీకు అందించడం ద్వారా నా విద్యుక్తధర్మాన్ని నేను నిర్వర్తించాను, నాకు నేను విధించుకున్న నా బాధ్యత తీర్చుకున్నాను. నా తలమీద*

*భారం తగ్గింది. ఇది దాదాపు ఆరేళ్ల పెట్టుబడి, ప్రయత్నం, కృషి, ఆరాటం, తపన, ప్రగాఢవాంఛ. అదొక వినోదంగా ఆడుతూ, పాడుతూ, ఆనందిస్తూ తయారు చేశాను. అది అంతగా శ్రమించదగినదే అనుకుంటాను. ఇక ఇప్పుడు ఈ బాధ్యత నీది, ఈ జ్ఞానపాత్రను నీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, సంఘంతో కలిసి పంచుకోవాలి. అలా చేస్తే నువ్వూ, నీ ద్వారా మరికొందరూ ఐశ్వర్యవంతులు అవుతారు. ఐశ్వర్యం అంటే ధనం, మరొకటి, వేరొకటి కావు. నేను పెట్టిన పెట్టుబడి, మీ ఆచరణ ద్వారా, మీ జీవితాలను వాళ్ల జీవితాలను సుఖశాంతులతో ఉంచగలిగినదే.*

*ఈ గ్రంథరచనలో సహకరించిన రచయితలు అందరికీ ధన్యవాదాలు చెప్పడం నా కర్తవ్యం. వారి అనుభవాలు ఈ పుస్తకానికి కొత్త ఊపిరి నిచ్చాయి. నాతో మాట్లాడి, నన్ను కలిసి, నా ఆలోచనలను, తెలుగువారికి అందిస్తున్న పెద్ది యస్. యస్. రావు గారికి, వారి అమ్మాయి డా.రాణి గారికి కృతజ్ఞతలు.*

*''ముందుకు సాగే కొలది నువ్వు ఏమి చేస్తున్నావో ప్రతివ్యక్తికీ వివరించ లేకపోతే నువ్వు చేసే పని వ్యర్థం- అన్నాడు ఆస్ట్రియన్ భౌతికశాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత, ఎర్విన్ శ్రోడింగర్ **(1887 – 1961)***

*ఇంకా నన్ను అడగదలచుకున్న ప్రశ్నలు,చేయదలచిన వ్యాఖ్యలు, సూచించ దలచిన సిఫారసులు, గమనించిన పరిశీలనలు, నువ్వు పొందిన అనుభవాలు, సాధించిన విజయగాధలు ఏమైనా ఉన్నాయా? అయితే దయచేసి ఈ వెబ్ లో కలుసుకోవడానికి వెనకాడవద్దు.* “thehumankey.com”,

telugu thejam.com, peddissrgnt@gmail.com- సెలవ్.

**పునఃశ్చరణ**

అంతిమ విజయం ప్రశ్నదే.

అజ్ఞానానికి, అమాయకత్వానికి విరుగుడు ప్రశ్న.

అజ్ఞానాన్ని నిరంతరం తొలగించే మార్గాలు ప్రశ్నలు.

ఆత్మావలోకనం అంటే తనను తాను ప్రశ్నించుకోవడం.

ఆలోచనా వాహనాన్ని ముందుకు లాక్కుపోయే యంత్రం ప్రశ్న.

ఆలోచించడం అంటే ప్రశ్నించడం.

ఆలోచించని వాళ్లు ప్రశ్నించరు, ప్రశ్నించని వాళ్లు ఆలోచించరు.

ఉత్తమ ప్రశ్నలనుంచి ఉత్తమ జవాబులు వస్తాయి.

ఎందుకు? ఏమిటి?ఎక్కడ? ఎప్పుడు? ప్రశ్నలను పట్టించుకోవాలి.

కత్తి కంటే కలం గొప్పది, కలం కంటే ప్రశ్న శక్తివంతమైనది.

గురువు మంచి జవాబులు చెప్పి, మంచి ప్రశ్నలు నేర్పుతాడు.

చెట్టు నుంచి పండు రాలిపడటం కోట్లమంది చూశారు. కాని ఎందుకు అని అడిగింది మాత్రం న్యూటన్ ఒక్కడే.

జవాబు చెప్పడం కాదు, ప్రశ్న అడగటమే కష్టం.

జ్ఞాని సరైన జవాబులు చెప్పక,సరైన ప్రశ్నలు వేస్తాడు. నిరంతరంగా ప్రశ్నించడం వల్ల మార్పు నిరంతరంగా జరుగుతుంటుంది.

నువ్వు ఏం చేస్తున్నావో చెప్పలేకపోతే - నువ్వు చేసేపని నిరర్ధకమే.

నైపుణ్యాలకు మూలనైపుణ్యం ప్రశ్నించటం.

పట్టించుకోకుండా ఉండటం ప్రశ్నను చంపేస్తుంది,.

పిల్లల ప్రశ్నల సునామీ తట్టుకోలేక వాళ్లమానసిక వికాసాన్ని కుదిస్తారు పెద్దలు.

పిల్లలు బడిలో పాదం మోపకముందే ప్రశ్నించడం అలవాటు చేయాలి.

పిల్లవాడు ప్రశ్నించడానికి ప్రయత్నిస్తుంటే ఏదో నేర్చుకోవాలనుకుంటున్నట్టే.

ప్రతి చర్యకూ ముందున్నది ప్రశ్నయే.

ప్రతిక్షణం, అదృశ్యప్రశ్నల సముద్రంలో ఉన్నట్లు మనిషికి తెలియదు.

ప్రశ్న ***ఎప్పుడూ*** వ్యంగ్యంతో నిండి ఉండగూడదు. అలా ఉంటే అది నేరమే.

ప్రశ్న మాటల సూక్ష్మదర్శిని.

ప్రశ్న మానవ నాగరకతకు కూకటి వేరు.

ప్రశ్న మార్పుకు ప్రతినిధి. ప్రశ్నను తగ్గిస్తే నేర్చుకోవడం గిడస బారుతుంది.
ప్రశ్న లేకపోతే ఏమీ లేకపోవచ్చు.
ప్రశ్న వల్ల మెదడులో ఉన్న చీకటి గదులు వెలుగుతో నిండుతాయి.
ప్రశ్నయే జవాబు – జవాబే ప్రశ్న
ప్రశ్నలతోనే స్వేచ్ఛ ప్రారంభం అవుతుంది.
ప్రశ్నించగల సత్తాయే మానవుని అత్యంత ముఖ్యసత్తా.
ప్రశ్నించడమే మానవుడిగా ఉండటం, మానవుడిగా ఉండటమే ప్రశ్నించడం.
ప్రశ్నించడం ఎప్పుడూ మంచిపనే, పనికిమాలిన ప్రశ్న అనేది లేదు.
ప్రశ్నించడం గొప్పకళ. ప్రశ్నించే నైపుణ్యం పెరిగితే అవగాహన సుస్పష్టము.
ప్రశ్నించడమే మానవవిజ్ఞానానికి మూలం.
ప్రశ్నించే స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు.
మనో సామర్ధ్యనిధి తలుపులు తెరిచే తాళం చెవి ప్రశ్న.
భూమిపై మనిషి తొలి అడుగు ప్రశ్న తో ప్రారంభమయింది.
మన పిల్లల్ని మరిన్ని ప్రశ్నలు అడగ గలిగే వారిలా పెంచాలి.
మానవ పరిణామానికి, విప్లవానికి మూలం ప్రశ్న.
మానవసంబంధాల వారధులు నిర్మించడానికి ప్రశ్నా నైపుణ్యం ముఖ్యం.
విత్తనాలు చల్లకపోతే పంటలు కోసుకోలేం. ప్రశ్నలేని నోబెల్ పురస్కారం లేదు.
శాస్త్రం కేవలం విజ్ఞానపు కుప్ప మాత్రమే కాదు, ప్రశ్నించే మార్గం కూడా.
సూక్తులు ఒక్క విత్తనం నుంచి పుట్టి పెరిగినవే. ఆ విత్తనమే ప్రశ్న.
స్వయంగా ప్రశ్నించుకునే ప్రక్రియ ఆలోచించడం.

** అనేక దైనందిన మాటల మాటున ప్రశ్నలు, జవాబులు దాగుంటాయి. అలాంటి మాటల్లో కొన్ని ఇవి. * శాసనసభలు, పార్లమెంటు ఉభయసభల్లో సభ్యులు పలు ప్రశ్నలు అడగటానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. ప్రభుత్వప్రతినిధులు జవాబులు చెపుతారు. శాసనసభల్లో ప్రశ్నల సమయం ప్రత్యేకంగా కేటాయిస్తారు. ప్రశ్నలలో ప్రాధాన్యతా క్రమము ఉంటుంది. ముఖ్యమైనవాటికి ముందు సమయం కేటాయిస్తారు. సాధారణంగా వాడే విశేషణాలూ, వాటి అర్థాలు.*

awkward : ఇబ్బందికర
basic *: ప్రాథమిక *
burning *: రగిలే *
clarificatory *:వివరణ ఇచ్చు *
closed / polar * ఒకే జవాబుగల *
commited : కట్టుబడిన *
comparative : తులనాత్మక *
comprehensive *: సంక్షిప్త *
constitutional *: రాజ్యాంగ *
controversial *, వివాదాస్పద *
crucial *: కీలక *
ethical *: నైతిక *
follow-up *: కొనసాగింపు *
fundamental *: ప్రాథమిక *
hard *: కష్టమైన *
hypothetical *: ఊహాత్మక *
inevitable *: అనివార్యమైన *
interesting *: జిజ్ఞాసకర *
intriguing * :చమత్కారమైన *
key *: కీలక *
leading * .దారిచూపే *
legitimate *: చట్టబద్ధమైన *
loaded * .భారమైన *
not often *: rarely * అరుదైన
obvious *: స్పష్టమైన *
open * . బహిరంగ *
perennial *: శాశ్వత *
philosophical *: తాత్విక *
probing * .తరచి అడుగు *
profound *: లోతైన *
related *: సంబంధిత *
relevant * సముచిత *
rhetorical * జవాబు ఆశించని *
searching *: శోధించే *
serious *: తీవ్రమైన *
short notice * స్వల్పకాలిక *
specific *: నిర్దిష్ట *
supplementary * అనుబంధ *
the first * . మొదటి *
thorny *: విసుగు పుట్టించే *
tricky *: గమ్మత్తయిన *
unanswerable:జవాబు లేని *
unresolved * : పరిష్కరించని *
valid *: చెల్లుబాటు అయ్యే *
whole * : సమగ్ర *
written *: రాతపూర్వక *

ఆంగ్లంలో టెడ్ అగాన్ రచించిన 'ది హ్యూమన్ కీ'

పుస్తకానికి తెలుగు అనువాదం 'ప్రశ్న ఎందుకు?'

* జీవితంలో విద్యావ్యవస్థలో ప్రశ్నించే తత్వాన్ని ఎందుకు ప్రోత్సహించాలి?

* ప్రశ్నించే తత్వాన్ని పిల్లలకు ఎప్పుడు ఎలా నేర్పాలి?

* ప్రశ్న జీవన నైపుణ్యాలన్నిటిలో ఎలా అనుసంధానమై ఉంటుంది?

* సమాధానాలు కావాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే.

"ప్రశ్న - ప్రగతికి మూలం" "వేలవేల ప్రశ్నలు వేయనిద్దాం-అందరినీ ఎదగనిద్దాం." ఈ స్వేచ్ఛానువాదం కొత్త రుచినీ, వాసననీ పొదివిపట్టుకుని ఆగకుండా చదివిస్తుంది. అందులో భావజాలానికి అబ్బురపడేలా చేస్తుంది. ప్రశ్నించడం భారత ఇతిహాసాలలో, పురాణాలలో ఆదినుంచీ ఉన్న ప్రక్రియే. నిజానికి "నేను ఎవరు?" అని ప్రశ్నిస్తూ, ప్రశ్న వేసుకుంటూ ఆదిశంకరుల వారి నుంచి వివేకానందులవారి దాకా శోధించినదే మన వేదాంతసారం. పాశ్చాత్య నాగరికతలో ఏదైనా నేర్చుకోవాలి అంటే ముందు ప్రశ్నించాలి అనేది ఒక మౌలిక సూత్రం... పాశ్చాత్య దేశాలలో పిల్లలలో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహిస్తారు. ఆ ప్రోత్సాహం ఇంకా, ఇంకా పెరగాలనేది ఈ గ్రంథం ప్రధాన ఉద్దేశ్యం.

-వంగూరి చిట్టెన్ రాజు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్, టెక్సాస్, USA

*ప్రశ్నలు ప్రగతికి మెట్లు అవి అధ్యయనాన్ని నేర్పుతాయి.

ప్రగతిని కోరుకునేవాళ్లు వయోబేధం లేకుండా చదివి,

ఆలోచించి, ఆచరించవలసిన పాఠాల సారాంశం ఈ అనువాద గ్రంథం.

- దేవినేని మధుసూదనరావు

ISBN 978-93-91400-00-2

9 789391 400002

వెల : ₹ 95 /-